
'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+12 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 180

శనివారం 20-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అమ్మ ట్రాన్స్‌ప్లాంట్‌కు పతకాలు పూశాయి

వరుణ్ ఆనంద్ చిన్నప్పటినుంచి ఆటల్లో చురుగ్గా ఉంటాడు. అలాంటి వరుణ్ అనుకోకుండా దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి బారినపడ్డాడు. దీంతో కనీసం తన పనులు తాను చేసుకోలేనంతటి దుస్థితికి వచ్చాడు. ఆ పరిస్థితుల్లో వారికి అనికా అనే ఆర్గాన్ డొనేషన్ సంస్థ జీవితాన్నిచ్చింది. మళ్లీ అతను ఉత్సాహంగా ఆటల్లో పాల్గొని మూడు స్వర్ణ పతకాలను గెలుచుకున్నాడు. ఈ విజయం వెనుక వరుణ్ ఆనంద్ తల్లి ప్రోత్సాహంతో పాటు ఆమె కొడుక్కు పంచి ఇచ్చిన కిడ్నీ కూడా ఓ కారణం.

- వివరాలు IIలో

అమ్మ ట్రాన్స్‌ప్లాంట్‌కు పతకాలు పూశాయి





వరుణ్ ఆనంద్ చిన్నప్పటినుంచి ఆటల్లో చురుగ్గా ఉంటాడు. తిండి, నిద్ర కన్నా ఆటలే ముఖ్యం అతనికి. అలాంటి వరుణ్ అనుకోకుండా దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి బారినపడ్డాడు. దాంతో ఆటల మాట దేవుడెరుగు... కనీసం తన పనులు కూడా తాను చేసుకోలేనంతటి దుస్థితికి వచ్చాడు. ఆ పరిస్థితుల్లో వారికి అనికా అనే ఆర్గాన్ డొనేషన్ సంస్థ జీవితాన్నిచ్చింది. అంతేకాదు, అతను ఆ వ్యాధి మూలంగా ఏ ఆటల నుంచి అయితే దూరం అయ్యాడో, అవే ఆటల పోటీల్లో అతను మరింత ఉత్సాహంగా పాల్గొని మూడు స్వర్ణ పతకాలను గెలుచుకున్నాడు. ఈ విజయం వెనుక వరుణ్ ఆనంద్ తల్లి ప్రోత్సాహంతో పాటు ఆమె కొడుక్కు పంచి ఇచ్చిన కిడ్నీ కూడా ఓ కారణం.

ఆరేళ్ల క్రితం ఓ రోజు.. బెంగళూరు అబ్బాయి వరుణ్ ఆనంద్ ఉన్నట్టుండి ఫుట్‌బాల్ గ్రౌండ్ నుంచి ఇంటికొచ్చేశాడు. ''అదేంట్రా అప్పుడే వచ్చేశావ్?'' అని తల్లి అడిగితే ''బాగా అలసటగా ఉంది. ఆడాలనిపించడం లేదు. అందుకే వచ్చేశా' అని నీరసంగా చెప్పాడు.

ఆటలో పడితే తనను తానే మరిచిపోయే తన కొడుకు ఇలా చెప్పేసరికి అతని అమ్మ దీపకు జరగరానిదేదో జరగబోతోందన్న భయం, సందేహం అతలాకుతలం చేశాయి. తగ్గట్టే నెమ్మదిగా వరుణ్ ఆటకు దూరమయ్యాడు. కనీసం తన పనులు కూడా చేసుకోలేనంత బలహీనంగా తయారయ్యాడు. ఏ పనీ చేయకుండా ఊరికే తిని పడుకుంటున్నా సరే ఎప్పుడూ అలసటగా కనిపించేవాడు. దీనికి తోడు విడువని జ్వరం..కాళ్ల వాపులు...ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో చిరుతలా కదిలే వరుణ్ ఎముకలు బలహీనంగా మారడం తో తప్పటడుగులకు కూడా కష్టపడేవాడు. ఇదంతా చూస్తున్న అమ్మానాన్నలు అతడి భవిష్యత్తు గురించి బెంగటిల్లుతుండేవారు.

ఇంతలో జరగకూడదనుకున్నదే జరిగింది. ఓ రోజు మాటాపలుకూ లేకుండా పడిపోయాడు వరుణ్.

వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ పిల్లాడిని పరీక్షించారు. వరుణ్ బీపీ చాలా తక్కువగా చూపిస్తోంది. దాదాపు కోమాలో ఉన్నాడు. వెంటనే కొన్ని ఎమర్జెన్సీ టెస్టులు చేయించారు. వాటిలో అతడికి క్రానికల్ కిడ్నీ డిసీజ్ ఉన్నట్లు బయటపడింది. వరుణ్ కండిషన్ ను గురించి అతని తల్లిదండ్రులకు చెప్పారు డాక్టర్. చివరకు వరుణ్ ఇప్పుడున్న స్థితికి అతడికి హీమో డయాలసిస్ చేసి కిడ్నీ మార్చడం తప్ప మరో దారి లేదని చెప్పారు. చెప్పిందే తడవుగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం సిద్ధమయ్యారు. దాతల గురించి వెతకసాగారు. ఈ క్రమంలో వారికి తెలిసిన విషయం... ఇంత బాధలోనూ అందరికీ ఆనందం కలిగించిన విషయం ఒకటే. వరుణ్‌కు తల్లి కిడ్నీ సరిగ్గా మ్యాచ్ కావడం. ఆపరేషన్ సక్సెస్ కావడం..

రెండేళ్ల క్రితం.. పెర్త్ వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్ ఎరీనా కొత్త వరుణ్ అప్పుడు ఫుట్‌బాల్‌ను మాత్రమే వదిలేశాడు. 12, 14 ఏళ్ల విభాగంలో మరి ఇప్పుడు మూడు క్రీడా విభాగాలు టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, టెన్నిస్‌ల ప్రత్యర్థులను చిత్తు చేసి 3 స్వర్ణాలతో విన్నింగ్ స్టైల్‌తో డయాస్ మీద గర్వంగా నిలుచున్నాడు. ఇదతనికి మరో జీవితం. వీరందరి కన్నా ముందే అనికా ఈ పోటీల్లో పాల్గొంది. ఇది సాటిలేని అనుభవమని ఆమె చెబుతుంది. అనికా ఆర్గాన్ ఇండియా వ్యవస్థాపకురాలు. ఇది లాభాపేక్ష లేని సంస్థ. అనికా తల్లికి కూడా గుండెమార్పిడి ఆపరేషన్ జరిగింది. ఒక రకంగా దాని నుంచే ఆమె స్ఫూర్తి పొందింది. అనికా సంస్థ 2023లో ప్రపంచ ట్రాన్స్‌ప్లాంటేషన్ గేమ్స్‌లో టీం ఇండియాకు ప్రాతినిధ్యం వహించింది.

''మా అమ్మ ఆపరేషన్ సమయంలో నాకు ఎలాంటి ఆసరా, ట్రాన్స్‌ప్లాంటేషన్ గురించిన సమాచారమూ అందుబాటులో లేదు. అందుకే నేను ఆర్గాన్ ఇండియాను స్థాపించాను. ఇప్పుడు నేను నాలా ఎవరూ సమస్యలతో సతమతం కాకుండా చూసుకుంటున్నాను. అందుకు ఎంతో సంతోషంగా ఉంది'' అని చెబుతుందామె.

ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్

ఈ ఏడాది జర్మనీలో 25వ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్ జరుగుతున్నాయి. 51 దేశాల నుంచి 17 క్రీడాంశాల్లో పోటీకి అథ్లెట్లు సిద్ధమవుతున్నారు. 1978 నుంచి ఈ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలకు అర్హతలు ఒకటి అభ్యర్థులు నాలుగేళ్ల కంటే ఎక్కువ వయసున్న వారై ఉండాలి. అలాగే వారు ప్రాణాధార అల్లోగ్రాఫ్టులు (గుండె, పేగు, మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, ప్యాంక్రియాస్) అలాగే బోన్ మ్యారో మార్పిడి వంటి క్లిష్టమైన ఆరోగ్య సమస్యలనుంచి బయటపడి ప్రస్తుతం మామూలు జీవితం గడుపుతూ తాము పాల్గొనే ఈవెంట్లలో శిక్షణ పొంది ఉండాలి. ఆర్గాన్ ఇండియా ద్వారా వరుణ్ ఫ్యామిలీకి ఈ పోటీల గురించి తెలిసింది. అనికా తన ఆర్గాన్ ఇండియా సంస్థ ద్వారా వరుణ్ లాంటి ఎంతోమందికి జీవితంపై ఆశలు కల్పిస్తోంది. చికిత్స విషయంలో సహాయపడుతోంది. 2023లో ట్రాన్స్‌ప్లాంటేషన్ గేమ్స్‌లో వరుణ్ ప్రతిభను చూసి అనికా ఆశ్చర్యపోయింది. '32 మంది సభ్యుల టీమ్ ఇండియా బృందంలో అతనే చిన్నవాడు. కానీ తన శక్తితో దానిని నడిపించాడు.

● ఇంటర్వ్యూ రౌండ్

మీ పేరెంట్స్ మీతోనే ఉంటారా?



సాధారణంగా ఏదైనా ఉద్యోగంలోకి తీసుకోవడం కోసం చేసే ఇంటర్వ్యూలు అభ్యర్థి నైపుణ్యాలు, అర్హతలు, ఆ సంస్థలో వారిని తీసుకోవాలనుకుంటున్న హోదాకు తగిన అర్హతను అంచనా వేయడం పైనే ఉంటాయి. కానీ కొన్నిసార్లు ప్రశ్నలు అభ్యర్థి వ్యక్తిగత రంగంలోకి వెళతాయి. ఇటీవల ఓ అభ్యర్థి ఎదుర్కొన్న అలాంటి ఒక ప్రశ్న – 'మీరు మీ తల్లిదండ్రులతో నివసిస్తున్నారా?' అది విన్న ఆ అభ్యర్థి ఒక్కసారిగా ఆశ్చర్యపోయాడు. నిజానికిది ఎటువంటి ఇబ్బందీ కలిగించని ప్రశ్నే అయినప్పటికీ కొంతమంది రిక్రూటర్లు ఇలాంటి ప్రశ్నలు ఎందుకు అడుగుతారనే దానిపై ఆన్‌లైన్‌లో చర్చకు దారితీసింది. నిజమే కదా... ఎందుకు అడుగుతారు?

ఇటీవల గ్రాడ్యుయేట్ అయిన ఒకరిద్దరు అభ్యర్థులు వేర్వేరు ఇంటర్వ్యూయర్లు తమని తమ తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారా అని అడిగినట్లు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. మొదటిసారి ఇది జరిగినప్పుడు, కంపెనీ తరువాత ఉద్యోగ ఆఫర్‌ను పొడిగించింది, కానీ అభ్యర్థి దానిని తిరస్కరించాడు. తరువాతి ఇంటర్వ్యూలో, మరొక రిక్రూటర్ ఆ ప్రశ్నను పునరావృతం చేసి, ఆపై ఇతర ఉద్యోగ ఆఫర్‌ల వివరాల కోసం, వాటిని తిరస్కరించడానికి గల కారణాల కోసం ఒత్తిడి చేశాడు.

ప్రశ్న సముచితమైనదేనా అని ఖచ్చితంగా తెలియదని, అభ్యర్థి ఆర్థికంగా తల్లిదండ్రులపై ఆధారపడతాడా? లేక అతనిపై తల్లిదండ్రుల సంరక్షణ భారం ఎంత మేరకు పడుతుందా అని అంచనా వేయడానికి ఇలాంటి ప్రశ్నలు వేయవలసి వచ్చిందని ఆ కంపెనీ వివరణ ఇచ్చుకుంది. కుటుంబంతో కలిసి జీవిస్తున్నారంటే తక్కువ ఖర్చులు అని రిక్రూటర్లు భావించవచ్చని, తగ్గిన జీతాన్ని మేనేజ్ చేయడం సులభం అవుతుందని వారి అంచనా.

నియామక ప్రక్రియలో అసమతుల్యతపై వారు నిరాశ వ్యక్తం చేశారు, ఇంటర్వ్యూయర్లు ఉద్యోగ పనితీరుకు సంబంధం లేని విషయాలను కూడా పరిశీలించవచ్చు. అర్థరహిత వ్యాఖ్యతో, కృత్రిమ మేధస్సు అటువంటి పద్ధతులను పూర్తిగా భర్తీ చేయగలదా అని అభ్యర్థి ఆశ్చర్యపోయాడు.

కమ్యూనిటీ స్పందన

ఇలాంటి ప్రశ్నలు ఆఫర్ ఎంత తక్కువగా ఉంటుందో నిర్ణయించే ప్రయత్నాన్ని సూచిస్తాయన్నారు. కుటుంబంతో కలసి ఉండటం వల్ల అభ్యర్థిపైన తక్కువ ఆర్థిక ఒత్తిడి పడుతుందని వాళ్ల ఉద్దేశంగా భావించవచ్చు.

ఇలాంటి ప్రశ్నలు ఎలా ఎదుర్కోవాలి?

ఈ పరిస్థితులను నిర్వహించడానికి అనేక మంది వినియోగదారులు తమ ఆలోచనలను ఇలా పంచుకున్నారు, వాటిలో ''మీరు ఎందుకు అడుగుతారు?'' అనే ఆసక్తితో స్పందించడం లేదా ప్రశ్నలోని అసంబద్ధతను ఎత్తి చూపడం వంటివి ఉన్నాయి. నిరుద్యోగ భృతి లేదా వ్యక్తిగత ఆర్థిక విషయాల గురించి యజమానులు అడిగిన ఇలాంటి అనుభవాలను కొందరు వివరించారు.

ఈ చర్చ ఒక సాధారణ భావనను నొక్కి చెప్పింది: కొన్ని ఇంటర్వ్యూ ప్రశ్నలు అభ్యర్థి సామర్థ్యాన్ని అంచనా వేయడం గురించి తక్కువగా ఉండవచ్చు లేదా తమ సంస్థలో వీలైనంత తక్కువ ప్యాకేజీకే ఒప్పించేందుకు తగిన అవకాశాలను గుర్తించడం గురించి ఉండవచ్చు. తల్లిదండ్రులతో కలసి ఉంటున్నారంటే వారు బాధ్యతతో పని చేస్తారని ఇంటర్వ్యూయర్లు భావించవచ్చు.

మలైకా ఆరోగ్య రహస్యం



ఐదు పదులు దాటుతున్నా ఇంకా ఫిట్‌గా... ఆరోగ్యంగా కనిపించే మలైకా అరోరా అందానికి పడిపోని వారుండరంటే అతిశయోక్తి కాదు. చాలామందికి ఆమె ఆరోగ్య రహస్యం గురించి తెలుసుకోవాలని ఆసక్తి. అదే ప్రశ్న అడిగితే కొంటెగా నవ్వేసి 'వెరీ సింపుల్... నేను నా దినచర్యను రెటినోల్ జ్యూస్‌తో ప్రారంభిస్తాను. అందుకే ఈ అందం'' అని చెప్పింది. మెరుపులీనే పట్టులాంటి చర్మం, ఎప్పుడు చూసినా ఫ్రెష్‌గా కనిపించే చర్మసౌందర్యం కావాలంటే ముందుగా మెరుగైన జీర్ణక్రియ అవసరం. మంచి ఆరోగ్యం కోసం మలైకా లా మనం కూడా మన దినచర్యను రెటినోల్ జ్యూస్‌తో ప్రారంభిస్తే సరి.

అదెలాగో చూద్దామా..

రెటినోల్ జ్యూస్ అంటే ఏమిటి? ఇది రోజువారీ పండ్లు, కూరగాయల సహజ ప్రయోజనాలతో నిండిన పానీయం. దీనిని తాజా కూరగాయలు, పండ్లతో తయారు చేసుకోవచ్చు.

రెటినోల్ జ్యూస్ కోసం ..

2 క్యారెట్లు, సగం దోసకాయ, ఒక నారింజ, సగం నిమ్మకాయ, అల్లం ముక్క.. పై పదార్థాలను కడిగి, తొక్క తీసి, వాటిని కలిపి జ్యూస్ చేసుకుని ఒక గ్లాసులో పోసుకుని వెంటనే తాగేయాలి. ఈ జ్యూస్‌లో సమృద్ధిగా ఉండే విటమిన్ సి ఇతర విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు రోజంతా తాజాగా ఉండేందుకు తోడ్పడతాయి.

యాంగ్జైటీ ఎక్కువగా మహిళల్లోనే..!



తీవ్రమైన కుంగుబాటు (డిప్రెషన్), ఉద్విగ్నతకు (యాంగ్జైటీకి) లోను కావడం వంటివి పురుషులతో పోలిస్తే మహిళల్లోనే ఎక్కువగా కనిపిస్తుంటాయని డబ్ల్యూహెచ్‌ఓ గణాంకాలు పేర్కొంటున్నాయి. ఉదాహరణకు 2021 నాటి డబ్ల్యూహెచ్‌ఓ లెక్కల ప్రకారం మానసిక సమస్యలతో బాధపడేవారిలో పురుషుల సంఖ్య 13 శాతం కాగా... మహిళల్లో ఆ సంఖ్య 14.8 శాతం. అదే నివేదికలోని వివరాల ప్రకారం... యాంగ్జైటీ సమస్యలు వయసుపరంగా చూస్తే బాలికల్లో చాలా త్వరగా బయటపడతాయనేది డబ్ల్యూహెచ్‌ఓ రిపోర్టులు చెబుతున్న మాట. ఉదాహరణకు యాంగ్జైటీ సమస్యలతో బాధపడేవారిలో 10 నుంచి 19 ఏళ్ల వయసున్న బాలికలు 5.8 శాతం మంది ఉండగా... 20 నుంచి 24 ఏళ్ల వయసున్న యువతులు 7.1 శాతం మంది ఉంటారు. ఇక యాంగ్జైటీ బాధితుల్లోనే యుక్తవయసుకు వచ్చిన ఆడపిల్లలు 5.7 శాతం మంది ఉంటారు. అలాగే 50 నుంచి 69 ఏళ్ల మహిళల విషయానికి వస్తే ఇందులో డిప్రెషన్‌తో బాధపడేవారు 6 నుంచి 7 శాతం వరకు ఉంటారని డబ్ల్యూహెచ్‌ఓ నివేదికలు వెల్లడిస్తున్నాయి.

1. ఈ నెల 29న వరల్డ్ హార్ట్ డే సందర్భంగా హార్ట్ రిలేటెడ్ స్టోరీ
2. థైరాయిడ్ నాడ్యూల్స్‌కు శస్త్రచికిత్సకు బదులుగా వచ్చిన అధునాతన అబ్లేషన్ చికిత్సపై కథనం.
3. విటమిన్ బి-12 లోపం వల్ల కనిపించే సమస్యలూ, అధిగమించే మార్గాలపై కథనం.

సాక్షి సినిమా

సుకుమార్ రైటింగ్స్‌కి పది వసంతాలు



● సుకుమార్

సుకుమార్... పాన్ ఇండియా స్థాయిలో పరిచయం అక్కర్లేని దర్శకుడి పేరు. ఒకవైపు స్టార్ హీరోల చిత్రాలకు దర్శకత్వం వహిస్తూనే మరోవైపు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ ద్వారా క్రేజీ పాన్ ఇండియా చిత్రాలతో పాటు కొత్తదనంతో కూడిన వైవిధ్యమైన చిత్రాలను అందించడంలోనూ సుకుమార్ ముందంజలో ఉన్నారు. ఆయన ఆరంభించిన సుకుమార్ రైటింగ్స్ బ్యానర్ పది వసంతాలు పూర్తి చేసుకుంది. 'కుమారి 21ఎఫ్, ఉప్పెన, విరూపాక్ష, 18 పేజెస్, పుష్ప-2, గాంధీ తాత చెట్టు' వంటి పలు బ్లాక్‌బస్టర్ చిత్రాలు అగ్ర నిర్మాణ సంస్థల నిర్మాణ భాగస్వామ్యంలో సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై రూపొందాయి. తాజాగా సుకుమార్ రైటింగ్స్ భాగస్వామ్యంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. అలాగే నాగచైతన్య హీరోగా కార్తీక్ దండు దర్శకత్వం వహిస్తున్న కొత్త చిత్రంలోనూ సుకుమార్ రైటింగ్స్ భాగస్వామంగా ఉంది. 'పెద్ది' అనంతరం సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా రూపొందనున్న చిత్రానికీ సుకుమార్ రైటింగ్ నిర్మాణ భాగస్వామ్యంగా ఉంది. అంతేకాదు... ఈ బ్యానర్‌లో మరో ఆరు కథలతో సినిమాలు రూపొందడానికి సిద్ధంగా ఉన్నాయి.

ఎన్టీఆర్‌కు గాయం



హీరో ఎన్టీఆర్ గాయపడ్డారు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో ఓ యాడ్ చిత్రీకరణలో పాల్గొంటున్న సమయంలో ఎన్టీఆర్‌కు గాయాలయ్యాయి. ఆయన వ్యక్తిగత సిబ్బంది వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. ఈ వార్త బయటకు రాగానే ఎన్టీఆర్ అభిమానులు కాస్త ఆందోళనకు గురయ్యారు. దీంతో ఈ విషయంపై ఆయన సిబ్బంది స్పందించారు. ''ఓ ప్రకటన చిత్రీకరణ సమయంలో ఎన్టీఆర్‌కు స్వల్ప గాయమైంది. వైద్యుల సలహా మేరకు ఎన్టీఆర్ పూర్తిగా కోలుకోవడానికి రెండు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగా ఉన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య పరిస్థితులపై వస్తున్న ఊహాగానాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు'' అంటూ ఎన్టీఆర్ సిబ్బంది ఓ నోట్‌ను విడుదల చేసింది.

సందడిగా షబానా పుట్టినరోజు వేడుక



● భర్త జావేద్‌తో డ్యాన్స్ చేస్తున్న షబానా

బాలీవుడ్ సీనియర్ నటి షబానా ఆజ్మీ ఎంతో ఉత్సాహంగా 'ప్రెట్టీ లిటిల్ బేబీ' పాటకు డ్యాన్స్ చేశారు. 75 ఏళ్ల వయసులో ఆమె 'లిటిల్ బేబీ' అంటూ డ్యాన్స్ చేయడానికి కారణం ఉంది. గురువారం (సెప్టెంబరు 18) షబానా 75వ పుట్టినరోజు. ఈ సందర్భంగా గ్రాండ్ బర్త్ డే పార్టీని ఏర్పాటు చేసి, పలువురు బాలీవుడ్ స్టార్స్‌ని ఆహ్వానించారు. అమెరికన్ సింగర్ కోనీ ఫ్రాన్సిస్ ఫేమస్ పాట 'ప్రెట్టీ లిటిల్ బేబీ'కి భర్త జావేద్ అక్తర్‌తో కలిసి డ్యాన్స్ చేశారు షబానా. ఈ వీడియో వైరల్ అవుతోంది. ఇక ఈ నైట్ పార్టీలో డ్యాన్సింగ్ క్వీన్ మాధురీ దీక్షిత్ 'పరిణీత' సినిమాలోని పాపులర్ సాంగ్ 'కైసీ పహేలీ జిందగాని'కి డ్యాన్స్ చేసి, ఆకట్టుకున్నారు. మాధురీతో కలిసి సీనియర్ నటి రేఖ స్టయిల్‌గా వేసిన స్టెప్పులు అందర్నీ అలరించాయి. విద్యాబాలన్, మాధురీ దీక్షిత్, ఊర్మిళ కలిసి డ్యాన్స్ చేసిన వీడియోలూ వైరల్ అయ్యాయి. 'ఓజీ క్వీన్స్ ఆఫ్ బాలీవుడ్' అనే క్యాప్షన్‌తో ఓ వీడియోను నటుడు-నిర్మాత సంజయ్ కపూర్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇంకా 'జిందగీ న మిలేగీ దోబారా' చిత్రంలోని 'సెనోరిటా' పాట పాడుతూ, డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు దర్శక-నిర్మాత-నటుడు ఫర్హాన్ అక్తర్. ఈ వేడుకలో హృతిక్ రోషన్, సోనూ నిగమ్, కరణ్ జోహార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆస్కార్‌కి హోమ్ బౌండ్

హైదరాబాదీ ఫిల్మ్ మేకర్ నీరజ్ ఘైవాన్ తెరకెక్కించిన తాజా హిందీ చిత్రం 'హోమ్ బౌండ్' ఆస్కార్ నామినేషన్ బరిలో నిలిచింది. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న 98వ ఆస్కార్ అవార్డ్స్‌లోని ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో నామినేషన్ కోసం 'హోమ్ బౌండ్' పోటీలో నిలిచింది. ఆస్కార్ నామినేషన్ ఎంట్రీ కోసం భారతదేశం తరపున 'హోమ్ బౌండ్' సినిమాను పంపిస్తున్నట్లుగా ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఫిర్దౌసుల్ హసన్ తెలిపారు. ఇషాన్ కట్టర్, విశాల్ జైత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రధారులుగా 'హోమ్ బౌండ్'కు నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించారు. కరణ్ జోహార్, ఆదార్ పూనావాలా, అపూర్వ మెహతా, సోమెన్ మిశ్రా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న థియేటర్స్‌లో రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో మొహమ్మద్ షోయబ్ పాత్రలో ఇషాన్ కట్టర్, చందన్‌కుమార్‌గా విశాల్ జైత్వా నటించారు. పోలీసు కావాలనే తమ కల కోసం ఇద్దరు చిన్ననాటి ప్రాణ స్నేహితులు కుల, మత వివక్షలకు వ్యతిరేకంగా ఎలాంటి పోరాటం చేయాల్సి వచ్చిందనే అంశంతో 'హోమ్ బౌండ్' కథనం సాగుతుందని ఇటీవల విడుదలైన ఈ సినిమా ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఇక ఈ ఏడాది మేలో జరిగిన కాన్స్ ఫిల్మ్‌ఫెస్టివల్, ఇటీవల 50వ టొరంటో ఫిల్మ్‌ఫెస్టివల్ వంటి అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో 'హోమ్ బౌండ్'ను ప్రదర్శించారు. కొన్ని అవార్డులూ వచ్చాయి. ఈ చిత్రం ఆస్కార్ నామినేషన్‌కి వెళ్లడం గురించి ''ఓ మై గాడ్.. ఇది నిజమా?'' అంటూ నీరజ్ తన ఆశ్చర్యానందాలను వ్యక్తం చేశారు. ఈ సంగతి ఇలా ఉంచితే... తెలుగు నుంచి 'పుష్ప ది రూల్, కన్నప్ప', హిందీ 'తన్వీ: ది గ్రేట్, ది బెంగాలీ ఫైల్స్, కేసరి చాప్టర్ 2, జుగ్నుమ, ఫులే' వంటి చిత్రాలను కూడా ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పరిశీలించి, ఫైనల్‌గా ఆస్కార్ నామినేషన్ పోటీకి 'హోమ్ బౌండ్'ను ఎంపిక చేసినట్లుగా వార్తలు వస్తున్నాయి.



● 'హోమ్ బౌండ్' పోస్టర్

రేస్‌లో రాజా




● శర్వానంద్

మోటార్ సైకిల్ రేస్‌లో శర్వానంద్ పాల్గొంటున్నారు. హీరో శర్వానంద్, దర్శకుడు అభిలాష్ కంకర కాంబినేషన్‌లో మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో స్కిల్డ్ మోటార్ సైకిల్ రేసర్‌గా కనిపించనున్నారు శర్వానంద్. ప్రస్తుతం ఈ సినిమాలోని కీలకమైన రేసింగ్‌కు సంబంధించిన సన్నివేశాలను హైదరాబాద్‌లో చిత్రీకరిస్తున్నారు. ''ఈ చిత్రంలో ఓ యునిక్ క్యారెక్టరైజేషన్‌తో, చాలెంజింగ్ రోల్‌లో శర్వానంద్ నటిస్తున్నారు. మంచి యాక్షన్ స్టంట్స్‌తో శర్వా అదరగొడుతున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాకు 'రేస్ రాజా' అనే టైటిల్ అనుకుంటున్నారని సమాచారం.

ధర్మమే గెలుస్తుంది

అర్జున్ హీరోగా రూపొందిన పాన్ ఇండియన్ చిత్రం 'మఫ్టీ పోలీస్'. దినేష్ లెట్చుమనన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఐశ్వర్యా రాజేష్ లీడ్ రోల్ చేశారు. జి. అరుళ్ కుమార్ సమర్పణలో జి.ఎస్. ఆర్ట్స్ బ్యానర్ నిర్మించిన ఈ సినిమా తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. ''సర్... ఆ రైటర్ ఒక కథ రాశారు.. అది చదవడానికి ఫిక్షన్‌లా ఉంది కానీ నాన్ ఫిక్షన్', 'కొన్నిసార్లు చట్టాన్ని దాటి న్యాయం ఉంటుంది.. ఇంకొన్నిసార్లు న్యాయాన్ని దాటి ధర్మం ఉంటుంది. కానీ, మొత్తం లెక్కవేసి చూస్తే చివరికి ధర్మమే గెలుస్తుంది'' అంటూ అర్జున్ చెప్పే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ''క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'మఫ్టీ పోలీస్'. ఈ సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.



● అర్జున్, ఐశ్వర్యా రాజేష్

ఫ్యాంటసీ గాలి

రామ్‌ప్రసాద్ గురజాడ, అంజలి, శ్రీకాంత్ పెరుమండ్ల, చిన్ని, రోజా రాణి, బీవీ సుబ్బా రెడ్డి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'గాలి'. టి. రాము దర్శకత్వంలో చందా లక్ష్మీ నారాయణ నిర్మించారు. ఈ చిత్రం టీజర్, ఆడియో రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథులుగా నిర్మాత సాయి వెంకట్, బల్లెం వేణు మాధవ్, రచయిత తిరునగిరి శ్రీనివాస్, విద్యావేత్త దరిపల్లి నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చందా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ– ''నాకు సినిమా ఫీల్డ్ కొత్త. అయినా రాముగారు రాసుకున్న సోషియో ఫ్యాంటసీ కథ నచ్చడంతో ఈ సినిమా నిర్మించాను. ఔట్‌పుట్ చాలా బాగా వచ్చింది'' అన్నారు. టి. రాము మాట్లాడుతూ– ''కలి పురుషుడుకి–అమ్మవారికి మధ్య జరిగే భీకర పోరాటమే 'గాలి' చిత్రం. ఈ చిత్రాన్ని డిసెంబరు 25న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని చెప్పారు.



● రామ్‌ప్రసాద్, అంజలి, చిన్ని, శ్రీకాంత్

ఏం చేద్దాం...



● కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కె ర్యాంప్'. జైన్స్ నాని రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తున్నారు. రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబరు 18న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. 'మీరు డొనేషన్ కట్టారన్న ఒకే ఒక రీజన్‌తో సస్పెండ్ చేయడం లేదు సర్' (శివన్నారాయణ), 'అయినా నీకు అందరూ చెబుతూనే ఉన్నార్రా... బిల్డప్‌లు ఎక్కువైనయ్ తగ్గించుకోమని చెప్పి.. ఏం చేద్దాం.. అవే చేద్దాం (కిరణ్ అబ్బవరం), 'మా అబ్బాయి మీ అమ్మాయిని లవ్ చేయడం గొప్ప విషయం కాదు... మీ అమ్మాయి తిరిగి మా అబ్బాయిని లవ్ చేయడం గొప్ప విషయం' (సాయికుమార్) వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''లవ్, రొమాన్స్, యాక్షన్, ఫన్‌తో కంప్లీట్ ఎంటర్‌టైనర్‌గా 'కె-ర్యాంప్' ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

యూత్‌ఫుల్ సంగీత్




● నిఖిల్ విజయేంద్ర సింహా

యూ ట్యూబర్ నిఖిల్ విజయేంద్ర సింహా హీరోగా నటిస్తున్న చిత్రం 'సంగీత్'. ఈ రొమాంటిక్ కామెడీ సినిమాకు సాద్ ఖాన్ దర్శకత్వం వహిస్తున్నారు. లహరి ఫిల్మ్స్, ఆర్‌బీ స్టూడియోస్ పతాకాలపై నవీన్ మనోహరన్, చంద్రు మనోహరన్, స్రవంతి నవీన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నిఖిల్ విజయేంద్ర సింహా బర్త్ డే సందర్భంగా 'సంగీత్' సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ''యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను కూడా మెప్పించేలా ఈ సినిమా ఉంటుంది. చిత్రీకరణ తుది దశలో ఉంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: కల్యాణ్ నాయక్.

శనివారం 20-9-2025

సత్యమేవ జయతే

సాక్షి



WWW.SAKSHI.COM

పేజీలు: 20+12 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 180

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



స్టాక్‌ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్‌ ▽	388	82,626
నిఫ్టీ ▽	97	25,327

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్‌	22,577	△	106
డోజోన్స్‌	46,298	△	156
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,213	▽	16
డాక్స్‌	23,644	▽	31
షాంఘై	3,820	▽	12
నికాయ్‌	45,046	▽	258

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్‌ డాలర్‌	ఎస్‌బీఐ	87.80	88.82
£	బ్రిటన్‌ పౌండ్‌	ఎస్‌బీఐ	118.23	121.22
€	యూరో	ఎస్‌బీఐ	102.73	105.33
¥	జపాన్‌ యెన్‌ (100)	ఎస్‌బీఐ	59.28	60.80
AU$	ఆస్ట్రేలియా డాలర్‌	ఎస్‌బీఐ	57.29	59.57
S$	సింగపూర్‌ డాలర్‌	థామస్‌కుక్‌	66.27	69.97
SAR	సౌదీ రియాల్‌	థామస్‌కుక్‌	22.60	24.10
UAE D	యూఏఈ దిర్హామ్‌	థామస్‌కుక్‌	23.09	24.35
¥	చైనా యువాన్‌	థామస్‌కుక్‌	11.50	13.32

భారత్‌లో యాపిల్‌ మేనియా...


ఐఫోన్‌ 17 అమ్మకాలు షురూ..

ఢిల్లీ యాపిల్‌ స్టోర్‌లో ఐఫోన్‌-17 కోసం క్యూ...

న్యూఢిల్లీ: భారత్‌లో శుక్రవారం అందుబాటులోకి వచ్చిన యాపిల్‌ ఐఫోన్‌ 17 అభిమానుల్లో మేనియా సృష్టించింది. లేటెస్ట్‌ ఫోన్‌ను ముందుగా దక్కించుకునేందుకు యాపిల్‌ స్టోర్స్‌ ముందు ఫ్యాన్స్‌ బారులు తీరారు. కొందరు ముందు రోజు రాత్రి నుంచే దాదాపు 21 గంటల పాటు కూడా నిరీక్షిస్తూ కూర్చున్నారు. ముంబై, ఢిల్లీ, బెంగళూరులో చాంతాడంత క్యూలు కనిపించాయి. ఐఫోన్‌ 17ని మొదటి రోజునే ముందుగా దక్కించుకున్నవారు మిగతా వారితో తమ సంతోషాన్ని పంచుకున్నారు. రికార్డు స్థాయిలో కొనుగోలుదారులు వెల్లువెత్తినట్లు రిటైలర్లు తెలిపారు. 'నేను పొద్దుటి నుంచే క్యూలో ఉన్నాను. ఈ రంగు ఐఫోన్‌ను కొనుక్కోవడం చాలా సంతోషంగా ఉంది' అంటూ ఢిల్లీలోని అష్రఫ్‌ అనే కొనుగోలుదారు తెలిపారు. బెంగళూరులో కొత్తగా ప్రారంభించిన యాపిల్‌ హెబ్బాల్‌ స్టోర్‌లో కూడా ఇలాంటి సందడే నెలకొంది. అటు ముంబైలోని స్టోర్‌ దగ్గర గుమికూడిన కస్టమర్ల మధ్య ఉదయం సుమారు 6 గంటల ప్రాంతంలో గొడవ తలెత్తడంతో, సెక్యూరిటీ సిబ్బంది పరిష్కరించాల్సి వచ్చింది. ఇటీవల ప్రవేశపెట్టిన ఐఫోన్‌ 17 సిరీస్‌ ధర శ్రేణి రూ. 82,900 నుంచి రూ. 2,29,900 వరకు ఉంది.

దేశీయంగానే కీలక ఖనిజాల అన్వేషణ

- హిందుస్తాన్‌ కాపర్‌, ఆయిల్‌ ఇండియా జట్టు
- చైనా దిగుమతులను తగ్గించడమే లక్ష్యం



న్యూఢిల్లీ: రాగి సహా కీలక ఖనిజాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునేలా, దేశీయంగానే మరింతగా ఉత్పత్తి చేయడంపై ప్రభుత్వ రంగ సంస్థలు కసరత్తు చేస్తున్నాయి. ఇందులో భాగంగా హిందుస్తాన్‌ కాపర్‌ (హెచ్‌సీఎల్‌), ఆయిల్‌ ఇండియా (ఆయిల్‌) అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. దేశీయంగా కీలక ఖనిజాల వెలికితీత, ఉత్పత్తికి ఇది ఉపయోగపడనుంది. క్రూడాయిల్‌ వెలికితీత, ఉత్పత్తి, రవాణాలో ఆయిల్‌ ఇండియాకు అపార అనుభవం ఉంది. అటు గనుల శాఖలో భాగమైన హెచ్‌సీఎల్‌కి కాపర్‌ తదితర ఉత్పత్తుల మైనింగ్‌, ఉత్పత్తి, ప్రాసెసింగ్‌, మార్కెటింగ్‌లో అనుభవం ఉంది. రాగికి సంబంధించి దేశీయంగా మైనింగ్‌ లీజులన్నీ కంపెనీకే ఉన్నాయి. ఇండియన్‌ ఆయిల్‌ కార్పొరేషన్‌, గెయిల్‌ ఇండియా రైట్స్‌లాంటి ప్రభుత్వ రంగ సంస్థల తరహాలోనే క్రిటికల్‌ మినరల్స్‌, రేర్‌ ఎర్త్‌ ఎలిమెంట్‌ బ్లాక్‌ల కోసం బిడ్డింగ్‌ చేయనున్నట్లు హిందుస్తాన్‌ కాపర్‌ ఇప్పటికే ప్రకటించింది. దేశీ, విదేశీ మార్కెట్లలో కీలక ఖనిజాలను సంయుక్తంగా అభివృద్ధి చేసేందుకు కంపెనీతో, ఇంజనీరింగ్‌ సంస్థ రైట్స్‌ ఒప్పందం కుదుర్చుకుంది. పర్యావరణహితమైన ఇంధనాల విషయంలో స్వావలంబన సాధించే దిశగా కేంద్రం ప్రాథమికంగా రూ. 16,300 కోట్లతో జాతీయ క్రిటికల్‌ మినరల్‌ మిషన్‌ను ప్రకటించింది. ఏడేళ్లలో దీనిపై మొత్తం రూ. 34,300 కోట్లు వెచ్చించనుంది. రాగి, లిథియం, నికెల్‌, కోబాల్ట్‌, రేర్‌ ఎర్త్‌ మినరల్స్‌లాంటివి, స్వచ్ఛ ఇంధన టెక్నాలజీలను అభివృద్ధి చేసేందుకు కీలకమైన ముడి వనరులుగా ఉపయోగపడతాయి.

ప్రీమియం హోటల్స్‌ కోసం
ఓయో 'చెకిన్‌'



న్యూఢిల్లీ: ప్రీమియం హోటళ్లు, హోమ్‌స్టే బ్రాండ్లను ఒకే గొడుగు కిందకు తెస్తూ ఓయో మాతృ సంస్థ ప్రిజం ప్రత్యేకంగా 'చెకిన్‌' పేరిట కొత్త విభాగాన్ని ప్రారంభించింది. ఇందులో ప్రీమియం హోటళ్లు, సండే హోటల్స్‌, క్లబ్‌హౌస్‌, పాలెట్‌, చెక్‌మైగెస్ట్‌, డ్యాన్సెంటర్‌, బెల్‌విల్లా తదితర బ్రాండ్స్‌ ఉంటాయి. ఓయో ఏ విధంగానైతే బడ్జెట్‌ ట్రావెల్‌కి పర్యాయపదంగా మారిందో చెకిన్‌ కూడా అదే విధంగా ప్రీమియం హోటళ్లు, హోమ్స్‌కి గ్లోబల్‌ బ్రాండ్‌గా ఉంటుందని ప్రిజం వ్యవస్థాపకుడు రితేష్‌ అగర్వాల్‌ తెలిపారు. ప్రాథమికంగా చెకిన్‌ భారత్‌లో అందుబాటులో ఉంటుందని, దశలవారీగా రాబోయే నెలల్లో అంతర్జాతీయంగా కూడా ప్రవేశపెడతామని పేర్కొన్నారు. తమ అధ్యయనం ప్రకారం 55 శాతం మంది మరింత నాణ్యమైన, లగ్జరీ అనుభూతిని అందించే హోటళ్లకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడైందని ప్రిజం తెలిపింది.

'సాక్షి ప్లస్‌' ఈ-పేపర్‌లో ..
ఏటా రూ. 120 కోట్ల పెట్టుబడులు: లైఫ్‌స్టయిల్‌ | భారత రేటింగ్‌ బీబీబీ ప్లస్‌

ఐపీవో రష్‌..!

వచ్చే వారం (22-26) ప్రైమరీ మార్కెట్లలో సందడే సందడి.. మెయిన్‌ బోర్డులో 6 కంపెనీల పబ్లిక్‌ ఇష్యూలు మార్కెట్లను పలకరించనుండగా.. మరో 3 ఇష్యూలు ముగియనున్నాయి. ఇప్పటికే నిధుల సమీకరణ పూర్తి చేసుకున్న మరో 4 కంపెనీలు స్టాక్‌ ఎక్స్ఛేంజీలలో లిస్టకానున్నాయి. వెరసి వచ్చే వారం ఐపీవో నామవారంగా నిలవనుంది. వివరాలు చూద్దాం..

- సాక్షి, బిజినెస్‌ డెస్క్‌

వారమంతా ఆఫర్ల సందడి...
- 6 పబ్లిక్‌ ఇష్యూలు షురూ
- 3 ఇష్యూల ముగింపు
- 5 కంపెనీల లిస్టింగ్‌
- రేసులో పలు ఎస్‌ఎంఈలు

రానున్న సోమవారం(22) నుంచి శుక్రవారం (26) మధ్యలో ప్రైమరీ మార్కెట్లు కళకళలాడనున్నాయి. ఇటీవల జోరందుకున్న పబ్లిక్‌ ఇష్యూలు మరింతగా వెల్లువెత్తనున్నాయి. రూ. 560 కోట్ల సమీకరణకు ఈ వారం ప్రారంభమైన ఐవేల్యూ ఇన్ఫో 22న ముగియనుండగా.. సాత్విక్‌ గ్రీన్‌ ఎనర్జీ(రూ. 900 కోట్లు), జీకే ఎనర్జీ(రూ. 465 కోట్ల సమీకరణ) 23న పూర్తికానున్నాయి. ఇక 22–24 మధ్య అట్లాంటా ఎలక్ట్రికల్స్‌(రూ. 687 కోట్లు), గణేశ్‌ కన్జూమర్‌ ప్రొడక్ట్స్‌(రూ. 409 కోట్లు), 23–25 మధ్య ఆనంద్‌ రాఠీ షేర్‌ అండ్‌ స్టాక్‌ బ్రోకర్స్‌(రూ. 745 కోట్లు), శేషసాయి టెక్నాలజీస్‌(రూ. 480 కోట్లు), సోలార్‌ వరల్డ్‌(రూ. 490 కోట్లు), జారో ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌ అండ్‌ రీసెర్చ్‌(రూ. 450 కోట్లు), 24–26 మధ్య జైన్‌ రిసోర్స్‌ రీసైక్లింగ్‌(రూ. 1,250 కోట్లు), ఈప్యాక్‌ ప్రీఫ్యాబ్‌(రూ.504 కోట్లు) ఇన్వెస్టర్లకు జోష్‌నివ్వనున్నాయి. ఈ కంపెనీలు ఉమ్మడిగా దాదాపు రూ. 7,000 కోట్లు సమీకరించనున్నాయి. కొద్ది నెలలుగా ఇన్వెస్టర్లను ఆకట్టుకుంటున్న ప్రైమరీ మార్కెట్ల ప్రభావంతో ఈ కేలండర్‌ ఏడాదిలో ఇప్పటికే 60 కంపెనీలు లిస్టింగ్‌కు రావడం ద్వారా రూ. 78,000 కోట్లకుపైగా సమీకరించడం గమనార్హం!

లిస్టింగ్‌కు 5 కంపెనీలు రెడీ

ఇప్పటికే విజయవంతంగా ఐపీవోలు చేపట్టిన 5 కంపెనీలు వచ్చే వారం మెయిన్‌బోర్డులో లిస్టకానున్నాయి. జాబితాలో యూరో ప్రతీక్‌ సేల్స్‌ (23న), వీఎంఎస్‌ టీఎంటీ (24న), ఐవేల్యూ ఇన్ఫో (25న), సాత్విక్‌ గ్రీన్‌, జీకే ఎనర్జీ(26న) చేరాయి.



ఇష్యూల జోరు ఇలా...

కంపెనీ పేరు	ధరల శ్రేణి	ఇష్యూ తేదీ
ఐవేల్యూ ఇన్ఫో	284-299	18-22
సాత్విక్‌ గ్రీన్‌ ఎనర్జీ	442-465	19-23
జీకే ఎనర్జీ	145-153	19-23
అట్లాంటా ఎలక్ట్రికల్స్‌	718-754	22-24
గణేశ్‌ కన్జూమర్‌	306-322	22-24
ఆనంద్‌ రాఠీ షేర్‌	393-414	23-25
శేషసాయి టెక్‌	402-423	23-25
సోలార్‌ వరల్డ్‌	333-351	23-25
జారో ఇన్‌స్టిట్యూట్‌	846-890	23-25
జైన్‌ రిసోర్స్‌	220-232	24-26
ఈప్యాక్‌ ప్రీఫ్యాబ్‌	194-204	24-26

ధరల శ్రేణి రూ.లలో, ఇష్యూ తేదీ - ప్రారంభం, ముగింపు

ఎస్‌ఎంఈల దూకుడు

చిన్న, మధ్యతరహా కంపెనీ(ఎస్‌ఎంఈ)ల నిధుల సమీకరణకు వీలుగా స్టాక్‌ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌లను తీసుకువచ్చిన నేపథ్యంలో కొన్నేళ్లుగా ఐపీవోలు క్యూ కడుతున్నాయి. ఈ బాటలో ఈ వారం పబ్లిక్‌ ఇష్యూలు పూర్తి చేసుకున్న 4 ఎస్‌ఎంఈలు వచ్చే వారం లిస్టకానుండగా.. ఏకంగా 16 కంపెనీలు ఐపీవోలకు రానుండటం విశేషం! జాబితాలో ప్రైమ్‌ కేబుల్‌, సాల్వెక్స్‌ ఎడిబుల్స్‌, భారత్‌రోహన్‌ ఎయిర్‌బోన్‌, ఆప్టస్‌ ఫార్మా, ట్రూ కలర్స్‌, మ్యాట్రిక్స్‌ జియో, ఎన్‌ఎస్‌బీ బీపీవో సొల్యూషన్స్‌, ఎకోలైన్‌ ఎగ్జిమ్‌, సిస్టమాటిక్‌ ఇండస్ట్రీస్‌, జస్టో రియల్‌ఫిన్‌టెక్‌, రిద్ధి డిస్‌ప్లే, గురునానక్‌ అగ్రికల్చర్‌, ప్రరూహ టెక్‌ తదితర కంపెనీలు చేరాయి.

3 రోజుల లాభాలకు బ్రేక్‌

- సెన్సెక్స్‌ నష్టం 388 పాయింట్లు
- సెబీ క్లీన్‌చిట్‌తో అదానీ షేర్ల ర్యాలీ



ముంబై: బ్యాంకులు, ఐటీ, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో దేశీయ స్టాక్‌ మార్కెట్‌ మూడు రోజుల లాభాలకు శుక్రవారం బ్రేక్‌ పడింది. సెన్సెక్స్‌ 388 పాయింట్లు నష్టపోయి 82,626 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 97 పాయింట్లు పతనమైన 25,327 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్‌ 528 పాయింట్లు కోల్పోయి 82,486 వద్ద, నిఫ్టీ 137 పాయింట్లు పతనమై 25,286 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి.

● హిండెన్‌బర్గ్‌ కేసులో సెబీ క్లీన్‌చిట్‌తో అదానీ గ్రూప్‌ షేర్లు భారీ ర్యాలీ చేశాయి. అదానీ పవర్‌ 12.50%, అదానీ టోటల్‌ గ్యాస్‌ 7.35%, అదానీ గ్రీన్‌ ఎనర్జీ 5.33%, అదానీ ఎంటర్‌ప్రైజెస్‌ 5.04% ఎన్‌డీటీవీ, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్‌ 5% పెరిగాయి. అదానీ గ్రూప్‌ మొత్తం మార్కెట్‌ విలువ రూ.69,000 కోట్లు పెరిగి రూ.13.96 లక్షల కోట్లకు చేరింది.

సాక్షి స్పోర్ట్స్‌



క్వార్టర్‌ ఫైనల్లో రిత్విక్‌-బాలాజీ జంట

హాంగ్జౌ ఓపెన్‌ ఏటీపీ-250 టెన్నిస్‌ టోర్నమెంట్‌ డబుల్స్‌ విభాగంలో భారత డేవిస్‌కప్‌ జట్టు సభ్యుడు, హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్‌ చౌదరీ క్వార్టర్‌ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. చైనాలో శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్‌ తొలి రౌండ్‌లో రిత్విక్‌-శ్రీరామ్‌ బాలాజీ (భారత్‌) జంట 6-4, 7-5తో థియో అరిబెజ్‌ (ఫ్రాన్స్‌)-రే హో (చైనీస్‌ తైపీ) జోడీపై నెగ్గింది. 88 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్‌-బాలాజీ ఏడు ఏస్‌లు సంధించి, రెండు డబుల్‌ ఫాల్ట్‌లు చేశారు. ప్రత్యర్థుల సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్‌ చేశారు. మరోవైపు హైదరాబాద్‌కే చెందిన అనిరుధ్‌ చంద్రశేఖర్‌-రీస్‌ స్టాల్డర్‌ (అమెరికా) జోడీ తొలి రౌండ్‌లో 2-6, 6-4, 7-10తో అర్నియోడో (మొనాకో)- సాండర్‌ జిలె (బెల్జియం) ద్వయం చేతిలో ఓడిపోయింది. మరో మొదటి రౌండ్‌ మ్యాచ్‌లో అర్జున్‌ ఖడే-విజయ్‌ సుందర్‌ (భారత్‌) జంట 6-2, 6-4తో లెర్నర్‌ టియెన్‌ (అమెరికా)-యిబింగ్‌ వు (చైనా) జోడీపై గెలిచి క్వార్టర్‌ ఫైనల్‌ చేరుకుంది.



తొలిసారి సిరీస్‌ సాధించే లక్ష్యంతో...

- నేడు ఆస్ట్రేలియాతో భారత మహిళల మూడో వన్డే
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్టార్‌ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

న్యూఢిల్లీ: మహిళల వన్డే క్రికెట్‌లో భారత జట్టు ఇన్నేళ్లలో ఒక్కసారి కూడా ఆస్ట్రేలియా మహిళలపై సిరీస్‌ సాధించలేకపోయింది. అయితే ఇప్పుడు అలాంటి అవకాశం మన జట్టు ముందు నిలిచింది. ఆసీస్‌తో జరిగిన రెండో వన్డేలో చెలరేగి భారీ విజయాన్ని అందుకున్న హర్మన్‌ప్రీత్‌ బృందం అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. గత మ్యాచ్‌లాగే సత్తా చాటితే తొలిసారి టీమిండియా సిరీస్‌ మన ఖాతాలో పడుతుంది. అరుణ్‌ జైట్లీ స్టేడియం వేదికగా ఇరు జట్ల మధ్య నేడు నిర్ణయాత్మక మూడో వన్డేకు రంగం సిద్ధమైంది. వన్డే వరల్డ్‌ కప్‌కు సన్నాహకంగా ఈ సిరీస్‌లో ఆడిన ఇరు జట్లు విజయంతో ముగించి మెగా ఈవెంట్‌లో అడుగు పెట్టాలని భావిస్తున్నాయి. రెండో వన్డేలో స్మృతి మంధాన మెరుపు బ్యాటింగ్‌తో పాటు పదునైన బౌలింగ్‌తో ఆసీస్‌ను భారత్‌ కట్టడి చేసింది. ఫలితంగా ఆసీస్‌ వన్డే చరిత్రలో అతి పెద్ద పరాజయాన్ని చవిచూసింది. అయితే మన జట్టులో కూడా ఫీల్డింగ్‌ రూపంలో ప్రధాన లోపం కనిపిస్తోంది. రెండు వన్డేల్లో కలిపి మన ప్లేయర్లు ఏకంగా 10 క్యాచ్‌లు వదిలేశారు. దీనిని సరిదిద్దుకోవాల్సి ఉంది. భారత తమ తుది జట్టులో మార్పులు చేసే అవకాశం ఉంది. మరో వైపు గత మ్యాచ్‌లో ఓడినా...ఆస్ట్రేలియాను తక్కువగా అంచనా వేయడానికి వీలు లేదు. అలీసా హీలీ టీమ్‌ రెండో వన్డే పరాజయాన్ని మరచి తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇవ్వాలని, సిరీస్‌ చేజార్చుకోరాదని పట్టుదలగా ఉంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్‌ స్పోర్ట్స్‌ ఈ-పేపర్‌లో

భారత్‌ అజేయంగా...


ప్లేయర్‌ ఆఫ్‌ ద మ్యాచ్‌ సామ్సన్‌

- ఒమన్‌పై 21 పరుగులతో గెలుపు
- పోరాడి ఓడిన కూన
- సామ్సన్‌ అర్ధ సెంచరీ
- రేపు పాక్‌తో టీమిండియా పోరు

అబుదాబి: ఆసియా కప్‌ టి20 టోర్నీలో లీగ్‌ దశను భారత్‌ అజేయంగా ముగించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో తొలిసారి తమతో తలపడిన చిన్న జట్టు ఒమన్‌పై సునాయాస విజయాన్ని అందుకుంది. బ్యాటర్ల పట్టుదలతో ఒమన్‌ కొంత పోరాడగలిగినా... టీమిండియా ముందు అది సరిపోలేదు. శుక్రవారం జరిగిన ఈ గ్రూప్‌ 'ఎ' పోరులో భారత్‌ 21 పరుగులతో గెలుపొందింది. టాస్‌ గెలిచి ముందుగా బ్యాటింగ్‌ ఎంచుకున్న భారత్‌ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. సంజు సామ్సన్‌ (45 బంతుల్లో 56; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... అభిషేక్‌ శర్మ (15 బంతుల్లో 38; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), తిలక్‌ వర్మ (18 బంతుల్లో 29; 1 ఫోర్‌, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం ఒమన్‌ 20 ఓవర్లలో 4 వికెట్లకు 167 పరుగులు చేసింది. ఆమిర్‌ కలీమ్‌ (46 బంతుల్లో 64; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), హమ్మద్‌ మీర్జా (33 బంతుల్లో 51; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. టోర్నీలో నేటి నుంచి సూపర్‌-4 దశ పోటీలు ప్రారంభం అవుతున్నాయి. తొలి పోరులో శ్రీలంకతో బంగ్లాదేశ్‌ తలపడనుండగా ... ఆదివారం పాకిస్తాన్‌ను భారత్‌ ఎదుర్కొంటుంది.

రాణించిన అభిషేక్‌, తిలక్‌...

శుబ్‌మన్‌ గిల్‌ (5) త్వరగానే వెనుదిరిగినా... అభిషేక్‌ మరోసారి తనదైన రీతిలో దూకుడుగా ఆడుతూ శుభారంభం అందించాడు. షకీల్‌ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌ కొట్టిన అతను నదీమ్‌ ఓవర్లో మరో మూడు ఫోర్లు బాదాడు. సామ్సన్‌ కూడా కొన్ని చక్కటి షాట్లు ఆడటంతో పవర్‌ప్లేలో భారత్‌ 60 పరుగులు చేసింది. అయితే రామనంది వేసిన ఓవర్లో ముందు అభిషేక్‌ అవుట్‌ కాగా... రెండు బంతుల తర్వాత దురదృష్టవశాత్తూ హార్దిక్‌ పాండ్యా (1) రనౌటయ్యాడు. సామ్సన్‌ కొట్టిన షాట్‌కు బంతి బౌలర్‌ చేతికి తాకుతూ స్టంప్స్‌ను పడగొట్టడంతో పాండ్యా వెనుదిరగాల్సి వచ్చింది. ఒకదశలో నాలుగు బంతుల వ్యవధిలో 2 ఫోర్లు, సిక్స్‌ బాదిన అక్షర్‌ను వెంటనే వెనక్కి పంపడంతో ఒమన్‌ సఫలమైంది. శివమ్‌ దూబే (5) కూడా ఎక్కువ సేపు నిలవలేకపోగా, తన సహజశైలికి భిన్నంగా ఆడిన సామ్సన్‌ 41 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో వైపు క్రీజ్‌లో ఉన్నంత సేపు తిలక్‌ ధాటిని ప్రదర్శించాడు. అయితే వరుసగా వికెట్లు పడుతూ ప్రధాన బ్యాటర్లంతా వెనుదిరిగినా కూడా ఇతరులకు అవకాశం ఇచ్చేందుకు కెప్టెన్‌ సూర్యకుమార్‌ మాత్రం చివరి వరకు బ్యాటింగ్‌కు రాలేదు!

కలీమ్‌, మీర్జా అర్ధసెంచరీలు...

భారీ లక్ష్య ఛేదనలో ఒమన్‌కు సరైన ఆరంభం దక్కింది. ఓపెనర్లు జతీందర్‌, కలీమ్‌ జాగ్రత్తగా ఆడి తొలి 6 ఓవర్లలో 44 పరుగులు రాబట్టారు. ఎట్టకేలకు తొలి వికెట్‌కు 52 బంతుల్లో 56 పరుగుల భాగస్వామ్యం తర్వాత కుల్దీప్‌ ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత కూడా భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కోవడంలో ఒమన్‌ సఫలమైంది. ఈ క్రమంలో 38 బంతుల్లో కలీమ్‌ హాఫ్‌ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత ఒమన్‌ బ్యాటర్లు మరింత దూకుడుగా ఆడారు. కలీమ్‌కు తోడు మీర్జా కూడా ధాటిని ప్రదర్శించాడు. 55 బంతుల్లోనే వీరిద్దరు 93 పరుగులు జత చేయడం విశేషం. 30 బంతుల్లో మీర్జా అర్ధ సెంచరీ సాధించగా... ఆ తర్వాత చేయాల్సిన రన్‌రేట్‌ పెరిగిపోయి ఒత్తిడిలో ఒమన్‌ ఓటమి దిశగా పయనించింది.

స్కోరు వివరాలు: **భారత్‌ ఇన్నింగ్స్‌:** అభిషేక్‌ (సి) శుక్లా (బి) రామనంది 38; గిల్‌ (బి) ఫైసల్‌ 5; సామ్సన్‌ (సి) బిష్త్‌ (బి) ఫైసల్‌ 56; పాండ్యా (రనౌట్‌) 1; అక్షర్‌ (సి) శుక్లా (బి) కలీమ్‌ 26; దూబే (సి) జతీందర్‌ (బి) కలీమ్‌ 5; తిలక్‌ (సి) జిక్రియా (బి) రామనంది 29; హర్షిత్‌ (నాటౌట్‌) 13; అర్ష్‌దీప్‌ (రనౌట్‌) 1; కుల్దీప్‌ (నాటౌట్‌) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 188.** **వికెట్ల పతనం:** 1-6, 2-72, 3-73, 4-118, 5-130, 6-171, 7-176, 8-179. **బౌలింగ్‌:** షకీల్‌ 3-0-33-0, ఫైసల్‌ 4-1-23-2, నదీమ్‌ 1-0-19-0, రామనంది 4-0-32-2, శ్రీవాస్తవ 2-0-23-0, జిక్రియా 3-0-23-0, కలీమ్‌ 3-0-31-2. **ఒమన్‌ ఇన్నింగ్స్‌:** జతీందర్‌ (బి) కుల్దీప్‌ 32; కలీమ్‌ (సి) పాండ్యా (బి) హర్షిత్‌ 64; హమ్మద్‌ (సి) (సబ్‌) రింకూ (బి) పాండ్యా 51; జిక్రియా (నాటౌట్‌) 0; శుక్లా (సి) (సబ్‌) రింకూ (బి) అర్ష్‌దీప్‌ 1; రామనంది (నాటౌట్‌) 12; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 167.** **వికెట్ల పతనం:** 1-56, 2-149, 3-154, 4-155. **బౌలింగ్‌:** పాండ్యా 4-0-26-1, అర్ష్‌దీప్‌ 4-0-37-1, హర్షిత్‌ 3-0-25-1, కుల్దీప్‌ 3-0-23-1, అక్షర్‌ 1-0-4-0, దూబే 3-0-31-0, తిలక్‌ 1-0-8-0, అభిషేక్‌ 1-0-12-0.





1 అంతర్జాతీయ టి20ల్లో 100 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా అర్ష్‌దీప్‌ సింగ్‌ గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా ఇప్పటి వరకు అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో 25 మంది బౌలర్లు 100 వికెట్ల మైలురాయిని దాటారు. ఈ జాబితాలో రషీద్‌ ఖాన్‌ (173 వికెట్లు) 'టాప్‌'లో ఉన్నాడు.

సెమీస్‌లో సాత్విక్‌-చిరాగ్‌ జోడీ

షెన్‌జెన్‌: ఈ ఏడాది తొలి టైటిల్‌ కోసం వేచి చూస్తున్న భారత బ్యాడ్మింటన్‌ డబుల్స్‌ జోడీ ఆ దిశగా మరో అడుగు వేసింది. చైనా మాస్టర్స్‌ వరల్డ్‌ టూర్‌ సూపర్‌-750 టోర్నీలో సాత్విక్‌-చిరాగ్‌ ద్వయం సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్‌ క్వార్టర్‌ ఫైనల్లో సాత్విక్‌-చిరాగ్‌ జంట 21-14, 21-14తో రెన్‌ జియాంగ్‌ యు-జియె హావోనన్‌ (చైనా) జోడీపై విజయం సాధించింది. 38 నిమిషాల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో రెండు గేముల్లోనూ భారత జోడీ ఆధిపత్యం కనబరిచింది. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంక్‌ జోడీ ఆరోన్‌ చియా-సో వుయ్‌ యిక్‌ (మలేసియా)తో సాత్విక్‌-చిరాగ్‌ జంట తలపడుతుంది. ముఖాముఖి రికార్డులో సాత్విక్‌-చిరాగ్‌ ద్వయం 4-11తో వెనుకంజలో ఉంది.


సింధు

సింధు ఎనిమిదో 'సారీ'

మహిళల సింగిల్స్‌ విభాగంలో భారత స్టార్‌ పీవీ సింధు పోరాటం ముగిసింది. ప్రపంచ నంబర్‌వన్‌ ఆన్‌ సె యంగ్‌ (దక్షిణ కొరియా)తో జరిగిన క్వార్టర్‌ ఫైనల్లో ప్రపంచ 14వ ర్యాంకర్‌ సింధు 14-21, 13-21తో పరాజయం పాలైంది. ఆన్‌ సె యంగ్‌తో ఇప్పటి వరకు ఆడిన ఎనిమిదిసార్లూ సింధు ఓడిపోవడం గమనార్హం. ఈ కొరియా స్టార్‌తో ఆడిన ఎనిమిది మ్యాచ్‌ల్లో సింధు ఒక్క గేమ్‌ మాత్రమే గెలవగలిగింది. క్వార్టర్‌ ఫైనల్లో ఓడిన సింధుకు 6,875 డాలర్ల (రూ. 6 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 6050 ర్యాంకింగ్‌ పాయింట్లు లభించాయి.

బోల్ట్‌ సరసన లైల్స్‌

ప్రపంచ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ 200 మీటర్లలో వరుసగా నాలుగో స్వర్ణం


నోవా లైల్స్‌


మెలిస్సా

టోక్యో: జమైకా దిగ్గజ అథ్లెట్‌ ఉసేన్‌ బోల్ట్‌కు మాత్రమే సాధ్యమైన ఘనతను అమెరికా స్టార్‌ అథ్లెట్‌ నోవా లైల్స్‌ సాధించాడు. ప్రపంచ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌లో వరుసగా నాలుగోసారి పురుషుల 200 మీటర్ల విభాగంలో లైల్స్‌ విజేతగా నిలిచాడు. 42 ఏళ్ల ప్రపంచ అథ్లెటిక్స్‌ చాంపియన్‌షిప్‌ చరిత్రలో ఉసేన్‌ బోల్ట్‌ (2009, 2011, 2013, 2015లలో) తర్వాత 200 మీటర్ల విభాగంలో వరుసగా నాలుగు స్వర్ణ పతకాలు నెగ్గిన రెండో అథ్లెట్‌గా లైల్స్‌ గుర్తింపు పొందాడు. శుక్రవారం జరిగిన 200 మీటర్ల ఫైనల్‌ రేసును లైల్స్‌ 19.52 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని సంపాదించి పసిడి పతకం గెలిచాడు. 2019, 2022, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలోనూ ఈ విభాగంలో లైల్స్‌ విజేతగా నిలిచాడు.

మెలిస్సా 'స్ప్రింట్‌ డబుల్‌'

మరోవైపు మహిళల 200 మీటర్ల విభాగంలో అమెరికాకే చెందిన మెలిస్సా జెఫర్సన్‌ వుడెన్‌ స్వర్ణ పతకాన్ని దక్కించుకుంది. 200 మీటర్ల ఫైనల్‌ రేసును మెలిస్సా 21.68 సెకన్లలో పూర్తి చేసి విజేతగా అవతరించింది. 100 మీటర్ల విభాగంలోనూ మెలిస్సాకే బంగారు పతకం లభించింది. 2013లో షెల్లీ ఆన్‌ ఫ్రేజర్‌ ప్రైస్‌ తర్వాత ఒకే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్ల విభాగాల్లో పసిడి పతకాలు నెగ్గిన రెండో అథ్లెట్‌గా మెలిస్సా గుర్తింపు పొందింది.

సత్యమేవ జయతే

సాక్షి


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

WWW.SAKSHI.COM

పేజీలు: 20+12 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 180

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

'సాక్షి'పై ప్రభుత్వ కక్ష సాధింపు తగదు

పత్రికా స్వేచ్ఛను హరించొద్దు

సీఎం చంద్రబాబుకు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా ఘాటు లేఖ

కేవలం 'సాక్షి'నే లక్ష్యంగా చేసుకుని కేసులు పెట్టడంపై తీవ్ర ఆందోళన

ఇది అధికార దుర్వినియోగమేనని స్పష్టీకరణ.. విలేకరుల సమావేశాన్ని ప్రచురించినందుకు వేధించడం దారుణం

పత్రికల గొంతు నొక్కే చర్యలను తక్షణమే ఆపాలని డిమాండ్

14లో



నీటి వినియోగ లెక్కల్లేవ్



గోదావరి, కృష్ణాలో ఏ ప్రాజెక్టు కింద ఎంత నీటిని వాడుతున్నామో తెలియట్లేదు

ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

'కాళేశ్వరం'పై విచారణను సీబీఐకి ఇస్తే 48 గంటల్లో తేలుస్తామన్న కిషన్‌రెడ్డి ఎక్కడ?

సరిపడా యూరియా ఇవ్వకుండా రాష్ట్రంపై కేంద్రం కక్ష సాధిస్తోందని ఆరోపణ

కేసీఆర్, ఎల్ అండ్ టీ వల్లే మెట్రో రైలు అంచనా వ్యయం పెరిగిందన్న సీఎం

సుప్రీం తీర్పునకు అనుగుణంగా 'స్థానికం'పై ముందుకెళ్తామని వెల్లడి

కండువాలు కప్పినంత మాత్రాన ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు కాదని వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా, గోదావరి నదుల్లో ఏ ప్రాజెక్టు కింద ఎంత నీటిని వినియోగిస్తున్నామన్న లెక్కలు ప్రభుత్వం వద్ద లేవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గోదావరి జలాల్లో రాష్ట్రానికి 968 టీఎంసీల నీటి కేటాయింపులున్నా అందులో ఎంత నీటిని వాడుతున్నామన్న దానిపై స్పష్టత కొరవడిందన్నారు. శుక్రవారం ఢిల్లీలో వివిధ అంశాలపై సీఎం రేవంత్ మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఇందులో భాగంగా నీటి వినియోగ లెక్కల గురించి ఆయన వివరించారు. 'గోదావరిలోని 968 టీఎంసీల

మిగతా 2వ పేజీలో ▶

శుక్రవారం ఢిల్లీలో జరిగిన పీఏఎఫ్ఐ సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి





పెట్టుబడులు పెట్టండి

తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి

పీఏఎఫ్ఐ సదస్సులో పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

రాష్ట్రంలో రూ. 200 కోట్లతో కొత్త డెయిరీ యూనిట్ పెట్టేందుకు ముందుకొచ్చిన గోద్రెజ్

- వివరాలు 2లో

నేటి నుంచి యథాతథంగా ఆరోగ్యశ్రీ సేవలు

- వివరాలు 2లో

అస్సాం రైఫిల్స్‌పై దాడి

ఇద్దరు జవాన్లు మృతి..

మణిపూర్‌లో దుండగుల దుశ్చర్య

షీ జిన్‌పింగ్‌కు ట్రంప్ ఫోన్

టిక్‌టాక్‌తోపాటు వాణిజ్యంపై చర్చ

'లష్కరే' కేంద్రం ధ్వంసం నిజమే

ఆపరేషన్ సిందూర్‌తో మాకు భారీ నష్టం.. లష్కరే తోయిబా కమాండర్ ఖాసిం అంగీకారం

- వివరాలు 6లో

మిలియనీర్ కుటుంబాలు @ 8,71,700



టాప్-10లో 79 శాతం


దేశంలోని మొత్తం మిలియనీర్ల కుటుంబాల్లో దాదాపు 79 శాతం మంది.. టాప్-10 నగరాల్లోనే ఉన్నారు. 19,800 మందితో హైదరాబాద్ 8వ స్థానంలో, 2,900 మందితో విశాఖపట్నం 14వ స్థానంలో ఉన్నాయి.

ముంబై	న్యూఢిల్లీ	బెంగళూరు	అహ్మదాబాద్	కోల్‌కతా
1,42,000	68,200	31,600	26,800	26,600
చెన్నై	**పుణే**	**హైదరాబాద్**	**గురుగ్రామ్**	**సూరత్**
22,800	22,500	19,800	10,100	5,700

సంవత్సరాల వారీగా మిలియనీర్ కుటుంబాల సంఖ్య

సంవత్సరం	సంఖ్య
2019	3,39,500
2020	3,98,700
2021	4,58,000
2022	5,37,800
2023	6,31,500
2024	7,41,500
2025	8,71,700

మిలియనీర్ కుటుంబాలలో టాప్ - 10 రాష్ట్రాలు



దేశంలో మిలియనీర్ కుటుంబాల (ఒక మిలియన్ డాలర్లు లేదా రూ.8.5 కోట్ల నికర విలువ ఉన్నవి) సంఖ్య కేవలం 4 ఏళ్లలో 90 శాతం పెరిగింది. 2021లో వీటి సంఖ్య 4,58,000 లక్షల నుంచి 2025లో ఏకంగా 8,71,700కు ఎగబాకింది. 2017- 2025 మధ్య మిలియనీర్ కుటుంబాల సంఖ్య ఏకంగా 445 శాతం పెరగడం విశేషం. దేశంలోని మొత్తం కుటుంబాల్లో.. ఇవి 0.31 శాతం. రాష్ట్రాల్లో మహారాష్ట్ర అత్యధిక మిలియనీర్ కుటుంబాలతో నంబర్ వన్ స్థానంలో ఉంటే.. నగరాల్లో ముంబై టాప్‌లో నిలిచింది. ఇలాంటి ఆసక్తికర విషయాలు 'మెర్సిడెజ్ బెంజ్ హురున్ ఇండియా వెల్త్ రిపోర్ట్ 2025'లో వెల్లడయ్యాయి.

సాక్షి, స్పెషల్ డెస్క్

2021తో పోలిస్తే 2025లో 90 శాతం పెరుగుదల

టాప్ - 3 రాష్ట్రాల్లో మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు

టాప్-10 స్టేట్స్, సిటీస్‌లో తెలంగాణ, హైదరాబాద్


2,900 మందితో 14వ స్థానంలో నిలిచిన విశాఖపట్నం

ప్రధాన కారణాలు

పట్టణ ఆర్థిక వృద్ధి, వ్యాపార ఆలోచనలు పెరగడం, బలమైన ఈక్విటీ మార్కెట్లు, టెక్నాలజీ, వివిధ రకాల పెట్టుబడి మార్గాలు వంటి అనేక కారణాలు మిలియనీర్ కుటుంబాలు పెరగడానికి దోహదం చేశాయి.

మరింత ధనికులుగా..

2017 నాటి మిలియనీర్లలో 2025 నాటికి రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరినవారు 5 శాతం అంటే 66,800 కుటుంబాలు. రూ.200 కోట్ల క్లబ్‌లోకి చేరింది 1.3 శాతం. రూ.1,000 కోట్ల క్లబ్‌లోకి చేరింది 0.07 శాతం. రూ.8,500 కోట్ల క్లబ్ అంటే బిలియనీర్ల జాబితాలోకి చేరింది 0.01 శాతం.. అంటే 360 కుటుంబాలు.



ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ..

మిలియనీర్ కుటుంబాలు అంటే గతంలో ముంబై, ఢిల్లీ వంటి ప్రథమ శ్రేణి నగరాల్లోనే ఉండేవి. కానీ, ఇప్పుడు అహ్మదాబాద్, సూరత్, విశాఖపట్నం, జైపూర్, లక్నో వంటి ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఈ సంఖ్య పెరుగుతోంది.

ఆర్థిక స్వేచ్ఛ

'మెర్సిడెజ్ బెంజ్ హురున్ ఇండియా లగ్జరీ కంజ్యూమర్ సర్వే' ప్రకారం.. ఏటా పర్యటనలు, చదువు, వినోదం కోసం 60 శాతం మిలియనీర్ కుటుంబాలు రూ.కోటి వరకు ఖర్చు చేస్తున్నాయి.

- 'ఎంత సంపద ఉంటే ఆర్థిక స్వేచ్ఛ' ఉన్నట్లు భావిస్తారు అని అడిగితే.. 27 శాతం మంది రూ.50 కోట్లు చాలు అని చెప్పారు. రూ.200 కోట్లు ఉండాల్సిందే అని 20 శాతం మంది స్పష్టం చేశారు.
- 40 శాతం మంది ఒక కారును 6 ఏళ్లకుపైనే వాడుతున్నారు.
- 27 శాతం మంది.. యోగా తమకు ఇష్టమైన ఫిట్‌నెస్ కార్యక్రమం అని చెప్పారు.
- విదేశాల్లో చదువుల విషయానికొస్తే.. అమెరికా (19 శాతం మంది), యూకే (14 శాతం) మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.
- ఆసక్తికరంగా 42 శాతం మంది తమ పిల్లలను భారతదేశంలోనే చదివిస్తామని వెల్లడించారు.

లంబాడీల ఎస్టీ హోదాపై సుప్రీంలో విచారణ

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు
- తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: బంజారా, లంబాడీ, సుగాలీ కులాలను షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) జాబితాలో చేర్చడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వంతో పాటు తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. పిటిషనర్లు పోడియం బాలరాజు, మోడియం శ్రీనివాసరావు సహా మరో ఇద్దరి తరఫున సీనియర్ న్యాయవాది పరమేశ్వరన్‌తో పాటు న్యాయవాదులు అల్లంకి రమేశ్, ఉండవల్లి అరుణ్ కుమార్, ఆర్.మమత వాదనలు వినిపించారు. లంబాడీ, సుగాలీ, బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 342కు పూర్తిగా విరుద్ధమని వారు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అసలైన ఆదివాసీ తెగలతో పోలిస్తే ఈ వర్గాలు ఇప్పటికే ఆర్థికంగా, సామాజికంగాఅభివృద్ధి చెందాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం, ఈ అంశంపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ప్రధాన పిటిషన్లతో ఈ వ్యాజ్యాలను జత చేయాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

ఇదంజ్యోతి



రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి

తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి

- పీఏఎఫ్‌ఐ సదస్సులో పారిశ్రామికవేత్తలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- న్యూజెర్సీ గవర్నర్ సహా పలువురు ప్రముఖులతో వరుస సమావేశాలు
- రాష్ట్రంలో రూ.200 కోట్లతో కొత్త డెయిరీ యూనిట్ పెట్టేందుకు ముందుకొచ్చిన గోద్రెజ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు మద్దతుగా నిలుస్తామని.. పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందని భరోసా ఇచ్చారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని కొత్త నగరం 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని గొప్పగా నిర్మిస్తున్నామని తెలిపారు. భావితరాలకు అవకాశాలు సృష్టించడమే తమ ఆలోచన అన్నారు. దేశంలోనే కొత్త రాష్ట్రమైన తెలంగాణ, హైదరాబాద్‌కు గొప్ప చరిత్ర ఉందని చెప్పారు. శుక్రవారం ఢిల్లీలోని హోటల్ తాజ్ ప్యాలెస్‌లో పబ్లిక్ ఎఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా (పీఏఎఫ్‌ఐ) 12వ వార్షిక సదస్సుకు రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ఏడాది డిసెంబర్ 9న ఆవిష్కరించనున్న 'తెలంగాణ రైజింగ్-2047'విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన అంశాల గురించి సీఎం రేవంత్ పారిశ్రామికవేత్తలకు వివరించారు. అలాగే 30 వేల ఎకరాల్లో నిర్మించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ ఉద్దేశాలతోపాటు ఇటీవల ఏర్పాటు చేసిన స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ గురించి తెలియజేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటు లక్ష్యాల గురించి వివరించారు.

తెలంగాణలో 'ట్రంప్'ను ప్రజలు పక్కనబెట్టారు...

'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలతో అమెరికాకే ఎక్కువగా నష్టం. ట్రంప్ ఒకరోజు ప్రధాని మోదీని స్నేహితునిగా అభివర్ణిస్తారు. మరో రోజు అడ్డగోలుగా సుంకాలు వేస్తారు. తెలంగాణలో ఒక ట్రంప్ (మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి) ఉండేవాడు. ఆయన్ను తెలంగాణ ప్రజలు పక్కనపెట్టారు. రాత్రి వచ్చిన ఆలోచనను తెల్లారే అమలు చేయడం సాధ్యం కాదు'అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ చేతన్ కృష్ణస్వామి



న్యూజెర్సీ గవర్నర్ ఫిలిప్ డి.మర్ఫీకి జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చిన అమెజాన్

అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (పబ్లిక్ పాలసీ) చేతన్ కృష్ణస్వామితో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమై పలు అంశాలపై చర్చించారు. తెలంగాణలో మహిళా పారిశ్రామికవేత్తలు వారి ఉత్పత్తులను 'కళాకార్'కార్యక్రమం కింద మార్కెటింగ్ చేసుకొనేందుకు ప్రోత్సహిస్తామని ఈ సందర్భంగా చేతన్ హామీ ఇచ్చారు. అలాగే హైదరాబాద్‌లో గిగ్ వర్కర్ల కోసం 100 విశ్రాంతి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. తెలంగాణకు చెందిన చిన్న, మధ్య తరహా సంస్థల విక్రయదారులు వారి ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసుకొనే విషయంలో తోడ్పాటు అందిస్తామన్నారు. మరోవైపు గోద్రెజ్ సంస్థ ప్రతినిధులతోనూ సీఎం భేటీ అయ్యారు. ఈ భేటీలో జెర్సీ క్రీమ్ బ్రాండ్ కింద రూ. 200 కోట్లకుపైగా పెట్టుబడితో కొత్త డెయిరీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు గోద్రెజ్ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారు.

న్యూజెర్సీ గవర్నర్‌తో భేటీ...

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యూజెర్సీ గవర్నర్ ఫిలిప్ డి.మర్ఫీతో భేటీ అయ్యారు. విద్య, గ్రీన్ ఎనర్జీ, ఎంటర్‌టైన్‌మెంట్ (సినిమా రంగం), మౌలిక వసతులు (మెట్రో... పట్టణ రవాణా), మూసీ రివర్ ఫ్రంట్ తదితర అంశాల గురించి ఆయనకు తెలియజేశారు. తెలంగాణ రైజింగ్-2047 సాధనలో తమ ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. ఐటీ, ఫార్మా రంగంలో తెలంగాణ రాష్ట్రం ప్రాధాన్యాన్ని సీఎం తెలియజేశారు. న్యూజెర్సీ రైల్ అథారిటీ ద్వారా హైదరాబాద్ పట్టణ, ప్రజారవాణా రంగాలకు, తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యానికి సంపూర్ణ మద్దతు ఇస్తామని సీఎం రేవంత్‌కు మర్ఫీ హామీ ఇచ్చారు.

దావోస్‌కు రావాలని సీఎంకు డబ్ల్యూఈఎఫ్ చీఫ్ ఆహ్వానం..

వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) అధ్యక్షుడు బోర్గ్ బ్రేండేతోనూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రైజింగ్-2047కు మద్దతిస్తామని సీఎంకు తెలియజేశారు. వచ్చే ఏడాది దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సదస్సుకు విచ్చేయాలని రేవంత్‌ను ఆహ్వానించారు. అలాగే తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసే విషయమై చర్చించేందుకు త్వరలో హైదరాబాద్‌కు వస్తానని హామీ ఇచ్చారు.

నీటి వినియోగ లెక్కల్లేవ్

▶ మొదటి పేజీ తరువాయి

నీటి కేటాయింపుల్లో ఎన్ని టీఎంసీల నీటిని రాష్ట్రం వాడుకుంటోందో ఎవరికీ తెలియదు. ఏ ప్రాజెక్టు కింద ఎంత నీటిని వాడుతున్నదీ.. ఎంత ఆయకట్టుకు నీళ్లిస్తున్నదీ తెలియకుండా గత ప్రభుత్వం అంతా గందరగోళం చేసింది. ఒక ప్రాజెక్టు ఆయకట్టును ఇంకో ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టులో కలిపి చూపించింది. దీంతో ఏ ప్రాజెక్టు కింద ఎంత ఆయకట్టు ఉందో, ఎంత నీటిని వినియోగిస్తున్నామో రాష్ట్రం వద్ద లెక్కల్లేవు. అందుకే ఆ లెక్కలు తయారు చేయాలని అధికారులను ఆదేశించాం. అది పూర్తయితేనే తెలంగాణకు మిగిలిన నీటి వాటా ఎంతో తెలుస్తుంది. ఆ మిగిలిన నీటి వాటాను వినియోగించుకునేలా తుమ్మిడిహెట్టి వంటి ప్రాజెక్టులను చేపడతాం'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణంపై మహారాష్ట్రకు వెళ్లి అక్కడి ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. ఇక కృష్ణాలోనూ పరీవాహకం ఆధారంగా 904 టీఎంసీలను కోరుతున్నామని.. అందులో నికర, వరద, మిగులు జలాలన్నీ కలిపి ఉన్నాయని సీఎం వివరించారు.

'కాళేశ్వరం'పై సీబీఐ విచారణకు జాప్యం ఎందుకు?

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వం సీబీఐని కోరినా కేంద్రం ఎందుకు జాప్యం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 'కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణకు ఇస్తే 48 గంటల్లో తేలుస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గతంలో ప్రకటించారు. కానీ ఇంతకాలం అవుతున్నా కనీసం ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయట్లేదు? ప్రాజెక్టు లోపాల్లో కుట్రదారులెవరో తేల్చాల్సి ఉన్నా, సమగ్ర విచారణ జరగాల్సి ఉన్నా కేంద్రం ఎందుకు జాప్యం చేస్తోంది? విచారణ జరగకుండా కేటీఆర్ ఆపుతుంటే దానికి కిషన్ రెడ్డి సహకరిస్తున్నారు. వాళ్లిద్దరి మధ్య అంత అవినాభావ సంబంధం ఉంది'అని సీఎం ఆరోపించారు.

హైకోర్టు చెప్పినట్లుగా ఈ నెలాఖరులోగా 'స్థానికం' కష్టసాధ్యం..

స్థానిక సంస్థల ఎన్నికలను హైకోర్టు విధించిన ఈ నెల 30లోగా నిర్వహించడం కష్టసాధ్యమని.. దీనిపై ఎలా ముందుకెళ్లాలో న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన మూడు బిల్లులను రాష్ట్రపతి ఆమోదానికి పంపాం. బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ 90 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పింది. ఆ అధికారం సుప్రీంకు ఉందా? అని రాష్ట్రపతి సుప్రీంకు రెఫరెన్స్ ఇచ్చింది. ఆ రెఫరెన్స్‌పై సుప్రీం తీర్పు రిజర్వ్ చేసింది. ఆ తీర్పు వచ్చే వరకు స్థానిక సంస్థలపై నిరీక్షిస్తాం. ఆ తర్వాతే తదుపరి కార్యాచరణ చేపడతాం'అని సీఎం రేవంత్ తెలిపారు.

కండువాలు కప్పితే పార్టీ మారినట్లు కాదు..

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై సుప్రీం తీర్పునకు అనుగుణంగా నడుచుకోవాలని స్పీకర్‌కు సూచించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. అయితే పార్టీ కండువాలు కప్పుకున్నంత మాత్రాన ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు కాదన్నారు. 'కండువా కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదు. నేను ఈరోజు ఎంతో మందికి కండువాలు కప్పాను. వారికి కప్పిన కండువా ఏదో వారికే తెలియదు. ఎవరి ఇంటికి వెళ్తే ఏం భోజనం పెడతారో ముందే తెలియదు కదా? బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల జీతాల్లోంచి ప్రతి నెలా రూ. 5 వేలు ఆ పార్టీ ఫండ్‌కు వెళ్తున్నాయి. తమ పార్టీకి 37 మంది ఎమ్మెల్యేల బలం ఉంది కాబట్టి ఆ మేరకు సమయం కేటాయించాలని అసెంబ్లీలో హరీశ్‌రావు ఆన్ రికార్డుగా చెప్పారుగా'అని సీఎం గుర్తుచేశారు.

కేసీఆర్, ఎల్ అండ్ టీ తప్పులకు ప్రజలపై భారమా?

హైదరాబాద్ మెట్రో విస్తరణలో ఎల్ అండ్ టీ సంస్థ తీరును ముఖ్యమంత్రి తప్పుపట్టారు. మెట్రో విస్తరణకు ఎల్ అండ్ టీ సహకరించాలని.. లేకపోతే ప్రభుత్వపరంగా ఏం చేయాలో ఆలోచిస్తామన్నారు. 'మెట్రో విస్తరణలో భాగంగా 76 కి.మీ. కనెక్టివిటీ జరగాలి. ఇది పూర్తి కావాలంటే ఎల్ అండ్ టీతో ఒప్పందం చేసుకోవాలని కేంద్రం షరతు పెడుతోంది. కానీ మెట్రోతో మాకు నష్టాలు వస్తున్నందున కొత్త పనులు చేయలేమని ఎల్ అండ్ టీ అంటోంది. కేసీఆర్, ఎల్ అండ్ టీ చేసిన తప్పిదాలు, భూసేకరణలో జాప్యం వల్ల రూ. 13 వేల కోట్లుగా ఉన్న అంచనా వ్యయం కాస్తా రూ. 20 వేల కోట్లకు పెరిగింది. వాళ్లు చేసిన తప్పిదాలకు రాష్ట్ర ప్రజలు భారం భరించాలా? ఈ విషయంలో ప్రభుత్వాన్ని ఎల్ అండ్ టీ డిక్టేట్ చేయజాలదు'అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ కోసమే యూరియా డ్రామా...

రాష్ట్రానికి సరిపడా యూరియా ఇవ్వకుండా కేంద్రం రాష్ట్రంపై కక్ష సాధిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 'రాష్ట్రానికి సీజన్‌లో 9.8 లక్షల టన్నుల యూరియా అవసరం ఉంది. కానీ 2 లక్షల టన్నుల యూరియాను కేంద్రం సరైన సమయానికి సరఫరా చేయలేదు. ఈ విషయంలో బీఆర్ఎస్‌కు తిరిగి జీవం పోసేలా బీజేపీ డ్రామాలాడింది. ఇదే అదునుగా బీఆర్ఎస్ ప్రజల్లో యూరియా లేదని ఒక అస్థిరతను సృష్టించడం.. రైతులు ఎక్కువగా కొనుగోళ్లు చేయడంతో సమస్య పెద్దదైంది. బీఆర్ఎస్‌ను నిలబెట్టేందుకు కేంద్రం రైతులకు నష్టం చేస్తోంది'అని సీఎం ఆరోపించారు.

బీఆర్ఎస్‌లో ఆస్తుల గొడవతో కాంగ్రెస్‌కు సంబంధం లేదు..

బీఆర్ఎస్‌లో కవిత ముసలం పుట్టిందని సీఎం అన్నారు. వేలాది మందిని పొట్టన పెట్టుకున్న పాపం ఊరికే పోదు కదా? అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, సంతోష్‌రావులు కలిసి కవితపై మూకుమ్మడిగా దండయాత్ర చేస్తున్నారని.. అయితే ఈ ఆస్తుల గొడవతో తమ పార్టీకి సంబంధం లేదన్నారు.

మావోలతో చర్చించాలి..

కేంద్రం మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు ముందుకు రావాలని సీఎం రేవంత్ సూచించారు. ఉగ్రవాదులతోపాటు దాయాది దేశమైన పాకిస్తాన్‌తో చర్చలు జరుపుతున్న కేంద్రం.. మావోయిస్టులతో చర్చిస్తే తప్పేంటని ఆయన ప్రశ్నించారు. వాళ్లూ ఈ దేశ ప్రజలే కదా.. మన అక్కాతమ్ముళ్లే కదా అని పేర్కొన్నారు.

నేటి నుంచి యథాతథంగా ఆరోగ్యశ్రీ సేవలు



మంత్రి దామోదరతో మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ఆరోగ్యశ్రీ సేవలను యథాతథంగా కొనసాగించాలని నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ నిర్ణయించింది. హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు యథావిధిగా కొనసాగిస్తామని హామీ ఇచ్చినట్టు ఆరోగ్య శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, ఆరోగ్యశ్రీ నిధులు ప్రతి నెలా విడుదల చేస్తామని, హాస్పిటల్స్ కోరుతున్న ఇతర అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు.

పర్యాటకంతో పెట్టుబడులు, ఉపాధి

మంత్రి జూపల్లి కృష్ణారావు




ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్ ప్రారంభోత్సవంలో రిబ్బన్ కట్ చేస్తున్న మంత్రి జూపల్లి. చిత్రంలో క్రాంతి, తదితరులు

సాక్షి, హైదరాబాద్: పర్యాటకం వినోదం మాత్రమే కాదని, ఉపాధి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదం చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు.. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామని చెప్పారు. పర్యాటకంలో పెట్టుబడులే లక్ష్యంగా త్వరలోనే తెలంగాణలో అత్యున్నత స్థాయి టూరిజం కాన్‌క్లేవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్ (టీటీఎఫ్)- 2025 ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం కొత్త పర్యాటక విధానం ద్వారా పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తోందని చెప్పారు. వివిధ వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులతో ముందుకు రావాలనుకునే యువ పారిశ్రామికవేత్తలకు ఇది విస్తృత అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే వారికి పూర్తిగా మద్దతు ఇవ్వడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 21 నుంచి 30 వరకు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుగుతాయని, వేడుకలను చారిత్రక వేయి స్తంభాల గుడి వద్ద ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ పూల పండుగను ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా ఆస్వాదించి, దాని వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలని మంత్రి జూపల్లి కోరారు.

పదవీ విరమణా? రాజీనామానా?

- వివరాలు తెలుసుకొని మూడు వారాల్లో అఫిడవిట్ వేయండి
- ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి కేసులో పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన వెంకట్రామిరెడ్డి తన అఖిల భారత సర్వీస్‌కు పదవీ విరమణ చేశారా.. లేక రాజీనామా చేశారా.. అన్న వివరాలు లేకుండా పిటిషన్ దాఖలు చేస్తే ఎలా అని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వం నుంచి వివరాలు తెలుసుకొని మూడు వారాల్లో అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. 2021, నవంబర్‌లో జరిగిన మండలి ఎన్నికల్లో ఎమ్మెల్యే కోటాలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా మాజీ ఐఏఎస్ వెంట్రామిరెడ్డి ఎన్నికైన విషయం విదితమే. ఈ ఎన్నిక చట్ట విరుద్ధమంటూ జగిత్యాల జిల్లాకు చెందిన జె.శంకర్‌తోపాటు మరొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. '2007 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ వెంకట్రామిరెడ్డి 2021, నవంబర్ 15 వరకు అధికారిగా కొనసాగారు. బీఆర్ఎస్‌లో చేరే ఉద్దేశంతో స్వచ్ఛంద పదవీవిరమణ నోటీసు సమర్పించారు. అయితే ఐఏఎస్ అధికారుల స్వచ్ఛంద పదవీ విరమణ నియమాల మేరకు నోటీసు ఇచ్చిన మూడు నెలల్లో డీవోపీటీ ఆమోదం తప్పనిసరి. కానీ, వెంకట్రామిరెడ్డి ఎటువంటి రాజీనామా చేయలేదని, పదవీ విరమణ పత్రాలు తమకు అందలేదని నిర్ధారించింది. ప్రభుత్వ అధికారిగా కొనసాగుతున్న వ్యక్తి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 6(1) ప్రకారం పోటీకి అనర్హుడు. వెంటనే అతన్ని అనర్హుడిగా ప్రకటిస్తూ.. ఎన్నిక రద్దు చేయాలి'అని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. పూర్తి వివరాలు తెలుసుకొని అదనపు అఫిడవిట్ వేయాలని చెబుతూ విచారణ వాయిదా వేసింది.

లంచమడిగితే 18005995991 ఈ నంబర్‌కు ఫిర్యాదు చేయండి

- 'ఇందిరమ్మ'లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి సూచన
- కాల్‌సెంటర్‌కు భారీగా ఫిర్యాదుల నేపథ్యంలో ఈ నిర్ణయం
- ఫిర్యాదులపై చర్యలు షురూ.. పలువురు సిబ్బంది సస్పెన్షన్



సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కొంతమంది సిబ్బంది లబ్ధిదారుల నుంచి లంచాల కోసం ఒత్తిడి చేస్తుండటాన్ని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం అలాంటి వారిపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇళ్ల బిల్లుల మంజూరులో లంచం అడిగే వారి వివరాలతోపాటు ఇళ్ల నిర్మాణం చేపట్టకుండానే అక్రమంగా బిల్లుల మంజూరుకు సిఫారసు చేసేవారిపై ఫిర్యాదు చేసేందుకు 18005995991 టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రకటించింది. శుక్రవారం రాత్రి సచివాలయంలో జరిగిన సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నంబర్‌ను వెల్లడించారు. లంచం అడిగే సిబ్బందితోపాటు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అక్రమాలకు సంబంధించిన ఫిర్యాదులు చేస్తే పరిశీలించి 24 గంటల్లో చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటించారు. ఇళ్ల లబ్ధిదారుల సమస్యలు, సందేహాల కోసం గత వారం ప్రారంభించిన కాల్‌సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులపై ఆయన గృహనిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఏడీజీ సంగ్రామ్ సింగ్ పాటిల్‌తో మంత్రి సమీక్షించారు.

- సూర్యాపేట జిల్లా పోలుమల్ల గ్రామంలో కొండ లింగయ్య అనే లబ్ధిదారు నుంచి రూ.10 వేలు డిమాండ్ చేసిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సత్తెయ్య, జనగామ జిల్లా దేవరుప్పల మండలం పడమటి తండాలో శివమ్మ అనే లబ్ధిదారురాలి నుంచి రూ.30 వేలు డిమాండ్ చేసిన గ్రామ పంచాయతీ సెక్రటరీ, అక్కడ ఇందిరమ్మ కమిటీ సభ్యుడి పాత్రపై కూడా ఫిర్యాదు రావటంతో విచారణ జరిపి 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు.
- ఖమ్మం, జగిత్యాల, కొత్తగూడెం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఇళ్లు మంజూరు కాని నలుగురికి వారి ఖాతాలో ఇందిరమ్మ ఆర్థిక సాయం జమ చేసిన గ్రామ పంచాయతీ సెక్రటరీలను తక్షణమే సస్పెండ్ చేసి పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆదేశించారు. అక్రమాలకు బరితెగించే వారిని సస్పెండ్ చేయటంతోపాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయాలని మంత్రి పేర్కొన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి ఆర్థిక సాయం నిధులు జమ చేయగానే, కొన్ని బ్యాంకులు వాటిని పాత బకాయిల కింద మినహాయించుకుంటున్నాయని, అలాంటి బ్యాంకులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆధార్ నంబర్ ఆధారంగా చెల్లింపుల్లో ఎదురవుతున్న సమస్యలను ఈ నెల 25వ తేదీలోగా పరిష్కరించి దసరా పండుగలోపు చెల్లింపులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆధార్‌తో బ్యాంకు ఖాతా అనుసంధానం, ఇతర సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

వాసవి సంస్థల్లో కొనసాగుతున్న ఐటీ సోదాలు

- ఐటీ చెల్లింపుల్లో భారీగా అవకతవకలు గుర్తింపు
- కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వాసవి గ్రూప్ ఆఫ్ కంపెనీలు, అనుబంధ సంస్థలైన క్యాప్స్ గోల్డ్ సహా మరికొన్ని జ్యువెల్లరీ షాపుల్లో బుధవారం ఉదయం నుంచి ఆదాయ పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. బంజారాహిల్స్, అబిడ్స్ కేంద్రంగా క్యాప్స్‌గోల్డ్, కలశ ఫైన్ జ్యువెల్స్ ఆఫీసులు, వాసవి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ చందా శ్రీనివాస్‌రావు సహా క్యాప్స్ గోల్డ్ డైరెక్టర్లు చందా అభిషేక్, చందా సుధీర్, సౌమ్యల నివాసాల్లో మూడు రోజులుగా సోదాలు కొనసాగుతున్నాయి. మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి కొనుగోలు చేసిన గోల్డ్‌ను హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, ముంబై, విజయవాడ, వరంగల్‌లోని కార్పొరేట్ ఆఫీసులు, హోల్‌సేల్, రిటైల్ షాపులకు తరలిస్తున్నట్టు ఐటీ గుర్తించింది. ఈ క్రమంలో ట్యాక్స్‌లు తప్పించుకునేందుకు నగదు రూపంలో లావాదేవీలు జరుపుతున్నట్టు ఐటీ దృష్టికి వచ్చింది. ఐదు రోజుల సెర్చ్ వారెంట్‌తో సోదాలు చేస్తున్న ఐటీ అధికారులు.. శుక్రవారం కూడా తనిఖీలు చేశారు. గత ఐదేళ్లగా దాఖలు చేసిన ఐటీ రిటర్న్స్‌తోపాటు బంగారం అమ్మకాలు, ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలు గుర్తించినట్టు తెలిసింది. టీ చెల్లింపుల్లో భారీగా వ్యత్యాసం గుర్తించినట్టు తెలిసింది. ఇందుకు సంబంధించి పన్నుల చెల్లింపులు, బంగారం క్రయ విక్రయాలు, బంగారం స్టాక్ రిజిస్టర్లను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోదాలు శనివారం కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

సబ్ క్లాసిఫికేషన్ లేని సర్టిఫికెట్లయినా పర్వాలేదు

- ఏపీపీ దరఖాస్తుల్లో ఎస్సీ కేటగిరీ సర్టిఫికెట్లపై టీఎస్ఎల్పీఆర్బీ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్పీఆర్బీ) ఇటీవల ప్రకటించిన 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. అక్టోబర్ 5 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు గడువు ఉంది. అయితే నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం, ఎస్సీ విభాగానికి చెందిన అభ్యర్థులు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన 14 ఏప్రిల్ 2025 తేదీని కలిగిన యాక్ట్ నంబర్ 15 ఆధారంగా ఎస్సీ సబ్–క్లాసిఫికేషన్‌తో కూడిన కమ్యూనిటీ సర్టిఫికెట్‌ను సమర్పించాలి. 14 ఏప్రిల్ 2025కు ముందు జారీ చేసిన ఎస్సీ సబ్–క్లాసిఫికేషన్ లేని కమ్యూనిటీ సర్టిఫికెట్లు ఎస్సీ కేటగిరీ కింద రిజర్వేషన్ కోసం పరిగణనలోకి రావని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కాగా, సంబంధిత రెవెన్యూ అధికారులు ఇంకా గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 వంటి నిర్దిష్ట గ్రూప్‌లను పేర్కొనే ఎస్సీ కమ్యూనిటీ సర్టిఫికెట్లను జారీ చేయడం లేదని బోర్డు దృష్టికి వచ్చినట్టు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి ఆన్‌లైన్ దరఖాస్తుతో అప్‌లోడ్ చేయడానికి కులం పేరును స్పష్టంగా పేర్కొనే ఎస్సీ కమ్యూనిటీ సర్టిఫికెట్లను అంగీకరించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. అయితే, ఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు సర్టిఫికెట్ల ధ్రువీకరణ సమయంలో తప్పనిసరిగా గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 వంటి నిర్దిష్ట గ్రూప్‌లతో కూడిన తాజా ఎస్సీ కమ్యూనిటీ సర్టిఫికెట్‌ను సమర్పించాలని స్పష్టం చేశారు.

సీపీఎస్ ఉద్యోగుల డీఏ బకాయిలు వెంటనే చెల్లించండి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సీపీఎస్ సంఘం వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ (సీపీఎస్) ఉద్యోగులకు వెంటనే డీఏ బకాయిలు విడుదల చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో సీఎస్ కె.రామకృష్ణారావును కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుత ఉత్తర్వుల ప్రకారం 90 శాతం డియర్‌నెస్ అలవెన్స్‌ను జనవరి, 2025 నుంచి నెలసరి వాయిదాల్లో చెల్లించాలని, పాత పెన్షన్ పథకం పరిధిలోని ఉద్యోగులకు జీపీఎఫ్ ఖాతాల్లో ఒకేసారి జమ అవుతాయని తెలిపారు. జీపీఎఫ్ వడ్డీ రేట్ల ప్రకారం క్రెడిట్ మొత్తంపై వడ్డీ పొందుతారని, వాయిదాల పద్ధతి చెల్లింపులతో సీపీఎస్ ఉద్యోగులు ప్రయోజనాలు కోల్పోతారని వివరించారు. ఈ అంశంపై సీఎస్ సానుకూలంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎస్‌ను కలిసిన వారిలో కల్వల్ శ్రీకాంత్, నరేశ్ గౌడ్, కోటకొండ పవన్, నరేందర్‌రావు ఉన్నారు.

ఎకో టూరిజం హబ్‌గా తెలంగాణ

- ఇదే సర్కార్ లక్ష్యం: కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణను పర్యాటక రంగంలో ప్రత్యేక ఎకో టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ఎకో టూరిజం కోసం గుర్తించిన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మధ్యప్రదేశ్‌లోని భీమ్‌బెక్కా కొండల తరహాలో నీలాద్రి కొండలపై ప్రాచీన కాలం నాటి గుర్తులు ఉన్నందున దీనిని ఎకో టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులను పర్యాటక, దేవాదాయ శాఖల నుంచి తీసుకోవాలని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి అధ్యక్షతన జరిగిన ఎకో టూరిజం ప్రాజెక్టు స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో ఎఫ్‌డీసీ చైర్మన్ పొదెం వీరయ్య, అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ, ఎఫ్‌డీసీ ఎండీ సునీత భగవత్, పీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్) ఏలూ సింగ్ మేరు, సీసీఎఫ్ జి.రామలింగం (సోషల్ ఫారెస్టు), పలు జిల్లాల డీఎఫ్‌ఓలు, ఆర్థిక శాఖ సహా ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ భేటీలో అనంతగిరి (వికారాబాద్), కనకగిరి (ఖమ్మం), నందిపేట్ (నిజామాబాద్), మన్ననూర్ జంగల్ రిసార్టు (నాగర్ కర్నూల్), ముచ్చెర్ల ఎకో పార్కు (నల్లగొండ), వైజాగ్ కాలనీ (నల్లగొండ), మంజీరా (సంగారెడ్డి), అమరగిరి (నాగర్ కర్నూల్) తదితర ప్రాంతాల్లో ఎకో టూరిజం ప్రాజెక్టు అమలుపై చర్చ జరిగింది. వికారాబాద్ అనంతగిరి హిల్స్ మొదటి దశ పనులు పూర్తయ్యాయని, రెండో దశలో కారవాన్ క్యాంపింగ్, ఎకో కాటేజీలు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రికి అధికారులు వివరించారు. వచ్చేనెల నుంచి ఖమ్మంలోని కనకగిరి ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని వారు తెలిపారు. కాగా, ఖమ్మం జిల్లాలోని పులిగుండాల ఎకో టూరిజం కేంద్రంలో జ్యూట్ బ్యాగుల వాడకాన్ని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అభినందించారు. రాష్ట్రంలోని అన్ని ఎకో టూరిజం సెంటర్లు ఈ పద్ధతిని అనుసరించాలని సూచించారు.

మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు అండ

విధి నిర్వహణలో చనిపోయిన దేవాదాయశాఖ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటామని ఆ శాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. విధుల్లో ఉండగా చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉంటే.. వారికి మరేరకంగానైనా సాయం చేసే అవకాశం ఉందేమో పరిశీలించాలని అధికారులను ఆమె ఆదేశించారు. విధి నిర్వహణలో మృతి చెందిన పలువురు దేవాదాయ శాఖ ఉద్యోగుల గ్రాట్యుటీ మొత్తాన్ని శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు మంత్రి అందజేశారు. వీరితో పాటు ఉద్యోగ విరమణ చేసిన కొందరికి బెనిఫిట్స్‌తో పాటు ఉపనయన సాయం, విద్యా రుణాలను అందజేశారు. మొత్తం 20 కుటుంబాలకు రూ.1.05 కోట్ల మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్, అదనపు కమిషనర్ కృష్ణవేణి, వెంకటేశ్, రామకృష్ణారావు, పీఎస్ సోమరాజు, ఓఎస్డీ సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్వభూతాలను ఆ పరమాత్మలోనే నిరంతరం చూస్తూ,
అలాగే సమస్త భూతాల్లోనూ ఆ పరమాత్మను కనుగొంటూ
ఉండే మనుష్యుడు ఎప్పుడేగానీ ఘృణ, ద్వేషాలకు లోనుకాడు.
– ఈశావాస్యోపనిషత్తు

సాక్షి
శనివారం, 20 సెప్టెంబర్ 2025

నైపుణ్యానిదే భవిత

చాన్నాళ్ల క్రితం 'మీ పిల్లల్ని ఏం చదివిద్దామనుకుంటున్నార'ని తల్లిదండ్రుల్ని అడిగితే వైద్య విద్యనో, సాంకేతిక విద్యనో సమాధానంగా వచ్చేది. 90వ దశకానికల్లా సాంకేతిక విద్యే తారక మంత్రమైంది. పట్టా రావటానికి ముందే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఖాయమయ్యేది మరి. ఇప్పుడంతా తారుమారైంది. సాంకేతిక విద్య కిక్కిరిసి అవకాశాలు అంతంత మాత్రం అయ్యాయి. చదువుతోపాటు సాంకేతిక నైపుణ్యాల గురించి అడగటం మొదలైంది. ప్రస్తుతం కృత్రిమ మేధ(ఏఐ)లో నైపుణ్యం ఏమిటన్నదే ప్రధాన ప్రశ్నగా మారింది. దశాబ్దం క్రితం నైపుణ్యాల విషయంలో మన సాంకేతిక పట్టభద్రులు వెనకబడి ఉన్న మాట వాస్తవమే అయినా ఇప్పుడంతా మారిందని తాజాగా విడుదలైన 'ఇండియా స్కిల్స్ నివేదిక 2025' చెబుతోంది. దాని ప్రకారం 54.8 శాతం మంది పట్టభద్రులు ఉద్యోగార్హులు. చూడటానికి ఇది ఎక్కువేం కాదన్న అభిప్రాయం కలగొచ్చు. కానీ పదేళ్ల క్రితంతో పోలిస్తే ఇది 20 పాయింట్లు అధికం. గతేడాదితో పోల్చినా మూడు పాయింట్లు అధికం. విద్యారంగానికీ, పారిశ్రామిక రంగానికీ అనుసంధానం పెరగటం వల్ల ఇదంతా సాధ్యమైందని ఆ నివేదిక అంటున్నది. ముఖ్యంగా ఇంటర్న్‌షిప్‌లు విద్యార్థులకు ఆచరణాత్మక అనుభవాలనిచ్చి వారిని ఉద్యోగాలకు సంసిద్ధం చేస్తున్నాయని చెబుతోంది. కానీ ప్రభుత్వాలు విద్యకు ఇవ్వాల్సినంత ప్రాముఖ్యత ఇస్తున్నాయా? ఫీజు రీయింబర్స్‌మెంటువంటి పథకాలను పకడ్బందీగా అమలు చేసి పేద పిల్లలకు సాంకేతిక విద్య అందుబాటులోకి తెస్తున్నాయా?

మన సాంకేతిక విద్యారంగం ప్రపంచ శ్రేణితో పోటీ పడాలంటే మరింత వేగంగా కదలాల్సి ఉంటుంది. అందులో అన్ని వర్గాల భాగస్వామ్యం పెంచాల్సి ఉంది. ఈమధ్యే విడుదలైన నాల్‌స్కామ్ సంస్థ నివేదిక 2028 నాటికి తయారీ రంగ పరిశ్రమలో సాంకేతిక నైపుణ్య లేమి వల్ల ప్రపంచ వ్యాప్తంగా 24 లక్షల ఉద్యోగాలు ఖాళీగా మిగిలిపోతాయని తెలిపింది. దీన్ని సరిదిద్దకపోతే 2030 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం తప్పదని హెచ్చరించింది. తయారీ రంగంలో అత్యధిక పరిశ్రమలు ఉద్యోగార్థుల చదువుతోపాటు వారికున్న భిన్న రకాల నైపుణ్యాలేమిటని చూస్తున్నాయి. ముఖ్యంగా ఏఐ ఆధారిత సామర్థ్యాలు, సీఎన్‌సీ ఆపరేషన్స్, ఆటోమేషన్ సిస్టమ్స్ ఇంటిగ్రేషన్, డేటా ఎనలిటిక్స్, డిజిటల్ ట్విన్ టెక్నాలజీస్, హ్యూమన్–మెషీన్ ఇంటర్‌ఫేస్ డిజైన్ వగైరాలకు అపారమైన డిమాండ్ ఏర్పడబోతోంది. సాఫ్ట్‌వేర్ రంగంలో క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్ వగైరాలు అవసరమవుతాయి. సిబ్బందికుండే నైపుణ్యాలే విజయానికి బాటలు వేస్తాయి గనుక ఎంపికలో వాటినే ప్రధానంగా చూస్తామని 94 శాతం సంస్థలంటున్నాయి. అవసరాలకు అనుగుణంగా తగిన నైపుణ్యాలను పెంపొందించుకునే వారికే, ప్రపంచ స్థాయిలో పోటీపడగల వారికే ఏ పరిశ్రమల్లోనైనా ఉద్యోగాలు భద్రంగా ఉంటాయన్నది ఆ నివేదిక సారాంశం. కానీ మన సాంకేతిక విద్య ఈ స్థాయికి చేరకుండా... విద్యాసంస్థలు ఇందుకనుగుణమైన సాంకేతికతను విద్యార్థులకు సమర్థంగా అందించగలుగుతున్నాయా అనే సందేహాలున్నాయి.

మన దేశానికుండే ప్రత్యేకతేమంటే ప్రస్తుతం ఇక్కడ పనిచేయగలిగిన సత్తా గల (15–64 యేళ్ల మధ్య) జనాభా 99 కోట్ల 47 లక్షలకు చేరుకుంది. ఇది చైనాకన్నా అధికం. 2030 వరకూ ఏడాదికి కోటి మందికి పైగా దీనికి జమ అవుతారు. భిన్న రంగాల్లో మెరుపు వేగంతో దూసుకొస్తున్న ఏఐకి సంబంధించిన బహుముఖ నైపుణ్యాలను ఒడిసిపట్టుకోవటంలో వెనకబడితే వీరందరికీ మెరుగైన ఉద్యోగాల కల్పన అసాధ్యమవుతుంది. ఐటీ, ఆరోగ్య రంగం, హరిత ఇంధన రంగం వగైరాల ద్వారా 2030 నాటికి ప్రపంచ ఆర్థిక రంగానికి 50,000 కోట్ల డాలర్ల అదనపు సంపద జమవుతుందని అంచనా. ఈ సంపదలో మన వాటా చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండాలంటే మెరికల్లాంటి నిపుణుల సైన్యం తయారు కావాలి. సాంకేతిక కళాశాలల తీరుతెన్నుల్ని సంపూర్ణంగా మార్చాలి. నిరుపేద గ్రామీణ విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి. ఊకదంపుడు ఉపన్యాసాలు కాదు, ప్రభుత్వాలు ఫీజురీయింబర్స్‌మెంట్ వంటివి సక్రమంగా అమలు చేయాలి. అప్పుడే అన్ని వర్గాల పిల్లలూ ఈ అభివృద్ధిలో భాగస్వాములవుతారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.చతుర్దశి రా.12.09 వరకు, తదుపరి అమావాస్య, **నక్షత్రం:** మఖ ఉ.9.10 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** సా.5.26 నుండి 7.05 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.48 నుండి 7.29 వరకు, **అమృత ఘడియలు:** ఉ.6.40 నుండి 8.18 వరకు, తదుపరి రా.3.19 నుండి 4.57 వరకు, **మాస శివరాత్రి.**

సూర్యోదయం : 5.52
సూర్యాస్తమయం: 5.57
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

అలాస్కా నుంచి అయోమయంలోకి!

విశ్లేషణ



టంకశాల అశోక్

రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఆగస్టు 15న అలాస్కాలో, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో పాటు యూరోపియన్ నాయకులతో 18న వైట్‌హౌస్‌లో ముఖాముఖి చర్చలు జరిపిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇక యుద్ధం ముగింపునకు మార్గం సుగమమవుతున్నదనే సూచనలు ప్రపంచానికి ఇచ్చారు. సరిగ్గా మూడు వారాలు గడిచేసరికే పరిస్థితి అయోమయంగా మారగా, ఆయన సెప్టెంబర్ 6న అదే వైట్‌హౌస్‌లో అమెరికన్ కాంగ్రెస్ సభ్యులతో మాట్లాడుతూ, యుద్ధాన్ని ఆపలేకపోతున్నట్లు అంగీకరించారు.

ప్రయత్న లోపం లేకపోయినా...

దాని అర్థం ట్రంప్ ప్రయత్నాలు నిలిచిపోతాయని కాదు. ఇందులో తన ప్రయత్న లోపం ఏమీ లేదు. సైద్ధాంతికంగా, భౌగోళిక రాజకీయాల దృష్ట్యా తక్కిన అమెరికన్ అధ్యక్షుల వలెనే ట్రంప్ కూడా రష్యా వ్యతిరేకి. అది తన మొదటి పదవీ కాలంలో (2017–21) స్పష్టంగానే కనిపించింది. కానీ ఈ రెండవ విడతకు వచ్చేసరికి యుద్ధాలకు వ్యతిరేకినని ప్రకటించుకున్నారు. ఉక్రెయిన్ యుద్ధం గురించి అయితే ఎన్నికల ప్రచార సమయంలోనే ఆ వైఖరి తీసుకుని 24 గంటలలోనే ఆ స్థితిని ముగింపజేస్తానన్నారు. ఆ మాటను అక్షరాలా తీసుకుని నిందించనక్కరలేదు గాని, ఆ దిశలో ప్రయత్నాలను మాత్రం 24 గంటలలోనే మొదలుపెట్టారు. అప్పటి నుంచి గత ఎనిమిది మాసాలలో తన ప్రతినిధులను మాస్కో, కీవ్, బ్రసెల్స్‌లకు పలుమార్లు పంపారు. కొందరిని వైట్‌హౌస్‌కు రప్పించి చర్చించారు. పుతిన్, జెలెన్‌స్కీ తదితరులతో పలుమార్లు టెలిఫోన్ సంభాషణలు జరిపారు. రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధి వర్గాల మధ్య ఇస్తాంబుల్‌లో చర్చలు జరిగేట్లు చూశారు. యుద్ధ విరమణకు, సమస్య పరిష్కారానికి ఉభయ పక్షాలు తమ తమ ప్రతిపాదనలను ప్రకటించేట్లు చూశారు. ఆంక్షల రూపంలో రష్యాను, ఆయుధాల సరఫరా నిలిపివేత రూపంలో ఉక్రెయిన్‌ను ఒత్తిడి చేశారు. ఇంత తక్కువ కాలంలో ఇన్నిన్ని ప్రయత్నాలన్నది సాధారణమైన విషయం కాదు.

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి మూల కారణం ఎక్కడుందనే అవగాహన ట్రంప్‌కు ఉంది. నాటో సైనిక కూటమిని రష్యా సరిహద్దు వరకు విస్తరించజూడటం వల్లనే అభద్రతాభావానికి గురైన పుతిన్ ఈ యుద్ధాన్ని సాగిస్తున్నారని అనేకమార్లు అన్నారాయన. ఉక్రెయిన్, యూరోపియన్ నాయకులకు ముఖాముఖిగా చెప్పటమే గాక, ఉక్రెయిన్‌ను నాటోలో చేర్చుకునే ప్రసక్తి లేదని ప్రకటించారు. మొదట 20 ఏళ్లపాటు అని, తర్వాత ఎప్పటికీ జరగదన్నారు. క్రిమియా, దోన్‌బాస్‌లను రష్యాకు వదలివేయాలనీ చెప్పారు. ఈ ప్రతిపాదనలకు జెలెన్‌స్కీ, యూరోపియన్ నాయకులు సుముఖత చూపకపోవటంతో, ఇక మీ ఖర్మ మీదన్నట్లు మాట్లాడారు. పాశ్చాత్య సామ్రాజ్యవాదానికి, నాటో సైనిక కూటమికీ నాయకత్వ స్థానంలోగల ఒక దేశాధినేత ఇటువంటి వైఖరి తీసుకోవటం మామూలు విషయం కాదు.



రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఆగకపోవడానికి కారణాలేమిటి? అందుకు బాధ్యత యూరోపియన్ నాయకులది. ముఖ్యంగా బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్‌లది. జెలెన్‌స్కీని అడుగడుగునా రెచ్చగొట్టి రాజీలు జరగకుండా చేస్తున్నది వారే.

యూరప్ మొండితనం

ఇంతకూ పరిస్థితి అలాస్కా నుంచి అయోమయంలోకి వెళ్లటానికి కారణాలేమిటి? అందుకు బాధ్యత యూరోపియన్ నాయకులది. ముఖ్యంగా బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్‌లది. జెలెన్‌స్కీని అడుగడుగునా రెచ్చగొట్టి రాజీలు జరగకుండా చేస్తున్నది వారే. భూభాగాలను వదులుకునేందుకు జెలెన్‌స్కీ పరోక్షంగా సిద్ధపడగా, ఆ మాటను వారు మార్పించారు. తమకు పూర్తి రక్షణ హామీలు చాలునన్న ప్రతిపాదనను జెలెన్‌స్కీ ఒక దశలో చేయగా, అందుకు పుతిన్‌ను ట్రంప్ ఒప్పించారు. నాటో ఛార్టర్‌లో 5వ నిబంధన అనేది ఒకటుంది. ఒక నాటో సభ్య దేశంపై ఇతరులు దాడి జరిపితే మొత్తం అందరిపై దాడి జరిపినట్లుగా పరిగణించి అందరూ ఆ దేశానికి రక్షణగా ముందుకు రావాలని ఆ నిబంధన చెప్తున్నది. ఉక్రెయిన్‌కు సభ్యత్వం ఇవ్వకపోయినా ఆ నిబంధనను పోలిన రక్షణలు ఇచ్చేందుకు సిద్ధమని ట్రంప్ ప్రకటించారు. అందుకు కూడా అలాస్కాలో అంగీకరించిన పుతిన్, ఉక్రెయిన్ ప్రజలకు రక్షణ అవసరమేనన్నారు. ఈ ప్రస్తావనలన్నీ ఆగస్టు 18 నాటికి వైట్‌హౌస్ చర్చలలో వచ్చాయి. ఇక త్వరలో పుతిన్, జెలెన్‌స్కీల ముఖాముఖి సమావేశం జరిగి వారొక అంగీకారానికి రానున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఆ సమావేశానికి తగిన స్థలం కోసం వెతుకుతున్నారని, వారిద్దరి చర్చల తర్వాత ఒకవేళ ఆహ్వానించినట్లయితే తాను కూడా వెళ్ళగలనని అన్నారు.

అటువంటి ఆశావహమైన సూచనల మధ్య అంతలోనే అంతా బెడిసిపోయింది. ఆ పరిణామాల మధ్య నుంచే ట్రంప్ సెప్టెంబర్ 6 నాటి నిస్పృహతో కూడిన వ్యాఖ్యలు వినిపించాయి.

'నాటో' విస్తరణ ఆగితేనే...

అట్లా బెడియటానికి కనిపించే తక్షణ కారణం, ఉభయ పక్షాల మధ్య ఒప్పందం కుదిరే వరకు దాడులు కొనసాగించగలమనీ, అట్లాగాక ఉక్రెయిన్ పక్షం పట్టుబడుతున్నట్లు ముందుగానే కాల్పుల విరమణ జరిగితే ఆ వ్యవధిని ఉపయోగించుకుని సైన్యాన్ని, ఆయుధాలను సమీకరించుకోగలరనీ రష్యా వాదిస్తుండగా, అటువంటిదేమీ చేయబోమనే హామీని ఇవ్వని ఉక్రెయిన్ తన దాడులు తాను సాగిస్తుండటం. ఇందులో ట్రంప్ రష్యా వైఖరినే సమర్థించారు. ఇది తక్షణ కారణం కాగా, కనీసం ట్రంప్ ప్రతిపాదించిన ప్రకారమైనా భూమిని రష్యాకు వదలుకోవటానికి ఉక్రెయిన్ నిరాకరిస్తుండటం ప్రధానమైంది.

ఉక్రెయిన్ రక్షణ కోసం యుద్ధ ఆరంభంలో జరిగిన ఒప్పందం మేరకు అమెరికా, రష్యా, చైనా, ఇంగ్లండ్, జర్మనీ హామీగా నిలిస్తే సరిపోతుందని పుతిన్ అంటుండగా, యూరోపియన్ దేశాలు ఉమ్మడి సేనలను పంపగలవన్నది బ్రసెల్స్ వాదన. ఉక్రెయిన్ భూభాగంలో అటువంటి సేనల ప్రవేశాన్ని ఎంతమాత్రం సమ్మతించబోమని పుతిన్ స్పష్టం చేస్తున్నారు. అలాస్కా వైట్‌హౌస్ చర్చల అనంతరం విషయమంతా ఇక్కడ స్తంభించిపోయింది. అక్కడి నుంచి ముందుకు ఎట్లా, ఎప్పటికి కదిలేనో ట్రంప్‌కు బోధపడుతున్నట్లు లేదు. ఆ నిస్సహాయతలో తను చేయగల పని రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే ఇండియా వంటి దేశాలపై సుంకాలు పెంచటం ఒక్కటే గనుక అది మాత్రం అర్థంపర్థం లేకుండా చేస్తున్నారు.

నాటో విస్తరణ సమస్య ఇపుడు కొత్తగా తలెత్తింది కాదు. 1991లో సోవియెట్ యూనియన్ వార్సా కూటమి రద్దయినాక కూడా, ప్రస్తుత ఉక్రెయిన్ యుద్ధానికి ముందు రష్యా వ్యతిరేకతను లెక్కచేయకుండా నాటోను అయిదుసార్లు విస్తరించారు. యుద్ధం మొదలైనాక ఆ పని మరో రెండుసార్లు చేశారు. ఆ చర్యలను రష్యా అప్పటి అధ్యక్షుడు బోరిస్ ఎల్సిన్, ఆ తర్వాత పుతిన్ వ్యతిరేకిస్తూ వచ్చారు. అయినప్పటికీ అమెరికా అధ్యక్షులు ముఖ్యంగా క్లింటన్‌తో మొదలుకొని బైడెన్ వరకు వేగంగా విస్తరిస్తూ పోయారు. ఇపుడా దేశాల సంఖ్య 32కు చేరింది. ట్రంప్ మినహా ఆ నాయకుల లక్ష్యమంతా ఉక్రెయిన్‌ను కూడా చేర్చుకుని రష్యాను చుట్టుముట్టడం. ఇది పుతిన్‌కు తెలుసు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

ఒక యుగానికి అంతం... మరో యుగానికి ఆరంభం

టైమ్ మిషన్

భారతదేశ చరిత్రను అనేక మలుపులు తిప్పిన సంఘటనలు ఎన్నో సెప్టెంబర్ నెలలో చోటు చేసుకున్నాయి. అందులో 1857 సెప్టెంబర్ మూడవ వారంలో చివరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్‌ను బ్రిటిష్‌వాళ్లు అరెస్ట్ చేసి రంగూన్‌కు పంపించిన ఘటన అతి ముఖ్యమైనది. 1857 సిపాయిల తిరుగుబాటు (భారత ప్రథమ స్వాతంత్ర్య సమరం)కు సైనికులు బహదూర్ షాను ఆయనకు ఇష్టం లేకపోయినా తమ నాయకునిగా ఒప్పించారు. నిజానికి ఆయన కేవలం ఈ తిరుగుబాటుకు ఒక ప్రతీకగా మాత్రమే నిలిచాడు. అప్పటికి మొఘల్ సింహాసనం ఒక ప్రతిష్ఠాత్మక చిహ్నం మాత్రమే. వాస్తవ అధికారం అంతా బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ చేతిలోనే ఉంది. అప్పటికి ఆయన వయసు 80 ఏళ్ల పైమాటే. అయినా ఆయన పేరు తిరుగుబాటుదారుల్లో ఐకమత్యాన్ని తీసుకురావడానికి దోహదం చేసింది.



బర్మా ప్రవాస జీవితంలో బహదూర్ షా జాఫర్

1857 మేలో సిపాయిలు మీరట్‌లో బ్రిటిష్ వాళ్లపై తిరుగుబాటు చేసి ఢిల్లీకి చేరుకున్నారు. అక్కడ బ్రిటిష్ సైనికులు తక్కువ సంఖ్యలో ఉండటం వల్ల నగరం విడిచి పారిపోయారు. మొత్తంమీద ఢిల్లీ వారి ఆధీనంలోకి వచ్చింది. చేజారిన ఢిల్లీని తిరిగి ఆక్రమించడం కోసం బ్రిటిష్‌వాళ్లు దేశంలో ఇతర ప్రాంతాల్లో ఉన్న పటాలాలను రప్పించడం ప్రారంభించారు. జూన్ నాటికి గుర్ఖాల బలగం ఢిల్లీ చేరుకుంది.

ఈ కొద్ది పాటి సైన్యంతో ఢిల్లీకి దగ్గరలోని ఒక ఇరుకైన కొండప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు. జూన్ 8న ఢిల్లీ ముట్టడి ప్రారంభమయ్యే సమయానికి ఢిల్లీలో మొఘల్ చక్రవర్తిగా బహదూర్ షా దర్బార్ నిర్వహిస్తున్నాడు. ఇప్పుడు 40 వేల మంది పోరాట యోధులు ఆయన కింద ఉన్నారు. అదనపు బలగాల కోసం ఎదురు చూస్తూ ఢిల్లీ పరిసరాల్లో ఉన్న బ్రిటిష్ బలగాలు కొన్ని వారాలు గడిచేటప్పటికి కలరా వ్యాధికి గురయ్యాయి. వారు ప్రత్యర్థి సైనికులతో కాక విరేచనాలతో తలపడవలసి వచ్చింది.

బహదూర్ షా అరెస్టు

ఇంతలో పంజాబ్ నుండి బ్రిగేడియర్ జనరల్ జాన్ నికల్సన్ ఆధ్వర్యంలో 2,000 మంది అదనపు సైనికులు చేరుకున్నారు. సెప్టెంబర్ మొదటివారం నాటికి 9,000 మంది సైనికులను సమీకరించగలిగారు బ్రిటిష్ వాళ్లు. సెప్టెంబర్ 14 నాటికి నగరంలోని కశ్మీరీ గేట్ దగ్గరకు చేరగలిగారు. అయితే అక్కడ తిరుగుబాటుదారుల నుంచి గట్టి ప్రతిఘటన ఎదురయ్యింది. బ్రిటిష్ సైన్యాన్ని నడిపిస్తున్న నికల్సన్ తీవ్రంగా గాయపడ్డాడు. అయితే అతడి దళాలు ప్రత్యర్థుల రక్షణ వలయాన్ని ఛేదించడంలో విజయం సాధించాయి. ఢిల్లీలోకి బ్రిటిష్‌వాళ్లు ప్రవేశించారని తెలియడంతో బహదూర్ షా తన కుటుంబ సభ్యులతో కలిసి ఎర్రకోట నుంచి రహస్యంగా తప్పించుకుని హుమయూన్ సమాధి ప్రాంగణంలో తలదాచుకున్నాడు. ఆయన దర్బార్‌లోనే పని చేసే కొందరి నమ్మక ద్రోహంవల్ల ఈ సంగతి బ్రిటిష్‌వాళ్లకు తెలిసి అక్కడే ఆయన్ని సెప్టెంబర్ 21న అరెస్ట్ చేశారు.

ఈ అరెస్టుతో మొఘల్ సామ్రాజ్య చరిత్ర ముగిసింది. ఆయనపై దేశ ద్రోహం ఆరోపణలు మోపారు. ఆయన కుమారులను చంపారు. చివరకు ఆయనను బ్రిటిష్ బర్మా (ఇప్పటి మయన్మార్)లోని రంగూన్‌కు తరలించారు. అక్కడే 1862లో ఆయన మరణించాడు.

బహదూర్ షా జాఫర్ అరెస్టు 300 ఏళ్ల మొఘల్ సామ్రాజ్యానికి ముగింపు పలికింది. ఢిల్లీపై బ్రిటిష్ సంపూర్ణ ఆధిపత్యం నెలకొంది. తిరుగుబాటు అనంతరం 1858లో ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారం రద్దయి, బ్రిటిష్ రాణి విక్టోరియా భారతదేశాన్ని నేరుగా తన పాలన కిందికి తీసుకుంది. బహదూర్ షా జాఫర్ అరెస్టు ఒక యుగానికి ముగింపు పలికినా, కొత్త స్వాతంత్ర్య పోరాట ఆరంభానికి సంకేతమైంది!

సోషల్ టాక్

జెనరేషన్



మేము పిడికిలి బిగించి నినదిస్తాం. సామాన్యుల ఐక్యతకు ఉన్న శక్తి ఏమిటో చూపిస్తాం. పాలకులు, అధికారుల అవినీతిపై పోరాటం చేస్తాం. మేము మౌనంగా ఉండబోము. మౌనంగా ఇంట్లోనే ఉండిపోము. దేశాన్ని ప్రక్షాళన చేస్తాం.

– సుదన్ గురుంగ్, నేపాల్ 'జెన్ జీ' నాయకుడు

రిపీట్



జిమ్‌కు వెళ్లే ముందు నేను ఒకటే గుర్తుంచుకుంటాను. ఈరోజు ఒక పూర్తి ఎక్సర్‌సైజ్‌ను 'రెప్' (రిపీట్) చెయ్యాలని. అది నాలో పంతం రేపుతుంది. ఏ క్రీడలలో ఉన్నవారికైనా అంకితభావం, కృషి, క్రమశిక్షణతో పాటుగా ఒక 'రెప్' కూడా ఉండాలి.

– హర్మన్‌ప్రీత్ సింగ్, హాకీ టీమ్ కెప్టెన్

సరికాదు



ఒకరి జీవితంలో జనన, మరణాలన్నవి సున్నితమైన భావోద్వేగాలతో కూడిన కుటుంబ సంతోషాలు, విషాదాలు. వాటి గురించి తక్కువ చేసి మాట్లాడటం, వదంతులు వ్యాప్తి చెయ్యటం సరికాదు. తెలిసి ఎవరినీ బాధించకండి. మనమూ బాధపడే రోజు రావచ్చు.

– కాజోల్, బాలీవుడ్ నటి

రెండు వారాలు



నేను మానసికంగా చురుగ్గా ఉండగలిగినంత వరకు ముందుకు సాగుతూనే ఉంటాను. ఇంట్లో కూర్చోవడం నాకు సరిపడని పని. భార్య, పిల్లలతో ఏడాదికి రెండు వారాల పాటు సఫారీలకు వెళ్లటం నాకు ఇష్టం. నేను చనిపోవడానికి సిద్ధంగా లేను.

– రూపర్ట్ మర్డోక్ (94), మీడియా మొఘల్

మొదలైతే!



పురోగతికి కావలసినవి ధైర్యమైన ఎంపికలే కానీ, పరిపూర్ణ పరిస్థితులు కాదు. మోటివేషన్‌ల కోసం చూడకండి. 'అవకపోతే ఏం చేద్దాం?' అనే ఆలోచన మానండి. 'ఎందుకు కాదో చూద్దాం' అని ముందుకు అడుగేయండి.

– సంజయ్ కపూర్, బిజినెస్‌మాన్

ఆత్మ విశ్వాసం




అందం గురించి నిశ్చింతగా ఉండే అమ్మాయిలలో కనిపించే ఆత్మవిశ్వాసం అంటే నాకు చాలా ఇష్టం. అందంగా కనిపించే ప్రయత్నం చేయకపోవడమే నిజమైన అందం. అందం కోసం వింతగా తయారవక్కర్లేదు. జీన్స్, హూడీ చాలు.

– టామ్ ఫెల్టన్, నటుడు, హ్యారీ పాటర్ ఫేమ్

ఆకలినే ఆయుధంగా...

ఇన్ బాక్స్

ఆకాశం నుండి అగ్ని వర్షాన్ని కురిపిస్తూ, నరరక్త జీవనదిని చూస్తూ వికటాట్టహాసం చేస్తున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూనూ, ఆయనకు వంత పాడుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నూ చూసి యావత్ ప్రపంచం అసహ్యించుకుంటోంది. సుమారు రెండేళ్లలో అరవై వేల మంది ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకొన్న ఇజ్రాయెల్ యుద్ధ విలువలను ఏ మాత్రం పాటించడం లేదు. మానవత్వాన్ని పూర్తిగా వదిలేసి ఆహారం తెచ్చిన ట్రక్కుల దగ్గరకు వచ్చిన అన్నార్తులను కాల్చి చంపేస్తోంది. ప్రపంచ దేశాలు గాజాపై దాడులు ఆపాలనీ, మానవ హననాన్ని నిలుపుదల చేయాలనీ కోరుతున్నా చలనం లేదు.



హిట్లర్ కాలంలో సామూహిక మృత్యుకేళిని చూశాం. నేడు మళ్ళీ అదే కోవలో నెతన్యాహూ ఆకలిని ఆయుధంగా మలిచి జాతి హననానికి పూనుకున్న సజీవ సాక్ష్యపు గాజాను చూస్తున్నాము. పాలస్తీనా ప్రజల సార్వభౌమత్వాన్ని కాలరాస్తూ హమాస్‌ను అంతం చేసి, శాంతిని స్థాపించడం కోసమే ఈ యుద్ధం అని ఇజ్రాయిల్ తీర్మానిస్తున్నది. కానీ జర్నలిస్టులను వేటాడి 20 మందిని ఉద్దేశ్యపూర్వకంగా హత్య చేసింది. అల్‌షిఫా ఆస్పత్రి ప్రధాన ద్వారం వెలుపల మీడియా కోసం ఉద్దేశించిన టెంట్‌పై క్షిపణి దాడి చేసింది. 23 నెలల కాలంలో 200 మంది జర్నలిస్టులను హత్య చేసింది.

ఇజ్రాయెల్ బాధితుల్లో మహిళలూ, చిన్న పిల్లలూ, ముసలి వారే యాభై శాతానికి పైగా ఉన్నారు. వీధులన్నీ శ్మశానవాడలుగా మారిపోయాయి. ఇళ్ళు, భవనాలు, భవంతులు మోడులుగా నిలిచిపోయాయి. పని లేదు, ఆహారం లేదు, మంచినీటి సౌకర్యం లేదు. 5 లక్షల మంది ఆకలి కేకలతో కాలం గడుపుతున్నారు. చిన్న పిల్లలూ, వృద్ధుల స్థితి హీనాతిహీనంగా ఉన్నది. గాజా అంతా దుర్భిక్షంగా మారిపోయింది.


ఐరాస ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పీ) ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మెక్ కెయిన్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇజ్రాయెల్‌ను హెచ్చరించారు. అలాగే ఇజ్రాయెల్‌లోని 600 మంది రిటైర్డ్ సీనియర్ భద్రతాధికారులు, సైనికాధికారులు యుద్ధాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ అమెరికా అధ్యక్షుడికి లేఖ రాశారు. 'హమాస్ ఇంక ఎంత మాత్రం ఇజ్రాయెల్ ఉనికికి ప్రమాదకరం కాదనీ, యుద్ధం కొనసాగించడం ద్వారా ఇజ్రాయెల్ తన గౌరవాన్ని కోల్పోతున్నదనీ' స్పష్టంగా పేర్కొన్నారు. అయినా మృత్యు ఘోష సాగుతూనే ఉన్నది.

– ఎం. హన్మేశ్ । సీపీఐ (ఎమ్ఎల్) మాస్ లైన్ తెలంగాణ కార్యదర్శివర్గ సభ్యులు

నేపాల్ పర్యటనలు ఎక్కువే!

డేటా పాయింట్

ఇటీవలి నేపాల్ సంక్షోభాన్ని అటుంచితే– ఏటా భారత్, నేపాల్ మధ్య 5 లక్షలకుపైగా ప్రయాణిస్తుంటారు. మన దేశానికి వచ్చే నేపాల్ పర్యాటకుల కంటే, అటు వెళ్లే భారతీయ పర్యాటకులే ఎక్కువ. ప్రస్తుతం మన దేశం నేపాల్‌కు 10 విమానాలు నడుపుతోంది.



ఆధారం: కేంద్ర పర్యాటక శాఖ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్

మంచివారిని అంటిపెట్టుకునే...

జ్యోతిర్మయం

సంస్కృతంలో విష్ణుశర్మ రచించిన 'పంచతంత్రం' కావ్యానికి తెలుగు అనువాదాలలో ఒకటైన భానుకవి 'పంచతంత్రి' కావ్యంలో లోకనీతికి చెందిన అంశాలే కాకుండా, ఆధ్యాత్మిక విషయాలు కూడా సందర్భానుసారంగా కనిపిస్తాయి. అందులో, ఒక సందర్భంలో, పింగళకుడు అనే మృగరాజుకు సంజీవకుడు అనే వృషభానికి మధ్య క్రమంగా వృద్ధిచెంది, స్థిరపడుతున్న గాఢమైన స్నేహానికి ఈర్ష్య పడిన దమనకుడు అనే నక్క, ఒకరోజు సంజీవకుడి వద్దకు వచ్చి 'మృగరాజైన పింగళకుడు నీపై చాలా కోపంతో ఉన్నాడు, నిన్ను దండించే ఆలోచనలో ఉన్నాడు' అని చెప్పాడు. దమనకుడి మాటలను అమాయకంగా నమ్మిన సంజీవకుడు చాలా నిరాశ చెంది 'నావైపు నుంచి ఏమీ అపరాధం జరగలేదు. అయినా రాజు నన్ను శిక్షార్హునిగా చూడటం ఆశ్చర్యాన్ని, బాధను కలిగించే విషయం. సర్వాధికారంతో విర్రవీగే వారికి ఏం నీతి ఉంటుంది? ఉపకారం చేసిన వాడినే శత్రువుగా భావిస్తారు' అని తన మనసులో అనుకుంటున్నట్లుగా దమనకుడితో పలికి, ఆ సందర్భంగా ఇంకా ఇలా తన అధ్యాత్మిక భావనలను దమనకుడితో పంచుకున్నాడని భానుకవి పంచతంత్రి ప్రథమాశ్వాసంలో చెప్పాడు:

చం. సరసుల నక్రముల్, మలయజంబుల బన్నగరాజి, కేతకీ / తరువుల గంటకమ్ములు, నిధానములన్ బహుభూతముల్ సుధా / కరుని గళంకమట్లు నధికంబుగ, దుర్దశ లుర్విలోన స / త్పురుషుల బొందుచుండు దమ పూర్వకృతంబగు పాతకంబునన్. అందంగా, ఆహ్లాదంగా కనిపించే సరస్సులో మొసళ్ళూ, సువాసనలు వెదజల్లే చందన వృక్షం మొదలైనవాటిని ఆశ్రయించి పాములూ, మొగిలిపూల చెట్లను చుట్టి ఉండే ముళ్ళూ, మనుషులు నివసించే ఇళ్ళను అంటిపెట్టుకుని ఉండే దయ్యాలూ, చంద్రునిపై కనిపించే పెద్ద మచ్చా... ఇలా పలు రకాల కష్టాలు, దుర్దశలు ఎక్కువగా మంచివాళ్ళకే సంభవిస్తూ ఉంటాయి. అలా ఎందుకు? అని ఆలోచిస్తే మనసుకు తోచే సమాధానం 'అది పూర్వజన్మ పాప ఫలితంగానే సుమా!' అన్నది తప్ప మరొకటి కాదు – అని పై పద్యం భావం.


– భట్టు వెంకటరావు



బ్రిటన్ రాజు కానుకగా ఇచ్చిన మొక్క నాటిన ప్రధాని

న్యూఢిల్లీ: బ్రిటన్ రాజు చార్లెస్–3 తనకు 75వ పుట్టిన రోజు సందర్భంగా కానుకగా పంపిన కదంబ మొక్కను శుక్రవారం ప్రధాని మోదీ అధికార నివాస ప్రాంగణంలో నాటారు. 'తల్లి పేరుతో ఒక చెట్టు' అన్న ప్రధాని మోదీ నినాదం ప్రేరణతోనే రాజు చార్లెస్ ఈ మొక్కను పంపారని ఢిల్లీలోని బ్రిటిష్ హై కమిషన్ కార్యాలయం తెలిపింది. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలంటూ ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేసింది. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని మోదీ, చార్లెస్–3 కట్టుబడి ఉన్నారనేందుకు ఈ కానుకే ఒక ఉదాహరణ అని తెలిపింది. ఈ నెల 17వ తేదీన ప్రధాని మోదీ తన నివాస ప్రాంగణంలో మొక్కను నాటుతున్నప్పటి వీడియోను బ్రిటిష్ హై కమిషన్ కార్యాలయం శుక్రవారం ఆన్‌లైన్‌లో షేర్ చేసింది. ఇద్దరు నేతల మైత్రి, పర్యావరణ పరిరక్షణపై ఇద్దరి నిబద్ధతకు ఇది ప్రతీకని తెలిపింది. జూలైలో బ్రిటన్‌లో ప్రధాని మోదీ పర్యటన సమయంలో రాజు చార్లెస్–3 సొనొమా మొక్కను బహుమతిగా అందజేశారు. 'కామన్వెల్త్, యూకే–భారత్ ఉమ్మడి భాగస్వామ్య విజన్–2035కు వాతావరణ, పరిశుభ్రమైన ఇంధన రంగాలే కీలకం' అని బ్రిటిష్ హైకమిషన్ తెలిపింది.

సూర్యుడిని కత్తిరించేశారు!



వాషింగ్టన్: భూమి నుంచి 15 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యుడిని కత్తిరించడం సాధ్యమా? భూమి కంటే 109 రెట్లు పెద్దదైనా సూర్యగోళాన్ని రెండు ముక్కలు చేయగలమా? అలా చేయడం సాధ్యమేనని ప్రముఖ ఖగోళ ఫొటోగ్రాఫర్ ఆండ్రూ మెక్‌కార్తీ నిరూపించారు. నారింజ రంగులోని ఈ అద్భుతమైన చిత్రాన్ని తన కెమెరాలో బంధించారు. స్పేస్ ఎక్స్ సంస్థ ఈ నెల 6న ఫాల్కన్–9 రాకెట్‌ను ప్రయోగించింది. అమెరికాలోని ఫ్లోరిడాలోని కేప్ కెనావెరాల్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. ఈ సందర్భంగా ఆండ్రూ మెక్‌కార్తీ తన కెమెరాను క్లిక్‌మనిపించారు. రాకెట్ సూర్యుడిని చీలుస్తూ దూసుకెళ్లినట్లుగా చిత్రం ఆవిష్కృతమైంది. ఇందులో ఉదయ భాస్కరుడి ఉపరితలంలోని క్రోమోస్ఫియర్ హైడ్రోజన్ అల్ఫా లైట్‌లో చక్కగా కనిపిస్తోంది. గతంలోనూ ఇలాంటి దృశ్యాలు కెమెరా కంటికి చిక్కినప్పటికీ అవి సాధారణ తెల్లటి కాంతిలోనే కనిపించాయి. ఇలా కనువిందైన సోలార్ క్రోమోస్ఫియర్ దృశ్యాన్ని మాత్రం ఎవరూ బంధించలేకపోయారు. ఆ పని మెక్‌కార్తీ విజయవంతంగా పూర్తిచేశాడు. ఇందుకోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన సోలార్ టెలిస్కోప్‌తోపాటు అస్ట్రానమీ కెమెరా ఉపయోగించాడు. రాకెట్ లాంచ్‌ప్యాడ్ నుంచి 12 కిలోమీటర్ల దూరంలో తన కెమెరాను బిగించి, ఈ ఫొటో తీశాడు. రాకెట్ నుంచి చిమ్ముతున్న నిప్పుల వర్షం సూర్యుడి వర్ణంతో సరిగ్గా కలిసిపోయింది. సూర్యుడిని రెండు ముక్కలుగా కత్తిరిస్తున్నట్లుగా కనిపిస్తోంది. సూర్యుడి క్రోమోస్ఫియర్‌తోపాటు రాకెట్ ఒకేచోట దర్శనమిస్తున్న తొలి ఫొటో ఇదేనని చెప్పొచ్చు. అస్ట్రోఫొటోగ్రఫీ, స్పేస్ అబ్జర్వేషన్‌లో ఇది కీలక ఘట్టం. ఇలాంటి అరుదైన దృశ్యాన్ని చిత్రీకరించే అవకాశం జీవిత కాలంలో ఒక్కసారే లభిస్తుందని మెక్‌కార్తీ ఆనందం వ్యక్తంచేశాడు. ఇది సైన్స్, ఆర్ట్ సమ్మేళనమని అభివర్ణించాడు. అంతరిక్షంలోని అందాలను ఒడిసిపట్టడంలో అతడు దిట్టగా పేరుగాంచాడు. సాధారణ టెలిస్కోప్‌తో చూడలేని ఎన్నో దృశ్యాలను తన ప్రతిభతో ప్రపంచానికి చూపించాడు. స్టార్‌లింక్ 10–57 మిషన్‌లో భాగంగా అమెరికా అంతరిక్ష పరిశోధకులు ఫాల్కన్–9 రాకెట్‌ను ప్రయోగించారు. 28 ఉపగ్రహాలను భూదిగువ కక్ష్యలో ప్రవేశపెట్టారు.

అస్సాం రైఫిల్స్‌పై దాడి

- ఇద్దరు జవాన్లు మృతి.. ఐదుగురికి గాయాలు
- మణిపూర్‌లో సాయుధ దుండగుల దుశ్చర్య
- హఠాత్తుగా కాన్వాయ్‌ని చుట్టుముట్టి కాల్పులు
- ఇంఫాల్ నుంచి బిష్ణుపూర్‌కు వస్తుండగా ఘటన



గాయపడిన జవానును ఆస్పత్రికి తీసుకువస్తున్న సిబ్బంది

ఇంఫాల్: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో దారుణం చోటుచేసుకుంది. బిష్ణుపూర్ జిల్లాలోని నంబోల్ సబాల్ లెయ్‌కై సమీపంలో పారామిలటరీ దళం 'అస్సాం రైఫిల్స్' వాహన శ్రేణిపై గుర్తుతెలియని వ్యక్తులు హఠాత్తుగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు మరణించారని, మరో ఐదుగురు గాయపడ్డారని మణిపూర్ పోలీసు అధికారులు వెల్లడించారు. మణిపూర్ రాజధాని ఇంఫాల్ నుంచి 33 మంది అస్సాం రైఫిల్స్ సిబ్బంది వాహనంలో బిష్ణుపూర్‌కు బయలుదేరారు. శుక్రవారం సాయంత్రం 5.50 గంటలకు వాహనాన్ని సాయుధ దుండగులు చుట్టుముట్టి కాల్పులు జరిపి, తక్షణమే అక్కడి నుంచి పరారయ్యారు. ఇంఫాల్‌కు 16 కిలోమీటర్ల దూరంలో ఈ సంఘటన జరిగింది. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. కాల్పుల్లో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. వారిని నాయక్ సుబేదార్ శ్యామ్ గురూంగ్, రైఫిల్‌మేన్ కేశావ్‌గా గుర్తించారు. గాయపడినవారిని సమీపంలోని 'రిమ్స్'కు తరలించారు. బాధితులకు చికిత్స కొనసాగుతోంది. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. దాదాపు ఐదుగురు వ్యక్తులు తమపై కాల్పులు జరిపారని గాయపడిన జవాన్ ఎస్.నాంగ్‌థాన్ చెప్పాడు. ప్రధాన రహదారిపై చుట్టుపక్కల జనం ఉండడంతో తాము అప్రమత్తంగా వ్యవహరించామని, వెంటనే ఎదురు కాల్పులు ప్రారంభించలేకపోయామని వెల్లడించాడు. మాజీ సీఎం ఎన్.బీరేన్‌సింగ్ 'రిమ్స్'లో బాధితులను పరామర్శించారు. గాయపడిన జవాన్లు మణిపూర్, అస్సాం, సిక్కిం, మేఘాలయా, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు చెందినవారు.

మోదీ వచ్చి వెళ్లిన వారం రోజులకే..

భద్రతా సిబ్బందిపై కాల్పులు జరిపిన దుండగుల కోసం అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. వారిని త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత వారమే మణిపూర్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఇంతలోనే దుండగులు భద్రతా సిబ్బందిపై దాడికి దిగడం చర్చనీయాంశంగా మారింది. ఈ దాడికి కారణం ఎవరన్నది ఇంకా తెలియరాలేదు. తీవ్రవాద సంస్థలు ఇప్పటిదాకా ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు.

రెండేళ్లుగా ఘర్షణలు

మణిపూర్‌లో రెండు ప్రధానమైన జాతులైన కుకీలు, మైతేయీల మధ్య 2023 మే నెల నుంచి ఘర్షణ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ ఘర్షణల్లో 260 మంది మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాష్ట్రపతి పాలన కొనసాగుతోంది. 13 పోలీసు స్టేషన్ల పరిధిలో మినహా రాష్ట్రమంతటా సైనిక దళాల(ప్రత్యేక అధికారాల) చట్టం(ఏఎఫ్ఎస్‌పీఏ) అమల్లో ఉంది. శుక్రవారం కాల్పులు జరిగిన నంబోల్ ఏరియాలో ఈ చట్టం అమల్లో లేదు. శుక్రవారం ఉదయం ఇక్కడికి 20 కిలోమీటర్ల దూరంలో ఆందోళనకారులు రహదారిని దిగ్బంధించారు. ఓ కేసులో 45 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినందుకు ఆందోళనకు దిగారు. అస్సాం రైఫిల్స్‌పై దాడికి స్థానిక తీవ్రవాద సంస్థలే కారణం కావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇది మణిపూర్‌పై దాడి: బీరేన్ సింగ్

అస్సాం రైఫిల్స్‌పై జరిగిన దాడిని మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా తీవ్రంగా ఖండించారు. ఇది అత్యంత హేయమైన హింసాకాండ అని పేర్కొన్నారు. ఈ మేరకు మణిపూర్ రాజ్‌భవన్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఇద్దరు జవాన్లు మృతిచెందడం పట్ల గవర్నర్ విచారం వ్యక్తంచేశారు. వారి కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్రూరమైన దాడులను సహించే ప్రసక్తే లేదని, దుండగులను శిక్షించడం ఖాయమని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో శాంతి, సుస్థిరతను కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఉద్ఘాటించారు. తాజా దాడి పట్ల మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఇది సాక్షాత్తూ మణిపూర్‌పై జరిగిన క్రూరమైన దాడిగా అభివర్ణించారు. అస్సాం రైఫిల్స్ సిబ్బంది ప్రాణత్యాగం ఎప్పటికీ తమ హృదయాల్లో నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. వారిని పొట్టనపెట్టుకున్న ముష్కరులను కఠినంగా శిక్షించక తప్పదని తేల్చిచెప్పారు.

సూడాన్‌లో మసీదుపై దాడి.. 70 మంది మృతి

కైరో: సూడాన్‌లోని పారామిలటరీ గ్రూప్ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్(ఆర్ఎస్ఎఫ్) శుక్రవారం ఓ మసీదుపై జరిపిన దాడిలో కనీసం 70 మంది చనిపోయారు. ఉత్తర దార్ఫుర్ ప్రాంతంలోని ఎల్ ఫషెర్‌లో శుక్రవారం ఉదయం ప్రార్థనల సమయంలో ఘటన చోటుచేసుకుంది. డ్రోన్ దాడి తీవ్రతకు మసీదు పూర్తిగా నేలమట్టమైందని స్థానికులు తెలిపారు. ఎల్ ఫషెర్ సమీపంలో రెండు పక్షాల మధ్య గత వారం నుంచి భీకర దాడులు జరుగుతున్నాయి. సూడాన్ ఆర్మీ, ఆర్ఎస్ఎఫ్ మధ్య 2023 నుంచి జరుగుతున్న ఆధిపత్య పోరుతో కనీసం 40 వేల ప్రాణాలు కోల్పోయారు. కోటి మందికి పైగా నిరాశ్రయులయ్యారు.

ఢిల్లీ వర్సిటీ ఏబీవీపీదే!

- అధ్యక్షునిగా ఆర్యన్ మాన్ ఎన్నిక
- ఎన్ఎస్‌యూఐ అభ్యర్థిపై 16,196 ఓట్ల మెజార్టీతో గెలుపు
- ఉపాధ్యక్షునిగా ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి రాహుల్ ఝాన్స్‌లా

న్యూఢిల్లీ: ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ (డీయూఎస్‌యూ) ఎన్నికల్లో ఆర్ఎస్ఎస్ మద్దతు గల ఏబీవీపీ అభ్యర్థి ఆర్యన్ మాన్ అధ్యక్ష పదవిని కైవసం చేసుకున్నారు. ఏడేళ్ల విరామం తర్వాత గత ఏడాది ఈ స్థానాన్ని గెలుచుకున్న ఎన్ఎస్‌యూఐ నుంచి అధ్యక్ష పదవిని ఏబీవీపీ చేజిక్కించుకోవడం విశేషం. ఏబీవీపీ అభ్యర్థి ఆర్యన్ మాన్, కాంగ్రెస్ అనుబంధ ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి జోస్లిన్ నందిత చౌదరిపై 16,196 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఆర్యన్ మాన్‌కు 28,841 ఓట్లు రాగా, ఎన్ఎస్‌యూఐ అభ్యర్థి జోస్లిన్‌కు 12,645 ఓట్లు వచ్చాయి. మొత్తం నాలుగు స్థానాలకు గాను.. ఏబీవీపీ అధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను గెలుచుకుంది. అయితే ఉపాధ్యక్ష పదవిని కోల్పోయింది. ఏబీవీపీకి చెందిన కునాల్ చౌదరి, దీపికా ఝా.. కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులకు ఎన్నికయ్యారు, కాగా ఎన్ఎస్‌యూఐకి చెందిన రాహుల్ ఝాన్స్‌లా ఉపాధ్యక్ష పదవిని కైవసం చేసుకున్నారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ), ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ)లు ఒక్క స్థానం కూడా గెలుచుకోలేకపోయాయి. ఈ ఎన్నికల్లో తమ సంస్థ బాగా పోరాడిందని ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి ఎక్స్‌లో పోస్టు చేశారు. ఏబీవీపీకి వ్యతిరేకంగానే కాకుండా.. ఢిల్లీ పాలన యంత్రాంగం, ఢిల్లీ, కేంద్ర ప్రభుత్వాలు, ఆర్ఎస్ఎస్–బీజేపీ, ఢిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా కూడా తాము పోరాడినట్లు స్పష్టం చేశారు. వేలాది మంది ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులు తమకు గట్టి మద్దతుగా నిలిచారని, తమ అభ్యర్థులు బాగా పోరాడారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ ప్యానెల్ నుంచి ఉపాధ్యక్షునిగా ఎన్నికైన రాహుల్ ఝాన్స్‌లా, గెలిచిన ఇతర ఆఫీస్ బేరర్లకు శుభాకాంక్షలు తెలిపారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ఎన్ఎస్‌యూఐ ఎల్లప్పుడూ సామాన్య విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, ఢిల్లీ యూనివర్సిటీ పరిరక్షణకు పోరాడుతుందని స్పష్టం చేశారు. తాము మరింత బలపడతామని ధీమా వ్యక్తం చేశారు. 2024లో జరిగిన డీయూఎస్‌యూ ఎన్నికలలో, ఎన్ఎస్‌యూఐ ఏడేళ్ల విరామం తర్వాత అధ్యక్ష పదవిని, సంయుక్త కార్యదర్శి పదవిని గెలుచుకుంది. ఏబీవీపీ ఉపాధ్యక్ష పదవిని కైవసం చేసుకొని, కార్యదర్శి స్థానాన్ని నిలుపుకొని విద్యార్థి సంఘ ఎన్నికల్లో తన ఉనికిని చాటుకుంది. గురువారం జరిగిన ఈ ఎన్నికల్లో దాదాపు 40 శాతం పోలింగ్ నమోదైంది.



విజయోత్సవంలో ఆర్యన్ మాన్

సింగర్ జుబీన్ గార్గ్ కన్నుమూత

సింగపూర్‌లో స్కూబా డైవింగ్ చేస్తుండగా ఘటన

గౌహతి: ప్రఖ్యాత అస్సామీ గాయకుడు జుబీన్ గార్గ్(52) కన్నుమూశారు. సింగపూర్‌లో శుక్రవారం స్కూబా డైవింగ్ చేస్తుండగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందికి గురయ్యారు. ఆయన ప్రాణాలు కాపాడేందుకు సహచరులు సీపీఆర్ చేశారు. వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతూ జుబీన్ తుదిశ్వాస విడిచినట్లు నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్టివల్ నిర్వాహకుడు శ్యామ్‌కానూ మహంత వెల్లడించారు. 'యా అలీ'గా ప్రసిద్ధుడైన జుబీన్ గార్గ్ ఈ వేడుకలో పాల్గొనడం కోసమే బుధవారం ఇండియా నుంచి సింగపూర్ చేరుకున్నారు. స్థానికంగా స్థిరపడిన అస్సాం ప్రజలతో కలిసి స్కూబా డైవింగ్ కోసం పడవలో బయలుదేరారు. సముద్రంలో స్కూబా డైవింగ్ చేస్తుండగా శ్వాస సంబంధిత సమస్య తలెత్తింది. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం. శుక్రవారం ప్రారంభమైన నార్త్ ఈస్ట్ ఇండియా ఫెస్టివల్ మూడు రోజులపాటు జరగాల్సి ఉండగా, జుబీన్ గార్గ్ మృతి నేపథ్యంలో ఈ వేడుకలు రద్దు చేసినట్లు నిర్వాహకులు చెప్పారు. జుబీన్ గార్గ్‌కు భార్య ఉన్నారు. ఆయన 1972 నవంబర్ 18న అస్సాంలో జన్మించారు. మూడేళ్ల వయసు నుంచే పాటలు పాడటం ప్రారంభించడం గమనార్హం. అస్సామీ భాషలో తన పాటలతో అలరించారు. అనామిక, మోనోర్ నిజానోత్, మాయ, ఆశా, ముజాలిర్ ఎజోనీ సువాలీ తదితర అల్బమ్‌లు విడుదల చేశారు. 40కిపైగా భాషల్లో పాటలు పాడారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. గాయకుడు, రచయిత, సంగీత దర్శకుడు, సినీ దర్శకుడు, నటుడిగా ప్రేక్షకులను అలరించారు. గదర్, దిల్ సే, డోలీ సజా కే రఖ్నా, ఫిజా, కాంటే, జిందగీ తదితర హిందీ చిత్రాల్లో ఆయన తన గళం వినిపించారు. అస్సాం సంస్కృతికి ప్రతీకగా నిలిచారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. పలు సామాజిక ఉద్యమాల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు. పౌరసత్వ సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో భాగస్వామి అయ్యారు. కళాగురు ఆర్టిస్ట్ ఫౌండేషన్ అనే సంస్థను స్థాపించారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులను ఆదుకున్నారు.

గాయకుడు జుబీన్ గార్గ్ మృతిపట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంగీత రంగంలో ఆయన అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని శ్లాఘించారు. జుబీన్ కుటుంబ సభ్యులకు, అభిమానులకు సానుభూతి ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం 'ఎక్స్'లో మోదీ పోస్టు చేశారు. జుబీన్ మృతికి కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరణ్ రిజిజు, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ తదితరులు సంతాపం ప్రకటించారు.



షీ జిన్‌పింగ్‌కు డొనాల్డ్ ట్రంప్ ఫోన్

టిక్‌టాక్‌తోపాటు వాణిజ్యంపై చర్చ

వాషింగ్టన్: అమెరికా, చైనా సంబంధాల్లో మరో ముందడుగు పడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ శుక్రవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. చైనాకు చెందిన సోషల్ మీడియా యాప్ 'టిక్‌టాక్'ను అమెరికాలో యథాతథంగా కొనసాగించడంపై వారు చర్చించినట్లు సమాచారం. దీనిపై త్వరలో తుది ఒప్పందానికి రావాలని ఇద్దరు నేతలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 8 గంటలకు ఇరువురి మధ్య చర్చ ప్రారంభమైనట్లు వైట్‌హౌస్ అధికారులు వెల్లడించారు. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ యుద్ధాన్ని సాధ్యమైనంత త్వరగా ముగించి, వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని ట్రంప్, జిన్‌పింగ్ భావిస్తున్నారు. త్వరలో ముఖాముఖి సమావేశమై ఒప్పందాన్ని కుదుర్చుకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చి చైనా ఉత్పత్తులపై భారీగా సుంకాలు విధించిన తర్వాత జిన్‌పింగ్‌తో ఫోన్‌లో మాట్లాడడం ఇది రెండోసారి.

వచ్చే నెలలో జిన్‌పింగ్‌ను కలుస్తా: ట్రంప్

జిన్‌పింగ్‌తో మాట్లాడానని, టిక్‌టాక్ అంశంతోపాటు వాణిజ్యంపై చర్చించానని ట్రంప్ శుక్రవారం వెల్లడించారు. దక్షిణ కొరియాలో వచ్చే నెల లో జరగబోయే శిఖరాగ్ర సదస్సు సందర్భంగా జిన్‌పింగ్‌ను కలుసుకోబోతున్నానని పేర్కొన్నారు. అలాగే వచ్చే ఏడాది ఆరంభంలో చైనాకు వెళ్తానని తెలిపారు.

'లష్కరే' కేంద్రం ధ్వంసం నిజమే!

ఆపరేషన్ సిందూర్‌తో మాకు భారీ నష్టం ● లష్కరే తోయిబా కమాండర్ ఖాసిం అంగీకారం

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు చావుదెబ్బ తగిలింది. ఉగ్రవాద సంస్థలు కకావికలమయ్యాయి. తమకు జరిగిన నష్టంపై నోరువిప్పుతున్నాయి. భారత సైన్యం దాడులతో జైషే మొహమ్మద్ అధినేత మసూద్ అజార్ కుటుంబం ముక్కలైందని ఆ సంస్థ టాప్ కమాండర్ మసూద్ ఇల్యాస్ కశ్మీరీ ఇప్పటికే అంగీకరించాడు. వైమానిక దాడుల్లో బహవల్పూర్ స్థావరం దెబ్బతిన్నదని వెల్లడించాడు. పాకిస్తాన్‌లోని మరో ముష్కర ముఠా లష్కరే తోయిబా కమాండర్ ఖాసిం కూడా తాజాగా స్పందించాడు. ఆపరేషన్ సిందూర్ కారణంగా తమకు భారీ నష్టం వాటిల్లిందని, తమ ప్రధాన కేంద్రం 'మర్కజ్ తయిబా' ధ్వంసమైందని వెల్లడించాడు. మే 7న జరిగిన దాడుల్లో మురిద్కే పట్టణంలోని ఈ కేంద్రం నామరూపాల్లేకుండా పోవడంతో మళ్లీ నిర్మిస్తున్నట్లు చెప్పాడు. ధ్వంసమైన భవనం కంటే.. ఈసారి భగవంతుడి దయతో పెద్ద భవనం నిర్మిస్తున్నామని తెలియజేశాడు. మర్కజ్ తయిబా శిథిలాలపై నిలబడి ఖాసిం మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నిర్మాణంలో ఉన్న భవనం కూడా ఈ వీడియోలో కనిపిస్తోంది. పాక్ భూభాగంలో పంజాబ్ ప్రావిన్స్‌లోని షేక్‌పురా జిల్లాలో మురిద్కే పట్టణం ఉంది. మర్కజ్ తయిబాలో ముజాహిదీన్‌లు(ఉగ్రవాదులు), తలాబాలకు(విద్యార్థులు) శిక్షణ ఇస్తుంటారు. ప్రస్తుతం ఇక్కడ ఎలాంటి శిక్షణ ఇవ్వడం లేదని పాకిస్తాన్ అధికారులు చెబుతున్నారు.

దౌరా–ఇ–సుఫాలో చేరండి

మర్కజ్ తయిబాలో దౌరా–ఇ–సుఫాలో చేరాలంటూ పాకిస్తాన్ యువతకు లష్కరే తోయిబా ఖాసిం పిలుపునిస్తున్న మరో వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. దౌరా–ఇ–సుఫా అనేది ఉగ్రవాద శిక్షణ కార్యక్రమం. ఇక్కడ జిహాదీ శిక్షణలో భాగంగా మత విద్య కూడా బోధిస్తారు. తమ స్థావరం పునర్నిర్మాణానికి పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం సహకరిస్తున్నాయని, నిధులు అందజేస్తున్నాయని లష్కరే తోయిబా డిప్యూటీ చీఫ్ సైఫుల్లా కసూరీ వెల్లడించడం గమనార్హం. లష్కరే తోయిబా ప్రధాన కేంద్రాన్ని మళ్లీ నిర్మిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు సైతం ధ్రువీకరించాయి. 2026 ఫిబ్రవరి 5న జరిగే 'కశ్మీర్ సంఘీభావ దినం' నాటికి కొత్త భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, లాంఛనంగా ప్రారంభించాలని లష్కరే తోయిబా ముఠా లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.

ఖైబర్ పఖ్తూంక్వాకు పాక్ ఉగ్రవాద సంస్థలు

ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లో కనీసం తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు నేలమట్టమయ్యాయి. ఈ నేపథ్యంలో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లడంపై పాక్ ఉగ్రవాద సంస్థలు దృష్టిపెట్టాయి. తమ ప్రధాన కేంద్రాలను ఖైబర్ పఖ్తూంక్వా(పీకేపీ) ప్రావిన్స్‌కు తరలిస్తున్నారు. లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్‌లు ప్రస్తుతం ఇదే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. ఖైబర్ పఖ్తూంక్వా అనేది ఎత్తయిన కొండలతో నిండిన శత్రుదుర్భేద్య ప్రాంతం. అఫ్గానిస్తాన్‌కు సమీపంలో ఉండడం ఉగ్రవాదులకు అనుకూలించే అంశం. జిహాదీ శక్తులకు ఇది ప్రధాన అడ్డా. భారత సైన్యం వైమానిక, క్షిపణి దాడుల నుంచి తప్పించుకోవాలంటే ఖైబర్ పఖ్తూంక్వాకు తరలివెళ్లడమే సరైన వ్యూహమని పాక్ ఉగ్రవాద సంస్థలు నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇకపై అక్కడి నుంచే కార్యకలాపాలు కొనసాగించాలని తీర్మానించుకున్నట్లు సమాచారం.



జేసీబీతో పప్పు కలిపేశారు!

న్యూఢిల్లీ: కాలువలు తవ్వడానికి, పాత ఇళ్లు కూల్చడానికే కాకుండా వంటలు వండడానికి, పప్పు కలపడానికి కూడా జేసీబీ ఉపయోగించవచ్చని మీకు తెలుసా? ఇక్కడ అచ్చంగా అదే చేశారు. భారీ పాత్రలో ఉడుకుతున్న పప్పును జేసీబీతో చక్కగా కలిపారు. అదే పప్పును అదే జేసీబీతో ట్రాక్టర్ ట్రాలీలోకి ఎత్తి, తర్వాత వేలాది మంది అతిథులకు వడ్డించారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నీరాజాద్ అనే వ్యక్తి దీన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. ఈ సంఘటన ఎప్పుడు ఎక్కడ జరిగిందో తెలియదు గానీ క్షణాల్లోనే ఇంటర్నెట్‌లో పాకిపోయింది. జేసీబీనే మాస్టర్ చెఫ్‌గా మారిందని పోస్టులు పెడుతున్నారు. ఇలాంటి తిండి తింటే ఇంకేమైనా ఉందా? మరికొందరు ఆందోళన వ్యక్తంచేశారు. తిండి విషయంలో శుభ్రత గురించి కాస్తయినా పట్టించుకోండి అని సూచిస్తున్నారు. ఇదొక గొప్ప ఆవిష్కరణ అంటూ మరికొందరు జోక్ చేస్తున్నారు. ఇలా కూడా చేయొచ్చని మాకు ఇప్పటిదాకా తెలియదని అంటున్నారు. మట్టిని తవ్వడానికి వాడే యంత్రాన్ని వంటలు వండే ప్రదేశం దాకా తీసుకురావడమే పెద్ద తప్పు, అలాంటిది దాంతోనే పప్పు కలపడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. జేసీబీతో కలిపిన పప్పు భలే టేస్టు అంటూ సెటైర్లు సైతం విసురుతున్నారు. ఇకపై ఎవరూ ఇలాంటి పనులు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని చాలామంది ప్రభుత్వాన్ని కోరారు.

క్లుప్తంగా...


భూమి కబ్జా చేశారు.. చనిపోతా

- ప్రజాభవన్ ముందు పెట్రోల్ పోసుకున్న మహిళ

లక్డీకాపూల్ (హైదరాబాద్): 'మా భూమిని అన్యాయంగా ఆక్రమించుకుని బతుకులను ఆగం చేస్తున్నారు. చనిపోతాను'.. అంటూ ఒక మహిళ ప్రజా భవన్ ముందు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రజా భవన్ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమానికి సిద్దిపేట జయపూర్ మండలానికి చెందిన భూ బాధితురాలు హాజరైంది. ఆక్రమించుకున్న తన భూమిని కాపాడాలంటూ ఆమె ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించి గోడు వెళ్లబోసుకుంది. అనంతరం ఆమె ప్రజాభవన్ ముందు ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. ప్రమాదాన్ని గుర్తించిన అక్కడి పోలీసులు ఆమె ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితురాలు విలేకరులతో మాట్లాడుతూ.. ఆరేళ్లుగా తన 3 ఎకరాల భూమిని నలుగురు వ్యక్తులు కలిసి దోచుకుతింటున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంలో అధికారులకు ఎంత మొత్తుకున్నా తమకు న్యాయం దక్కలేదన్నారు. ఈ పరిస్థితుల్లో పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతానని బోరున విలపించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుటుంబాన్ని ఆదుకుంటారన్న ఆశతో ప్రజావాణికి వచ్చానని తెలిపింది.

హైడ్రోపోనిక్ గంజాయి పట్టివేత

- దుబాయ్ ప్రయాణికురాలి నుంచి స్వాధీనం



శంషాబాద్ (హైదరాబాద్): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం రాత్రి భారీ ఎత్తున గంజాయి పట్టుబడింది. విశ్వసనీయ సమాచారం మేరకు దుబాయ్ నుంచి వచ్చిన ఒక మహిళా ప్రయాణికురాలి లగేజీని తనిఖీ చేయగా.. అందులో హైడ్రోపోనిక్ పద్ధతిలో పెంచిన సుమారు 6 కేజీల గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. పాస్‌పోర్టు ఆధారంగా నిందితురాలిని నగరానికి చెందిన రుక్సానా అనీఫ్ ఖాన్‌గా గుర్తించారు. ఆమెను క్యారియర్‌గా ఉపయోగించుకుని గంజాయిని స్మగ్లర్లు రవాణా చేస్తున్నట్లు డీఆర్ఐ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అధికారులు అధికారికంగా వివరాలు వెల్లడించలేదు.

కూపన్ల కోసం రైతుల పోటాపోటీ

- కారేపల్లిలో రెండు చోట్ల వేలాదిగా బారులు
- తోపులాటలో సొమ్మసిల్లిన ఏఓ
- అడవిదేవులపల్లిలో యూరియా తోపులాటలో గాయపడిన మహిళ మృతి



సొమ్మసిల్లిన ఏఓ అశోక్‌కుమార్‌కు చికిత్స చేయిస్తున్న దృశ్యం



కూపన్ల కోసం పెద్దసంఖ్యలో రావడంతో నెలకొన్న తోపులాట

కారేపల్లి/అడవిదేవులపల్లి: ఒక్క బస్తా యూరియా దక్కించుకునేలా కూపన్ కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి సొసైటీకి 890 బస్తాల యూరియా రాగా, శుక్రవారం కూపన్లు జారీ చేస్తున్నారనే సమాచారంతో మహిళలు సహా పెద్దసంఖ్యలో రైతులు వచ్చారు. కారేపల్లి ఎస్సై బి.గోపి, ఏఓ భట్టు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులను నియంత్రించేందుకు శ్రమ పడాల్సి వచ్చింది. రైతుల ఉరుకులు పరుగులు, తోపులాటలో ఒకరిపై ఒకరు పడగా, కొందరు వాహనాలపై పడటంతో స్వల్ప గాయాలయ్యాయి. తొక్కిసలాటలో ఏఓ అశోక్‌కుమార్ కూడా సొమ్మసిల్లడంతో కారేపల్లి పీహెచ్‌సీకి, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చివరకు కూపన్లను జిన్నింగ్ మిల్లులో ఇస్తామని చెప్పడంతో రైతులు అక్కడికి పరుగులు తీశారు. అక్కడికీ వేలాదిగా చేరడంతో అదే పరిస్థితి ఎదురైంది. కొందరు రైతులు కూపన్ల కోసం ఎగబడటంతో హోంగార్డు శంకర్ ఉక్కిరిబిక్కిరై కారేపల్లి పోలీసుస్టేషన్‌కు వెళ్లి తలదాచుకున్నాడు. ఈక్రమంలో 2,152 కూపన్లను రైతులకు అందజేయగా, మరో 1,600 మంది ఆందోళనకు దిగడంతో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి అక్కడికి చేరుకుని నచ్చచెప్పారు. ఆపై అందరి పేర్లు నమోదు చేసుకుని 1,600 మంది రైతులకు ఇళ్ల వద్దే శనివారం నుంచి కూపన్లు ఇస్తామని చెప్పడంతో నిరాశగా వెనుదిరిగారు.

11న తోపులాటలో గాయపడ్డ మహిళ మృతి

నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద యూరియా కోసం జరిగిన తోపులాటలో గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందింది. గోన్యాతండాకు చెందిన పాతులోతు దసి (52) ఈనెల 11న రైతు వేదిక వద్దకు యూరియా కోసం వచ్చి క్యూలో నిలబడింది. ఈ సందర్భంగా రైతుల మధ్య జరిగిన తోపులాటలో క్యూలో ఉన్న దసి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి రైతులు ఆమెను ఆటోలో మిర్యాలగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

శ్రీశైలం 8 గేట్లు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు 24 గేట్ల ఎత్తివేత



దోమలపెంట/నాగార్జునసాగర్ : ఎగువ నుంచి వస్తున్న భారీ వరదలతో కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. దీంతో శుక్రవారం రాత్రి 7 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టు ఎనిమిది గేట్లను పైకెత్తి సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేశుల, హంద్రీ నుంచి మొత్తంగా 2,24,882 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో దిగువన ఉన్న సాగర్‌కు 2,22,400 క్యూసెక్కుల నీరు వెళుతోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 884.4 అడుగుల నీటిమట్టం వద్ద 211.9572 టీఎంసీల నీటి నిల్వ ఉంది. శ్రీశైలం నుంచి భారీగా ఇన్‌ఫ్లో వస్తున్న నేపథ్యంలో సాగర్ ప్రాజెక్టు 24 రేడియల్ క్రస్ట్ గేట్లు, విద్యుదుత్పాదన ద్వారా 2,60,548 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాగర్ జలాశయ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 587.20 అడుగులుగా ఉంది.

సాగర్‌ను సందర్శించిన కేఆర్ఎంబీ చైర్మన్

సాగర్ ఎడమ కాల్వ వద్ద ఏర్పాటు చేసిన టెలీమెట్రీ వ్యవస్థను కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్ బీపీ.పాండ్యే, సభ్యుడు కేకే.జాన్గిడ్, స్థానిక ఇంజనీర్లతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కాల్వల ద్వారా ఆయకట్టుకు విడుదలవుతున్న నీటి ప్రవాహం, వినియోగం, ఎక్కడకు ఎంత చేరుతుందనే దానిని పరిశీలించారు. ఈ సందర్భంగా బీపీ. పాండ్యే మాట్లాడుతూ రైతులకు నీటి సరఫరా సక్రమంగా జరిగేలా టెలిమెట్రీ ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని, ఏ ప్రాంతానికీ అన్యాయం జరగకుండా నీటి పంపిణీకి కృషి చేస్తామన్నారు. కాల్వల సంరక్షణ, నిర్వహణపై స్థానిక ఇంజనీర్లతో సమీక్షించారు. ఆయన వెంట ఈఈ శ్రీనివాసరావు ఉన్నారు.

పెన్షన్ డబ్బుల కోసం తల్లిని చంపిన కొడుకు

- వికారాబాద్ జిల్లా గడిసింగాపూర్‌లో ఘటన



మల్లమ్మ (ఫైల్)

పరిగి: పున్నామ నరకం నుంచి రక్షిస్తాడనుకున్న కొడుకు పెన్షన్ డబ్బుల కోసం కన్నతల్లిని చంపిన ఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం గడిసింగాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మిట్టకోడూర్ మల్లమ్మ (57)కు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ముగ్గురికీ వివాహాలు కాగా, పెద్ద కుమారుడు ఆంజనేయులు మద్యానికి బానిసయ్యాడు. ఇతని మొదటి భార్య మృతి చెందగా, రెండో భార్య విడాకులు తీసుకుంది. ఎలాంటి సంపాదన లేకపోవడంతో తల్లికి వచ్చే ఆసరా పెన్షన్ డబ్బులు లాక్కుని నిత్యం మద్యం తాగేవాడు. ఇటీవల పెన్షన్ రావడంతో గత బుధవారం సాయంత్రం డబ్బులు ఇవ్వమని అడగ్గా.. ఆమె నిరాకరించింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఆంజనేయులు విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్రగాయాలపాలై మరుసటి రోజు శుక్రవారం ఇంట్లోనే చనిపోయింది. ఇది గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. చిన్న కుమారుడు మహిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపర్చిన అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఠాణాలోనే పోలీసులపై దాడి

- ఇద్దరు హెచ్‌సీలు, ఒక కానిస్టేబుల్‌పై దౌర్జన్యం

అశ్వారావుపేట రూరల్: పోలీస్‌స్టేషన్‌లో విధుల్లో ఉన్న ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లతోపాటు మరో కానిస్టేబుల్‌పై ఒక వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. వివరాలివి. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం నల్లబాడులో పొలం వద్ద నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె విషయమై గురువారం గ్రామానికి చెందిన గడ్డం వెంకటస్వామి, గడ్డం వసంతయ్య మధ్య గొడవ జరిగింది. ఈ ఘటనలో వసంతయ్య గాయపడగా, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణకు శుక్రవారం వెంకటస్వామిని పోలీసులు స్టేషన్‌కు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న వెంకటస్వామి తనయుడు గడ్డం వెంకన్నబాబు అలియాస్ అరుణ్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. అంతటితో ఆగక 'మా నాన్ననే పోలీస్‌స్టేషన్‌కు తీసుకొస్తారా'అంటూ హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మీపతి, కృష్ణమూర్తి, కానిస్టేబుల్ సంతోష్‌పై దాడికి పాల్పడ్డాడు. తాను మాజీ మావోయిస్టునంటూ సిబ్బందిని బెదిరించాడు. ఈ ఘటనపై హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీపతి ఫిర్యాదుతో మాజీ మావోయిస్టు వెంకన్నబాబు, ఆయన తండ్రి వెంకటస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యయాతి రాజు తెలిపారు.

ఎంపీలాడ్స్‌పై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో జోనల్ వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో పార్లమెంటు సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకంపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో శుక్రవారం జోనల్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఎంపీలాడ్స్ పథకానికి సంబంధించిన అన్ని ముఖ్యాంశాలను అధికారులకు ప్రత్యేక శిక్షణ ద్వారా ముఖ్యంగా ఇ-సాక్షి పోర్టల్ నిర్వహణను కవర్ చేయడం లక్ష్యంగా వివరించారు. దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులతో పాటు, తెలంగాణలోని ముఖ్య ప్రణాళిక అధికారులు పాల్గొన్నారు. పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పీఎఫ్ఎంఎస్) మ్యాపింగ్ చేయడం తద్వా రా అధికారులు డిజిటల్ ప్రక్రియలను మెరుగ్గా అర్థం చేసుకోవడంతో పాటు, సందేహాలను వెంటనే పరిష్కరించే అవకాశాన్ని వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రణాళిక శాఖ డైరెక్టర్ రూఫస్ దత్తం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పూజాసింగ్ మండోల్, గణాంకాలు, ప్రణాళిక అమలు మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ, జోసెఫ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ శిక్షణ ఇచ్చారు.

'సీఓఈ విద్యార్థులకూ దసరా సెలవులు మంజూరు చేయాలి'

సాక్షి, హైదరాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కాలేజీలకు ఇతర గురుకుల కాలేజీల మాదిరిగానే దసరా సెలవులు ఇవ్వాలని ఆల్ తెలంగాణ గవర్నమెంట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎట్‌గ్రివా) అధ్యక్షుడు యాదయ్య.. సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి కృష్ణ ఆదిత్యను కోరారు. ఈమేరకు వేర్వేరుగా వినతిపత్రాన్ని అందించారు. సాధారణ గురుకుల పాఠశాలలు, కళాశాలలకు ఈనెల 21 నుంచి దసరా సెలవులు ఇవ్వగా.. సీఓఈ విద్యార్థులకు మాత్రం వారం రోజులు ఆలస్యంగా సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు మనోవేదనకు గురవుతారన్నారు.

‘మెంటల్’ షాక్.. ‘ఫ్యామిలీ’ ప్యాక్



భర్తకొస్తే భార్యకు.. భార్యకొస్తే భర్తకు! • ఇద్దరి నుంచీ పిల్లలకు, వారి పిల్లలకు!!

ఇదొక మానసిక రుగ్మతల జీవిత చక్రం • అవగాహనతోనే సమస్యకు అడ్డుకట్ట

మనవాళ్లు ‘సావాస దోషం’ అని రెండు పదాల్లో చెప్పేశారుగానీ.. అది కుటుంబం విషయంలో నిజమేనని ఇప్పుడు పరిశోధనలు చెబుతున్నాయి. భార్యాభర్తల్లో ఒకరికి మానసిక సమస్య ఉన్నప్పుడు, కొన్నాళ్ల సంసారం తరువాత అది రెండోవారిలో కనిపిస్తోంది. ఆ తర్వాత వాళ్ల పిల్లలకూ వస్తోంది. సుప్రసిద్ధ ‘నేచర్’ జర్నల్‌లో ప్రచురితమైన తాజా పరిశోధన ఈ భార్యాభర్తలు, పిల్లల ‘సావాస దోషం’ గురించి వెల్లడించింది. ముందుగా గుర్తించి జాగ్రత్త పడకపోతే సమస్య తీవ్రం కావచ్చునని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

మానసిక సమస్యలు లేదా రుగ్మతలలో భార్యాభర్తలు ఒకే విధమైన పోలికను కలిగి ఉండటం, ఆ తర్వాత అవి వారి సంతానంలోనూ కనిపించటం అన్నది అనుకోకుండా జరుగుతోందా, లేదంటే వేరే ప్రత్యేకమైన కారణాలేమైనా ఉన్నాయా అన్నది నిర్ధారించుకునేందుకు పరిశోధకులు తైవాన్, డెన్మార్క్‌లోని 50 లక్షలకుపైగా దంపతుల ఆరోగ్య రికార్డులను విశ్లేషించారు. అందుకు వారు తొమ్మిది రకాల మానసిక పరిస్థితులను, ప్రవర్తనలను పరిగణనలోకి తీసుకున్నారు.

9 సమస్యలపై..



పరిశోధకులు ప్రధానంగా ఒత్తిడి, ఆందోళన, బైపోలార్ డిజార్డర్, స్కిజోఫ్రెనియా, అత్యాచారం లేదా పెద్ద ప్రమాదం తరువాత మానసిక స్థితి (పోస్ట్–ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్; మద్యం, మాదక ద్రవ్యాల వినియోగం; అటెన్షన్–డెఫిసిట్/ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏడీహెచ్‌డీ), ఈటింగ్ డిజార్డర్స్, అబ్సెసివ్–కంపల్సివ్ డిజార్డర్ (ఒసీడీ) అనే 9 పరిస్థితులపై దృష్టి సారించినప్పుడు ‘అసార్టేటివ్ మేటింగ్’ ప్రభావ ధోరణి బయటపడింది.

వధూవరులు కోరుకున్నవే..

పొడవుగా ఉన్నవారు పొడవుగా ఉన్నవారిని, సన్నగా ఉన్నవారు సన్నగా ఉన్నవారిని తమ జీవిత భాగస్వాములుగా ఎంచుకోవటం వంటివి భౌతిక సారూప్యాలు. నెమ్మదస్తులు నెమ్మదస్తులను, మాటకారులు మాటకారులను ఎంపిక చేసుకోవటం వంటివి భావ సారూప్యాలు. అలాగే విద్యా నేపథ్యాలు, సామాజిక, ఆర్థిక స్థితిగతులు, భౌగోళిక పరిస్థితులు భాగస్వామి ఎంపికలో ప్రభావం చూపుతాయి. దీనినే ‘అసార్టేటివ్ మేటింగ్’ అంటున్నారు.


మానసిక రుగ్మతల చక్రం

తాజా పరిశోధనల ప్రకారం.. భాగస్వాముల నుంచి వారి పిల్లలు జన్యుపరమైన ఉద్వేగాలను పొందటం వల్ల బాల్యం నుంచే మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. తరత రాలకు ఇదో చక్రం లాంటిది. అందుకే వైద్యులు గుండె జబ్బులు లేదా మధుమేహం కోసం కుటుంబ చరిత్రను తనిఖీ చేసినట్లే, మానసిక సమస్యలను నివారించడానికి కుటుంబంలో ‘అసార్టేటివ్ మేటింగ్’ ఉందేమో చూడవలసిన అవసరం ఉందని పరిశోధకులు అంటున్నారు.

పెళ్లికి ముందే బీజాలు

దంపతులు పెళ్లికి ముందు ఒకర్నొకరు ఎంపిక చేసుకునేటప్పుడే ‘అసార్టేటివ్ మేటింగ్’కు బీజం పడుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. భౌతిక సారూప్యం, భావ సారూప్యం ఉన్న వాళ్లను ఎంపిక చేసుకోవటం వల్ల, భవిష్యత్తులో ఇద్దరిలోనూ కాస్త వెనుకా ముందూ ఒకే విధమైన మానసిక, ఆరోగ్య పరిస్థితులు కనిపిస్తాయని, వారికి పుట్టిన పిల్లలకు కూడా అవి సంక్రమిస్తాయని పరిశోధకులు కనుగొన్నారు. అలా పిల్లలు కూడా తల్లిదండ్రుల మనోదౌర్బల్యాలకు వారసులు అవుతున్నారని పరిశోధకులు తెలిపారు.

‘ఇంటర్ జనరేషనల్ ట్రామా’



తల్లి లేదా తండ్రికి ఉన్న మనో రుగ్మతలు వారి వరకే పరిమితం కావు. ఆ కలత (ట్రామా) ప్రభావం పిల్లలపైనా పడుతుంది. అంతేకాదు, తరం నుంచి తరానికీ సంక్రమిస్తుంది. దీనినే ‘ఇంటర్ జనరేషనల్ ట్రామా’ అంటారు. పైకి తేలిగ్గా అనిపించవచ్చు కానీ, అనుభవించేవారికి అదొక నరకం. పోస్ట్–ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్, ఇతర మానసిక రుగ్మతలు, విపరీత ప్రవర్తనలు, తల్లిదండ్రులతో తెగిన అనుబంధాలు పిల్లల్ని తీవ్ర వేదనకు గురిచేస్తాయి.

ఎలా తప్పించవచ్చు?

దీన్ని ప్రధానంగా దశలవారీగా తగ్గించుకోవచ్చని మానసిక నిపుణులు సూచిస్తున్నారు.

- మొదటి దశలో.. భార్యాభర్తలు ఒకరి సమస్యలు మరొకరు తెలుసుకోవాలి. మనసు విప్పి మాట్లాడుకోవడం మినహా దీనికి ప్రత్యామ్నాయం లేదు. ఇలా మాట్లాడుకునేటప్పుడు.. ఒకరి ఆలోచనలను మరొకరు గౌరవించడం చాలా ముఖ్యం. అలా కాకుండా సమస్యను కొట్టి పారేస్తే.. భాగస్వామిలో ఆ సమస్య మరింత పెరుగుతుంది తప్ప తగ్గదు.
- ఒకరి సమస్యను ఒకరు తగ్గించేందుకు తమ వంతు ప్రయత్నం చేయాలి. ఉదాహరణకు ఇద్దరూ ఉద్యోగస్తులైతే ఇంటి పనులు షేర్ చేసుకుని ఒత్తిడి తగ్గించుకోవాలి. ముఖ్యంగా మాటలతో భాగస్వామిని ఒత్తిడి లేదా ఆందోళన లేదా హింసకు గురిచేసే ధోరణి పూర్తిగా విడిచిపెట్టాలి.
- అవసరమైతే వైద్యులు లేదా మానసిక నిపుణులను సంప్రదించాలి. తమ సమస్యల ప్రభావం తమ పిల్లలపై పడకుండా చూసుకోవాలి. వారిపై విసుగూ, చిరాకూ, కోపమూ చూపిస్తే అవే లక్షణాలు పిల్లలకూ వస్తాయి.

క్లుప్తంగా...

సొంత చెల్లిని బయటకు పంపి ఆడబిడ్డల గురించి మాట్లాడతావా?

కేటీఆర్‌పై మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: సొంత చెల్లిని పార్టీ నుంచి బయటకు పంపిన కేటీఆర్ ఆడబిడ్డల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.సునీతారావు వ్యాఖ్యానించారు. బతుకమ్మ పేరుతో రాజకీయ పాట రాయించడం కాదని, ముందు ఆడబిడ్డలను గౌరవించడం నేర్చుకోవాలని కేటీఆర్‌కు ఆమె హితవు పలికారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆడబిడ్డలకు కనీస గౌరవం ఇవ్వని చరిత్ర కల్వకుంట్ల కుటుంబానిదని మండిపడ్డారు. బతుకమ్మ కుంటను కూడా ఆక్రమించిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని ఎద్దేవాచేశారు. అలాంటి బతుకమ్మ కుంటను హైడ్రా సాయంతో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గుర్తు మీద ఎమ్మెల్యేలుగా గెలిచి ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తున్న మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి బతుకమ్మ కుంటకు వస్తే అక్కడే దసరా బతుకమ్మ ఆడుదామని సునీతారావు ఆహ్వానించారు.

ప్రతీ మహిళకు బతుకమ్మ చీర పంపిణీ చేయాలి

బీజేపీ ఉపాధ్యక్షురాలు బండ కార్తీకరెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతీ మహిళకు బతుకమ్మ చీర పంపిణీ చేయాలని బీజేపీ ఉపాధ్యక్షురాలు, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి డిమాండ్ చేశారు. బతుకమ్మ పేరుతో గత ప్రభుత్వం టెండర్లు వేసి కోట్ల రూపాయల గోల్ మాల్ చేసిందని, అట్లాంటివి ఇప్పుడు జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. శుక్రవారం కార్తీకరెడ్డి మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్ పార్టీ కూడా నడుస్తోందని విమర్శించారు. బతుకమ్మ అంటేనే మహిళలను గౌరవించడమని, అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి అగౌరవ పరుస్తున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వం బతుకమ్మ పేరుతో పాలిస్టర్ చీరలు పంపిణీ చేసి మహిళల్ని అగౌరవపరిచిందన్నారు. తెలంగాణలో అనేక మంది నారీమణులు ఉన్నప్పటికీ బతుకమ్మ చీరలకు ఇందిరమ్మ పేరు ఎందుకు పెట్టాల్సి వచ్చిందని కార్తీకరెడ్డి ప్రశ్నించారు. మహిళలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని ధ్వజమెత్తారు. మహిళలకు స్కూటీ పంపిణీ చేస్తామని 21 నెలలు గడుస్తున్నా.. ఒక్క వాహనం కూడా పంపిణీ చేయలేకపోయారని విమర్శించారు.

నవంబర్ 9న లక్ష మందితో బీసీ యుద్ధభేరి: జాజుల



కాజీపేట రూరల్: సర్వాయిపాపన్న కోట సాక్షిగా భువనగిరి గడ్డపై బీసీ రిజర్వేషన్ల సాధనకు నవంబర్ 9వ తేదీన లక్షమందితో బీసీల రాజకీయ యుద్ధభేరి మహాసభ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. హనుమకొండ జిల్లా కాజీపేటలో శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మేధోమధన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 42 శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో మొండిగా వ్యవహరిస్తున్నాయని, తమిళనాడు తరహాలో బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 33 జిల్లాల నుంచి వచ్చిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

టీజీఐఐసీ ఆస్తులు మదింపు

భవనాలు, భూముల విలువ లెక్కింపునకు సన్నాహాలు

- సమగ్రంగా లెక్కించేందుకు ప్రైవేటు ఏజెన్సీలకు ఆహ్వానం
- రాష్ట్రంలో టీజీఐఐసీ వద్ద 1.45 లక్షల ఎకరాల ల్యాండ్ బ్యాంకు

సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల అభివృద్ధి ప్రణాళిక వివాదంలో చిక్కుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ (టీజీఐఐసీ) అధీనంలోని ఆస్తులపై ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. సంస్థ ఆస్తులను పూర్తి స్థాయిలో మదింపు చేయాలని నిర్ణయించింది. టీజీఐఐసీకి చెందిన భవనాలు, భూ భాగాల (ల్యాండ్ పార్సెల్స్) వివరాలను పూర్తిగా క్రోడీకరించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఆస్తుల విలువను లెక్కించి, భవిష్యత్తులో వాటి విలువను పెంచడం, వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు వినియోగించాల్సిన తీరుపైనా అధ్యయనం చేయనుంది. టీజీఐఐసీ ఆస్తులకు సంబంధించి సమగ్ర నివేదికలు రూపొందించే బాధ్యతను అనుభవం కలిగిన ప్రైవేటు కన్సల్టెన్సీలకు అప్పగించాలని నిర్ణయించారు. దీంతో కన్సల్టెన్సీలను ఎంపిక చేసే ప్రక్రియకు టీజీఐఐసీ శ్రీకారం చుట్టింది. ప్రైవేటు కన్సల్టెన్సీలు ఈ నెల 22లోగా ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) దాఖలు చేయాలని కోరింది.



1.45 లక్షల ఎకరాల ల్యాండ్ బ్యాంకు

రాష్ట్రంలో పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన, పారిశ్రామిక పార్కుల అభివృద్ధి, వాటి నిర్వహణలో టీజీఐఐసీకి కీలక పాత్ర. హైదరాబాద్ కేంద్ర కార్యాలయంతో పాటు రాష్ట్రంలోని 9 జోనల్ కార్యాలయాల పరిధిలో సుమారు 190కి పైగా పారిశ్రామిక పార్కులను టీజీఐఐసీ అభివృద్ధి చేసింది. ఈ పార్కుల పరిధిలో వివిధ అవసరాల కోసం 5,730 ఎకరాలు కేటాయింపులకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. భవిష్యత్ అవసరాల కోసం టీజీఐఐసీ వద్ద సుమారు 1.45 లక్షల ఎకరాల ల్యాండ్ బ్యాంకు ఉంది. ఈ భూముల విలువ, వాటి స్థితిగతులను సంపూర్ణంగా అధ్యయనం చేయాలని టీజీఐఐసీ నిర్ణయించింది. భవిష్యత్తు పారిశ్రామిక అవసరాలు, ఇతర అభివృద్ధి పనుల కోసం ఈ భూములను ఎలా ఉపయోగించాలనే అంశంపై కూడా కన్సల్టెన్సీలు టీజీఐఐసీకి మార్గదర్శనం చేయాల్సి ఉంటుంది. భూములకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు ఇన్ఫర్మేషన్ మెమోరాండం (పీఐఎం)ను కన్సల్టెన్సీలు సిద్ధం చేయాల్సి ఉంటుందని ఎల్‌ఓఐ నోటిఫికేషన్‌లో టీజీఐఐసీ పేర్కొంది.

అందించాల్సిన సేవలు ఇవే..

టీజీఐఐసీ ఎంపిక చేసిన కన్సల్టెన్సీ ప్రధానంగా భూములు, భవనాల విలువను లెక్కించడంతోపాటు వాటి సమగ్ర లావాదేవీలకు అవసరమైన సేవలు అందించాల్సి ఉంటుంది. లే ఔట్ తయారీ, కన్వర్షన్, భూ వినియోగ అనుమతుల సాధన, పీఐఎం తయారీ వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది. అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టేందుకు అనువైన భూభాగాలు గుర్తించాలి. సదరు భూభాగాలను సరిహద్దులు, వాటిని చేరుకునే మార్గాలు, మౌలిక వసతులపై నివేదికలను సైట్ మ్యాప్‌లతో పాటు తయారు చేయాలి. ఆ భూములపై ఉన్న న్యాయపరమైన చిక్కులు, జోనింగ్ చేయడంలో ఉన్న ఇబ్బందులు, ల్యాండ్ టైటిల్, ఈసీలు, కోర్టు కేసులు, ఇతర వివాదాలను అధ్యయనం చేయాలని పేర్కొంది.

మార్కెటింగ్ అవకాశాల మదింపు

టీజీఐఐసీ భూములను మార్కెటింగ్ చేసేందుకు ఉన్న అవకాశాలను కూడా మదింపు చేయాలని నిర్ణయించారు. మెట్రో, హై వేలు, స్మార్ట్‌సిటీ వంటి ప్రభుత్వ పెట్టుబడితో చేపట్టే ప్రాజెక్టులు, ప్రైవేటు సంస్థల పెట్టుబడుల సమీపంలోని టీజీఐఐసీ భూముల విలువ పెరుగుదలపై చూపించే ప్రభావాన్ని కూడా అంచనా వేయాలి. సదరు టీజీఐఐసీ భూములు కమర్షియల్, రెసిడెన్షియల్ లేదా ఏవైనా సంస్థల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నాయా అనే కోణంలోనూ కన్సల్టెన్సీలు నివేదించాల్సి ఉంటుంది.

22న ఛత్తీస్‌గఢ్‌కు మంత్రి ఉత్తమ్

- ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్ సాయితో రాయ్‌పూర్‌లో భేటీ
- సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు నిరభ్యంతర పత్రం కోసం ప్రయత్నం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 22న ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో రాయ్‌పూర్‌లో సమావేశం కానున్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు అనుమతుల విషయంలో ఈ నెల 25న కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) కీలక సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ఆలోగా ప్రాజెక్టుకు నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయాలని ఛత్తీస్‌గఢ్ సీఎంకు ఉత్తమ్ విజ్ఞప్తి చేయనున్నారు. ములుగు జిల్లాలో గోదావరిపై తుపాకులగూడెం వద్ద నిర్మిస్తున్న సమ్మక్క సాగర్ బరాజ్ పనులు 95 శాతం పూర్తయ్యాయి. బరాజ్‌లో పూర్తిస్థాయి నిల్వమట్టం 83 మీటర్ల మేర నీటిని నిల్వ చేస్తే పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురికానున్న భూములకు న్యాయమైన పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని విష్ణుదేవ్ సాయికి మంత్రి ఉత్తమ్ హామీ ఇవ్వనున్నారు.

హరీశ్ ప్రచారంలో నిజం లేదు: ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ నిర్మాణానికి సంబంధించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చేస్తున్న ప్రచారంలో నిజం లేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణ పనులను పునరుద్ధరించాలని నిర్ణయించిన మాట వాస్తవమేనని అయితే తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించే బరాజ్‌కు అయ్యే వ్యయం, తద్వారా ఆయకట్టు అంశంపై కసరత్తు ఇంకా ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. బరాజ్ అంచనాలు అంటూ.. హరీశ్‌రావు ఎలా నిర్ధారణకు వచ్చారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా పని చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

ఏ పార్టీలో ఉన్నానో స్పీకర్ తేలుస్తారు

- స్పీకర్ నోటీస్ ముట్టింది... రిప్లై ఇచ్చేందుకు సమయం ఉంది
- స్పీకర్ నిర్ణయం తర్వాత రాజకీయ భవిష్యత్‌పై నిర్ణయం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సాక్షి ప్రతినిధి, వరంగల్: పార్టీ ఫిరాయింపుల అంశంపై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం హనుమకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ఏ పార్టీలో ఉన్నానో స్పీకర్ తేలుస్తారని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. బీఆర్ఎస్ ప్రతిపక్షానికే పరిమితమవడంతో ప్రజలకు తాను ఇచ్చిన హామీలు, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆందోళన చెందానని.. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి తనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారని చెప్పారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా అని అడగ్గా ముందే చెబితే ఏం కిక్, మజా ఉంటుందని. సమయం వచ్చినప్పుడు చెబుతానని చెప్పుకొచ్చారు. పార్టీ ఫిరాయింపుల విషయంలో తనకు స్పీకర్ నోటీస్ ముట్టిందని.. అయితే రిప్లై ఇచ్చేందుకు ఇంకా సమయం ఉందని కడియం పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు స్పీకర్‌కు సమాధానం పంపుతానని చెప్పారు. స్పీకర్ నిర్ణయం ప్రకారం నడుచుకుంటానని, ఆ తర్వాతే రాజకీయ కార్యాచరణను ప్రకటిస్తానని స్పష్టం చేశారు.

నాడు 36 మందిని బీఆర్ఎస్‌లో చేర్చుకోలేదా?

పార్టీ ఫిరాయింపులకు ఆద్యుడు కేసీఆర్ అని, పదేళ్ల కాలంలో 36 మందిని ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేర్చుకొని ఇద్దరిని మంత్రులను కూడా చేశారని కడియం శ్రీహరి గుర్తుచేశారు. 36 మందిలో ఒక్కరితోనూ రాజీనామా చేయించకుండా ఇప్పుడు తమపై సుప్రీంకోర్టు వరకు వెళ్లారని విమర్శించారు. వారు చేస్తే సంసారం.. ఇతరులు చేస్తే వ్యభిచారమా? అని ఆయన ప్రశ్నించారు. రాజకీయాలను భ్రష్టుపట్టించిన కేసీఆర్.. చివరకు ఫామ్‌హౌస్‌కు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. కొందరు నాయకులు సభ్యత, సంస్కారం మరిచి తనపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని పరోక్షంగా మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. కానీ తనకు సభ్యత ఉన్నందున వారిలా మాట్లాడలేనని చెప్పారు.

ఏ దేశం కూడా జీఎస్టీని ఇంతగా తగ్గించలేదు

బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలో జీఎస్టీకి సంబంధించిన శ్లాబులను ఎప్పుడూ ఏ దేశం కూడా సవరించలేదని, ఇంత తక్కువగా ఏ దేశం కూడా తగ్గించలేదని బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు వల్ల కేంద్రానికి వచ్చే ట్యాక్స్ తగ్గిపోతుందని, అయినా ప్రభుత్వం సామాన్య ప్రజల లబ్ధికోసం సంచలన నిర్ణయం తీసుకుందని అన్నారు. శుక్రవారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాలు నడిచేదే జీఎస్టీ, ఇతర పన్నుల మీద అని చెప్పారు. అయితే ఈ శ్లాబ్ రేట్ల తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతితో పాటు ధనికులకు కూడా ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. జీఎస్టీలో మార్పులు జరుగుతూనే ఉంటాయని, ఇంకా ఏవైనా వస్తువులపై ట్యాక్స్ తగ్గించాల్సి ఉంటే కేంద్రం తగ్గిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో జీఎస్టీని అమలు చేయాలని ఎన్నో ప్రయత్నాలు చేసినా సాధ్యపడలేదన్నారు. కానీ మోదీ ప్రధాని అయ్యాక రెండేండ్లకే అన్ని రాష్ట్రాలను ఒప్పించి అమలు చేశాక కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని విమర్శించారు. జీఎస్టీ ఎక్కువగా ఉన్నా, తక్కువగా ఉన్నా.. కాంగ్రెస్‌కు కడుపుమంటేనని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ప్రతీ విషయాన్ని రాజకీయం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. ప్రతి గ్రామంలో జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు. ఇన్ని రోజులు ప్రధాని మోదీ మణిపూర్ వెళ్లనందుకు ప్రతిపక్ష పార్టీలు ఏడ్చాయని, ఇప్పుడు వెళ్లినందుకు కూడా ఏడుస్తున్నాయని ఎద్దేవా చేశారు.

పండుగలొస్తే దండుకోవడమేనా?

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: పండుగల సమయాల్లో ఆర్టీసీ బస్సు చార్జీలను అడ్డగోలుగా పెంచి ప్రజల నడ్డి విరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో ఆర్టీసీ బస్సు చార్జీలను 50 శాతం పెంచడంపై శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు. పల్లె వెలుగు సహా అన్ని రకాల ఆర్టీసీ బస్సుల్లో టికెట్ ధరలు విపరీతంగా పెంచి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల ముక్కు పిండి చార్జీలు వసూలు చేయడం దుర్మార్గమన్నారు. తెలంగాణ ప్రజలకు పండుగ సంతోషాన్ని లేకుండా చేయడమే ప్రజా పాలనా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి బ్యారేజీకి గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు రూ.35 కోట్లు ఖర్చవుతుందని ప్రభుత్వం చేసిన ప్రకటనపై హరీశ్‌రావు మండిపడ్డారు.

బతుకమ్మ పండుగ ఏర్పాట్లు ఎక్కడ?

బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు లేవని, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. బతుకమ్మ పండుగ పూట కూడా వీధిదీపాలు వెలగక గ్రామాలు చీకట్లో ఉన్నాయని ఒక ప్రకటనలో విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ కంటే ఎక్కువ ఢిల్లీలో ఉంటూ పాలన గాలికి వదిలేశారన్నారు. గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్లకు డీజిల్ పోయించే డబ్బులు లేక మూలన పడేసే దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. రహదారులు, డ్రైనేజీలు మరమ్మతులు లేక తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఆల్మట్టి ఎత్తు పెంపుతో తెలంగాణకు మరణ శాసనం

- దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చేందుకు కర్ణాటక కాంగ్రెస్ కుట్ర
- మహారాష్ట్ర సీఎం స్పందించినా రేవంత్‌లో చలనం కనిపించడం లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచి తెలంగాణ రైతాంగానికి మరణ శాసనం రాస్తుంటే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో జల్సాలు చేస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తును 519 అడుగుల నుంచి 524 అడుగులకు పెంచాలని మూడు రోజుల కిందట కర్ణాటక మంత్రిమండలి నిర్ణయం తీసుకున్నా, దున్నపోతు మీద వాన పడ్డట్టుగా రేవంత్ వ్యవహరిస్తున్నారన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కును బొందపెట్టి ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలను ఎడారులుగా మార్చేందుకు కర్ణాటక కాంగ్రెస్ సర్కారు కుట్ర పన్నిందని చెప్పారు. రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా రేవంత్‌కు నిలదీసే దమ్ము లేదన్నారు. ఈ మేరకు శుక్రవారం కేటీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆల్మట్టి ఎత్తు పెంచితే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా మారుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఆ పథకం నిర్వీర్యం అవుతుంటే పాలమూరు బిడ్డగా చెప్పుకునే రేవంత్ చూస్తూ ఊరుకోవడం దారుణమన్నారు. కర్ణాటక నుంచి కృష్ణా నీళ్లు రాకపోతే జూరాల ప్రాజెక్టు కూడా నిండదని, తద్వారా రేవంత్ ప్రభుత్వం మొదలుపెట్టిన నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం కూడా పడావు పడుతుందని కేటీఆర్ హెచ్చరించారు.

అక్కడ భూ సేకరణకే రూ.70 వేల కోట్లు

‘ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపు కోసం రూ.70 వేల కోట్లతో 1.30 లక్షల ఎకరాల భూమిని సేకరిస్తామని కర్ణాటక ప్రభుత్వం చెబుతోంది. ఈ లెక్కన 40 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే కాళేశ్వరం ప్రాజెక్టును రూ.93 వేల కోట్లతో నిర్మించడంలో తప్పు ఏంటో చెప్పాలి. కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై సుప్రీంకోర్టుకు వెళతామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ స్పందించారు. కానీ రేవంత్ మాత్రం ఇంకా మొద్దు నిద్ర వీడటం లేదు. మహారాష్ట్ర మద్దతు కూడగట్టుకొని సుప్రీంలో పోరాడాల్సిన బాధ్యత తెలంగాణ ముఖ్యమంత్రిపై ఉంది. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రను అడ్డుకోకపోతే రైతులతో కలిసి మహోద్యమాన్ని నిర్మిస్తాం’ అని కేటీఆర్ హెచ్చరించారు.

ఎవరి బలం ఏంటో ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం

పార్టీ మారిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలి: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపు రాజకీయాలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని, సరైన సమయంలో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఓట్ చోరీపై గొంతు చించుకుంటున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ.. తెలంగాణలో తమ పార్టీ చేసిన ఎమ్మెల్యేల చోరీపై ఏం సమాధానం చెబుతారని శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. దమ్ము, ధైర్యం ఉంటే, పార్టీ మారిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి, ఉప ఎన్నికలకు వెళ్లాలన్నారు. ఎవరి బలం ఏంటో ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామని చెప్పారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించకుండా రాహుల్‌గాంధీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు అనిపిస్తుందన్నారు. ఓట్ల చోరీ నేరమైతే, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను దొంగిలించడం అంతకంటే పెద్ద నేరమని తెలిపారు. రాహుల్‌కు సిగ్గు, శరం ఉంటే బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అప్పుడే ఆయనకు ఓట్ల చోరీ గురించి మాట్లాడే నైతిక అర్హత ఉంటుందని కేటీఆర్ అన్నారు.

మంత్రి వివేక్ వెంకటస్వామిపై ఫిర్యాదు సత్యదూరం: మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: సహచర మంత్రి వివేక్ వెంకటస్వామిపై తాను సీఎంఓలో ఫిర్యాదు చేసినట్టు పత్రికల్లో వచ్చిన వార్త సత్యదూరమని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. అలాంటిదేమీ జరగలేదని ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. కాగా సచివాలయంలో అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించడంపై కొండా సురేఖకు మంత్రి వివేక్ వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ వివాదాన్ని ఇంతటితో వదిలిపెట్టాలని ఇరువురు భావించినట్టు సమాచారం.

ఆల్మట్టి వ్యవహారం సుప్రీంకోర్టులో ఉంది

కర్ణాటక మంత్రివర్గ నిర్ణయం మేరకు అంతా జరిగిపోదు: చామల



సాక్షి, హైదరాబాద్: ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తును పెంచాలని కర్ణాటక మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నంత మాత్రాన అంతా జరిగిపోదని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ అంశం సుప్రీంకోర్టులో ఉందని, తెలంగాణ ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూసుకునేందుకు సుప్రీం కోర్టులో రాష్ట్రానికి ప్రత్యేకంగా న్యాయవాదులున్నారని ఆయన చెప్పారు. అక్కడి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఉంటుందని, కానీ కోర్టులో పెండింగ్‌లో ఉంది కాబట్టి ఏదో జరిగిపోతోందంటూ తెలంగాణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బనకచర్ల విషయంలోనూ బీఆర్ఎస్ ఇదే తరహాలో రాద్ధాంతం చేసిందని ఎద్దేవా చేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో హరీశ్‌రావు ఏకపాత్రాభినయం చేశారని, చంద్రబాబును బూచిగా చూపించి అబద్ధాలను ప్రచారం చేశారని విమర్శించారు. హరీశ్‌రావు చేసిన ఆ అభినయం పేలలేదని, అందుకే ఇప్పుడు ఆల్మటి విషయంలో మాజీ ఎంపీ వినోద్‌రావును తెరపైకి తెచ్చారని ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడా అలసత్వంతో ఉండదని చామల స్పష్టం చేశారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం : 20 : సెప్టెంబర్ : 2025


దిల్‌సుఖ్‌నగర్‌లో..

వణికించిన వాన

నగరాన్ని ఇటీవల సాయంత్రం, రాత్రి వేళల్లో వర్షం చిగురుటాకులా వణికిస్తోంది. శుక్రవారం రాత్రి సైతం వరుణుడు పలు ప్రాంతాల్లో విరుచుకుపడ్డాడు. నాగోల్ బండ్లగూడలో సుమారు 9.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

- సాక్షి, సిటీబ్యూరో



నిమ్స్‌లో వైద్యం.. అత్యాధునికం

రికార్డు స్థాయిలో రోబోటిక్ సర్జరీలు | ఇప్పటివరకు 650కుపైగా శస్త్ర చికిత్సలు

లక్డీకాపూల్: నగరంలోని నిమ్స్ ఆస్పత్రి అత్యాధునిక వైద్య చికిత్సల్లో ముందంజ వేస్తోంది. ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 650కుపైగా రోబోటిక్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేసింది. ఇందులో అత్యధికంగా యూరాలజీ విభాగంలోనే 370 మందికి చికిత్సలందించగా, గ్యాస్ట్రోఎంటరాలజీ, అంకాలజీ వంటి విభాగాల్లోనూ ఈ తరహా చికిత్సలు అందిస్తున్నారు. దీని కోసం 20 మంది వైద్యులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. కార్పొరేట్‌లో రూ.లక్షల్లో అయ్యే చికిత్సలు నిమ్స్‌లో ఆరోగ్యశ్రీ కార్డుతో ఉచితంగానే అందిస్తున్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్న నిమ్స్ ఆసుపత్రికి వైద్య ఖర్చుల కింద సీఎంఆర్‌ఎఫ్, ఆరోగ్య శ్రీ తదితర పథకాల్లో రోబోటిక్ సర్జరీలకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది.

యూరాలజీలో ప్రత్యేక గుర్తింపు..

నగరంలో యూరాలజీ సంబంధిత కేసులకు నిమ్స్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇతర ఆసుపత్రులతో పోల్చితే యూరాలజీ క్రిటికల్ కేసులంటే నిమ్స్ అనే స్థాయికి వచ్చిందని ఆసుపత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, గాల్‌బ్లాడర్, కేన్సర్ తదితర విభాగాల్లోనూ విరివిగా రోబోటిక్ సర్జరీలు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ సహకారంతోనే..



వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న ఉత్తమ చికిత్సా విధానాలను అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. నిమ్స్ క్లినికల్ ఫలితాలను మెరుగుపరుస్తోంది. ఇతర ఆసుపత్రులకు రోల్‌మోడల్‌గా నిలుస్తోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో సహకారం లభిస్తోంది.

- డా.నగరి బీరప్ప, నిమ్స్ డైరెక్టర్

అన్ని వర్గాలకూ భరోసా



రోబోటిక్ సర్జరీలు, నూతన విధానాలను ఎప్పటికప్పుడు సద్వినియోగం చేసుకుంటున్నాం. రోగికి కచ్చితత్వంతో చికిత్స అందించడం, తక్కువ నొప్పి, వేగంగా కోలుకునే అవకాశాలను ఎంపిక చేసుకుంటున్నాం. పేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం నిమ్స్‌లో లభిస్తోంది.

- ప్రొ.రాహుల్ దేవ్ రాజ్, నిమ్స్ యూరాలజీ విభాగం హెచ్‌ఓడీ

రోజా నవ్వుల పూజా!



వర్ధమాన సినీతార పూజా హెగ్డే నగరంలో సందడి చేసింది. శుక్రవారం మాదాపూర్ ఇనార్బిట్ మాల్‌లో ఓ లైఫ్‌స్టైల్ షోరూంను ప్రారంభించింది. ఈ సందర్భంగా అభిమానులను ఆమె అలరించింది.

- సాక్షి, సిటీబ్యూరో

లండన్ బ్రిడ్జి పునరుద్ధరణ

పనులకు సిద్ధమవుతున్న జీహెచ్‌ఎంసీ

- అంచనా వ్యయం రూ.2.95 కోట్లు



సాక్షి, సిటీబ్యూరో: దీని పేరు లండన్ బ్రిడ్జి. కానీ ఇది ఉన్నది మాత్రం పాతబస్తీ యాకుత్‌పురా నియోజకవర్గంలో. ముర్కి నాలా మీద నిర్మించిన ఈ బ్రిడ్జి.. ఎస్సార్టీ కాలనీ, మదీనా నగర్ ప్రాంతాల మధ్య వారధిగా ఉంది. ఎంతో కాలం క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి దెబ్బతింది. ప్రతి రోజూ వేలాదిమంది రాకపోకలు సాగిస్తారు. ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ బ్రిడ్జి నుంచి రైల్వే బ్రిడ్జి వరకు పక్కనే ఉన్న నాలా రిటైనింగ్ వాల్ సైతం దెబ్బతింది. దీనివల్ల కూడా ప్రమాదాలకు ఆస్కారం ఉంది. ముఖ్యంగా, వర్షాకాలంలో పొంగిపొర్లే వరదనీటితో పరిసర ప్రాంతాల ప్రజలకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. ప్రమాదాలు జరగకముందే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా, బ్రిడ్జిని పునర్నిర్మించాల్సిందిగా స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ చేసిన విజ్ఞప్తి మేరకు జీహెచ్‌ఎంసీ మెయింటనెన్స్, ప్రాజెక్ట్స్ విభాగాల చీఫ్ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్రిడ్జిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని గుర్తించారు. పునరుద్ధరణ పనులకు దాదాపు రూ. 2.95 కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. డీటైల్ డిజైన్, ఎస్టిమేషన్, ఇన్వెస్టిగేషన్ పనుల కోసం కన్సల్టెంట్ నియామకానికి సిద్ధమయ్యారు. నిర్మాణాన్ని పేరుకు తగ్గట్లుగా చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రెండు వైపులా అప్రోచెస్ సహా పనులు చేసేందుకు సిద్ధమయ్యారు. మేజర్ వరద కాలువల అభివృద్ధి పనుల పద్దు కింద జీహెచ్‌ఎంసీ నిధులతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఆమోదం కోసం స్టాండింగ్ కమిటీ ముందుంచుతున్నారు. వచ్చే మంగళవారం జరగనున్న స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం లభించగానే వెంటనే పనులు ప్రారంభించనున్నారు.

మరికొన్ని పనులు

- అల్వాల్ సర్కిల్‌లో చిన్నరాయుని చెరువు నుంచి దినకర్‌నగర్ వరకు రూ.2.95 కోట్లతో బాక్స్ డ్రెయిన్ నిర్మాణం, రూ.4.85 కోట్లతో మల్లేపల్లి ఫుట్ బాల్ గ్రౌండ్ ఆధునీకరణ, తదితర పనుల్ని కూడా ఆమోదం కోసం స్టాండింగ్ కమిటీ ముందుంచుతున్నారు.
- కార్పొరేటర్ల కుటుంబాలకు మెడికల్ ఇన్సూరెన్స్‌ను వారి పదవీ కాలమున్న వచ్చే ఫిబ్రవరి వరకు పొడిగిస్తూ కమిషనర్ తీసుకున్న నిర్ణయానికి, వర్షాకాలంలో అవసరమైన చర్యల కోసం జీహెచ్‌ఎంసీ నుంచి హైడ్రాకు వెంటనే రూ.20 కోట్లు విడుదల చేసేందుకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలపనుంది.

మెట్రో.. దారి ఎటో!

- ఎలాంటి కదలిక లేని ప్రాజెక్ట్
- వివిధ అంశాలపై కుదరని సయోధ్య
- మొదటి దశ నుంచి వైదొలగితే నిర్వహణ ఎలా?

ఎండీ మార్పుతో రెండో దశ పట్టాలెక్కేనా!!

సాక్షి, సిటీబ్యూరో

మెట్రో ప్రాజెక్టు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఒకవైపు మొదటి దశకు సంబంధించి నష్టాలను భరించలేక నిర్వహణ బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు ఎల్‌అండ్‌టీ ప్రకటించింది. మరోవైపు రెండో దశ విషయంలో కేంద్రం నుంచి ఇప్పటివరకూ అనుమతి లభించలేదు. పైగా ఇప్పట్లో ఆ అవకాశం కూడా లేదు. మొదటి దశ రైలు మార్గాలపై సమన్వయం కుదిరే వరకు ఈ ప్రతిష్టంభన ఇలాగే కొనసాగే అవకాశం ఉంది. దీంతో వచ్చే ఎన్నికల నాటికి కూడా పట్టుమని పది కిలోమీటర్ల లైన్‌లు నిర్మాణమయ్యే దాఖలాలు కనిపించడం లేదు. ఒకవైపు మెట్రోను వదులుకొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ ప్రకటించిన వెంటనే హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆ బాధ్యతల నుంచి తప్పించి హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. మెట్రో రైల్ నిర్మాణదశ నుంచి ఇటీవల వరకు సుమారు 18 సంవత్సరాల పాటు ఈ రంగంలో అపారమైన అనుభవాన్ని ఆర్జించిన ఎన్వీఎస్ హైదరాబాద్ మెట్రోమ్యాన్‌గా గుర్తింపును పొందారు.ఆ స్థాయిలో అనుభవాన్ని సంపాదించడానికి ప్రస్తుత ఎండీకి కొంత సమయం పట్టవచ్చు. పైగా ఆయనకు ఈ బాధ్యత అనేక సవాళ్లతో కూడుకొని ఉంది. సకాలంలో ఈ సవాళ్లను అధిగమించి రెండో దశ ప్రాజెక్టును పట్టాలెక్కించడం అంత సులువు కాకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

రెండు దశలు 'లింక్' అయ్యేనా..

- రెండో దశపై కేంద్రం లేవనెత్తిన ప్రశ్నలతోనే తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి. మొదటి దశలోని 69 కి.మీ. అలైన్‌మెంట్‌కు కొనసాగింపుగానే ప్రభుత్వం వివిధ దశల్లో రెండోదశ విస్తరణకు ప్రణాళికలను రూపొందించింది. ఈ క్రమంలో ప్రైవేట్ సంస్థ అయిన ఎల్‌అండ్‌టీ నిర్వహణలో ఉన్న మొదటిదశకు, ప్రభుత్వమే చేపట్టి నిర్వహించనున్న రెండో దశకు సమన్వయం ఎలా ఉంటుందని కేంద్రం ప్రశ్నించింది. ఆదాయ, వ్యయాలు, రైళ్ల నిర్వహణ, విద్యుత్ వినియోగం, టికెట్ చార్జీల పంపకాలు వంటి అంశాలను ప్రస్తావించింది. ఈ క్రమంలో సమన్వయం సన్నద్ధతను తెలియజేయాల్సిన ఎల్‌అండ్‌టీ అందుకు భిన్నంగా ప్రాజెక్టు నుంచి తప్పుకొనేందుకే సిద్ధంగా ఉన్నట్లు సంచలన ప్రకటన చేసింది.
- తీవ్ర నష్టాల్లో ఉన్నట్లు మొదటి నుంచి ఆ సంస్థ ప్రతినిధులు చెబుతూనే ఉన్నారు. అదే నష్టాలను ప్రధాన సాకుగా చూపుతూ ప్రాజెక్టును వదిలించుకోనున్నట్లు పేర్కొంది. దీంతో మొత్తం రెండు దశల మెట్రో భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. మొదటి దశ నిర్వహణ కోసం ప్రభుత్వం ఎల్‌అండ్‌టీతో బేరసారాలు, బుజ్జగింపుల పర్వాన్ని కొనసాగించనుందా? లేక ప్రత్యేకంగా స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ)ని ఏర్పాటు చేసి రెండో దశల నిర్వహణకు అప్పగించనుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ అలాంటి ఎస్పీవీకి సానుకూలమైతే తిరిగి ఏదో ఒక ప్రైవేట్ సంస్థను ఎంపిక చేయాల్సిందే. కానీ.. మెట్రో నిర్మాణంలో, నిర్వహణలో అపారమైన అనుభవం ఉన్న ఎల్‌అండ్‌టీ స్థాయి సంస్థలు లేవనేది నిర్వివాదమైన అంశం. ఈ క్రమంలో ఎస్పీవీ ఏర్పాటు కూడా ఏ మాత్రం తేలికైన వ్యవహారం కాదు.



చెల్లింపులు ఎలా..?

- నిధుల కొరత మరో సవాల్‌గా నిలిచింది. రెండో దశ కోసం అంతర్జాతీయ సంస్థల నుంచి పెద్ద ఎత్తున రుణాలను సేకరించాలనేది ప్రభుత్వ యోచన. కేంద్రం ఈ ప్రాజెక్టును ఆమోదించి తన వాటా నిధులు ఇచ్చినా, ఇవ్వకపోయినా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలంటే జైకా వంటి అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాలను సేకరించాల్సిందే. రెండో దశలో 'ఎ' విభాగం కింద ప్రతిపాదించిన 76.4 కి.మీ.లకు సుమారు రూ.24,269 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా. 'బి' విభాగం కింద ప్రతిపాదించిన మూడు మార్గాల్లో అంటే సుమారు 85 కి.మీ. మరో 19వేల కోట్లకు పైగా ఖర్చుకానుంది. ఇదే సమయంలో మొదటి దశ మెట్రో నిర్వహణ నుంచి ఎల్‌అండ్‌టీ వైదొలిగితే ఆ సంస్థకు దాదాపు రూ.6500 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.
- ఇటు మొదటి దశ చెల్లింపులకు, అటు రెండో దశ నిర్మాణానికి నిధుల సేకరణ మరో సవాల్‌గా మారనుంది. ప్రస్తుతం పాతబస్తీలో రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5.కి.మీ.మార్గంలో మెట్రో నిర్మాణ పనులను చేపట్టి ఎన్నికలకు వెళ్లాలని భావించిన అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుత పరిణామాలతో మింగుడుపడని పరిస్థితి నెలకొంది. అంతా అనుకున్నట్లు జరిగితే నాగోల్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు అక్కడి నుంచి ఫ్యూచర్ సిటీ వరకు రెండోదశలో మొదట మెట్రో నిర్మాణం చేపట్టి మార్కులు కొట్టేయాలని భావించిన ప్రభుత్వ పెద్దలు ఈ సవాళ్లన్నింటినీ అధిగమించడం ఏ మాత్రం ఆషామాషీ వ్యవహారం కాదని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే మెట్రో భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది.

బాచుపల్లిలో బోసిపోయి..

హెచ్‌ఎండీఏ భూములకు స్పందన శూన్యం

- తుర్కయంజాల్‌లో కేవలం 2 ప్లాట్‌లకే బేరం

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ భూములపై కొనుగోలుదారులు విముఖత చూపారు. బాచుపల్లిలో మొత్తం 70 ప్లాట్‌లకు ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించగా ఒక్క ప్లాట్ కూడా విక్రయించలేకపోయారు. తుర్కయంజాల్‌లో 12 ప్లాట్‌లలో కేవలం 2 మాత్రమే అమ్ముడయ్యాయి. గజానికి రూ.6,5000 కనీస ధర నిర్ణయించగా రూ.1.15 లక్షలకు గజం చొప్పున ఒక ప్లాట్‌ను, రూ.7,5000కు గజం చొప్పున మరో ప్లాట్‌ను విక్రయించారు. బాచుపల్లిలో కనీసం బోణీ కూడా చేయలేకపోయినట్లు హెచ్‌ఎండీఏ అధికారులు విస్మయం వ్యక్తం చేశారు.



రూ.600 కోట్లకుపైగా ఆదాయం వస్తుందని..

సుమారు రెండేళ్ల విరామం తర్వాత భూముల అమ్మకాలకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) శ్రీకారం చుట్టింది. ఈ రెండు చోట్ల ఉన్న స్థలాలతో పాటు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా మిగిలిపోయిన స్థలాల అమ్మకాల ద్వారా దాదాపు రూ.600 కోట్లకు పైగా ఆదాయం లభిస్తుందని అంచనా వేశారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల పాటు ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించారు. ఇటు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నిర్మాణరంగానికి చెందిన సంస్థల నుంచి, అటు మధ్యతరగతి వర్గాల నుంచి స్పందన కనిపించలేదు. హెచ్‌ఎండీఏ ప్లాట్‌లు కొనుగోలు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేకపోయారు. ప్లాట్‌ల వేలానికి ముందు నిర్వహించిన ప్రీబిడ్డింగ్ సమావేశాల్లోనూ కొనుగోలుదారుల నుంచి స్పందన లభించకపోవడం గమనార్హం. ప్రస్తుతం మార్కెట్‌లో నెలకొన్న స్తబ్దత కారణంగా విక్రయించలేకపోయినట్లు అధికారులు తెలిపారు.

ధరలు ఎక్కువే..

రెండు చోట్ల హెచ్‌ఎండీఏ నిర్ణయించిన బేసిక్ ధరలపై మొదటి నుంచీ భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. తుర్కయంజాల్‌లో చదరపు గజానికి రూ.6,5000 చొప్పున ధర నిర్ణయించారు. ప్రస్తుత స్తబ్దత కారణంగా మార్కెట్ ధరల కంటే ఇవి ఎక్కువే. ప్రస్తుతం అక్కడ గజానికి రూ.40,000 నుంచి రూ.45,000 ధర ఉన్నట్లు అంచనా. కానీ.. హెచ్‌ఎండీఏ అధికారులు కనీస ధరలను అమాంతం పెంచారు. ఒక్కోప్లాట్ కనిష్టంగా 600 గజాల నుంచి 1,146 గజాల వరకు మొత్తం 12 ప్లాట్‌లు ఉన్నాయి. వీటి పరిమాణాలు నాలుగు వైపులా సమంగా లేకపోవడంతో కొనుగోలుదారులు ముందుకు రాలేదని తెలిసింది. బాచుపల్లిలోని స్థలాలకు గజానికి రూ.70,000 చొప్పున కనీస ధరను నిర్ణయించారు. కానీ.. స్థానికంగా ఉన్న మార్కెట్ ధరల కంటే ఎక్కువేననే అభిప్రాయం ఉంది. కనిష్ఠంగా 266.67 గజాల నుంచి గరిష్ఠంగా 499.96 గజాల వరకు ఈ ప్లాట్ సైజ్‌లు ఉన్నాయి. ఈ లే అవుట్‌కు సరైన అప్రోచ్ రోడ్ లేకపోవడం ఒక లోపమనే చెప్పాలి.

నిత్యం వేధిస్తున్నాడని భర్తను చంపేసింది

కూరగాయలు కోసే కత్తితో పొడిచిన భార్య


కృష్ణజ్యోతి బోరా మృతదేహం

మణికొండ: తనను తరచూ వేధిస్తున్నాడనే కోపంతో భర్తను కూరగాయలు కోసే కత్తితో పొడిచి చంపేసింది ఓ భార్య. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి కోకాపేటలో జరిగింది. నార్సింగి ఇన్‌చార్జి సీఐ రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రానికి చెందిన కృష్ణంజ్యోతి బోరా (30), బర్క బోరా భార్యాభర్తలు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి కోకాపేటలోని ఓ నిర్మాణ సంస్థలో పని చేస్తున్నారు. వారం రోజుల క్రితం భార్యను కొట్టి ఆమెతో గొడవ పడి ఇంట్లోంచి కృష్ణంజ్యోతి వెళ్లిపోయాడు. గురువారం అర్ధరాత్రి మద్యం మత్తులో వచ్చి తలుపులు కొట్టినా ఆమె తీయలేదు. తలుపులను కృష్ణంజ్యోతి బలంగా తన్నటంతో ఇద్దరి మధ్యా గొడవ జరిగింది. బర్క బోరాను కర్రతో కొట్టేందుకు యత్నించగా.. ఆమె పక్కనే ఉన్న కూరగాయలు కోసే కత్తితో అతనిపై దాడి చేసింది. తల, మెడ, కుడి భుజంపై కత్తితో పొడవటంతో కృష్ణంజ్యోతికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి అరుపులు వినిపించడటంతో లేబర్ క్యాంపులో ఉన్న చుట్టు పక్కల వారు వచ్చి చూసే సరికి అతను రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు నిందితురాలు బర్క బోరాని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు సురుకుబెట్టాలే

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

శ్రీనగర్‌కాలనీ: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 420 వాగ్దానాల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన ఎర్రగడ్డ డివిజన్ ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడపిల్ల పెళ్లికి తులం బంగారం ఇస్తామని, అమ్మాయిలు బడి పోయేందుకు స్కూటీ ఇస్తామన్న కాంగ్రెస్ వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. స్కూటీలు లేవు గానీ లూటీ మాత్రం జోర్దార్‌గా నడుస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని బస్తీల్లో హైడ్రా వచ్చి ఎప్పుడు ఇళ్లు కూలగొడుతుందోననే భయంతో స్థానికులు జీవిస్తున్నారని చెప్పారు. 24 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం గరీబోళ్ల ఇళ్లు కూలగొట్టుడు తప్ప ఏమి చేసిందని ప్రశ్నించారు. కూకట్‌పల్లిలో బుచ్చమ్మ అనే మహిళ.. తన ఇల్లు కూలగొడతారనే భయంలో ఉరి వేసుకొని చనిపోయిందని, ఆమెకు వచ్చిన కష్టం ఏ ఆడబిడ్డకు రాకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఏ ఆడబిడ్డకూ కష్టం కలిగించలేదని, లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్‌కు సురుకు పెట్టుడు ప్రారంభం కావాలంటే అది జూబ్లీహిల్స్ ఎన్నికతోనే జరగాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. చివరిశ్వాస వరకూ ప్రజాసేవలో ఉన్న మాగంటి గోపీనాథ్ కుటుంబానికి కార్యకర్తలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మాగంటి సునీత మాట్లాడుతూ.. కార్యకర్తలు బీఆర్‌ఎస్‌కు భారీ విజయాన్ని అందించి మాగంటికి నివాళిగా అందించాలని కోరారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ దేదీప్య, ఎర్రగడ్డ డివిజన్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

గ్రే స్పాట్లే కీలకం!

- గుర్తించి చర్యలు తీసుకుంటేనే ఫలితాలు
- పోలీసులకు రోడ్డు భద్రతా నిపుణుల సూచన



ప్రమాదాలు జరిగేవి బ్లాక్.. జరగబోయేవి గ్రే స్పాట్లు

సాక్షి, సిటీబ్యూరో: 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దేన్ క్యూర్' అనే నానుడిని రోడ్డు ప్రమాదాలకూ వర్తింపజేస్తూ బ్లాక్ స్పాట్స్‌తో పాటు గ్రే స్పాట్స్ గుర్తింపునకూ ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు నగర పోలీసులకు సూచించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు బ్లాక్ స్పాట్స్ కిందికి వస్తే.. ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉన్నవి గ్రే స్పాట్స్ అని వివరించారు. జలవిహార్‌లోని ఆడిటోరియంలో జరిగిన ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ సమ్మిట్–2025కు శుక్రవారం హాజరైన నిపుణులు ఈ మేరకు పలు కీలక సూచనలు చేశారు. వక్తలు ఏమన్నారంటే..

హైదరాబాద్, రాచకొండకూ విస్తరిస్తాం

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 42 మార్గాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి మా యాప్‌లోకి తీసుకువచ్చాం. వాటర్ లాగింగ్, ప్రమాదాలు, ఇతర ట్రాఫిక్ జామ్స్‌పై ఫొటోలతో సహా సమాచారం ఇస్తున్నాం. ప్రస్తుతానికి సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ఆ ప్రాంతంలోనే సేవలు చేస్తున్నాం. భవిష్యత్తులో హైదరాబాద్, రాచకొండలకు విస్తరిస్తాం.

- అర్చన, సీఎస్సార్ హెడ్, పల్స్ ట్రాఫిక్ యాప్

రెండు చోట్ల ఐరాస్తే ప్రాజెక్టు చేపట్టాం

గ్రీన్ స్పాట్స్‌ను గుర్తించడానికి ఐఐఐటీ హైదరాబాద్ అధీనంలోని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఐఎన్‌ఏఐ పని ప్రారంభించింది. దీనికోసం నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియాతో కలిసి ఐరాస్తే పేరుతో ప్రాజెక్టు చేపట్టాం. మహారాష్ట్రతో పాటు తెలంగాణలోనూ ఈ ప్రాజెక్టు చేపడతాం. ఇప్పటికే నాగ్‌పూర్‌లో నడుస్తోంది. త్వరలోనే హైదరాబాద్‌లోనూ అధ్యయనం చేస్తాం.

- కోనాల వర్మ, మాజీ సీఈఓ, ఐఎన్‌ఏఐ

ఒక్క ప్రాణం పోకుండా కాపాడొచ్చు

నిర్ణీత కాలంలో వరుసగా ప్రమాదాలు జరిగి, మరణాలు సంభవించిన తర్వాత అధ్యయనం చేసి ఆ ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తిస్తాం. అప్పటికే అక్కడ కొన్ని ప్రాణాలు పోయి ఉంటాయి. రహదారుల్లో ఉన్న ఇబ్బందికర ప్రాంతాల్లో భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఈ గ్రే స్పాట్స్‌ను గుర్తించి ముందే చర్యలు తీసుకుంటే ఒక్క ప్రాణం కూడా పోకుండా కాపాడవచ్చు.

- ముక్తి అద్వానీ, సీనియర్ ప్రిన్సిపుల్ సైంటిస్ట్, సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఢిల్లీ

విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలి..

ట్రాఫిక్, రోడ్డు భద్రత నిబంధనల అవగాహన విద్యార్థి దశ నుంచే పెంపొందించాలి. అత్యధిక రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలే ప్రధాన కారణం. మాది 100 కుటుంబాలు ఉన్న చిన్న గ్రామం. నా కుటుంబంలో ఒకరితో పాటు ఊరిలో పది మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. ఆ తొమ్మిది కుటుంబాల్లో ఉన్న చిన్నారుల చదువుల బాధ్యత తీసుకున్నా.

- బి.జనార్దన్‌రెడ్డి, మాజీ ఐఏఎస్, సర్వేజన ఫౌండేషన్

నేను పోలీసునైతే హెల్మెట్ నిబంధన వదిలేస్తా

హెల్మెట్ ధరించడం, ధరించకపోవడం అనేది వ్యక్తికి సంబంధించిన విషయం. దాని వల్ల అతడు మాత్రమే నష్టపోతాడు. అదే సిగ్నల్ జంపింగ్ వంటి తీవ్రమైన నేరాల వల్ల ఎదుటి వాళ్ల ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. నేను పోలీసునైతే హెల్మెట్ నిబంధన వదిలేస్తా. మిగిలిన వాటిపైనే ఎక్కువగా దృష్టి పెడతా.

- కవిత వేమూరి, ప్రొఫెసర్, ఐఐఐటీ హైదరాబాద్


వక్తలతో కొత్వాల్ ఆనంద్, ట్రాఫిక్ చీఫ్ జోయల్ తదితరులు

అక్రమ మద్యం పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 301 నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.15.85 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చెందిన సీఐలు చంద్రశేఖర్ గౌడ్, మహేష్, కోటమ్మలతోపాటు ఎస్సైలు శ్రీనివాస్, రూప సిబ్బంది కలిసి ఢిల్లీ నుంచి వచ్చే తెలంగాణ ఎక్స్‌ప్రెస్, బెంగుళూరు నుంచి వచ్చే కేఎస్‌ఆర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో తనిఖీలు నిర్వహించిన 73 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీదేవి లాడ్జిలోని 310 రూమ్‌లో మద్యం బాటిళ్లు ఉన్నాయనే సమాచారం మేరకు డీటీఎఫ్ సీఐ సౌజన్య టీం కలిసి దాడి చేసి 34 బాటిళ్లను స్వాధీనం చేసుకుంది. అల్పా హోటల్ ముందు మరో వ్యక్తి వద్ద 34 మద్యం బాటిళ్లను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.అలాగే అమీర్‌పేట్ సీఐ పటేల్ బానోత్ ఆధ్వర్యంలో ఎస్‌ఆర్ నగర్ న్యూబస్టాండ్‌లో నిర్వహించిన తనిఖీల్లో 22మద్యం బాటిళ్లను,కామారెడ్డిలో మరో 55 బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు.కర్ణాటక ప్రాంతానికి చెందిన డిఫెన్స్‌కు చెందిన 51 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ ఎస్టీఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.అల్మాస్‌గూడ ప్రాంతంలో మల్లికార్జున్ రెడ్డి, సింగారయ్య, సుబ్బయ్య, బద్రు అనే నలుగురు వ్యక్తులు అక్రమ మద్యం కలిగి ఉన్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు.

బ్లాక్ స్పాట్స్‌తో పాటు క్రైమ్ స్పాట్స్

ఈ రెండూ గూగుల్ మ్యాప్స్‌లోకి చేర్చే ఆలోచన

- స్థానిక యంత్రాంగాలతో కలిసి పని చేస్తాం
- ట్రాఫిక్ సమ్మిట్‌లో టెక్నికల్ లీడ్ అనల్ ఘోష్



సాక్షి, సిటీబ్యూరో: 'దేశంలోని 70 లక్షల కిలోమీటర్ల రోడ్డు మార్గాన్ని గూగుల్ మ్యాప్స్ మీదికి తీసుకువచ్చాం. వీటి ఆధారంగా ప్రతి రోజూ 2.5 లక్షల కిలోమీటర్లు వినియోగదారులు ప్రయాణిస్తున్నారు. మా సేవల్ని మరింత మెరుగుపరచడానికి అసరమైన చర్యలు తీసుకుంటున్నాం' అని గూగుల్ మ్యాప్స్ టెక్నికల్ లీడ్ అనల్ ఘోష్ పేర్కొన్నారు. జలవిహార్‌లోని ఆడిటోరియంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రెండు రోజుల ట్రాఫిక్ అండ్ సెక్యూరిటీ సమ్మిట్–2025 నిర్వహించారు. శుక్రవారం నాటి కార్యక్రమానికి వక్తగా హాజరైన అనల్ కీలకాంశాలు వెల్లడించారు. ఆ వివరాలు ఇలా...

ఏఐ వినియోగించి ఇరుకు రోడ్లకు చెక్...

ప్రస్తుతం గూగుల్ మ్యాప్స్‌ను వినియోగిస్తున్న వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్య ఇరుకైన రోడ్లు. అనేక మంది తమ కార్లలో అక్కడకు వెళ్లి వెనక్కు తిరిగి రావాల్సి వస్తోంది. దీనికి పరిష్కారంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగిస్తున్నారు. ఈ టూల్ మ్యాప్స్‌లో ఉన్న రహదారుల్లో రోడ్డు వెడల్పును లెక్కించి, ఏ తరహా వాహనాలకు పరిమితమో సూచిస్తుంది. గూగుల్ మ్యాప్స్‌లో తొలుత టూ వీలర్ మోడ్ ఉండేది కాదు. దాన్ని తొలుత భారత్‌లోనే ప్రారంభించి.. ఫలితాల ఆధారంగా ఇతర దేశాలకు విస్తరించారు. ఈ ఏఐ వినియోగాన్నీ ఇక్కడే ప్రారంభించి ఆపై ఇతర దేశాలకు తీసుకువెళ్తారు.

నగర పోలీసులతో కలిసి ప్రాజెక్ట్ గ్రీన్‌లైట్...

నగరంలోని వాహనచోదకులు ఉత్తమ సేవలు అందించడానికి హైదరాబాద్ పోలీసులతో కలిసి గూగుల్ మ్యాప్స్ సంస్థ ప్రాజెక్ట్ గ్రీన్‌లైట్ చేపట్టింది. ఏఐను వినియోగించుకుంటూ వాహనచోదకులకు అనునిత్యం రియల్‌టైమ్ ట్రాఫిక్ అప్‌డేట్స్ ఇవ్వడం దీని ముఖ్య ఉద్దేశం. భవిష్యత్తులో ఈ డేటాను విశ్లేషించడం ద్వారా ట్రాఫిక్ జామ్స్‌ను ముందే చెప్పగలగటంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలను సూచించేలా మ్యాప్స్‌ను అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ వెహికిల్స్ శకం నడుస్తోంది. వీటి చోదకుల కోసం దేశ వ్యాప్తంగా ఉన్న 10 వేల ఈవీ చార్జింగ్ స్టేషన్ల లోకేషన్స్‌ను మ్యాప్‌లోకి తీసుకువచ్చారు.

ఆ రెండూ చేర్చేందుకు యోచిస్తున్నాం...

ప్రస్తుతం గూగుల్ మ్యాప్స్‌లోకి రహదారుల పక్కన ఉన్న పెద్ద భవనాల వివరాలు మానవ ప్రమేయం లేకుండా శాటిలైట్ ఫొటోల ఆధారంగా అప్‌డేట్ అయిపోయే పరిజ్ఞానం అభివృద్ధి చేశారు. తరచు ప్రమాదాలు చోటు చేసుకునే బ్లాక్ స్పాట్స్‌తో పాటు నేరాలు జరిగే ప్రాంతాల వివరాలను మ్యాప్స్‌లో పొందుపరచాలని, మహిళలకు సురక్షితం కాని ప్రాంతాలను వాటిలో గుర్తించాలని ట్రాఫిక్ సమ్మిట్‌లో కొందరు అనల్‌కు సూచించారు. ఈ రెండూ వీటిని అమలు చేయడానికి స్థానిక యంత్రాంగాలతో కలిసి పని చేయాలని యోచిస్తున్నాం. ఈ ప్రాంతాలకు సమీపంలోకి వచ్చిన వారికి అలెర్ట్స్ వచ్చే విధంగానూ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయనున్నామని ఆయన ప్రకటించారు.

ఆర్టీసీ బస్సుల సమాచారం ఇచ్చే ప్రయత్నం...

గూగుల్ మ్యాప్స్‌లోకి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు సంబంధించిన రియల్ టైమ్ సమాచారం తీసుకువస్తున్నారు. అంటే ఆయా వాహనాలు, రైళ్లు ఎక్కడ ఉన్నాయి? ఏ సమయంలో ఎక్కడకు చేరుకుంటాయి? తదితర వివరాలు వినియోగదారులకు అందుబాటులో ఉంటాయి. ఇప్పటికే రైల్వేల సహకారంతో 'వేర్ ఈజ్ మై ట్రైన్' ఫీచర్ మ్యాప్స్‌లో ఉంది. మెట్రో రైళ్ల రాకపోకల వివరాలను పొందుపరుస్తున్నారు. అత్యధిక జనాభా వినియోగించే ఆర్టీసీ బస్సుల రాకపోకలు, సమయాలను మ్యాప్స్‌లోకి తీసుకురావాలని గూగుల్ నిర్ణయించింది. దీని కోసం ఆర్టీసీతో సంప్రదింపులు జరుపనుంది.

నేడు గాంధీలో సదస్సు

గాంధీఆస్పత్రి: గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలోని అలుమ్నీ ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఈనెల 20,21 తేదీల్లో ఏఓఐ–టీజీ–కాన్–2005 రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులపై అత్యాధునిక చికిత్స విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శస్త్రచికిత్స సాంకేతికత, తాజా పరిశోధనలు, నూతన టెక్నాలజీ, ఆధునిక వైద్యయంత్రాలు, వైద్య రంగంలో జరుగుతున్న విప్లవాత్మక మార్పులపై నిష్ణాతవైద్యులు విశ్లేషణాత్మక ప్రసంగాలు చేయనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు డాక్టర్ ఆనందఆచార్య, జేబీఎస్ రాథోడ్, సాగర్‌లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ పేరుతో మోసం..

బంజారాహిల్స్: సీఎం రిలీఫ్ ఫండ్ కింద లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను నకిలీల పేరుతో సరిచూసుకొని మోసం చేయడానికి ప్రయత్నించిన ఘటనలో ఏడుగురిని జూబ్లీహిల్స్ పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను తమ వ్యక్తిగత బ్యాంకు ఖాతాలలో జమ చేసుకొని మొత్తం రూ. 8.71 లక్షలు విత్‌డ్రా చేసి ప్రభుత్వాన్ని, అర్హులైన పేద బాధితులను మోసం చేసిన పొట్ల రవి, జనగామ నాగరాజు, మటేటి భాస్కర్, ధర్మారం రాజు, సంతోష్, చిట్యాల లక్ష్మి, అసంపెల్లి లక్ష్మిలను అరెస్ట్ చేశారు. కట్టుకథలతో కుట్ర ద్వారా నిధులను తమ ఖాతాల్లో జమ చేసుకొని మోసం చేసినట్లు నిర్ధారణ కావడంతో వీరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మరికొందరు నిందితులను గుర్తించినప్పటికీ వారు పరారీలో ఉన్నారని వారిని పట్టుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రెండేళ్లలో గోదావరి తాగునీరు

సాక్షి,సిటీబ్యూరో : హైదరాబాద్ మహానగరానికి తాగు నీరు అందించే గోదావరి నీటి సరఫరా పథకం రెండు, మూడో దశ నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేసేందుకు రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ, జలమండలితో ఒప్పందం కుదుర్చుకుంది. రూ. 2,085 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. గోదావరి తాగు నీటి సరఫరా పథకం – ఫేజ్ –2, ఫేజ్–3ని హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) కింద రాంకీ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అనుబంధ సంస్థ అయిన మల్లన్న సాగర్ వాటర్ సప్లై లిమిటెడ్ ద్వారా ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయనుంది. నిర్మాణాన్ని పూర్తి చేసినంతరం 10 సంవత్సరాల పాటు నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించనుంది.

గిరిజనులను విభజించే కుట్ర

ఆత్మగౌరవ సభలో పలువురు వక్తలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

కవాడిగూడ: కొందరు స్వార్థపరులు రాజకీయ ప్రయోజనాల కోసం లంబాడీలపై తప్పుడు ప్రచారం చేస్తూ వాస్తవాలను వక్రీకరించి గిరిజన సమాజాన్ని విభజించడానికి ప్రయత్నిస్తున్నారని అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద తెలంగాణ లంబాడీల ఆత్మ గౌరవ వేదిక ఆధ్వర్యంలో లంబాడీల ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ అడిషనల్ డీజీపీ నాయక్, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, రెడ్యానాయక్ అమర్‌సింగ్, మాజీ ఎంపీలు ప్రొఫెసర్ సీతారాం నాయక్, మాలోతు కవిత తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కొంతమంది రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. సభ సమన్వయకర్తలు కరాటే రాజు, నెహ్రూ నాయక్, సంపత్ నాయక్, శరత్ నాయక్, బీమ్ రావు నాయక్ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి తండాకు లంబాడి ప్రజలను చైతన్య చేయడానికి బస్సు యాత్ర చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ట్రైకర్ చైర్మన్ రామ చంద్రనాయక్, రమేష్ రాథోడ్, సుబ్బు, నాము అశోక్, విజేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్ కాలనీ ముంపు సమస్యకు పరిష్కారం

- హుస్సేన్‌సాగర్ నాలాను కలుపుతూ కాలువ నిర్మాణం
- హైడ్రా కమిషనర్ రంగనాథ్



ముషీరాబాద్: బాగ్‌లింగంపల్లిలోని శ్రీరామ్‌నగర్ కాలనీ, దోమలగూడలోని గగన్‌మహల్, అశోక్‌నగర్ లోతట్టు ప్రాంతాలలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం పరిశీలించారు. వారం రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో తమ ప్రాంతాలు నీట మునుగుతున్నాయని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వర్షం పడితే మునిగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని శ్రీరామ్‌నగర్ కాలనీ వాసులు రంగనాథ్ ముందు వాపోయారు. 450 ఇళ్లు వరద నీటిలో మునుగుతున్నాయని ఫిర్యాదు చేశారు.

ఖాళీ స్థలంలోంచి కాలువ నిర్మాణం...

శ్రీరామ్‌నగర్ కాలనీని ముంచెత్తిన వరద నీరు హుస్సేన్‌సాగర్ నాలాలో కలిసేలా ఇక్కడ ఉన్న ఖాళీ స్థలంలో కాలువ నిర్మాణాన్ని చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని రంగనాథ్ తెలిపారు. కాలువ తవ్వకం పనులను కూడా ఆయన పరిశీలించారు. అలాగే వరద నీటిని హైడ్రా హెవీ మోటార్లు పెట్టి తోడించడాన్ని పరిశీలించారు. ఇక్కడ ఖాళీ స్థలం ప్రభుత్వానికి చెందిందని ఇందులోంచే గతంలో ఉన్న పైపులైన్‌లను పునరుద్ధరిస్తున్నామని కమిషనర్ తెలిపారు. ఒకవేళ ఈ స్థలం తమదని ఎవరైనా చెబితే టీడీఆర్ కింద నష్టపరిహారానికి ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అంతేకాని గతంలో ఉన్న పైపులైన్‌లను క్లోజ్ చేయడం సరికాదన్నారు.

వరద తగ్గాక పూడికను తొలగిస్తాం...

దోమలగూడలోని గగన్‌మహల్ ప్రాంతం హుస్సేన్‌సాగర్ నాలాలో పూడికను తొలగిస్తే చాలా వరకు సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు హైడ్రా కమిషనర్‌కు తెలిపారు. వరద ప్రవాహ తీవ్రత తగ్గిన వెంటనే జేసీబీలను కాలువలోకి దించి పూడికలను తొలగిస్తామని స్థానికులకు రంగనాథ్ హామీ ఇచ్చారు. అలాగే కాలువలో ఆక్రమణలను కూడా తొలగిస్తామన్నారు. అశోక్‌నగర్‌లోంచి హుస్సేన్‌సాగర్ వరద కాలువను అనుసంధానం చేసే నాలాను విస్తరిస్తామని తెలిపారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, డీఎఫ్‌వోలు యజ్ఞ నారాయణ, గౌతమ్, డీఎంసీ రామాంజులరెడ్డి, ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

23 ఏళ్లల్లో 76 శాతం పెరిగిన ఇంధన వినియోగం

ట్రాఫిక్ సమ్మిట్–2025లో నిపుణులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రజారవాణా వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వ్యక్తిగత వాహనాల వినియోగం పెరిగి ట్రాఫిక్ జామ్స్ ఏర్పడుతున్నాయని రవాణా, రహదారి భద్రత రంగ నిపుణులు చెప్తున్నారు. వ్యక్తిగత వాహనాల పెరుగుదల కారణంగానే 2002–2024 మధ్య హైదరాబాద్‌లో ఇంధన వినియోగం 76 శాతం పెరిగిందని వివరించారు. జలవిహార్‌లోని ఆడిటోరియంలో జరిగిన ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ సమ్మిట్–2025లో ప్రసంగించిన నిపుణులు రహదారులపై ట్రాఫిక్ నిర్వహణకు, కాలుష్య నియంత్రణకు విడదీయరాని సంబంధం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ చీఫ్ డి.జోయల్ డెవిస్, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రతినిధులు శేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాయు కాలుష్యంతో భారీ నష్టం

గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ నివేదిక ప్రకారం దేశంలో వాయు కాలుష్యం కారణంగా ఏడు శాతం జీడీపీతో సమానమైన మొత్తాన్ని నష్టపోతున్నాం. కాన్పూర్‌లోని ఐఐటీ సంస్థ హైదరాబాద్‌పై చేసిన అధ్యయనం వాహనాలు వదిలే వ్యర్థాల వల్ల 26 శాతం, వాటి కదలికలతో రోడ్లపై లేచే దుమ్ముతో మరో 24 శాతం కాలుష్యం ఏర్పడుతున్నట్లు తేలింది. సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెంచి ట్రాఫిక్‌ను సక్రమంగా నిర్వహిస్తే కాలుష్యం తగ్గుతుంది. లైన్ డిసిప్లేన్ అమలు కోసం నగరంలోని మూడు కమిషనరేట్లలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద రూ.9 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

– డాక్టర్ డి.ప్రసాద్, సీనియర్ ఎన్విరాన్‌మెంట్ స్పెషలిస్ట్, కాలుష్య నియంత్రణ మండలి

ఆర్టీసీ బస్సులు రోజురోజుకూ తగ్గుతున్నాయి

ప్రజారవాణా వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో వ్యక్తిగత వాహనాలు పెరుగుతున్నాయి. అందుకే రోజురోజుకూ కాలుష్యం పెరుగుతోంది. 2019 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సుల సంఖ్య తగ్గింది. ఇక్కడ ఆర్టీసీ బస్సుల నిర్వహణను నష్టం కలిగించే అంశంగా చూస్తారు. లండన్‌లో ఏదైనా ఓ రహదారిలో గంటకు 30 కంటే ఎక్కువ బస్సులు ప్రయాణిస్తుంటే... వాటి కోసం ప్రత్యేక లైన్ కేటాయించి తక్కువ రెడ్ సిగ్నల్స్ పడేలా చేస్తారు. ఫలితంగా త్వరగా గమ్యం చేరుతుండటంతో ప్రజారవాణాకు ఆదరణ పెరుగుతోంది. ఇక్కడా అలాంటి విధానాలు అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– రవి గడేపల్లి, బస్ సిస్టం ఎక్స్‌పర్ట్

సిటీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అంత ఈజీ కాదు

ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ముందు ఉన్న వాహనం ముందు వెళ్లాలి. అప్పుడైతేనే వెనుక ఉన్న వాళ్లు ముందువెళ్లడానికి సాధ్యమవుతుంది. ఈ సమస్యను నియంత్రించడానికి పరిష్కారంగా నగరంలో ఫ్రీ లెఫ్ట్ విధానాన్ని అమలు చేస్తున్నాం. రాజధానిలోని రహదారులు అన్ని ప్రాంతాల్లోనూ ఒకే వెడల్పుతో ఉండవు. అందుకే లైన్ డిసిప్లేన్ పక్కాగా అమలు చేయడం సాధ్యంకాదు. నగరంలో ట్రాఫిక్ చలాన్లు విధించడం కూడా అంత తేలికైన విషయం కాదు. రూ.200 ఫైన్ వేయాలన్నా వాహనచోదకుల నుంచి అనేక విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

– సీవీ ఆనంద్, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్

ప్రజలను అప్రమత్తం చేయండి : పొన్నం

సాక్షి, సిటీ బ్యూరో : నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేందుకు మొబైల్ మెసేజ్ పంపాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. తీవ్రత అధికంగా ఉన్నప్పుడు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని నగరవాసులను విజ్ఞప్తి చేయాలని అధికారులకు సూచించారు. శుక్రవారం నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే మూడు రోజుల వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు విధుల్లో ఉండాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా అయ్యే సమయంలో తప్పనిసరిగా మంచినీటి నాణ్యతను పరీక్షించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. తాగునీటిలో కలుషిత నీరు కలువకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

24న అంబేడ్కర్ వర్సిటీ ఎంబీఏ అడ్మిషన్స్ కౌన్సెలింగ్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2025–26 విద్యా సంవత్సరానికి ఎంబీఏ (హాస్పిటల్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) కోర్సుల్లో చేరడానికి సెప్టెంబర్ 24న వర్సిటీలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకునేవారు 2025–26 తెలంగాణ ఐసెట్ లేదా అంబేద్కర్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎంబీఏ హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత సాధించాలన్నారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను చూడవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఫోర్జరీ పత్రాలతో స్థలం అమ్మే యత్నం

నిందితులైన భార్య, భర్తలు అరెస్టు





నిందితులు పరుశరాములు, మాధవి

కంటోన్మెంట్: తప్పుడు ధ్రువపత్రాలతో రియల్ ఎస్టేట్ మోసానికి పాల్పడిన భార్యా,భర్తలను బోయిన్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. నార్సింగి ప్రాంతానికి చెందిన పరుశురాములు, మాధవి దంపతులు 'స్కందశ్రీ ఇన్‌ఫ్రా డెవలపర్స్' పేరిట ఆన్‌లైన్‌లో ప్రకటన ఇచ్చారు. బోయిన్‌పల్లికి చెందిన రమ్యన్ మీనా వారిని సంప్రదించగా సదాశివపేట మండలం, ఎంకేపల్లిలో ప్లాటుకు సంబంధించిన పత్రాలు చూపించి, రూ.13 లక్షలు, కొల్లూరులో ప్రీ లాంచ్‌లో ఉన్న వెంచర్‌లో మరో ప్లాటు రూ.9.50 లక్షలుగా పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి 2024 జనవరిలో బాధితురాలి నుంచి మొత్తం రూ.22.50 లక్షలు తీసుకుని ఆరునెలల్లో రిజిస్ట్రేషన్ చేస్తామంటూ అగ్రిమెంట్ చేసుకున్నారు. ఒక వేళ అగ్రిమెంట్ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయకపోతే చెల్లించిన మొత్తానికి నెలకు 2 శాతం వడ్డీ చెల్లిస్తామని పేర్కొన్నారు. గడువు ముగిసినా రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితురాలు పదే పదే అడిగినా ప్రయోజనం లేకుండా పోయింది. పైగా బాధితురాలిని దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితురాలు ఫిర్యాదు ఆధారంగా, పోలీసులు నిందితులు పరుశరాములు, మాధవిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నలుగురు సైబర్ నేరగాళ్లకు అరదండాలు

- మూడు వేర్వేరు కేసుల్లో అరెస్టు చేసిన పోలీసులు
- నిందితుల్లో బరోడా రంజీ క్రికెట్ టీమ్ ఆటగాడు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గుజరాత్, పంజాబ్, హర్యానాల్లో చేపట్టిన ఆపరేషన్లలో నలుగురు సైబర్ నేరగాళ్లను పట్టుకున్నారు. నగరవాసుల నుంచి రూ.2.79 కోట్లు కాజేయడంపై నమోదైన మూడు కేసుల్లో వీళ్లు నిందితులుగా ఉన్నట్లు డీసీపీ దార కవిత శుక్రవారం వెల్లడించారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్ ద్వారా ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించిన ప్రకటనకు ఆకర్షితుడయ్యాడు. వివిధ రకాలైన స్కీముల పేర్లు చెప్పిన సైబర్ నేరగాళ్లు వర్చువల్ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. ఇలా రూ.32 లక్షలు పెట్టుబడి పెట్టిన తర్వాత ఇతడి వర్చువల్ ఖాతాలో లాభాలతో కలిపి రూ.2.5 కోట్లు లాభాలు చూపారు. వీటిని డ్రా చేసుకోవాలంటే మరో రూ.కోటి డిపాజిట్ చేయాలని షరతు విధించారు. దీంతో తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాదరావు నేతృత్వంలోని బృందం బాధితుడు డబ్బు డిపాజిట్ చేసిన బ్యాంకు ఖాతాల ఆధారంగా ముందుకు వెళ్లింది. గుజరాత్‌లోని వడోదరకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఐ.వినాయక్ రాజేందర్ ఖాతాలోకి రూ.12 లక్షలు వెళ్లాయని, ఆ మొత్తాన్ని అతడు డ్రా చేసి కీలక సూత్రధారులకు ఇచ్చాడని గుర్తించారు. బరోడా రంజీ క్రికెట్ టీమ్‌లో ప్లేయర్ అయిన రాజేందర్‌కు నేరచరిత్ర కూడా ఉంది. గతంలో సైబర్ నేరంలో అరెస్టు అయ్యాడు. ఇతడి క్రికెట్ కోచ్ అయిన రిషి ఠాకూర్ ఆర్తేకు ఈ నేరంలో ఇతడు రాజేందర్ బ్యాంకు ఖాతాలతో ముడిపడి ఉన్న క్రిప్టో కరెన్సీ వాలెట్స్ తెరిచాడు. ఈ ఇద్దరినీ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వీరిపై తెలంగాణలో 2, దేశ వ్యాప్తంగా 12 కేసులు ఉన్నట్లు తేలింది. నగరానికి చెందిన మరో ఉద్యోగిని ట్రేడింగ్ పేరుతో మోసం చేసి రూ.1.23 కోట్లు కాజేసిన కేసులో లుధియానా వాసి సంజీవ్ కుమార్‌ను అరెస్టు చేశారు. వ్యాపారి అయిన ఇతగాడు తన బ్యాంకు ఖాతాలను సూత్రధారులకు అందించి సహకరించాడు. డిజిటల్ అరెస్టు ద్వారా నగర వైద్యుడి నుంచి రూ.1.23 కోట్లు కాజేసిన నేరంలో హర్యానాకు చెందిన నిఖిల్ తివారి అరెస్టు అయ్యాడు.

నేడు ముగియనున్న చైల్డ్ హార్ట్ ఫ్రీ సర్జరీ క్యాంప్

లక్డీకాపూల్: నిమ్స్‌లో ఉచితంగా నిర్వహిస్తున్న గుండె ఆపరేషన్ల ప్రక్రియ శనివారంతో ముగియనున్నది. ఈ నెల 14న ప్రారంభమైన చైల్డ్ హార్ట్ ఫ్రీ సర్జరీ క్యాంపులో పుట్టుకతోనే గుండె సంబంధ వ్యాధులతో బాధపడుతున్న చిన్న పిల్లలకు బ్రిటన్ వైద్యులు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. ఈ చికిత్సలను ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద చేపట్టినట్టు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బ్రిటన్ వైద్య బృందం చిన్నారులకు వారం రోజుల పాటు నిర్వహించిన గుండె శస్త్ర చికిత్సలు శనివారంతో పూర్తి అవుతున్నాయన్నారు. మిగిలిన చిన్నారులకు కూడా నిమ్స్ కార్డియోథొరాసిక్ సర్జన్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎం.అమరేష్‌రావు, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గోపాల్‌లు కొనసాగిస్తున్నారని చెప్పారు.

'వర్గీకరణ చట్టాన్ని సవరించి న్యాయం చేయాలి'

హిమాయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో నెం.99ను వెంటనే అసెంబ్లీలో సవరణ చేసి మాల ఉప కులాలకు న్యాయం చేయాలని తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై బీఆర్‌ఎస్ పార్టీ తరఫున అసెంబ్లీలో పోరాడాలని శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్, గౌరవ అధ్యక్షుడె చెరుకు రామచందర్‌లతో కలసి తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి ఎస్సీ వర్గీకరణ వల్ల జరుగుతున్న అన్యాయాన్ని వారు గణాంకాలతో సహా వివరించారు. నాయకులు కె.బాలకృష్ణ, బేగరి దేవదాస్, డా.బి.వీరస్వామి, మాదాసు రాహుల్ రావు, నామ సైదులు, తాళ్లపల్లి రవి, మంత్రి నరసింహయ్య, నల్లల కనకరాజు, భీమ్ సేన, రావుల అంజయ్య, నాలుకల నర్సింగరావు పాల్గొన్నారు.

దసరాలోపు మెస్ బిల్లులు చెల్లించాలి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని ఎస్టీ హాస్టళ్లలో 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం దసరా పండగలోపు చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వేలాది మంది విద్యార్థులతో ప్రజా భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వాటి అద్దె బిల్లులు గత 20 నెలలుగా చెల్లించడం లేదని ఆరోపించారు. సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జి.అనంతయ్య, నందగోపాల్, శివకుమార్ యాదవ్, నరేష్ గౌడ్, రవి యాదవ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వృద్ధుడికి గాయాలు

వెంగళరావునగర్: స్కూటర్‌పై వెళ్తున్న వృద్ధుడిని కారు ఢీకొట్టిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఈనెల 18వ తేదీ అర్ధరాత్రి ఎస్.యాదయ్య అనే వృద్ధుడు స్కూటీపై సారథి స్టూడియో మీదుగా మధురానగర్ వైపు వెళుతున్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన కారు వృద్ధుడి స్కూటీని ఢీకొట్టింది. దాంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు అతనిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై యాదయ్య మనవడైన ఎస్.రాహుల్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

భార్య, పిల్లలు అదృశ్యంపై ఫిర్యాదు

వెంగళరావునగర్: విధులకు వెళ్లి వచ్చేలోగా ఓ డ్రైవర్ భార్య పిల్లలు అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... యూసుఫ్‌గూడ ప్రాంతానికి చెందిన పి.వెంకటరావు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఈ నెల 16న పనికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి అతని భార్య నయోమి, కుమార్తె, కుమారుడు కనిపించలేదు. వారి కోసం పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేదు. దీంతో శుక్రవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

గంజాయి విక్రేతల అరెస్టు

వెంగళరావునగర్: అక్రమంగా గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్ పీఎస్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్నట్టుగా పోలీసులకు సమాచారం అందింది. దాంతో మధురానగర్ ప్రాంతంలో ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ సూచన మేరకు ఎస్‌ఐ శివశంకర్ పెట్రోలింగ్ చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి చైనా బజార్ సమీపంలో ఇరువురు యువకులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిని పట్టుకొని పరిశీలించగా 125 గ్రాముల గంజాయి, ఖాళీ ప్యాకెట్లను గుర్తించారు. దీంతో వారిని అరెస్టు చేశారు.

ఎన్నాళ్లీ ఎత్తిపోసుడు..!

అడుగడుగునా వరదనీటి కష్టాలు
- శాస్త్రీయత లోపించి మూసుకుపోయిన కాలువలు
- ముఖ్యమంత్రి తిరిగే రహదారుల్లోనే పరిస్థితి అధ్వానం



బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12 కమాండ్ కంట్రోల్ సెంటర్ ముందు వరదనీటిని తోడుతున్న మోటారు పంపు

బంజారాహిల్స్: కొంతకాలంగా కురుస్తోన్న కుండపోత వర్షాలకు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజక వర్గాలు మోకాలు లోతు వరదనీటితో అతలాకుతలం అవుతున్నాయి. ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారులు, బస్తీలు, కాలనీల్లో పెద్దఎత్తున వరదనీరు నిలిచిపోతూ స్థానికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ, జలమండలి నిర్వాకాలు అడుగడుగునా కళ్లకు కడుతున్నాయి. శాస్త్రీయత లోపించిన వరద కాలువల నిర్మాణం, డ్రైనేజీ పైపుల నిర్మాణం, రోడ్ల నిర్మాణంతో వరదనీరు ముందుకు వెళ్లలేకపోతున్నది. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా మోటారు పంపుసెట్లను అందుబాటులోకి తీసుకురావాల్సి వస్తున్నది.

- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాకపోకలు సాగించే రోడ్లపై వరదనీరు కనిపించకుండా మోటార్లను దింపుతున్నారు. పంపుసెట్ల సహాయంతో రోడ్లను ముంచెత్తుతున్న వరదను పంపింగ్ చేస్తున్నారు.
- ఖైరతాబాద్‌లో కూడా ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్, ప్రింటింగ్ ప్రెస్, మారుతీనగర్ ప్రాంతాల్లో భారీగా వరద నిలవగా రెండు పంపుసెట్ల సహాయంతో నీళ్లు తోడించారు. భారీ వర్షాలతో వరద కాలువల్లోకి చేరకపోవడంతో రోడ్లన్నీ జలమయమవుతున్నాయి.
- జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విధానం, అధికారుల నిర్లక్ష్యం వరదకు కారణమవుతున్నాయి. సమగ్ర ప్రణాళిక లేకపోవడం.. అధికారుల మధ్య సమన్వయం కుదరకపోవడం.. క్షేత్రస్థాయిలో సమన్వయ శాఖల పర్యటనలు కరువవడంతో రోజురోజుకు వరద ఉధృతి పెరుగుతూ స్థానికులకు నరకాన్ని చూపిస్తున్నది. ట్రాఫిక్ పోలీసులే వరద నిలిచిన చోట పంపింగ్ చేయిస్తూ పరిస్థితిని కొంతవరకు అదుపులోకి తీసుకొస్తున్నారు.



ఖైరతాబాద్‌లోని ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్ వద్ద వర్షపు నీటిని తోడుతున్న సిబ్బంది



కేబీఆర్ పార్కు వద్ద పంజగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కట్ట హరిప్రసాద్...

చీరకట్టుకు ప్రత్యేక స్థానం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఏఎస్ అధికారిణి లక్ష్మి, శైలజారెడ్డి

శ్రీనగర్‌కాలనీ: భారత సంస్కృతి-సంప్రదాయాల్లో మహిళల చీరకట్టుకు ప్రత్యేక స్థానం ఉందని, మన చేనేత కళలను ప్రోత్సహించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐఏఎస్ అధికారిణి, తెలంగాణ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి అన్నారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఆధ్వర్యంలో చేనేతకళలను ప్రోత్సహించేందుకు మహిళలను నారీమణి-2025 పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆమె నగర ఎంటప్రీనర్ శైలజారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. మహిళలకు నారీమణి పేరిట చేనేతకు దగ్గర చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఇండియన్ సిల్క్‌గ్యాలరీ నిర్వాహకులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావుల కృషిని అభినందించారు. చేనేతకారుల ప్రోత్సాహానికి మహిళలకు నారీమణి పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమంలో అందరూ భాగస్వాములవ్వాలని నిర్వాహకులు కోరారు. సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్‌గ్యాలరీ సిల్క్ ఎగ్జిబిషన్ ఈనెల 23 వరకూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

హెచ్-సిటీ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న జెడ్‌సీ అనురాగ్ జయంతి తదితరులు

బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ హైదరాబాద్ సిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఇనిషియేటివ్ (హెచ్-సిటీ) ప్రాజెక్టు కింద చేపట్టిన జంక్షన్ల అభివృద్ధి, ఫ్లైఓవర్లు, రోడ్ల విస్తరణపై శుక్రవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి స్టేక్ హోల్డర్స్ సమావేశం నిర్వహించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మహారాజా అగ్రసేన్ జంక్షన్ వద్ద మల్టీలెవల్ ఫ్లైఓవర్, కేబీఆర్ పార్కు పరిసర ప్రాంతాలు, బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12 ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, ఇతరత్రా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రాజెక్టు వేగవంతంగా సాగేందుకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ తెలిపారు. వీరు నిరంతర తనిఖీలు నిర్వహించడం, రహదారి విస్తరణ వల్ల ప్రభావితమైన స్థల యజమానుల సందేహాలను నివృత్తి చేయడం, టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్), భూసేకరణ చట్టం 2013 ప్రకారం నష్టపరిహారం వంటి అంశాలను వివరిస్తారని పేర్కొన్నారు. రహదారి వెడల్పు వల్ల ప్రభావితమైన స్థల యజమానులు జీహెచ్‌ఎంసీ అధికారులకు పూర్తి సహకారం అందించాలన్నారు. తమ సందేహాలు, సూచనలు, అభిప్రాయాలు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు ప్రజల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని వేగంగా పూర్తి చేయడం జీహెచ్‌ఎంసీ లక్ష్యంగా పేర్కొన్నారు. డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-18లోని శ్రీసీతారామస్వామి దేవాలయ సముదాయంలో కొలువుదీరిన శ్రీ పర్వతవర్ధినిదేవి అమ్మవారి దసరా శ్రీదేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా పండగ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వర్గాలు తెలిపాయి. అమ్మవారి ప్రత్యేక అలంకారాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ నెల 22న సాయంత్రం 6 గంటల నుంచి కూచిపూడి కళామృత ద్వారా కూచిపూడి నృత్య ప్రదర్శన, లక్ష్మీవిశ్వనాథంచే కథక్ నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నారు. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి వివిధ నృత్య సంస్థలు అమ్మవారి సన్నిధిలో ప్రదర్శనలు ఇవ్వనున్నాయి. వేడుకల కోసం ఆలయంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.



శ్రీ పర్వతవర్ధినిదేవి అమ్మవారు

ప్రతిఒక్కరూ స్వచ్ఛ భారత్‌లో పాల్గొనాలి



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న బీజేపీ నేతలు

వెంగళరావునగర్: నగరంలోని ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే దోమలు, ఇతర అంటు రోగాల బారిన పడకుండా ఉంచవచ్చని బీజేపీ నేతలు అన్నారు. యూసుఫ్‌గూడలోని హైలాం కాలనీ వద్ద పోచమ్మ గుడి సమీపంలో కొంతకాలంగా పేరుకుపోయిన చెత్తను శుక్రవారం బీజేపీ నేతలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేతలు కుంభాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, పులిరామ్, జ్ఞానేశ్వర్, బడుగు సతీష్, కాట్రాజ్, తాతా రవి, సురభి నవీన్, లక్ష్మణ్‌రెడ్డి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీవీబీపీ స్కూల్‌లో బతుకమ్మ సందడి

ఫిలింనగర్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే రీతిలో జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు సందడిగా నిర్వహించారు. చిన్నారులు రంగురంగుల పూలతో స్వయంగా బతుకమ్మలు పేర్చి తలపై పెట్టుకుని ఊరేగింపుగా వేదిక దాకా ఆనందోత్సాహాల మధ్య తీసుకొచ్చారు. అక్కడ విశేష పూజలు నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీతో పాటు ఉపాధ్యాయులు, చిన్నారులంతా కలిసి బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. మూడు గంటల పాటు పాఠశాల ప్రాంగణం రంగులమయంగా కోలాహలంగా మారింది. మూడు రోజుల ముందే బతుకమ్మ సందడిలో చిన్నారులంతా కనువిందు చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థినులు కార్యక్రమానికి హైలెట్‌గా నిలిచారు.





శ్రీనగర్‌కాలనీ: చిన్నారులు బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. శుక్రవారం ఎర్రగడ్డ సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ నృత్యాలతో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా బతుకమ్మను ఆడారు. స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైఫాబాద్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థినులు



బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు

హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు

బంజారాహిల్స్: హైమాస్ట్ లైట్లు వెలగవు.. వాకర్లకు తిప్పలు తప్పవు అనే శీర్షికన బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 వీధి దీపాల డీఈ శ్రీకాంత్ స్పందించారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ఎదుట ఉన్న హైమాస్ట్ లైట్లతో పాటు అలంకరణ దీపాలు కూడా కాలిపోవడంతో కొన్ని నెలలుగా ఇక్కడ చీకట్లను అలుముకోవడంతో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. స్పందించిన వీధిదీపాల నిర్వహణాధికారులు భారీ క్రేన్ సాయంతో హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేసి వెలుగులు నింపారు. ఆర్నమెంటల్ లైట్లు కూడా మరమ్మతులు చేయడంతో వెలుగుకు నోచుకున్నాయి.



కేబీఆర్ పార్కు ముందు వెలుగుతున్న హైమాస్ట్ లైట్లు

సాక్షి ఎఫెక్ట్..

వరద బాధితులకు బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న తహసీల్దార్ అనితారెడ్డి

బంజారాహిల్స్: కుండపోత వర్షాలతో వరదలు ముంచెత్తుతుండగా బస్తీలన్నీ అతలాకుతలమై ఇళ్లలోకి నీరు చేరి బస్తీవాసులు రోడ్డున పడుతున్న నేపథ్యంలో షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి హకీంపేట పరిసర బస్తీల్లో జీహెచ్‌ఎంసీ ఏఈ ఉదయ్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్‌లతో కలిసి పర్యటించారు. దెబ్బతిన్న నివాసాలను పరిశీలించి 150 మందికి రైస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. బుల్కాపూర్ నాలా పొంగిపొర్లుతుండడంతో నదీకాలనీ, టోలిచౌకి, హకీంపేట ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో వీరికి రైస్ ప్యాకెట్లు పంపిణీ చేయడమే కాకుండా నాలా మరమ్మతు పనుల కోసం రూ. 37 లక్షలు కేటాయించారని, రెండు వారాల్లో పనులు ప్రారంభమవుతాయని తహసీల్దార్ తెలిపారు.

మట్టిని తొలగించాలని వినతి

రహమత్‌నగర్: కమలానగర్ బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. డబుల్ బెడ్‌రూం పక్కనే మట్టిని డంప్ చేశారని, తక్షణమే దానిని తొలగించాలని ఆయన కోరారు. బీజేపీ నేతలు కాట్రాజు, కిశోర్, శ్రీనివాసరెడ్డి, భాస్కర్ శంకర్, శైలజ, రమేష్ నాయక్, లక్క మహేశ్, విశాల్‌సింగ్, అశోక్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

బంజారాహిల్స్: షేక్‌పేట మండల పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో అంకితభావంతో విద్యార్థులకు బోధన కొనసాగిస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. షేక్‌పేట మండల డిప్యూటీ ఐఓఎస్ మల్లయ్య ఉత్తమ ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. 2024లో ఉత్తమ ఫలితాలు తీసుకువచ్చి విధి నిర్వహణలో ప్రత్యేకతను ప్రదర్శించినందుకు గాను వీరిని సత్కరించి ప్రోత్సహిస్తున్నట్లు ఈ సందర్భంగా మల్లయ్య తెలిపారు.



సన్మానిస్తున్న డిప్యూటీ ఐఓఎస్ మల్లయ్య

వారసత్వ కట్టడాల సంరక్షణకు శిక్షణ అవసరం

జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి

లక్డీకాపూల్: వారసత్వ కట్టడాల పునరుద్ధరణ, సంరక్షణకు ప్రత్యేక శిక్షణ దోహదం చేస్తుందని జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ అనురాగ్ జయంతి అన్నారు. జీహెచ్‌ఎంసీ సమావేశ మందిరంలో శుక్రవారం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (క్యూక్యూఎస్‌యుడీఏ), జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, ఆర్‌అండ్‌బీ ఇంజనీర్‌లకు రెండు రోజులపాటు వారసత్వ సంరక్షణ ప్రాజెక్టుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆగా ఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ (ఏకేటీసీ) సహకారంతో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఇంజనీర్లకు వారసత్వ సంరక్షణపై ప్రత్యేక శిక్షణ అవసరమన్నారు. తొలుత హైదరాబాద్ ఐఎన్‌టీఏసీహెచ్ కో కన్వీనర్ సజ్జాద్ షాహిద్ హైదరాబాద్ వారసత్వ నిర్మాణాలు, సంరక్షణ సూత్రాలు, నిర్మాణాల మరమ్మత్తులు, ప్రత్యేక పదార్థాల వినియోగం వంటి అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నిపుణులు ఏకేటీసీ ఇండియా సీఈఓ రతీష్ నందా, కన్సర్వేషన్ కన్సల్టెంట్ డా.బెన్నీ కురియకోస్, కన్సర్వేషన్ ఆర్కిటెక్ట్ ఉజ్వల మీనన్, క్యూ క్యూ ఎస్ యూడీఏ చీఫ్ ఇంజనీర్ బి.గోపాల్ , ఈఈ మహమ్మద్ వాహజుద్దీన్ పాల్గొన్నారు.

ఫోన్‌లేని క్షణాన్ని ఊహించలేం

హీరోయిన్ ఫరియా అబ్దుల్లా

బంజారాహిల్స్: ఇప్పటి పరిస్థితుల్లో ఫోన్ లేని క్షణాన్ని ఏ మాత్రం ఊహించలేమని సినీ హీరోయిన్ ఫరియా అబ్దుల్లా అన్నారు. శుక్రవారం పంజగుట్టలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో ఐ-ఫోన్ 17 సిరీస్ ఫోన్లను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫరియా మాట్లాడుతూ... మార్కెట్లోకి వచ్చే నూతన గాడ్జెట్స్ వాడటం తనకు చాలా ఇష్టమని, కొత్త విషయాలను నేర్చుకోవడంలో ఇప్పుడు ఫోన్ అనేది ఎంతో ముఖ్యమైందని అన్నారు. ఈ సందర్భంగా ఫోన్‌లో వచ్చిన నూతన సిరీస్ మొబైల్ ఫోన్ల గురించి అడిగి తెలుసుకున్నారు.



క్లుప్తంగా...

ఓజీ సినిమా టికెట్ల ధర పెంపునకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: ఈనెల 25న విడుదల కానున్న ఓజీ సినిమా టికెట్ల ధర పెంపునకు, ప్రీమియర్ షోకు తెలంగాణ ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 24న రాత్రి 9 గంటలకు ప్రీమియర్‌కు అవకాశం ఇవ్వడంతోపాటు ఆ షోకు టికెట్ ధర జీఎస్టీతో కలిపి రూ.800గా నిర్ణయిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సినిమా విడుదల రోజు (ఈనెల 25) నుంచి అక్టోబరు 4 వరకు పది రోజులపాటు టికెట్ ధరల పెంపునకు వీలు కల్పించింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.100 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌ల్లో రూ.150 (జీఎస్టీతో కలిపి) అనుమతిస్తున్నట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సినిమా లైజనింగ్ అథారిటీలు, పోలీసు కమిషనర్లు ఈ ఉత్తర్వులకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని రవి గుప్తా ఉత్తర్వుల్లో వెల్లడించారు.

ఓజీ టికెట్ రేట్లపై సీఎం రేవంత్ యూటర్న్:హరీశ్



సాక్షి, హైదరాబాద్: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన ఓజీ సినిమా టికెట్ రేట్ పెంపుదలకు అనుమతిస్తూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు 'ఎక్స్'లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈనెల 25న విడుదల కానున్న ఈ సినిమాకు టికెట్ రేట్ల పెంపుతో పాటు 24వ తేదీ రాత్రి 9 గంటలకు రూ.800 రేట్లతో స్పెషల్ షోకు అనుమతిస్తూ హోంశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. హోంశాఖ సీఎం రేవంత్ వద్దే ఉండటం గమనార్హం. పుష్ప–2 సినిమా వివాదం నేపథ్యంలో స్పెషల్ షోలకు అనుమతిచ్చేది లేదంటూ గతంలో అసెంబ్లీ వేదికగా రేవంత్ చేసిన ప్రకటనకు సంబంధించిన క్లిప్‌ను హరీశ్‌రావు తన పోస్టుకు జత చేశారు. ప్రాణాలు పోతున్నాయని తెలిసినా స్పెషల్ షోలకు ఎలా అనుమతి ఇస్తామని రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఉద్దేశిస్తూ హరీశ్‌రావు 'యూ టర్న్' అంటూ పేర్కొన్నారు.

అర్చకుల డిమాండ్లను పరిష్కరించాలి

అర్చక సంఘాల సంయుక్త సమావేశం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖలో పనిచేస్తున్న అర్చకులతోపాటు ధూప, దీప, నైవేద్య పథకం అర్చకుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వివిధ అర్చక సంఘాలు డిమాండ్ చేశాయి. ధూప, దీప, నైవేద్య పథకం అర్చక సంఘం అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవ శర్మ అధ్యక్షతన శుక్రవారం వివిధ అర్చక సంఘాల సంయుక్త సమావేశం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగింది. ధూప, దీప, నైవేద్య పథకం కింద అర్చకుల గౌరవ వేతనం రూ.రెండున్నర వేలు, దేవాలయ నిర్వహణకు రూ.10 వేల చొప్పున అందజేయాలని, గ్రాంట్ ఇన్ ఎయిడ్ వేతనాలు అందని 2,625 మంది అర్చకులకు వాటిని వర్తింపజేయాలని, కాంట్రాక్టు అర్చక, ఉద్యోగుల వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇనాం భూముల అర్చకులను కాస్తు కాలంలో నమోదు చేయాలని, అర్చక ఉద్యోగులకు నగదు రహిత వైద్య సదుపాయం అందజేయాలని వారు కోరారు. డిమాండ్ల సాధన కోసం జేఏసీని ఏర్పాటు చేశారు. సమావేశంలో ప్రసాద్ శర్మ, శ్రీనివాస శర్మ, మురళీకృష్ణ శర్మ, రామ శర్మ, రమేశ్ శర్మ, భార్గవాచార్యులు, సేవాలాల్ సక్రునాయక్, సేవాలాల్ దేవుడు నాయక్, వెంకటేశ్వరాచార్యులు పాల్గొన్నారు. అనంతరం వారు దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రవర్ణ పేదలకు ఇళ్లు

వరంగల్‌లో జరిగిన టీఆర్‌పీ తొలి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీన్మార్ మల్లన్న



రాష్ట్ర కమిటీ నిర్ణయాలను విలేకరులకు వెల్లడిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే అగ్రవర్ణ పేదలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రకటించారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌ను జాతిపితగా ప్రకటించడంతోపాటు కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న కోసం సిఫారసు చేస్తామన్నారు. ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో బీసీలకు రూ.లక్ష కోట్లు పెట్టాలన్న ఆయన.. లేదంటే తమ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేస్తామని, రెండో రాజధానిగా వరంగల్‌ను ప్రకటిస్తామని చెప్పారు. టీఆర్‌పీ ఆవిర్భావం తర్వాత తొలి రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం హనుమకొండలోని ఓ హోటల్‌లో జరిగింది. అనంతరం విలేకరుల సమావేశంలో రాష్ట్ర కమిటీ నిర్ణయాలను మల్లన్న వెల్లడించారు.

పత్తి అమ్మాలా..? స్లాట్ బుకింగ్ తప్పనిసరి!

కపస్ కిసాన్ యాప్‌ను తెచ్చిన సీసీఐ

- పత్తి అమ్మాలంటే రైతు అందులో స్లాట్ బుక్ చేసుకోవాల్సిందే
- కనీసం వారం ముందే బుక్ చేసుకోవాలంటున్న సీసీఐ
- ఈ సీజన్ నుంచే ఈ నిబంధన అమలు
- చదువురాని రైతుల పరిస్థితి ఏంటి అనే సందేహాలు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: పత్తి రైతులకు కొత్త చిక్కు వచ్చి పడింది. పండించిన పత్తిని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలంటే ఇకపై ఆన్‌లైన్‌లో ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ) 'కపస్ కిసాన్'అనే ప్రత్యేక మొబైల్ యాప్‌ను ఈ ఏడాది నుంచి అందుబాటులోకి తెచ్చింది. రైతు తన పత్తి పంటను విక్రయించాలంటే ఈ యాప్‌లో వారం రోజుల ముందే స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందని సీసీఐ అధికారులు తెలిపారు. స్లాట్‌లో నిర్దేశించిన సమయానికి రైతులు పత్తిని కొనుగోలు కేంద్రానికి తమ పంటను తీసుకెళ్లాల్సి ఉంటుంది.

రైతులకు ఇబ్బందే..

రాష్ట్రంలో చాలామంది రైతులు ఇప్పటికీ నిరక్షరాస్యులే. అలాంటివారికి యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలంటే ఇబ్బందే. స్మార్ట్ ఫోన్లు అందరికీ ఉండవు. పైగా వారం రోజుల ముందు స్లాట్ బుక్ చేసుకోవాలనే నిబంధన మరింత ఇక్కట్లకు గురి చేయనుంది. స్లాట్‌లో నిర్దేశించిన రోజు ఏ కారణం చేత పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లకపోయినా స్లాట్ రద్దవుతుంది. దీంతో మరో వారం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. సాధారణంగా రైతులు తమ సమీపంలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లోనే పంటను అమ్ముకుంటారు. ఈ స్లాట్ విధానంతో దూరప్రాంతాల్లోని కేంద్రాలకు కూడా స్లాట్ కేటాయించే అవకాశాలుంటాయని చెబుతున్నారు. దీంతో రైతులకు దూరం పెరిగి రవాణా ఖర్చులు కూడా భారంగా మారతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో ఈసారి 45.85 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైంది. గతేడాది సుమారు 210.19 లక్షల క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది.

స్లాట్ విధానంతో రైతులకు ఇబ్బందే



స్లాట్ విధానంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయి. చాలా మంది రైతులకు స్మార్ట్‌ఫోన్లు ఉండవు. ఇతరుల ఫోన్ నుంచి బుక్ చేసుకోవాల్సి వస్తుంది. స్లాట్ బుక్ అయిన రోజు పత్తి నింపేందుకు లేబర్ దొరక్కపోయినా, వాహనం దొరక్కపోయినా స్లాట్ రద్దవుతుంది.

– కె.రాఘవేందర్‌రెడ్డి, తెలంగాణ రైతు రక్షణ సమితి నేత

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

ఈ సీజను నుంచి పత్తి కొనుగోలుకు స్లాట్ విధానాన్ని అమలు చేయాలని సీసీఐ నిర్దేశించింది. ఈ విధానంపై రైతుల నుంచి వ్యతిరేకత వస్తోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. ఈ నిబంధనలను తొలగించాలని కోరాం.

– రియాజ్, జిల్లా మార్కెటింగ్ అధికారి

పత్తి రైతులకు మద్దతు ధర దక్కాలి

- అందుకు సీసీఐ చొరవ తీసుకోవాలి
- అక్టోబర్ నుంచే పత్తి సేకరించండి
- 'కపస్ కిసాన్'యాప్‌పై ఏఈవోలకు శిక్షణ
- సమీక్షలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: పత్తి రైతులు నష్టపోకుండా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. సీసీఐ ప్రకటించిన ధర కంటే ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి క్వింటాల్ ధర రూ.1,099 తక్కువగా ఉందని తెలిపారు. అక్టోబర్ నుంచే పత్తి సేకరణ ప్రారంభించాలని సూచించారు. 2025–26 సీజన్‌లో పత్తి సేకరణకు సంబంధించి ఆయన శుక్రవారం సీసీఐ, రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పత్తి ఉత్పత్తి, మద్దతు ధర, మార్కెట్ ధర, రైతులకు చెల్లింపులు, జిన్నింగ్, ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాట్లు, రవాణా సమస్యలు, డిజిటలైజేషన్, రైతుల రిజిస్ట్రేషన్, స్థానిక కమిటీలు, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. ఈ సీజన్ నుంచి పత్తి సేకరణలో కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని, దానికి రాష్ట్ర ప్రభుత్వ మద్దతు అవసరమని సీసీఐ ప్రతినిధులు మంత్రిని కోరారు. పత్తి విక్రయించేందుకు 'కపాస్ కిసాన్'యాప్ ద్వారా రైతులు స్లాట్ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. మంత్రి తుమ్మల కల్పించుకుంటూ.. ఎల్1, ఎల్2 స్లాట్ బుకింగ్‌లతో రైతులు ఇబ్బంది పడే అవకాశం ఉన్నందున 10 – 15 కిలోమీటర్ల దూరంలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు సహకరించాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు కేంద్రాలను 110 నుంచి 122కి పెంచినట్లు వెల్లడించారు.

ఆధార్ ధ్రువీకరణతోనే ఎంఎస్‌పీ నిధులు

రైతుల ఆధార్‌కార్డులను ధ్రువీకరించుకున్న తరువాతే వారి ఖాతాల్లో కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) నిధులు జమ చేయాలని మంత్రి తుమ్మల కోరారు. భూ యజమాని అనుమతితో కౌలు రైతులు కూడా ఓటీపీ పొందే వెసులుబాటు ఉంటుందని, ఏఈవోలకు యాప్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతి కేంద్రంలో స్థానిక కొనుగోలు పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని, రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 599 5779, వాట్సాప్ హెల్ప్‌లైన్ 88972 81111 కొనసాగుతాయని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలు, జిన్నింగ్, ప్రాసెసింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. రవాణా సమస్యలు తలెత్తకుండా రవాణా శాఖ, కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సీసీఐ టెండర్ నిబంధనలు పారదర్శకంగా ఉండాలని అన్నారు. రైతుల ఎంఎస్‌పీ రక్షణకు రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లు మంత్రి వివరించారు.

కేజీబీవీ అల్పాహారంలో పురుగులు



పురుగులున్న అల్పాహారం

వీర్నపల్లి(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి కస్తూర్బాగాంధీ విద్యాలయంలో శుక్రవారం అల్పాహారంలో పురుగులు కనిపించాయి. ఈ విషయం తెలియడంతో మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ పాఠశాలకు వెళ్లి విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. ముగ్గురు విద్యార్థినులకు అల్పాహారంలో పురుగులు వచ్చాయని ఎంఈవో దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌ను వివరణ కోరగా.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని వాపోయారు.

చావు పిలిచింది.. వెళ్లిపోతున్నా..

- బీబీనగర్ పెద్ద చెరువులో దూకిన యువకుడు.. ఇంకా దొరకని ఆచూకీ
- భర్త లేకుండా తానూ ఉండలేనంటూ చెరువులో దూకిన భార్య
- కాపాడిన రెస్క్యూ టీమ్



చెరువు కట్టపై రోదిస్తున్న సురేందర్ భార్య ,బంధువులు

బీబీనగర్: 'తనను పది రోజులుగా చావు పిలుస్తుంది.. నేను చావు వద్దకు వెళ్లిపోతున్న.. ఇందులో ఎవరి ప్రమేయం లేదు'అంటూ ఓ యువకుడు చెరువులో దూకాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు, యువకుడి వాయిస్ రికార్డులో నమోదైన వివరాల ప్రకారం ...హనుమకొండ జిల్లా రాంనగర్‌కు చెందిన బర్ల సురేందర్ (36) ఉప్పల్ సమీపంలోని రామాంతపూర్‌లో డీమార్ట్ వెనుకాల తన భార్య, కొడుకుతో నివాసం ఉంటున్నాడు. సురేందర్ హైటెక్ సిటీలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. పది రోజులుగా సురేందర్ మానసిక స్థితి బాగాలేకపోవడంతో ఏదేదో మాట్లాడుతుండేవాడు. నిత్యం చావు కల వస్తుందని, తన వద్దకు రమ్మని చావు పిలుస్తుందని, దేవుళ్లు పిలుస్తున్నట్టు పీడ కలలు వస్తున్నాయని, తాను చనిపోతానని కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులకు చెబుతుండేవాడు. కాగా కుటుంబసభ్యులు అతని పలు దేవాలయాలు, దైవదర్శనాలకు తిప్పారు. మానసిక పరిస్థితి మెరుగుపడటంతో ఉద్యోగానికి వెళ్లానని కుటుంబ సభ్యులు చెప్పడంతో ఒప్పుకున్నాడు. నాలుగు రోజులుగా ఉద్యోగానికి వెళ్తున్న సురేందర్.. శుక్రవారం ఉదయం కూడా డ్యూటీకి వెళుతున్నట్టు ఇంట్లో చెప్పాడు. క్యాబ్ బుక్ చేసుకొని బీబీనగర్ పెద్ద చెరువు వద్దకు చేరుకున్నాడు. అక్కడి నుంచి తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. చావు రమ్మటుంది.. నేను వెళ్తున్నాని, చెరువులో దూకి చనిపోతున్నానని, తన చావు కార్యక్రమాలు పాత ఇంట్లో చేయాలని, నా చావుకు ఎవరూ కారణం కాదని సెల్‌ఫోన్‌లో వాయిస్ రికార్డ్ చేసి పంపాడు. ఆ తర్వాత బూట్లు, సెల్‌ఫోన్ చెరువు కట్టపై పెట్టి చెరువులో దూకాడు. బంధువుల సమాచారంతో పోలీసులు, రెస్క్యూ టీం చెరువులో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకకపోవడంతో అక్కడే ఉన్న సురేందర్ భార్య.. భర్త లేనిదే తాను ఉండలేనంటూ చెరువులో దూకింది. అప్రమత్తమైన రెస్క్యూ టీం ఆమెను కాపాడింది. శుక్రవారం రాత్రి వరకు గాలించినా సురేందర్ ఆచూకీ లభించకపోవడంతో శనివారం కూడా గాలింపు చర్యలు చేపట్టే అవకాశముంది.

దారిలో వదిలేసి..

చెంచు మహిళ మృతదేహాన్ని అడవి మధ్యలోనే వదిలేసిన మార్చురీ వ్యాన్ డ్రైవర్



ఫర్హాబాద్ గేటు వద్ద మృతదేహంతో చెంచులు

సాక్షి, నాగర్‌కర్నూల్/ మన్ననూర్: అనారోగ్యంతో ఆస్పత్రిలో మృతిచెందిన చెంచు మహిళ మృతదేహాన్ని మార్చురీ వ్యాన్ డ్రైవర్ దారి మధ్యలోనే అడవిలో వదిలిపెట్టిన ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని ఈర్లపెంటకు చెందిన చెంచు మహిళ మండ్లి గురువమ్మ (30) పది రోజుల కిందట అనారోగ్యంతో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మరణించింది. మహిళ మృతదేహాన్ని నల్లమల అటవీ ప్రాంతంలోని ఈర్లపెంటకు తరలించేందుకు అధికారులు మార్చురీ వ్యాన్‌ను ఏర్పాటు చేశారు. గురువారం అర్ధరాత్రి సమయంలో హైదరాబాద్ – శ్రీశైలం రహదారి పక్కన ఫర్హాబాద్ ఫారెస్ట్ గేటు వద్దకు రాగానే అడవి లోపలికి వెళ్లేందుకు దారి సరిగా లేదంటూ డ్రైవర్ మృతదేహాన్ని వ్యాన్ నుంచి దించి కిందపెట్టేశాడు. దీంతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం వరకు గురువమ్మ మృతదేహంతో పాటు ఫారెస్ట్ గేటు వద్దనే పడిగాపులు కాశారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ అధికారులు ఆటో ఏర్పాటు చేసి మృతదేహాన్ని ఈర్లపెంటకు తరలించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మార్చురీ వ్యాన్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు మన్ననూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ రోహిత్‌రెడ్డి తెలిపారు.

మద్యం దుకాణాల రిజర్వేషన్‌ను 25 శాతానికి పెంచాలి

మంత్రి జూపల్లి కృష్ణారావుకు బీజేపీ నేత బూర నర్సయ్య విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: మద్యం దుకాణాల రిజర్వేషన్‌ను 25 శాతానికి పెంచి, కల్లుగీత సహకార సంఘాలకే కేటాయించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా బకాయిలను వెంటనే చెల్లించి, ఈ మొత్తాన్ని రూ. 10 లక్షలకు పెంచాలని కోరారు. తాటి సాగును ఉద్యాన శాఖకు బదిలీ చేసి జాతీయ సబ్సిడీలు లభించేలా చూడాలన్నారు. ఐసీఏఆర్ ఆమోదించిన పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించి తాటి హైబ్రిడ్ రకాలపై పరిశోధన చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన వాగ్దానాల అమలుకు చర్యలు తీసుకోవాలని, గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. శుక్రవారం బూర నర్సయ్య గౌడ్ మంత్రి జూపల్లిని కలిసిన గీత కార్మికుల సమస్యలను వివరించారు. హామీలు అమలుకాకపోవడంతో వారు తీవ్ర సమస్యల్లో ఉన్నారని తెలిపారు.

ఆ లేఖలతో పార్టీకి సంబంధం లేదు

- ఇటీవల విడుదలైన లేఖలను అధికార ప్రకటనలుగా గుర్తించాల్సిన పనిలేదు
- మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ స్పష్టీకరణ.. అధికార ప్రతినిధి జగన్ పేరిట లేఖ
- శాంతి చర్చలపై అభిప్రాయాలు కోరుతూ ఈ–మెయిల్ అడ్రస్ ఇవ్వడం అర్థరహితమని ధ్వజం

సాక్షి, హైదరాబాద్: తాత్కాలికంగా ఆయుధాలు వదిలేందుకు సిద్ధమంటూ మావోయిస్టు అధికార ప్రతినిధి అభయ్ పేరిట వెలుగులోకి వచ్చిన లేఖ, ఆడియో సందేశంతోపాటు సెంట్రల్ కమిటీ సభ్యుడు సోను పేరిట సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన మరో లేఖపై మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ తాజాగా వివరణ ఇచ్చింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ నుంచి ఆయా నాయకుల పేరిట విడుదలైన లేఖలతో మావోయిస్టు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, అవి పూర్తిగా వ్యక్తిగత అభిప్రాయాలేనని స్పష్టం చేసింది. ఈ మేరకు మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరిట శుక్రవారం లేఖ విడుదలైంది. గతంలో అభయ్ పేరిట విడుదలైన లేఖలో ఆయుధాలు వదిలేసేందుకు సిద్ధమంటూ పేర్కొనడాన్ని మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా తప్పుపట్టింది. 'ఇటువంటి పద్ధతులు ఉద్యమానికి నష్టం కలిగించేవే తప్ప ఏమాత్రం ప్రయోజనం లేనివి. ఇది పార్టీ అధికారిక ప్రకటన కాదు. విప్లవ శిబిరం, మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు దీన్ని అధికారిక ప్రకటనగా గుర్తించాల్సిన అవసరం లేదు. ఈ ప్రకటనతో గందరగోళం అవసరం లేదు. బీజేపీ సాగిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు తీవ్రతరం చేయాలి'అని జగన్ పేరిట విడుదలైన లేఖ స్పష్టం చేసింది. ఈ–మెయిల్ ద్వారా అభిప్రాయాలు కోరడంపైనా రాష్ట్ర కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

సమయం కోరడం అనాలోచిత చర్య..

'కామ్రేడ్ సోనూ, కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో ఇచ్చిన తాత్కాలిక సాయుధ పోరాట విరమణ ప్రకటన సోనూ వ్యక్తిగత అభిప్రాయమే కానీ పార్టీ నిర్ణయం కాదు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండను కొనసాగిస్తున్న వేళ మాకు నెల రోజులు సమయం ఇవ్వాలని అడగడం అనాలోచిత చర్య. కేంద్ర కమిటీ సభ్యుడైన కామ్రేడ్ సోనూ సాయుధ పోరాటాన్ని విరమిస్తున్నామని పార్టీ నాయకులతో, కార్యకర్తలతో అభిప్రాయాలు తెలుసుకోవడానికి నెల రోజుల వ్యవధి కావాలని, పార్టీ కమిటీ సభ్యులు తమ అభిప్రాయాలను తాను ఇచ్చిన ఈ–మెయిల్ అడ్రస్‌కు పంపాలని కోరుతూ ప్రకటన ఇచ్చాడు. ఇది ఏం పద్ధతో అర్థంకావట్లేదు. ఉద్యమాన్ని విడిచి జనజీవన స్రవంతిలో కలసి పనిచేయదలిచినప్పుడు పార్టీ కమిటీలో చర్చించి అనుమతి పొందొచ్చు. తన అభిప్రాయాన్ని పార్టీ వేదిక ద్వారా పంపించి ఉంటే అభయ్ ప్రశ్నలకు జవాబులు దొరికేవి. అది చేయక పోగా ఇలా బహిరంగంగా ప్రకటన విడుదల చేయడం పార్టీ శ్రేణుల్లో, విప్లవ శిబిరంలోనూ గందరగోళానికి దారితీసేలా ఉంది. ఇటువంటి నిర్ణయాలను ఇంటర్నెట్ ద్వారా బహిరంగ చర్చకు పెట్టి పరిష్కరించాలని ఎవరూ అనుకోరు. తీవ్ర దమనకాండ అమలవుతున్న ఈ పరిస్థితుల్లో కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలకు కట్టుబడిన పార్టీలో సరిగ్గా ఆలోచించే వాళ్లు ఇలా చేయరు. పార్టీలో పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు కేడర్ ఎదుర్కొంటున్న సమస్యపై అందరూ తీవ్రంగానే ఆలోచిస్తున్నారు. అనవసరంగా నష్టపోవాలని ఎవరూ అనుకోవట్లేదు. కాబట్టి ఈ సమస్యకు పరిష్కారం బహిరంగ ప్రకటనలతో అయ్యేది కాదు. ఈ సమస్యకు ఇప్పటికిప్పుడే పరిష్కారం దొరక్కపోవచ్చు. 2024లో పొలిట్ బ్యూరో విడుదల చేసిన సర్క్యులర్‌ను అమలు చేయడమే తక్షణ కర్తవ్యం'అని లేఖలో జగన్ పేర్కొన్నారు.

సోది చెబుతానమ్మా..



కలెక్టర్ రాజర్షి షా చెయ్యి పట్టుకుని సోది చెబుతున్న విద్యార్థిని

కైలాస్‌నగర్: జిల్లాలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమ అమలు తీరును ఓ విద్యార్థిని వినూత్నంగా వివరిస్తూ ఆకట్టుకుంది. కార్యక్రమ అమలు తీరుపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, స్టూడెంట్ చాంపియన్లు కార్యక్రమ ప్రయోజనాలను వివరించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని సాయి సృజన.. ఆరు రోజుల పాటు అమలు చేస్తున్న కార్యక్రమాలను తనదైన శైలిలో వివరించింది. కలెక్టర్‌తో.. సోది చెబుతానమ్మా.. అంటూ వివరించి ఆకట్టుకుంది.

విద్యార్థులతో బెంచీల తరలింపు

ట్రాక్టర్‌లో ప్రమాదకర ప్రయాణం



ట్రాక్టర్‌లో బెంచీలు తరలిస్తున్న విద్యార్థులు

జగిత్యాల రూరల్: విద్యార్థులతో ట్రాక్టర్‌లో ప్రమాదకర రీతిలో బెంచీలు తరలించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణిపేట పాఠశాలలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. పురాణిపేట పాఠశాల విద్యార్థులకు బెంచీలు అవసరం కాగా.. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది శుక్రవారం ట్రాక్టర్‌లో జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బెంచీలు తీసుకొచ్చేందుకు వెళ్లారు. బెంచీలను విద్యార్థులతో ట్రాక్టర్‌లోకి మోయించారు. కాగా, విద్యార్థులు అదే ట్రాక్టర్‌లో ప్రమాదకర రీతిలో.. పొరండ్ల నుంచి పురాణిపేటకు ప్రయాణించడం చూసి పట్టణ ప్రజలు విద్యాశాఖ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.


వైద్యానికి పడవ ప్రయాణమే..



పడవలో వెళ్తున్న వైద్యులు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం మల్యాల సమీపంలోని గొత్తికోయగూడెంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. కొండాయి– దొడ్ల మధ్యలో వంతెన లేకపోవడం.. జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పడవలో ప్రయాణించాల్సి వచ్చింది. దొడ్లనుంచి నుంచి గొత్తి కోయగూడానికి రెండు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లారు. గొత్తికోయగూడెంలో వైద్య శిబిరం నిర్వహించి, ఇంటింటికి తిరిగి జ్వరాల సర్వే చేశారు. మొత్తం 35 మందికి మందికి మందులు అందజేసి.. ఐదుగురికి రక్తపూతల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కొండాయి వైద్యాధికారి డాక్టర్ ప్రణీత్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ భాస్కర్‌రావు, ఆశ వర్కర్లు జ్యోతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

చెరువులో దిగి.. విద్యుత్ సమస్య పరిష్కరించి



చెరువులోని విద్యుత్ స్తంభం ఎక్కుతున్న శ్రీకాంత్

ఆలేరు రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక నుంచి పటేల్‌గూడెం వెళ్లే మార్గంలో మల్లన్న కుంట చెరువు వద్ద వ్యవసాయ బావులకు వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్‌లో సాంకేతిక సమస్య వల్ల గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్.. ప్రాణాలకు తెగించి కుంటలోకి దిగి ఈదుకుంటూ వెళ్లి స్తంభం ఎక్కి విద్యుత్ లైన్‌ను సవరించాడు. శ్రీకాంత్ సాహసాన్ని గుర్తించిన భువనగిరి డివిజనల్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు అతనికి ప్రశంసా పత్రం అందజేశారు.

దసరా మామూళ్లు ఇవ్వలేం



పరిశ్రమ గేటుకు పెట్టిన బోర్డు

చౌటుప్పల్ రూరల్: దసరా మామూళ్లు ఇవ్వలేం.. అంటూ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామ పరిధిలోని ఓ పరిశ్రమ యాజమాన్యం బోర్డు పెట్టింది. దసరా పండుగ సందర్భంగా నవరాత్రుల కోసం గ్రామాల్లోని యువత చందాలు వసూలు చేస్తుంటారు. పలు ప్రభుత్వ శాఖలకు చెందిన కిందిస్థాయి సిబ్బంది కూడా పరిశ్రమ వద్దకు వెళ్లి దసరా మామూళ్లు అడుగుతారు. అయితే, ఈ ఏడాది పరిశ్రమ ఇబ్బందుల్లో ఉందని, తాము ఎవరికీ దసరా చందాలు ఇవ్వలేమని పరిశ్రమ గేటుకు బోర్డు తగిలించారు.

విమానానికి ఎయిర్‌బ్యాగులు

విమానం గాల్లో వెళ్తోంది. హఠాత్తుగా విమానంలో సమస్య తలెత్తింది. పైలట్లు ఇక విమానం నడపడం మావల్ల కాదని చేతులెత్తేశారు. అప్పుడు కనీవినీ ఎరగని రీతిలో విమానానికి ఎయిర్ బ్యాగులు ప్రత్యక్షమయ్యాయి. విమానం సురక్షితంగా కిందకు దిగింది. భారీ ప్రమాదం తప్పింది. వింటుంటే ఆశ్చర్యంగా ఉంది కదూ. ఇలా జరిగితే ఎంత బాగుంటుంది! ఈ దిశగా ఇప్పుడే ప్రయత్నాలు మొదలయ్యాయి. బిట్స్ పిలానీ దుబాయ్ క్యాంపస్‌కి చెందిన ఇద్దరు భారతీయ విద్యార్థుల ఆలోచన ఇది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



ప్రాజెక్ట్ రీబర్త్.. ఏఐ సాయంతో విమానాలకు ఎయిర్‌బ్యాగులు ఏర్పాటుచేసే వినూత్న ఆవిష్కరణ. దుబాయ్‌లోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో చదువుతున్న భారతీయ విద్యార్థులైన ఈషెల్ వసీం, దర్శన్ శ్రీనివాసన్ దీన్ని రూపొందించారు. ఈ ఎయిర్‌బ్యాగుల ఆలోచన.. ల్యాబులోనో, క్లాస్‌రూములోనో రాలేదు. ఇది ఒక మాతృమూర్తి ఆవేదన, సానుభూతి నుంచి వచ్చింది.

- 'ప్రాజెక్ట్ రీబర్త్'తో విమాన ప్రమాదాలకు చెక్
- తొలి 'ఏఐ ఆధారిత ప్రమాద నిరోధక వ్యవస్థ'
- రూపొందించిన ఇద్దరు భారతీయ విద్యార్థులు
- ఎయిర్ ఇండియా విమాన ప్రమాదమే స్ఫూర్తి
- తల్లి ఆవేదనతో చలించి ఆవిష్కరణకు శ్రీకారం

అమ్మ బాధ తెలుసుకుని..

జూన్ 12, 2025.. దేశం మొత్తం ఎప్పటికీ మర్చిపోలేని రోజు. ఎయిర్ ఇండియా విమానం అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన కొద్ది నిమిషాల్లోనే కుప్పకూలిపోయింది. 260 మంది ప్రాణాలు కోల్పోయారు. తమ ఆప్తుల మృతదేహాలు కూడా దొరకని వారి కుటుంబ సభ్యుల ఆవేదన వర్ణనాతీతం. అదిగో అది.. ఓ తల్లిని తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఆమె.. దుబాయ్‌లోని బిట్స్‌పిలానీలో చదువుతున్న ఈషెల్ తల్లి. 'విమాన ప్రమాదం గురించి విన్న మా అమ్మ తీవ్రంగా కలత చెందింది. ఆమెకు నిద్ర కూడా పట్టేది కాదు. ''ప్రమాదం తప్పదు.. ఇక విమానాన్ని, ప్రయాణికుల ప్రాణాలు కాపాడలేం' అనుకున్న క్షణంలో పైలట్లు ఎంత మానసిక వేదన అనుభవించి ఉంటారు'' అనుకుంది. అలాగే తమ ప్రాణాలు పోవడం ఖాయం అనుకున్న ప్రయాణికుల మానసిక స్థితి ఎలా ఉండి ఉంటుందో అని రోజూ ఆలోచించేది. ఆమె ఆవేదనే నన్ను ఆలోచింపజేసింది. నా స్నేహితుడు శ్రీనివాసన్‌తో ఈ విషయాన్ని పంచుకున్నాను. ఇలాంటి విమాన ప్రమాదాలు ఎలా ఆపవచ్చా అనుకున్నప్పుడు ఎయిర్‌బ్యాగుల ఆలోచన వచ్చింది' అంటాడు వసీం.





'ఏఐ' రక్షణ వ్యవస్థ

ఇది మొట్టమొదటి ఏఐ ఆధారిత ప్రమాద నిరోధక వ్యవస్థ. 5 స్మార్ట్ టెక్నాలజీల సాయంతో విమాన ప్రమాదాలను పసిగడుతుంది.

- ఇందులోని ఏఐ వ్యవస్థ.. ఎత్తు, వేగం, ఇంజిన్ పరిస్థితి, దిశ, మంటలు, పైలట్ల స్పందనలను పర్యవేక్షిస్తుంది.
- విమానం కుప్పకూలిపోతుంది అనుకున్నప్పుడు 'ప్రాజెక్ట్ రీబర్త్' యాక్టివేట్ అవుతుంది. హైస్పీడ్ ఎయిర్‌బ్యాగులు విమానం రెక్కలు, కింది భాగం, వెనుక భాగాల నుంచి కేవలం 2 సెకెన్ల వ్యవధిలో వచ్చేస్తాయి.
- విమాన వేగం తగ్గేలా సాంకేతిక ఏర్పాటు ఉంది.
- సాధారణంగా విమాన ప్రమాదాలు.. తీవ్ర విషాదాలుగా మారేది తాకిడి తీవ్రత వల్లే. అందువల్ల రీబర్త్‌లో ప్రధానంగా దీన్ని తగ్గించడంపైనే దృష్టి పెట్టారు. విమాన వేగం తగ్గి, దేన్నయినా బలంగా కాకుండా, నెమ్మదిగా తాకినప్పుడు.. లేదా వేగంగా కాకుండా నెమ్మదిగా ల్యాండింగ్ అయినప్పుడు ప్రమాదం తప్పినట్టే కదా.

క్షణాల్లో తెలిసిపోతుంది

సాధారణంగా విమాన ప్రమాదాలు జరిగాక కొన్ని గంటలకో, రోజులకోగానీ ఎక్కడ జరిగిందో తెలియదు. ఈలోగా.. తీవ్ర గాయాలతో ఉన్నవారు ప్రాణాలు కోల్పోవచ్చు. మంటలు పెరిగి అంతా కాలి బూడిదైపోవచ్చు. ఏదైనా జరగొచ్చు. ఇలా జరగకుండా.. విమానం ఎక్కడ ఉందో తెలియజేసేందుకు జీపీఎస్, లైటింగ్ వ్యవస్థ ఇందులో ఉన్నాయి. అంటే.. క్షణాల్లో విమాన సమాచారం తెలిసిపోతుందనమాట!

పునర్జన్మకు వాగ్దానం

'ప్రస్తుతం రీబర్త్ టెస్టింగ్‌కి సిద్ధంగా ఉంది. పైలట్లతో సంబంధం లేకుండానే.. విమానం ఎప్పుడు కుప్పకూలిపోవచ్చో ఏఐ వ్యవస్థ కచ్చితంగా అంచనా వేయడం దీని ప్రత్యేకత. విమానానికి బయట నుంచి వచ్చి, ప్రమాదం నుంచి కాపాడే ఎయిర్‌బ్యాగులు అసలైన రక్షణ వ్యవస్థ. ముఖ్యంగా లోపల ఉన్న ప్రయాణికులు తీవ్రమైన కుదుపులకు గురికాకుండా, ఎలాంటి గాయాలు కూడా కాకుండా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేశాం. ఈ మొత్తం వ్యవస్థను కొత్త విమానాల్లోనే కాదు, ఇప్పటికే ఉన్న విమానాల్లోనూ ఏర్పాటుచేయవచ్చు. రీబర్త్ అనేది కేవలం ఆవిష్కరణ కాదు.. అన్నీ విఫలమైపోయి ప్రాణాలు పోవడం ఖాయం అనుకున్నప్పుడు కూడా పునర్జన్మనిస్తుందనే వాగ్దానం' అంటున్నారు వసీం, శ్రీనివాసన్.

5 ఏళ్లలో సిద్ధం!

రీబర్త్‌కు సంబంధించిన ప్రధాన భాగాల తయారీపైనా ఈ యువ ఇంజినీర్లు దృష్టిపెట్టారు. ముఖ్యంగా ప్రమాదాన్ని పసిగట్టే ఏఐ వ్యవస్థ, ఎయిర్‌బ్యాగులు, స్మార్ట్ సీట్ల వంటి అన్ని రకాల సాంకేతికతలనూ తయారుచేసేందుకు విమాన తయారీ సంస్థలు, ప్రభుత్వాలతో వీరు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. వచ్చే 5 ఏళ్లలో.. రీబర్త్‌ను పరీక్షించి, అన్ని అనుమతులూ పొంది, విమానాల్లో పూర్తిస్థాయిలో వాడాలన్నది తమ లక్ష్యం అంటున్నారు ఈ యువ ఆవిష్కర్తలు.

క్లుప్తంగా...

రాజులకొత్తపల్లి హైస్కూల్‌ను సందర్శించిన డీఈఓ

- పీఈటీని మేచరాజుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు సర్దుబాటు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ

సాక్షి ఎఫెక్ట్

నెల్లికుదురు: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లి హైస్కూల్‌ను డీఈఓ దక్షిణ మూర్తి శుక్రవారం సందర్శించారు. పాఠశాలకు పిల్లలు రాకపోవడంపై ఆరా తీశారు. 'ఐదుగురు విద్యార్థులు.. 9 మంది టీచర్లు'అనే శీర్షికన శుక్రవారం సాక్షి మెయిన్‌లో ప్రచురితమైన కథనానికి స్పందించిన డీఈఓ దక్షిణమూర్తి ఎంఈఓ రాందాస్‌తో కలిసి పాఠశాలను సందర్శించారు. ఇక్కడ పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడిని మండలంలోని మేచరాజుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు సర్దుబాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడి పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని, వారి ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

భాగ్యలక్ష్మి ఆలయం వద్ద బతుకమ్మ

- షరతులతో అనుమతిచ్చిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: పాత బస్తీలోని భాగ్యలక్ష్మి ఆలయం వద్ద ఈనెల 23న బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడానికి హైకోర్టు అనుమతిచ్చింది. అయితే శాంతిభద్రతలను కాపాడటానికి కఠినమైన షరతులు విధించింది. మహిళలు మాత్రమే పాల్గొనాలి, నేర చరిత్ర ఉన్న వారు హాజరుకావొద్దు, వీఐపీలను ఆహ్వానించకూడదు, సాయంత్రం 4 నుంచి 5.30 వరకు వేడుకలు నిర్వహించుకోవాలని ఆదేశించింది. ఆలయం వద్ద బతుకమ్మ నిర్వహణకు పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఏపీపీ వాదనలు వినిపిస్తూ.. అక్కడ వేడుకలకు అనుమతిస్తే శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 2024, అక్టోబర్‌లో అదే వేదిక వద్ద కొన్ని షరతుల కింద బతుకమ్మ వేడుకలకు అనుమతి ఇచ్చారని తెలిపారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుని గతేడాది అవాంఛనీయ సంఘటనలు జరిగాయా? అని ప్రశ్నించగా.. ఏపీపీ లేదని బదులిచ్చారు. దీంతో న్యాయమూర్తి షరతులతో బతుకమ్మ వేడుకలకు అనుమతిచ్చారు.

కన్వీనర్ కోటా వైద్య సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కన్వీనర్ కోటా కింద మొదటి దశలో ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు చేసినట్లు ఆరోగ్య యూనివర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి తెలిపారు. 2025–26 సంవత్సరానికి వెబ్ ఆప్షన్స్‌కు నోటిఫికేషన్‌ను ఈనెల 15న ఇచ్చామని, శుక్రవారం రాత్రి 11.30 వరకు వెబ్ ఆప్షన్స్ ఇవ్వడానికి అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. వెబ్ ఆప్షన్స్‌ను పరిశీలించిన తర్వాత శనివారం రాత్రి 7.30 గంటలకు సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. కాలేజీల వారీగా కేటాయింపులకు సంబంధించి యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పెట్టినట్లు ఆయన వెల్లడించారు. అలాగే విద్యార్థులకు ఎస్‌ఎంఎస్ రూపంలో సీట్ల కేటాయింపు వివరాలను పంపించినట్లు చెప్పారు.

26,232 ఎంబీఏ సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: తుది దశ కౌన్సెలింగ్‌లో 26,232 ఎంబీఏ, 4,723 ఎంసీఏ సీట్లు భర్తీ చేసినట్టు సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏలో ఇంకా 4,456, ఎంసీఏలో 2,504 సీట్లు మిగిలిపోయాయని పేర్కొన్నారు. సీట్లు వచ్చిన వారు ఈనెల 23లోగా రిపోర్టు చేయాలని సూచించారు.

ఫీజుల పెంపుపై కొత్త పంచాయితీ

- పది శాతం పెంపునకు ప్రభుత్వం సుముఖత
- కొన్ని కాలేజీల పేర్లతో ఎఫ్‌ఆర్‌సీకి సమాచారం
- ఫీజుల పెంపులో ప్రభుత్వ జోక్యంపై ఎఫ్‌ఆర్‌సీ సీరియస్
- ఉన్నత విద్యా మండలి చైర్మన్ జోక్యంపై అభ్యంతరం



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఫీజుల పెంపు కొత్త పంచాయితీకి దారి తీసింది. కమిటీ సభ్యుల మధ్య వివాదం మొదలైంది. పరిస్థితి ఒకరిపై ఒకరు మాటల తూటాలు పేల్చుకునే దశకు చేరింది. ప్రైవేటు ఇంజనీరింగ్ ఫీజుల పెంపుపై ప్రభుత్వం తన నిర్ణయాన్ని బయట పెట్టింది. కొన్ని కాలేజీలకు పది శాతం ఫీజు పెంపునకు అనుమతించినట్టు తెలిసింది. రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీ (ఏఎఫ్‌ఆర్‌సీ)కి ఈ విషయాన్ని తెలిపింది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ప్రభుత్వ నిర్ణయాన్ని కమిటీ ముందుకు తెచ్చినట్టు సమాచారం. దీనిపై ఎఫ్‌ఆర్‌సీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయడం వివాదానికి కారణమైంది. ఇలా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం, తమ స్వతంత్ర ప్రతిపత్తిని దెబ్బకొట్టడమేనని ఎఫ్‌ఆర్‌సీ మండిపడినట్టు తెలిసింది. ప్రభుత్వం తరఫున బాలకిష్టారెడ్డి వకాల్తా పుచ్చుకోవడమే కాకుండా, ఎఫ్‌ఆర్‌సీ అధికారాలను కట్టడి చేసేలా వ్యవహరిస్తున్నారని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం.

పెంపుపై మీ పెత్తనమేంటి?


ప్రతి మూడేళ్లకోసారి రాష్ట్రంలోని వృత్తి విద్యా కాలేజీల్లో కోర్సుల ఫీజుల పెంపును ఏఎఫ్‌ఆర్‌సీ సమీక్షిస్తుంది. కాలేజీలు చేసే ఖర్చు, ఫ్యాకల్టీ, ఇతర మౌలిక వసతుల ఆధారంగానే ఫీజులను నిర్ణయిస్తుంది. 2026 నుంచి మూడేళ్ల బ్లాక్ పీరియడ్‌కు ఇదే తరహాలో ఫీజులపై కసరత్తు చేపట్టింది. దాదాపు 140 కాలేజీల ఆడిట్ నివేదికలను పరిశీలించి ఫీజులను ఖరారు చేస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. కానీ, ఫీజుల పెంపును ప్రభుత్వం నిలిపివేసింది. పునఃసమీక్ష కోసం మండలి చైర్మన్ నేతృత్వంలో కమిటీ వేసింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు ఫీజులను మరోసారి సమీక్షించాలని కోరింది. దీంతో మళ్లీ అన్ని కాలేజీల ఆడిట్ నివేదికలను, అఫిడవిట్లను ఎఫ్‌ఆర్‌సీ పరిశీలించింది. ఫీజులపై ఒక నిర్ణయానికి వస్తున్న నేపథ్యంలోనే పది శాతం ఫీజుల పెంపును ప్రభుత్వం సూచించడంపై ఎఫ్‌ఆర్‌సీ వర్గాలు తీవ్ర అభ్యంతరం చెబుతున్నాయి. ఇది తమ అధికారాలకు కత్తెర వేయడమేనని భావిస్తున్నాయి. నాణ్యత పాటించే కాలేజీలకు ఫీజులు పెంచకపోతే నష్టం జరుగుతుందని ఎఫ్‌ఆర్‌సీ భావిస్తోంది. ఫీజుల పెంపుపై ప్రభుత్వానికి విద్యాశాఖ, ఉన్నత విద్యా మండలి చైర్మన్ వంత పాడటం తప్ప, వాస్తవాలు గుర్తించటంలేదని ఎఫ్‌ఆర్‌సీ మండిపడినట్లు తెలిసింది. 'మీ ఇష్టమొచ్చినట్టు చేసేట్టయితే ఇక ఎఫ్‌ఆర్‌సీ ఎందుకు?'అని ప్రశ్నించినట్టు సమాచారం. హేతుబద్ధత లేకుండా ఫీజులను నిర్ధారిస్తే, ప్రైవేటు కాలేజీలు కోర్టులో సవాల్ చేస్తే పరిస్థితి ఏమిటి? అని నిలదీసినట్లు తెలిసింది.

కొత్త తలనొప్పి

ఫీజుల పెంపును ప్రభుత్వం ఆపడాన్ని ప్రైవేటు కాలేజీలు కోర్టులో సవాల్ చేశాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో పాత ఫీజులనే వసూలు చేస్తామని కౌన్సెలింగ్ సమయంలో విద్యార్థులకు ప్రభుత్వం తెలిపింది. ఫీజుల పెంపును అడ్డుకునే అధికారం ప్రభుత్వానికి ఉండదని న్యాయ నిపుణులు అంటున్నారు. ఈ కారణంగానే పది శాతం పెంపుకు అంగీకరించినట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే, పాత ఫీజులే వసూలు చేస్తామని కౌన్సెలింగ్ సమయంలో చెప్పడాన్ని విద్యార్థులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు ఫీజుల పెంపును అమలు చేస్తామంటే విద్యార్థులు వ్యతిరేకించే అవకాశం ఉంది. న్యాయస్థానంలోనూ సవాల్ చేసే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితులను పరిశీలించకుండా అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించారని, ఇది న్యాయ పరమైన చిక్కులు తెస్తుందని ఎఫ్‌ఆర్‌సీ వర్గాలు అంటున్నాయి.

మైనారిటీల కోసం రెండు కొత్త పథకాలు

- ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన, రేవంతన్న కా సహారా పేరిట ప్రారంభించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్
- నిరుపేద మహిళలు, యువతకు రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ఆర్థిక సాయం అందించనున్న ప్రభుత్వం
- వచ్చే నెల 6 వరకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తులకు గడువు



సాక్షి, హైదరాబాద్: మైనారిటీల్లోని నిరుపేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం రెండు కొత్త పథకాలను ప్రవేశపెట్టింది. ఆర్థిక సాయం అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు.. వారు స్వయం ఉపాధి పొందేందుకు 'ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన', 'రేవంతన్న కా సహారా మిస్కీనో కే లియే'పథకాలను తీసుకొచ్చింది. ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద వితంతువులు, విడాకులు పొందిన మహిళలు, అనాథలు, అవివాహిత మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు రూ. 50 వేల చొప్పున లబ్ధిదారులకు అందించనుంది. అలాగే రేవంతన్న కా సహారా మిస్కీనో కే లియే పథకం కింద ఫకీర్, దూదేకుల వర్గాల్లోని నిరుపేద లబ్ధిదారులకు రూ. లక్ష చొప్పున గ్రాంట్‌ను ఇవ్వనుంది. ఈ రెండు పథకాల కోసం ప్రభుత్వం రూ. 30 కోట్లు కేటాయించింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సచివాలయంలో ఈ పథకాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ పథకాల కోసం లబ్ధిదారులు https://tgobmms.cgg.gov.in/ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తులను కేవలం ఆన్‌లైన్ పద్ధతిలోనే స్వీకరిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే ఈ పథకాలను ప్రారంభించినట్లు తెలిపారు. మైనారిటీల అభివృద్ధి అంటే వారికి కేవలం రాయితీ ఇవ్వడమే కాదని.. స్వయం ఉపాధి ద్వారా వారిని ప్రోత్సహించి జీవితంలో స్థిరపడేలా చేయడమేనని ఆయన వివరించారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, క్యాపిటల్ వర్క్స్ సబ్ కమిటీ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: అభివృద్ధి పనులను శాఖల వారీగా, ప్రాధాన్యతా క్రమంలో హేతుబద్ధీకరణ చేసుకొని రావాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. శుక్రవారం సచివాలయంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, క్యాపిటల్ వర్క్స్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో మంత్రులు, సబ్ కమిటీ సభ్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్ కమిటీ చైర్మన్ అయిన భట్టి మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనల సంఖ్య ఎక్కువగా ఉంటే సంవత్సరాల వారీగా, ప్రాధాన్యతా క్రమంలో విభజన చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అన్ని శాఖల ప్రధాన కార్యదర్శులు వారంలోగా పూర్తిస్థాయి ప్రతిపాదనలతో సమావేశానికి రావాలని సూచించారు. రోడ్ల పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలను సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు వివిధ శాఖల కార్యదర్శులు, పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టీ-సాట్ భాగస్వామ్యంతో నూతన విద్యావిధానం

సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యా రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలనే కృత నిశ్చయంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో అమలు చేయబోయే నూతన విద్యావిధానంలో టీ-సాట్ నెట్‌వర్క్‌ను భాగస్వామి చేస్తామని తెలిపారు. టీ-సాట్ కార్యాలయాన్ని వేం నరేందర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా టీ-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి ఆయనకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. అనంతరం కార్యాలయంలోని విభాగాలన్నీ కలియ దిరిగిన వేం నరేందర్ రెడ్డి.. టీ-సాట్ పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమీక్షలో నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా స్టూడియోను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రారంభం రోజే వైద్య సేవలు అందాలి

- టిమ్స్ ఆసుపత్రులపై మంత్రి దామోదర సమీక్ష
- ఆర్‌అండ్‌బీ, ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలి
- అక్టోబర్ నెలాఖరుకు సనత్‌నగర్ టిమ్స్ పనులు పూర్తి చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: టిమ్స్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ప్రారంభించిన రోజే అక్కడ అన్ని రకాల వైద్య సేవలు కూడా అందుబాటులోకి రావాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు సూచించారు. ఈ దిశలో ఆసుపత్రుల భవనాలు నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ, వైద్య పరికరాలు సమకూర్చాల్సిన వైద్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ, సనత్‌నగర్, ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనులు, వైద్య పరికరాల కొనుగోలు, నిమ్స్ విస్తరణ, మెడికల్ కళాశాలల నిర్మాణ పనులపై శుక్రవారం సచివాలయంలోని తన చాంబర్ నుంచి ఆయన సమీక్ష జరిపారు. అన్ని భవనాల నిర్మాణ పనులు ఎక్కడి వరకు వచ్చాయన్న దాని గురించి ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సనత్‌నగర్ భవనం నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయని, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ పనులు పూర్తయ్యేందుకు మరో ఆరు నెలలు పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ.. సనత్‌నగర్ టిమ్స్‌ను ఈ ఏడాది చివరికల్లా ప్రజలకు అందుబాటులోకి తేవాలనేది సీఎం రేవంత్ ఆలోచన అని, పనులను అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్య పరికరాల కొనుగోలులో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఇందుకోసం సంబంధిత విభాగాల వైద్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనులను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. సమీక్ష సమావేశంలో వైద్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణీంద్రరెడ్డి, డీఎంఈ నరేంద్ర కుమార్, ఆర్‌అండ్‌బీ సీఈలు రాజేశ్వర్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్శిల్ బుక్ చేసిన మరుసటి రోజే బట్వాడా

మెట్రో నగరాలతో షురూ, ఆ తర్వాత ఇతర ప్రాంతాలకు విస్తరణ

- ఇందుకోసం 24 గంటలు పనిచేసే డెలివరీ విభాగాల ఏర్పాటు
- నాలుగైదు పోస్టాఫీసులకు కలిపి ఒకచోట వ్యవస్థ
- మిగతా తపాలా కార్యాలయాల్లో ఆ విభాగాల రద్దు
- ఫోన్ చేస్తే ఇంటికే వచ్చి పార్శిల్ బుకింగ్
- భారీ సంస్కరణలు చేపట్టిన తపాలా శాఖ.. త్వరలో అందుబాటులోకి



సాక్షి, హైదరాబాద్: పోస్టు చేసిన పార్శిల్ ఎప్పుడు గమ్యం చేరుతుందో..అసలు చేరుతుందో లేదో.. అన్న అపవాదును దూరం చేసుకునేందుకు తపాలాశాఖ కీలక మార్పులు చేపట్టింది. శాఖను సంస్కరించటం ద్వారా కొత్త విధానాలను తెరపైకి తెస్తోంది. తొలుత దేశంలోని మెట్రోపాలిటన్ నగరాలకు పోస్టు చేసే పార్శిల్/ లెటర్ మరుసటి రోజే గమ్యం చేరేలా కొత్త విధానాన్ని అందుబాటులోకి తెస్తోంది. తదుపరి మిగతా నగరాలకు కూడా దీన్ని వర్తింప చేయనుంది. ఇక, నిర్ధారిత గడువులో ఏరోజు, ఏ సమయంలో బట్వాడా కావాలో పోస్టు చేసే వ్యక్తి ఎంచుకునేలా కూడా మరో విధానాన్ని అందుబాటులోకి తెస్తోంది. మరో అడుగు ముందుకేసి, పార్శిల్ కవర్‌ను పోస్టాఫీసు వరకు వెళ్లి అందించాల్సిన అవసరం లేకుండా, ఫోన్ చేస్తే పోస్ట్‌మన్ ఇంటికే వచ్చి ఆర్డర్ బుక్ చేసుకొని, బట్వాడా చేయాల్సిన పార్శిల్‌ను తీసుకెళ్లే విధానాన్ని కూడా ప్రారంభించబోతోంది.

సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్నా...

ఆధునిక సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్నా.. తపాలాశాఖ కొన్ని సంప్రదాయ విధానాలనే నేటికీ కొనసాగిస్తోంది. బట్వాడాలో వేగం విషయంలో ప్రైవేటు కొరియర్ సంస్థలతో పోటీపడేలా తన విధానాలను సంస్కరించుకుంటోంది. మెట్రో నగరాల మధ్య పార్శిళ్లు పోస్టు చేసిన మరుసటి రోజే గమ్యం చేరే విధానాన్ని వచ్చే నెలలో అందుబాటులోకి తీసుకొస్తోంది.

డెలివరీ విభాగ వ్యవస్థను మార్చటం ద్వారా...

పోస్టాఫీసులోని సిబ్బంది ఇతర కార్యకలాపాలు పర్యవేక్షిస్తూ డెలివరీ కార్యకలాపాలు నిర్వహిస్తారు. ఇప్పుడు ఈ విధానాన్ని పూర్తిగా మార్చేస్తున్నారు. నాలుగైదు పోస్టాఫీసులకు ఒకటి చొప్పున మాత్రమే డెలివరీ విభాగాన్ని కలిగి ఉంటుంది. అందులో డెలివరీ కార్యకలాపాలు చూసేందుకు ప్రత్యేక సిబ్బంది ఉంటారు. వారికి ఇతర తపాలా విధులు ఉండవు. మిగతా పోస్టాఫీసుల్లో సిబ్బంది ఇక డెలివరీ విధులు చూడరు. ఈ డెలివరీ విభాగం ఉన్న పోస్టాఫీసు 24 గంటలు పనిచేస్తుంది. ఆదివారం కూడా తెరిచే ఉంటుంది. ఆమేరకు సిబ్బందిని సర్దుబాటు చేస్తారు. డెలివరీ కావాల్సిన పార్శిళ్లు వచ్చిన వెంటనే వాటిని బట్వాడా చేసే పని ప్రారంభిస్తారు. దాని పరిధిలోని అన్ని పోస్టాఫీసుల పోస్టుమన్ ఆ డెలివరీ విభాగం ఉన్న పోస్టాఫీసుకు వచ్చి డెలివరీ కావాల్సిన పార్శిళ్లను తీసుకెళతారు. వారు మూడు షిఫ్టుల్లో పనిచేసేలా పని విభజన ఉంటుంది. దీంతో ఏ సమయంలోనైనా బట్వాడా పని కొనసాగుతూనే ఉంటుంది. దూరాభారం ఉండనున్నందున పోస్‌మన్‌కు పెట్రోల్ భత్యం చెల్లిస్తారు. వారు కచ్చితంగా ద్విచక్ర వాహనం వినియోగించాల్సి ఉంటుంది.

ఫోన్ చేస్తే ఇంటికే వచ్చి పార్శిల్ బుకింగ్...


ప్రస్తుతం పార్శిళ్లను బుక్ చేసేందుకు పోస్టాఫీసుకు వెళ్లాల్సి వస్తోంది. ఇకపై ఫోన్ చేస్తే సిబ్బంది ఇంటికే వచ్చి పార్శిళ్లను బుక్ చేసుకొని తీసుకెళ్తారు. ఇందుకోసం ప్రత్యేక ఫోన్ నంబర్లను తపాలాశాఖ వెల్లడించనుంది. ప్రజల్లో ఆ నంబర్లపై అవగాహన పెరిగేలా, ప్రతి పార్శిల్‌పై ఆ ఏరియా బుకింగ్ ఫోన్ నంబర్‌ను ముద్రిస్తారు. పోస్టాఫీసుల్లో కూడా నోటీసు బోర్డుల్లో ఉంచుతారు.

బ్యాంకు తరహా వాతావరణం

పోస్టాఫీసుకు వెళితే అక్కడ పార్శిళ్లు, కవర్ల బుకింగ్, పోస్టల్ పేమెంట్ బ్యాంకు లావాదేవీలు చేస్తూనే, మరోవైపు బట్వాడా కావాల్సిన పార్శిళ్లపై పెద్ద శబ్దంతో ముద్రలు కొడుతుంటారు. పార్శిళ్ల కోసం పోస్ట్‌మెన్ తిరుగుతుంటారు..గట్టిగా మాట్లాడుతుంటారు..వెరసి ఆ ప్రాంతం గందరగోళంగా కనిపిస్తుంది. ఇప్పుడు డెలివరీ విభాగాలను తొలగించటం ద్వారా, ఈ గందరగోళం లేకుండా పోస్టాఫీసులు సాధారణ బ్యాంకుల తరహాలో కనిపించేలా చేయబోతున్నారు. ఇది ఖాతాదారులను ఆకర్షించటంతోపాటు, వేగంగా పనులు జరిగేందుకు దోహదం చేస్తుందని తపాలాశాఖ భావిస్తోంది.

నెలకు రూ.1,500 సరిపోతుందా?

- విద్యార్థుల భోజనంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఒక విద్యార్థి మెనూ నెలకు రూ.1,500 ఎలా సరిపోతుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. అది 2022 నాటి లెక్కల ప్రకారమని, ఇప్పుడు మరింత పెంచామని సర్కార్ తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ బదులిచ్చారు. ఒక్కో విద్యార్థికి ఎంత బడ్జెట్ ఇస్తున్నారు.. మెనూలో ఏఏ ఆహార పదార్థాలు ఉంటాయి.. వాటిలో పోషకాల విలువలు ఎంత.. ఇలా సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, ప్రైవేట్ పాఠశాలలో ఫీజు నియంత్రణకు కమిటీని నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కీతినీడి అఖిల్ శ్రీ గురు తేజ ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్, ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. విద్యార్థులకు రూ.1,500 చాలా తక్కువేనని, ఇప్పుడు ఎంత చెల్లిస్తున్నారో కౌంటర్ వేయాలని సర్కార్‌ను ఆదేశించింది. విచారణ దసరా సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.

క్లుప్తంగా...



అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ అధికారులు

రామగుండం ఎన్టీపీసీకి 'ఎనర్జీ ఎఫీషియెన్సీ ప్లాంట్' అవార్డు

జ్యోతినగర్ (రామగుండం): పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ ప్రాజెక్టు అత్యంత ప్రతిష్టాత్మక సీఐఐ ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫీషియెన్సీ ప్లాంట్ అవార్డు–2025 సాధించింది. హైదరాబాద్ హైటెక్స్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు అవార్డు అందుకున్నారు. ఇంధన సామర్థ్యం, పర్యావరణ నిర్వహణ, కార్యాచరణ విశ్వసనీయత రంగాల్లో స్థిరమైన నాయకత్వాన్ని పునరుద్ఘాటించినందుకు ఈ అవార్డు గెలుచుకుందని పురస్కారం అందుకున్న ప్రాజెక్టు అధికారులు వంశీకృష్ణ, సతీశ్, సచిన్ తెలిపారు. ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సామంత.. అవార్డు సాధించిన బృందాన్ని ప్రశంసించారు.

సింగరేణి సీఎండీ బలరాంకు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న సీఎండీ బలరాం

సూపర్‌బజార్ (కొత్తగూడెం): సింగరేణి సంస్థను అభివృద్ధి పథంలో నడుపుతూ గత ఆర్థిక సంవత్సరం అత్యుత్తమ ఫలితాలు సాధించడమే కాక వివిధ వ్యాపార విస్తరణ చర్యలతో గట్టి పునాదులు వేసిన సీఎండీ ఎస్.బలరాంకు మరో ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. దక్షిణ భారతదేశంలో అత్యుత్తమ సీఎండీగా గుర్తిస్తూ ప్రతిష్టాత్మక ఏసియా పసిఫిక్ హెచ్ఆర్ఎం కాంగ్రెస్ ఈ అవార్డును ప్రదానం చేసింది. బెంగళూరులో గురువారం నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో బలరాం ఈ అవార్డు అందుకున్నారు. ఖనిజ రంగంలో ప్రవేశం కోసం రెండు ఏజెన్సీల ఏర్పాటు, కర్ణాటకలో బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ దక్కించుకోవడం, రాజస్తాన్‌లో సోలార్, థర్మల్ ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందాలు, కార్మిక సంక్షేమ కార్యక్రమాలు, సామాజిక బాధ్యతగా అభివృద్ధి కార్యక్రమాలను సీఎండీ చేపట్టారని తెలిపారు. కార్మికులందరికీ రూ.కోటి ప్రమాద బీమా, పర్యావరణ పరిరక్షణకు స్వయంగా 20 వేలకు పైగా మొక్కలు నాటారని అభినందించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ ఇది సింగరేణి కార్మికులు, అధికారుల సమష్టి కృషికి దక్కిన గుర్తింపని పేర్కొన్నారు.

తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరు తొలగింపు



సాక్షి, అమరావతి: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరును తొలగిస్తూ చేసిన చట్ట సవరణకు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన అసెంబ్లీలోని ఆయన చాంబర్‌లో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. 'వైఎస్సార్ తాడిగడప'కు బదులుగా 'తాడిగడప'మునిసిపాలిటీగా చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపింది. అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్న పలు ముసాయిదా బిల్లులను కూడా మంత్రివర్గం ఆమోదించింది.



పులివెందుల మెడికల్ కాలేజీ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పీపీపీ బాబూ.. సిగ్గు సిగ్గు!

- వైఎస్సార్‌సీపీ 'ఛలో మెడికల్ కాలేజ్' కార్యక్రమంలో మిన్నంటిన నినాదాలు
- పోలీసులు అడ్డుకునే యత్నం చేసినా కార్యక్రమం గ్రాండ్ సక్సెస్
- వైఎస్ జగన్ పిలుపుతో ఎక్కడికక్కడ పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు, యువత
- ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి అధికార దుర్వినియోగానికి పల్పడిన కూటమి సర్కార్

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: ఏపీలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. సామాన్యులకు వైద్య విద్యను దూరం చేస్తూ చంద్రబాబు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి జనం కదంతొక్కారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని.. జీవో 590ను రద్దు చేయాలని.. పీపీపీ బాబూ.. సిగ్గు సిగ్గు.. అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రంలో 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు వైద్య సేవలను మెరుగుపర్చటం.. సామాన్యులకు వైద్య విద్యను అందించాలనే లక్ష్యంతో నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారు. ఇందులో ఐదు కాలేజీలు 2023–24 సంవత్సరంలోనే ప్రారంభించారు. పాడేరు, పులివెందుల మెడికల్ కాలేజీల నిర్మాణం అప్పటికే పూర్తయింది. మిగతా పది మెడికల్ కాలేజీల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కార్ మిగిలిన పనులను ఉద్దేశ పూర్వకంగా పూర్తి చేయలేదు. ఆ పది మెడికల్ కాలేజీలను ముడుపుల కోసం సన్నిహితులకు కట్టబెట్టేందుకు వాటిని ప్రైవేటీకరించాలని సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం నిర్వహించిన 'చలో మెడికల్ కాలేజ్'కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి టీడీపీ కూటమి సర్కార్ యథావిధిగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ పోలీసులను ప్రయోగించింది. వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ గృహ నిర్బంధం చేశారు. ఆ కార్యక్రమంలో పాల్గొంటే కేసులు పెడతామని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను బెదిరించారు. నిర్బంధాలను ఛేదించుకుని.. బెదిరింపులకు బెదరకుండా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు కదంతొక్కారు. ఈ ర్యాలీలకు సామాన్య ప్రజలు తండోపతండాలుగా కదలి వచ్చారు. మెడికల్ కాలేజీల వద్దకు భారీ ఎత్తున ర్యాలీగా తరలివస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామన్య ప్రజలపై పోలీసులు లాఠీలను ఝుళిపించారు. పోలీసుల లాఠీల దెబ్బలకు జడవకుండా సర్కార్‌పై రణభేరి మోగించారు. 'పీపీపీ వద్దు.. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ముద్దు.. మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించు కోవాలి.. జీవో 590 వెంటనే రద్దు చేయాలి.. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటుపరం.. సామాన్యుడుకి ఉన్నత చదువు దూరం..'నినాదాలతో కూడిన ప్లకార్డులతో ప్రజలు ర్యాలీల్లో కవాతు చేశారు.

'సాక్షి'పై ప్రభుత్వ కక్ష సాధింపు తగదు

పత్రికా స్వేచ్ఛను హరించొద్దు

- సీఎం చంద్రబాబుకు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా ఘాటు లేఖ
- కేవలం 'సాక్షి'నే లక్ష్యంగా చేసుకుని కేసులు పెట్టడంపై తీవ్ర ఆందోళన
- ఇది అధికార దుర్వినియోగమేనని స్పష్టీకరణ
- విలేకరుల సమావేశాన్ని ప్రచురించినందుకు వేధించడం దారుణం
- పత్రికల గొంతు నొక్కే చర్యలను తక్షణమే ఆపాలని డిమాండ్



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడి, ప్రత్యేకించి 'సాక్షి' మీడియా సంస్థను లక్ష్యంగా చేసుకుని చంద్రబాబు ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులపై జాతీయ స్థాయిలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏపీలో 'సాక్షి' మీడియా సంస్థతోపాటు జర్నలిస్టుల పట్ల పోలీసుల వ్యవహారశైలిపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఈజీఐ) తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు శుక్రవారం ఎడిటర్స్ గిల్డ్ ఒక ఘాటు లేఖ రాసింది. 'సాక్షి'పై కక్ష సాధింపు చర్యలను తక్షణమే నిలిపివేయాలని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడు అనంత్ నాథ్, ప్రధాన కార్యదర్శి రూబెన్ బెనర్జీ, కోశాధికారి కె.వి. ప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు.

ఒక్క పత్రికపైనే ఎందుకు?

ఒక రాజకీయ నాయకుడు నిర్వహించిన విలేకరుల సమావేశాన్ని ప్రచురించినందుకు ఇతర మీడియా సంస్థలను వదిలిపెట్టి, కేవలం 'సాక్షి'పై మాత్రమే క్రిమినల్ కేసు నమోదు చేయడాన్ని ఎడిటర్స్ గిల్డ్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇది పక్షపాత వైఖరికి నిదర్శనమని, నేర చట్టాలను ఎంపిక చేసుకుని ప్రయోగించడం పోలీసుల అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని పేర్కొంది. ఇది సాధారణ జర్నలిజంలో భాగమే అయినప్పటికీ, 'సాక్షి'ని మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం వెనుక ప్రభుత్వ కుట్ర స్పష్టంగా కనిపిస్తోందని అభిప్రాయపడింది.

వేధింపులు ఆపండి

పత్రికలను అనవసరమైన, కక్ష సాధింపు ఫిర్యాదులతో వేధించకూడదని ఎడిటర్స్ గిల్డ్ హితవు పలికింది. పోలీసుల ప్రవర్తన నిష్పక్షపాతంగా, వృత్తిపరంగా ఉండాలని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసే సంస్థలను భయపెట్టేలా ఉండకూడదని స్పష్టంచేసింది. ప్రజా ప్రయోజనాల కోసం పనిచేస్తున్న జర్నలిస్టులను అణచివేయడానికి, భయపెట్టడానికి క్రిమినల్ చట్టాలను ఆయుధాలుగా వాడటం రాజ్యాంగ విరుద్ధమని తెలిపింది. తక్షణమే ముఖ్యమంత్రి కార్యాలయం జోక్యం చేసుకుని, రాష్ట్రంలో పత్రికలు నిర్భయంగా విధులను నిర్వర్తించే వాతావరణాన్ని కల్పించాలని ఎడిటర్స్ గిల్డ్ డిమాండ్ చేసింది.

సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై అక్రమ కేసులు పత్రికా స్వేచ్ఛపై దాడే: ఐజేయూ

'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయ రెడ్డి, పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛపై దాడే అని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) తీవ్రంగా విమర్శించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులతోనే సాక్షి దినపత్రిక, పాత్రికేయులను వేధిస్తోందని ఐజేయూ ప్రధాన కార్యదర్శి బల్విందర్‌సింగ్ జమ్ము శుక్రవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో పోలీసులు ఇటీవల తనిఖీలు చేయడం, ఆయనకు నోటీసులు జారీ చేయడం పత్రికా స్వేచ్ఛపై ముప్పేట దాడి చేయడమేనని ఆయన దుయ్యబట్టారు. సాక్షి ఎడిటర్, పాత్రికేయులను భయపెట్టేందుకే పోలీసులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పత్రికలను నియంత్రించాలని ఏ ప్రభుత్వం భావించకూడదన్నారు. పత్రికల్లో ప్రచురితమైన వార్తలు, కథనాలపై అభ్యంతరం ఉంటే న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని బల్విందర్‌సింగ్ స్పష్టంచేశారు. కానీ, పత్రికలపై అక్రమ కేసులు నమోదు చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి చర్యలను ఐజేయూ ఏమాత్రం ఆమోదించదని స్పష్టంచేశారు.

నిరసన తెలిపే హక్కును కాలరాస్తారా?

- శాంతియుత ఆందోళనలను ఎందుకు పాశవికంగా అడ్డుకోవాలనుకున్నారు?
- సీఎం చంద్రబాబును నిలదీసిన వైఎస్ జగన్
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల్సిందే
- అప్పటి వరకు మరింత ఉధృతంగా పోరాటాలు కొనసాగుతాయని స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం శాంతియుతంగా ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించిన వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం దారుణం అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల తరపున నిరసన తెలిపే రాజ్యాంగ పరమైన హక్కులను కాలరాస్తారా? అంటూ సీఎం చంద్రబాబును నిలదీశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకు పోరాటాలు మరింత ఉధృతంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే..

→ చంద్రబాబు గారూ.. ప్రజారోగ్య రంగాన్ని, పేదల ఆరోగ్య భద్రతను కాపాడుకునేందుకు, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజల తరపున, వారి గొంతును గట్టిగా వినిపిస్తూ, వారితో కలిసి వైఎస్సార్‌సీపీ యూత్, స్టూడెంట్ విభాగాల నేతృత్వంలో చేపట్టిన శాంతియుత ఆందోళనలు, ర్యాలీలను ఎందుకు పాశవికంగా అడ్డుకోవాలనుకున్నారు? ఎందుకు లాఠీచార్జ్ చేశారు? గృహ నిర్బంధాలు, అరెస్టులు ఎందుకు చేశారు? ఈ రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం అనేది ఉందా? ప్రజల తరపున నిరసన తెలిపే రాజ్యాంగ పరమైన హక్కులను కాలరాస్తారా?

→ మీరు స్కాములు చేస్తూ ప్రజల ఆస్తులైన గవర్నమెంట్ మెడికల్ కాలేజీలను మీ అనుయాయులకు అమ్మేస్తుంటే వాటిని ప్రశ్నించకూడదా? ప్రజల తరపున గొంతెత్తితే అణచి వేస్తారా? మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఇటు అసెంబ్లీ వెలుపల కూడా మా పార్టీ ఎమ్మెల్సీలు నిరసన తెలుపుతుంటే పోలీసుల చేత దౌర్జన్యం చేయించడం మీ బరితెగింపు కాదా? ఈ కార్యక్రమాన్ని కవర్ చేస్తున్న మీడియా ప్రతినిధులపై దాడులకు దిగుతారా? ఏమిటీ రాక్షసత్వం?

→ మీరింతగా తెగబడినా ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం మా పార్టీ ఆధ్వర్యంలో మా నాయకులు, వీరితోపాటు యువతీ యువకులు, స్టూడెంట్లు తెగింపు చూపారు. ప్రజల పక్షాన నిలిచి అటు శాసన మండలిలో, ఇటు మెడికల్ కాలేజీల ఆవరణలో విజయవంతంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వారందరికీ అభినందనలు తెలియజేస్తున్నా. పేదల ఆరోగ్య భద్రత, పేద విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ కోసం, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకు పోరాటాలు మరింత ఉధృతంగా కొనసాగుతాయి.

అజ్ఞానుల్లో అజ్ఞాని బీఆర్ నాయుడు

- హైందవ ధర్మం.. ఆగమ శాస్త్రం తెలుసా..?
- టీటీడీ చైర్మన్‌ను సూటిగా ప్రశ్నించిన భూమన
- కరుణాకర్‌రెడ్డిని 4 గంటలపాటు విచారించిన పోలీసులు



విచారణ అనంతరం పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వస్తున్న భూమన కరుణాకర రెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ''అజ్ఞానుల్లో అజ్ఞాని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు. అలాంటి వ్యక్తులను చూసి భయపడను. మీకు ఆధ్యాత్మికత, హైందవ ధర్మం, ఆగమశాస్త్రం గురించి తెలియదు. తెలిసిందల్లా మిడ్‌నైట్ మసాలా గురించి మాత్రమే. బీఆర్ నాయుడుకు ఉన్న ఆధ్యాత్మిక జ్ఞానంపై ఆయన చానెల్ టీవీ-5లోనే నేను చర్చకు సిద్ధం'' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సవాల్ విసిరారు. అలిపిరి వద్ద తిరుమల తిరుపతి దేవస్థాన స్థలంలో మలమూత్రాలు విసర్జించే చోట శ్రీమహావిష్ణు విగ్రహం నిర్లక్ష్యంగా పడవేసి ఉండడాన్ని ఇటీవల భూమన గమనించారు. ప్రత్యక్షంగా పరిశీలించి మీడియా సమావేశంలో టీటీడీ తీరుపై మండిపడ్డారు. అయితే, దీనిపై భూమన కరుణాకర్‌రెడ్డి మీద ఓ ఇంజనీర్ చేత కక్షపూరితంగా ఫిర్యాదు చేయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు... భూమనకు రెండ్రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ భక్తవత్సలం ఎదుట భూమన హాజరయ్యారు. నాలుగు గంటల పాటు విచారించిన పోలీసులు 31 ప్రశ్నలు వేశారు. వీటికి సమాధానం ఇచ్చినట్లు భూమన తెలిపారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడారు. బీఆర్ నాయుడు ఒత్తిడి మేరకు ఇంజనీర్‌తో ఫిర్యాదు చేయించి... హైందవ ధర్మం, మత విద్వేషాలు రెచ్చగొట్టానని తనపై తప్పుడు కేసు పెట్టారన్నారు. విగ్రహ ఘటనలో తప్పిదాలుంటే టీటీడీలో అత్యున్నత అధికారి ఈవో ఫిర్యాదు చేయాలి కానీ, ఇంజనీర్‌తో ఫిర్యాదు విడ్డూరమని పేర్కొన్నారు. మహా విష్ణువు విగ్రహాన్ని శనీశ్వరుడి విగ్రహం అనడం మహా పాపమని మండిపడ్డారు. టీటీడీ స్థలంలో శంఖుచక్రాలు ధరించిన విగ్రహం పడి ఉందనే విషయం తన దృష్టికి రాగా, అది ఘోరమైన తప్పిదంగా భావించానన్నారు. ఇది ఎలా హైందవ ద్రోహమో బీఆర్ నాయుడుకు మాత్రమే తెలుసని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక శనీశ్వరుడు దేవతామూర్తి కాదా..? అంటూ ప్రశ్నించారు. శని దేవుడికి శంఖుచక్రాలు ఉండవని వెల్లడించారు. ఈ విషయంలో ఎల్లో మీడియా విష ప్రచారం చేస్తోందన్నారు. ''నాపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టాలని ఆలోచన చేస్తున్నారు. నేను కేసులకు భయపడే, బెదిరే వ్యక్తిని కాను. ఏ తప్పు చేయలేదు. చేయను. ఎన్నిసార్లు పిలిచినా పోలీసు విచారణకు వస్తా'' అని భూమన తేల్చి చెప్పారు. అనంతరం తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దాని తప్పులను భూమన ఎత్తి చూపిస్తున్నారని, సరిచేసుకోవాల్సింది పోయి... బీఆర్ నాయుడు కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని అన్నారు. తొక్కిసలాట, గోశాల ఘటనను ప్రజలు గమనించారని పేర్కొన్నారు. భూమన సవాల్‌ను స్వీకరించాలని కోరారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ, ఎండగడుతూనే ఉంటామని ఎంపీ స్పష్టం చేశారు.

బీటీపీఎస్‌లో ఓ అధికారి ఇష్టారాజ్యం

- మూడేళ్లలో లెక్కకు మించి ఆస్తుల సంపాదన
- కాంట్రాక్టర్లతో కుమ్మక్కు.. కమీషన్ల జోరు
- జెన్‌కో ఉన్నతాధికారులకు వాటాలు
- ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు

సాక్షి, హైదరాబాద్: భద్రాచలం థర్మల్ విద్యుత్ కేంద్రం (బీటీపీఎస్)లో ఓ ఉన్నతాధికారి అవినీతి, అక్రమాస్తులపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు అన్ని ఆధారాలతోపాటు, అధికారి వ్యవహారశైలిని వివరించారు. దీంతో సీఎంవో తక్షణ విచారణకు ఆదేశించింది. ఈ ఫిర్యాదు ఆధారంగా అవినీతి నిరోధక శాఖ, టీజీ జెన్‌కో ఉన్నతాధికారులు బీటీపీఎస్‌లో జరుగుతున్న అవినీతి కార్యకలాపాలపై ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో అవినీతి మూలాలు టీజీ జెన్‌కో ప్రధాన కార్యాలయంలోనూ ఉండటంతో ఉన్నతాధికారులు ఆశ్చర్యపోతున్నారు. జెన్‌కో వర్గాల నుంచి అందిన విశ్వసనీయ సమాచారం ప్రకారం.. 2022లో బీటీపీఎస్ బాధ్యతలు చేపట్టిన ఓ అధికారి తక్కువ సమయంలోనే రూ. కోట్లల్లో ఆస్తులు పోగేసినట్టు తెలుస్తోంది. హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో మూడు ఇళ్లు, శివారు ప్రాంతంలో ఒక విల్లా, ఖమ్మం, పాల్వంచల్లో ఇళ్లు, స్థలాలు ఉన్నట్టు తేలింది. బీటీపీఎస్‌లో కాంట్రాక్టు పని కోసం కొందరు కాంట్రాక్టర్లు ఆ అధికారి భార్య వద్ద బేరసారాలు చేసుకుంటారని, అక్కడి నుంచి క్యాప్చెల్-ఆర్ (పైకం అందింది) అనే మెసేజ్ వచ్చిన తర్వాతే కాంట్రాక్టును ఖరారు చేస్తారని జెన్‌కో ప్రాథమిక విచారణలో తేలింది. ఏడాది క్రితం ఓ కాంట్రాక్టర్ నాసిరకం పరికరాలు వాడటం వల్ల ఎఫ్‌డీ ఫ్యాన్ కూలిపోయి, ప్లాంట్‌కు రూ.40 లక్షల నష్టం వాటిల్లింది. దీనిపై కాంట్రాక్టు సంస్థకు కనీసం నోటీసు కూడా ఇవ్వకపోవడం జెన్‌కో ఉన్నతాధికారులను ఆశ్చర్య పరుస్తోంది. కాంట్రాక్టర్ నుంచి రూ.20 లక్షలు తీసుకొని, అంతా బాగుందని, సాంకేతిక లోపమే కారణమని ధృవీకరించినట్టు ఉన్నతాధికారుల విచారణలో తేలింది. అక్కడ పని చేస్తున్న అకౌంట్స్ అధికారికి కూడా ఈ అవినీతిలో భాగస్వామ్యం ఉందని స్థానికంగా ఫిర్యాదులున్నాయి. బీటీపీఎస్ అధికారి సోదరుడు కూడా ఇదే ప్లాంట్‌లో పనిచేయడం, అతనిపైనా అవినీతి ఆరోపణలున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫిర్యాదు వచ్చింది... విచారిస్తున్నాం

బీటీపీఎస్ అధికారిపై ఫిర్యాదు వచ్చింది. దీనిపై విచారణకు ఆదేశించాం. త్వరలోనే వాస్తవాలు ఏంటో బయటపెడతాం. అవినీతికి పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదులో ఉన్న ప్రతీ అంశాన్ని పరిశీలిస్తాం.

– ఎస్.హరీశ్, టీజీ జెన్‌కో ఎండీ

మద్యం డాన్.. మరో డ్రామా!

- మద్యం విధానంపై అక్రమ కేసులో బాబు సర్కారు రోజుకో కొత్త నాటకం
- వైఎస్ అనిల్‌రెడ్డి కార్యాలయాల్లో సిట్ సోదాలు
- లేని కుంభకోణం ఉన్నట్టుగా చూపించే కుతంత్రం
- చంద్రబాబు డైరెక్షన్‌లోనే సిట్ కపట నాటకం


సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ హయాంలో లేని కుంభకోణం ఉన్నట్టుగా చిత్రీకరించేందుకు చంద్రబాబు సర్కారు బరితెగించి వ్యవహరిస్తోంది. టీడీపీ వీర విధేయ అధికారులతో కూడిన సిట్‌తో ఈ పన్నాగాన్ని అమలు చేస్తోంది. అందుకోసం సాక్షులను, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను బెదిరించి అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేసింది. రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి, పూర్వ ఉద్యోగులు సత్య ప్రసాద్, అనూషలను వెంటాడి వేధించి అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేశారు. వాటి ఆధారంగానే గత ప్రభుత్వ మద్యం విధానంపై అక్రమ కేసులు నమోదు చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు డైరెక్షన్‌లో సిట్ ఎప్పటికప్పుడు వివిధ పాత్రలను తెరపైకి తెస్తూ నిరాధార అభియోగాలతో ప్రజల్ని తప్పుదారి పట్టిస్తోంది. మొదట రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, వికాట్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్పలను అక్రమంగా అరెస్టు చేసి బురద జల్లారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలను అక్రమంగా అరెస్టు చేసి దుష్ప్రచారం చేశారు. టీడీపీ అనుకూల మీడియా ద్వారా విష ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారు. అంతటితో చంద్రబాబు కుట్రలు ఆగలేదు... ఈ రెడ్‌బుక్ కుట్ర కేసులో రెండో అంకంగా.... నర్రెడ్డి సునీల్‌రెడ్డి నివాసంలో సోదాలతో మరో కట్టుకథ వినిపించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, సజ్జల భార్గవ్ రెడ్డి పేర్లను తెరపైకి తెచ్చారు. తాజాగా వైఎస్ జగన్ సమీప బంధువు వైఎస్ అనిల్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నారు. చెన్నై, హైదరాబాద్‌లలోని ఆయన నివాసాలు, కార్యాలయాల్లో సిట్ అధికారులు శుక్రవారం సోదాలకు దిగారు. చెన్నైకు చెందిన వ్యాపారవేత్త వైఎస్ అనిల్‌రెడ్డి ఏనాడూ ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఆయన అమరావతికి రానే లేదు. ఇక ప్రభుత్వ వ్యవహారాల్లోగానీ ఇతర అంశాల్లోగానీ ఆయన ఏనాడూ కల్పించుకోలేదు. కానీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు సర్కారు వైఎస్ అనిల్‌రెడ్డి నివాసంలో సోదాలు చేయాల్సిందేనని సిట్‌ను ఆదేశించింది. ఇదే అదనుగా ఎల్లో మీడియా ద్వారా వైఎస్ కుటుంబంపై బురద జల్లాలన్నదే అసలు లక్ష్యం. రానున్న రోజుల్లో సిట్ ద్వారా రెడ్‌బుక్ కుట్రలకు మరింత పదును పెట్టడమే ధ్యేయంగా చంద్రబాబు ప్రభుత్వం బరితెగిస్తోందన్నది స్పష్టమవుతోంది.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి


రాజ్ కేసిరెడ్డిని ఎంపిక చేసుకోవడంలోనే కుట్ర

రెడ్‌బుక్ కుట్ర కేసు కోసం చంద్రబాబు ప్రభుత్వం పక్కా పన్నాగంతో వ్యవహరించింది. ఈ కేసుకు కేంద్ర బిందువుగా రాజ్ కేసిరెడ్డిని ఎంపిక చేసుకోవడంలోనే కూటమి సర్కారు కుతంత్రం దాగుంది. ఆయన చెప్పని విషయాలను సైతం చెప్పినట్టుగా సిట్ తప్పుడు వాంగ్మూలాన్ని నమోదు చేసింది. అసలు ఆ వాంగ్మూలంపై ఆయన సంతకం చేయలేదని సిట్ అధికారులే ఆ రిమాండ్ నివేదికలో వెల్లడించారు. లేదంటే రాజ్ కేసిరెడ్డి తాను ఆ వాంగ్మూలం ఇవ్వలేదని న్యాయస్థానానికి చెబితే తాము ఇబ్బంది పడాల్సి వస్తుందనే భయంతోనే సిట్ ఆ విషయాన్ని నివేదికలో పేర్కొంది. ఇక అసలు విషయం ఏమిటంటే... రాజ్ కేసిరెడ్డి ఎవరో కాదు... ఆయన టీడీపీ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) వ్యాపార భాగస్వామి. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడు కూడా. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగానే అంటే 2021లోనే రాజ్ కేసిరెడ్డి ప్రస్తుత విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)తో భాగస్వామిగా వ్యాపారాలు నిర్వహించారు. రాజ్ కేసిరెడ్డికి చెందిన 'డే ఇన్‌ఫ్రాకాన్ ఎల్ఎల్‌పీ'లో కేశినేని చిన్ని దంపతులు వాటాదారులుగా ఉన్నారు. అక్రమంగా నిధులు తరలించారని సిట్ అధికారులు చెబుతున్న ఇషన్వీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రైడే ఇన్‌ఫ్రా ఎల్ఎల్‌పీ హైదరాబాద్‌లోని ఒకే చిరునామాతో (జూబ్లీ హిల్స్, సర్వే నంబర్ 403, ప్లాట్ నంబర్ 9)తో రిజిస్టర్ అయ్యాయి. అంతే కాదు ఆ రెండు కంపెనీలు ఒకే మెయిల్ ఐడీ (accounts@ wshanviinfraprojects.com)నే ఉపయోగిస్తుండటం గమనార్హం. కేశినేని చిన్ని ఏకంగా 12 రియల్ ఎస్టేట్, విదేశీ కంపెనీల ద్వారా భారీగా నల్లధనాన్ని అమెరికా, దుబాయ్‌లకు తరలించి భారీ పెట్టుబడులు పెట్టారు. రాజ్ కేసిరెడ్డి వ్యాపార భాగస్వామి కేశినేని చిన్ని మంత్రి నారా లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడే కాదు బినామీ అన్నది బహిరంగ రహస్యమే. అందుకే పట్టుబట్టి మరీ ఆయనకు విజయవాడ ఎంపీ టికెట్ ఇప్పించారు. అనంతరం ఆంధ్రా క్రికెట్ అసోషియేషన్ అధ్యక్షుడిగా చేశారు. ఇక కేశినేని చిన్ని బినామీ కంపెనీ 'ఉర్సా ఐటీ సొల్యూషన్స్'కు విశాఖలో అత్యంత విలువైన 60 ఎకరాలను కారుచౌకగా కట్టబెట్టే కుట్రలకు తెర తీశారు. కేశినేని చిన్ని ముసుగులో ప్రభుత్వ పెద్దలు దోపిడీకి పాల్పడుతున్నారు. మరి రాజ్ కేసిరెడ్డి వ్యాపార భాగస్వామి అయిన ఎంపీ కేశినేని చిన్నిపై సిట్ ఎందుకు కేసు నమోదు చేయడం లేదన్నది కీలకం. అంటే ఇదంతా చంద్రబాబు రెడ్‌బుక్ కుతంత్రమేనన్నది తేటతెల్లమవుతోంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


TATA
డెలిట్ లిమిట్స్
504 Nm టార్క్, క్వాడ్ వీల్ డ్రైవ్ డ్యూయల్ మోటార్, 0-100 kmph ఇన్ 6.3° సెకన్స్
డెలిట్ డిస్‌కంఫర్ట్
అల్ట్రా గ్లైడ్ సస్పెన్షన్ సెట్-అప్
డెలిట్ ఇన్‌కన్వీనియెన్స్
ఈ- వాలెట్- ఆటో పార్క్ అసిస్ట్
డెలిట్ బోరింగ్
36.9 cm (14.53) సినిమాటిక్ ఇన్ఫోటెయిన్‌మెంట్ స్క్రీన్ బై Harman™ పవర్డ్ బై Samsung Neo QLED
డెలిట్ అన్‌సర్టెనిటీ
540° సరౌండ్ వ్యూ కెమెరా*, L2 ADAS మరియు E-IRVM
డెలిట్ డౌట్స్
లైఫ్‌టైమ్ HV బ్యాటరీ ప్యాక్ వారంటీ* అండ్ సర్టిఫైడ్ రేంజ్ ఆఫ్ 627km
Harrier.ev ప్రతి అసాధ్యాన్నీ డెలిట్ చేసింది —
మిమ్మల్ని ఏది ఆపుతోంది?
ఇవాళే బుక్ చెయ్యండి
MH01EJ76
Harrier.ev with 4WD DualMotor
ధర ప్రారంభం ₹21.49 LAKH* వద్ద
₹1,00,000* ల ప్రత్యేక లాయల్టీ ప్రయోజనం TATA.ev ఓనర్లకై
book harrier.ev
Book now
కొనండి ఇప్పుడు, చెల్లించండి తర్వాత 100% ఆన్-రోడ్ ఫైనాన్సింగ్*, జీరో డౌన్‌పేమెంట్ మరియు అతి తక్కువ వడ్డీ రేట్లు*
భారతదేశమంతా పెరుగుతున్న 25,000+ పబ్లిక్ ఛార్జర్ల నెట్‌వర్క్###
2.3 లక్షల+ సంతృప్తి చెందిన Tata.ev ఓనర్లు
ఇండియాలో 10 బిలియన్+ కిమీ. లు ప్రయాణించాయి~
BHARAT NCAP
ఇండియాలోని అత్యంత సురక్షితమైన AWD SUV
మీకు దగ్గరలో ఉన్న TATA Motors డీలర్‌షిప్‌ని కనుక్కునేందుకు, స్కాన్ చెయ్యండి
EVs గురించి మరింత తెలుసుకునేందుకు
కాల్ చెయ్యండి +91 92402 92401
సందర్శించండి ev.tatamotors.com
TATA.ev
MALIK AUTOWORLD
Malakpet: 7506025166; Himayathnagar, Beeramguda : 7506025158; Bowenpally: 7506025486; Shadnagar: 8291106052
ORANGE AUTO
Attapur: 9167473372; Erragadda: 7506025174; Kharkana: 7506025493; Medchal: 8291244717; Medak: 9619938527
PRATHAMMALIK AUTOMATRIX
Banjara Hills: 8291058022; Boduppal: 9000979494; Financial District (Near Q City): 9167090503
SELECT CARS
Alkapuri: 7506025176; Begumpet: 7506025220; Karmanghat: 9619083948
SELECT CARS
Chandanagar: 7506025180; Miyapur,Bachupally: 9167413840
JASPER INDUSTRIES
SD Road, Secunderabad: 9619024718; Narsingi: 8879152707; Chandrayangutta: 9167450755; Kompally: 9619973314
TEJASWI AUTOMOBILES
HiTech City Madhapur: 7506025271, Sangareddy: 8879187409, Siddipet: 8879187436, Zaheerabad: 8879194145; Tolichowki: 8879186915
VENKATARAMANA MOTORS
Gachibowli, Shankarpally, Shamshabad : 7506025311; Kukatpally: 8879221046
VVC AUTOWORLD
Vanastalipuram, Ibrahimpatnam: 7506025358; Jubilee Hills: 8879334329; ECIL, Kushaiguda: 7506025339
Service: Attapur, Autonagar, Beeramguda, Bowenpally, Champapet, ECIL, Hafeezpet, Hi-tech City, Kompally, Kondapur, Kothapet, L.B. Nagar, Miyapur, Nacharam, Sanathnagar, Sangareddy, Secunderabad, Siddipet, Tadbund, Tellapur, Tolichowki, Uppal, Y Junction
Images and illustrations are indicative and for information purpose only. All feature / specifications mentioned may vary from model to model and may not be available across all personas / variants. Features and specifications are subject to change without prior information. Please consult an authorized TATA Motors dealer for latest information on features / specifications before deciding to place an order. Colours may not match actual colours due to printing limitations. ◆As per Bharat NCAP 2025 score. ###As per internal data provided by charging point operators. +++For terms and conditions refer to ev.tatamotors.com. øAs per internal testing data, under test ambient temperature conditions.δARAI Certified,Urban + Extra Urban (MIDC Part 1 + Part 2), actual performance figures may vary depending on various conditions including driving pattern, etc. ΔAdvanced driver assistant systems (ADAS) is not asubstitute for human eye or driver vigilance. It is a driver assist system only to enhance safety and driving experience. The driver will remain responsible for safe, vigilant and attentive driving. *The term 'Lifetime' refers to the period of fifteen years from the first date of registration of the vehicle at the local regional transport office, in accordance with the Motor Vehicles Act, 1988, and is restricted for the period of use during the first registration only. Applicable exclusively on Harrier.ev, Curvv.ev and Nexon.ev 45.~ Based on internal calculations. *All India ex-showroom price.≈540 degree view function is designed to enhance driver awareness and provide a better view of the vehicle's surroundings. However, it is not a substitute for careful driving and should be used in conjunction with other safety features and driver judgment.εHD rear-view mirror has a limited view.•Offers/benefits may vary from state to state. Please contact your nearest authorised TATA Motors dealer for exact offers and Details.*Financing options are from multiple financiers.*Finance at the sole discretion of financier Terms & conditions apply.


TVS RONIN
Celebrate with
THE ULTIMATE MODERN-RETRO
NOW STARTS @ ₹1.24 L*
Ride #UnScripted
FEATURING
NIMBUS GREY
MIDNIGHT BLUE
GLACIER SILVER
CHARCOAL EMBER
1800 315 7666
tvsronin
tvsmotor.com/tvs-ronin



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+12 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 180

శనివారం 20-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


HONER
HOMES
THE RARE LIFESTYLE
THAT MAKES IT PRICELESS
From world-class leisure to everyday conveniences,
Honer Signatis serves up a life that's rare and happening.
Secure it today before it gets harder to claim.
RARE FOR FINDING THE SPACE FOR EVERY YOU.
RARE FOR A LIFE FILLED WITH PARTY.
RARE FOR CALMING VIEWS.
RARE FOR A LUXE LIFESTYLE.
HONER Signatis Club
7 Mins JUBILEE HILLS
9 Mins HITEC CITY
18 Mins ORR
35 Mins AIRPORT
Amphitheatre
Basketball Court
Outdoor Gym
Children's Play Area
Aesthetic Water Point
Peripheral Tree Planting
Aerobic Station
Waterscape
Seating Plaza
Tree Court
Pet Park
Organic Garden
Pergola with Seating
Exquisitely Landscaped Central Courtyard
HONER Signatis
your style. your signature.
Kukatpally - Hitec City
www.honerhomes.com
FOLLOW US ON:
78278 66666
CHAT ON WHATSAPP
PROJECT APPROVED BY ALL MAJOR BANKS.
*Terms & Conditions apply. All norms, requirements pertaining to the environment, fire services, GHMC rules and regulations have been adhered to while designing HONER SIGNATIS.
This ad is conceptual and not a legal offering for Sale/Agreement.Disclaimer: This advertisement does not constitute an offer and/or acceptance and/or contract and/or any intention thereof and/or a disclosure under any statue of any nature whatsoever. The pictorial/other representation herein, the layout, number of buildings/towers/wings/structures, facilities, and amenities are merely creative imagination and an Architect's impression and are only indicative. The actual product may vary/differ from what is indicated herein. The photograph contained herein may be stock/standard photography used for the purpose and have been taken at location other than the project site and are used to indicate a conceptual lifestyle.
A Member of CREDAI HYDERABAD
NAREDCO TELANGANA
MEMBER


'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+12 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 180

శనివారం 20-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఫస్ట్ క్లాస్ జర్నీ
ఆమె ఒక రైలుబడి. ఆ బడిలో ఎన్నో విలువైన పాఠాలు ఉన్నాయి.
- 9లో



కస్టమర్ల ఇష్టాలివే..
ఇల్లు కొనాలనుకునే వారి ప్రధాన డిమాండ్లు ఏమిటంటే..
- 6లో



పట్టుదలే..ముందడుగు
'తలపెట్టిన పనిని నూటికి నూరుపాళ్లు పూర్తిచేయడానికి కృషి చేయాలని నమ్ముతాను' అంటారు నమిత.
- వివరాలు 9లో



అన్నను కోల్పోయాకే అర్థమైంది..
'రోడ్డు ప్రమాదంలో అన్నను కోల్పోయాకే రహదారి భద్రత ప్రాధాన్యం గురించి తెలిసి వచ్చింది' అంటున్నారు హీరో కిరణ్ అబ్బవరం.
- వివరాలు 8లో



స్వర్ణమే వర్ణమై..
వ్యక్తిగత చిత్రకళా రంగంలో బంగారాన్ని వినియోగిస్తున్న ఏకైక చిత్రకారిణిగా నిలిచారు భోపాల్‌కి చెందిన నవాబ్ జహాన్ బేగం.
- వివరాలు 9లో



అమ్మకు నైవేద్యం
దుర్గామాత పూజలకు అన్నీ సిద్ధం అనుకునేలోపు నైవేద్యాల తయారీ ఎలా అనే ఆందోళన తలెత్తడమూ సహజం.
- వివరాలు 9లో



మెడికల్ డివైజెస్.. కేరాఫ్ హైదరాబాద్

➤ మెడికల్ హబ్‌గా ఉన్న హైదరాబాద్ వైద్య పరికరాల తయారీలోనూ దూసుకెళుతోంది. మనదగ్గర తయారైన వైద్య పరికరాలు అమెరికా, యూరప్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. హైదరాబాద్ శివార్లలో మెడికల్ డివైజెస్ పార్కు ఏర్పాటు చేయడంతో ఉత్పత్తులు తక్కువ ధరలో లభిస్తున్నాయి. వైద్య ఖర్చుల భారం తగ్గుతోంది.

- వివరాలు 3లో



అఫర్లే.. ఆఫర్లు

➤ దసరా సంబరాల వేళ ఆఫర్లు ముంచెత్తుతున్నాయి. ఫెస్టివల్ సేల్స్ పేరుతో వివిధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు తగ్గింపు ధరలను ప్రకటిస్తూ ఊరిస్తున్నాయి. దీంతో ఆయా వస్తువుల కొనుగోళ్లకు నగరవాసులు ఉత్సాహం చూపుతుండటంతో ఆన్‌లైన్ వేదికలు సందడిగా మారుతున్నాయి. ఇదే సమయంలో నకిలీ ఆఫర్లు, నకిలీ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది..

- వివరాలు 2లో



'ఫ్యూచర్' అదిరేలా..

మూసీ పునరుజ్జీవం, ట్రిపుల్ ఆర్, ఫ్యూచర్ సిటీలతో కొత్తరూపు
హైదరాబాద్ అభివృద్ధే లక్ష్యంగా మెగా ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు శ్రీకారం
మెట్రో విస్తరణ, గ్రీన్ ఫీల్డ్ రహదారులతో కొత్త ప్రాంతాల అభివృద్ధి

అన్ని ప్రాంతాల్లోనూ మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికలు

మూసీ మురిసేలా..

కాలుష్య కాసారంగా మారిన మూసీనదికి పునరుజ్జీవం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచంలోని రివర్ సిటీ నగరాల జాబితాలో చేర్చారు. నగరంలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీ నదిని తొలి దశలో 20 కి.మీ. మేర అభివృద్ధి చేస్తారు. ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.5 కి.మీ., హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు ఉన్న 8.5 కి.మీ. మూసీ నదీ సుందరీకరణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మూసీ మాస్టర్ ప్లాన్ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో అతి త్వరలోనే సుందరీకరణ పనులను ప్రారంభించనున్నారు. నదికి ఇరువైపులా అందుబాటులో ఉన్న భూమిని పూర్తిగా వినియోగంలోకి తీసుకొచ్చి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉపయోగించనున్నారు. 24/7 వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలకు అనుమతి ఇవ్వడంతోపాటు మూసీలో బోటింగ్‌తోపాటు పలు వినోద, పర్యాటక, రెస్టారెంట్లు, వాటర్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌లు, క్రీడా సౌకర్యాలు, ఆతిథ్య మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు.

సాక్షి, హైదరాబాద్: అన్ని రకాల మౌలిక వసతులుంటేనే ఏ నగరమైనా త్వరగా అభివృద్ధి చెందుతుంది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆలోచన చేస్తోంది. దశాబ్దం క్రితం అందుబాటులోకి వచ్చిన శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్డులతో హైదరాబాద్ ముఖచిత్రమే మారిపోయింది. అప్పటివరకు అబిడ్స్, హిమాయత్‌నగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ వంటి వాటికే పరిమితమైన రియల్‌ఎస్టేట్ మార్కెట్ నగరం నలువైపులకూ విస్తరించింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అంతకు రెట్టింపు స్థాయిలో మెగా ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. అభివృద్ధిని నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీలతో సరికొత్త నగరాలను అభివృద్ధి చేయాలని కృత నిశ్చయంతో ఉంది. ఇక, మెట్రో విస్తరణ, బందర్ పోర్ట్ టు ఫోర్త్ సిటీకి గ్రీన్ ఫీల్డ్ హైవేలతో కొత్త ప్రాంతాలలో మెరుగైన మౌలిక వసతులను కల్పించనుంది. దీంతో ఔటర్ లోపల ధరలు పెరగడంతోపాటు డిమాండ్, అభివృద్ధి ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తుంది.

➤ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మెట్రో నగరాల్లో హైదరాబాద్ ఒకటి. నగరంలో ఏడాది పొడవునా ప్రధాన మౌలిక సదుపాయాల పనులు జరుగుతుండటంతో ఏటా స్థిరాస్తి మార్కెట్ 10 శాతం వృద్ధి రేటును నమోదు చేస్తోంది. మౌలిక సదుపాయాలతో కనెక్టివిటీ పెరిగి, ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. ప్రాపర్టీల డిమాండ్, ఆస్తి విలువలు పెరుగుతాయి. మెరుగైన మౌలిక సదుపాయాలున్న ప్రాంతాలు నివాస, వాణిజ్య పెట్టుబడులను ఆకర్షిస్తాయి. రోడ్లు, మెట్రో, విమానాశ్రయం కనెక్టివిటీలతో ఆర్థిక కార్యకలాపాలు మెరుగవుతాయి. నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుంది.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్లతో కొత్త ప్రాంతాల అభివృద్ధి..

బందర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీకి గ్రీన్‌ఫీల్డ్ హైవే, శంషాబాద్ నుంచి కొడంగల్‌కు, రావిర్యాల నుంచి ఆమనగల్లుకు గ్రీన్ ఫీల్డ్ రహదారులను నిర్మించనున్నారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు, రహదారుల విస్తరణతో ప్రజా రవాణా మెరుగవుతుంది. కొత్త ప్రాంతాలు వెలుగులోకి వచ్చి, నివాస యోగ్యంగా అభివృద్ధి చెందుతాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో ప్రాపర్టీ కొనుగోళ్లు, ఆస్తి విలువలు పెరుగుతాయి. మెరుగైన మౌలిక సదుపాయాలతో ప్రయాణ సమయం తగ్గడంతో నివాసాలు, కార్యాలయాలు, సౌకర్యాల కోసం

మిగతా 2వ పేజీలో ▶



ఫైవ్‌స్టార్ హోమ్స్

ఎంట్రన్స్, లాబీ నుంచే సకల హంగులు
నగరంలో పెరుగుతున్న ట్రెండ్

సాక్షి, హైదరాబాద్: ఫైవ్‌స్టార్ హోటళ్లు అనగానే అతిథుల జిహ్వా చాపల్యాన్ని తీర్చే విభిన్న వంటకాలు, విశాలమైన గదులు, స్విమ్మింగ్ పూల్స్, అత్యాధునిక జిమ్‌లే కాకుండా మనసును ఆహ్లాదపరిచే సంగీతం, యోగా, ధ్యానం వంటి ఆరోగ్యకరమైన ఏర్పాట్లూ ఉంటాయి. మరి ఇలాంటి వసతులన్నీ సొంతింట్లోనూ ఉంటే? ఇంకా చెప్పాలంటే మీ ఇంటి అడ్రస్సే ల్యాండ్‌మార్క్‌లా నిలిచేలా కనిపిస్తే? ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, పుణే నగరాలకే ఇప్పటి వరకు పరిమితమైన ఈ తరహా థీమ్ బేస్డ్, సబ్లిమినల్ ఆర్కిటెక్చర్ ప్రాజెక్టులు ఇప్పుడు హైదరాబాద్‌కూ వచ్చేశాయి. ప్రవాసులు, హై నెట్‌వర్త్‌గల వ్యక్తులు (హెచ్‌ఎన్‌ఐ)లు, ఎగువ ఆదాయ వర్గాలను రా.. రమ్మని పిలుస్తున్నాయి.

కొనుగోలుదారుల అభిరుచుల్లో మార్పులతో..: గత దశాబ్దకాలంగా గృహ కొనుగోలుదారుల అభిరుచుల్లో చాలా మార్పులు వచ్చాయి. విదేశాల్లోని గృహాలు, హోటళ్లు, రిసార్ట్‌ల్లోని వసతులను చూసి అలాంటి వసతులు తాముండే ఇళ్లలోనూ ఉండాలని ప్రజలు

మిగతా 2వ పేజీలో ▶



ప్రీ ఫ్యాబ్ పూల్స్

సులువుగా ఈత కొలను ఏర్పాటు
ఖర్చు తక్కువ.. నిర్వహణ తేలిక
ఫామ్‌హౌస్‌లు, విల్లాలలో ఏర్పాటుకు ఆసక్తి

సాక్షి, హైదరాబాద్: స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసుకోవాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ నిరంతరం నీటి శుభ్రత, నిర్వహణ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. దీంతో స్విమ్మింగ్ పూల్స్ ఒకప్పుడు సంపన్న వర్గాలకు మాత్రమే పరిమితమైపోయాయి.కానీ.. ప్రీ–ఫ్యాబ్రికేటెడ్ స్విమ్మింగ్ పూల్స్ వచ్చేశాక అన్ని వర్గాలకూ ఇవి చేరువయ్యాయి. గదిలో.. బాల్కనీలో మనకు నచ్చిన చోట ఏర్పాటు చేసుకునే వీలుండటమే కంటైనర్ స్విమ్మింగ్ పూల్స్ ప్రత్యేకత. దీంతో నగరవాసులు వీటిపై ఆసక్తి చూపిస్తున్నారు.

➤ స్విమ్మింగ్‌తో మంచి శారీరక వ్యాయామంతోపాటు మానసికోల్లాసం కలుగుతుంది. దీంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని చిన్నతనం నుంచే ఈత శిక్షణకు పంపిస్తారు. అయితే అన్ని ప్రాంతాల్లోనూ పూల్స్ అందుబాటులో లేకపోవడంతో ఎగువ మధ్యతరగతి కుటుంబాలు ఇళ్లలోనే ఈత కొలను ఏర్పాటు

మిగతా 2వ పేజీలో ▶

ఎకరం..

రూ.140 కోట్లపైనే!



బిడ్ దాఖలుకు పలు నిర్మాణ సంస్థలు సిద్ధం

ఎఫ్‌ఎస్‌ఐపై ఆంక్షలున్నా.. అధిక ధర పెట్టేందుకు రెడీ

ఐటీ, జీసీసీ, వాణిజ్య కేంద్రాలకు ఫుల్ డిమాండ్

ఇప్పటికే 34 మంది బిడ్డర్ల దరఖాస్తు

వచ్చే నెల 6న రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో భూముల ఈ–వేలం

సాక్షి, హైదరాబాద్: భూముల వేలంతో భారీగా నిధులు సమీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కనిష్టంగా రూ.2 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం.. ఈ మేరకు హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన రాయదుర్గంలో భూములను వేలం వేయనుంది. నాలెడ్జ్ సిటీలోని 18.67 ఎకరాలను ఈ–వేలానికి తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (టీజీఐఐసీ) అన్ని ఏర్పాట్లు చేసింది. ఒక ఎకరానికి ప్రారంభ ధర రూ.101 కోట్లుగా నిర్ణయించింది. అయితే పలు నిర్మాణ సంస్థలు ఎకరాకు రూ.140 కోట్లకు పైగానే వెచ్చించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో కోకాపేట నియోపోలిస్ ఫేజ్–2లో హెచ్‌ఎండీఏ నిర్వహించిన వేలంలో రికార్డ్ స్థాయిలో ఎకరం రూ.100 కోట్లు పలికిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అంతకు మించి ధర పలకడం ఖాయమని రియల్టీ నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఆంక్షలున్నా.. తగ్గేదేలే..: సర్వే నంబర్ 83/1 ప్లాట్ నంబర్ 19లో 11 ఎకరాలు, ఇదే సర్వే నంబర్‌లో ప్లాట్ నంబరు 15 ఏ/2లో 7.67 ఎకరాలను టీజీఐఐసీ వేలం వేయనుంది. అయితే ఈ సర్వే నంబర్ ఎయిర్‌పోర్ట్ జోన్ పరిధిలోకి వస్తోంది. 2022లో ఏఏఐ నిబంధనలను సవరించింది. ఈ మేరకు ఈ ప్రాంతంలో అపరిమిత భవన నిర్మాణ ఎత్తు (ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్–ఎఫ్‌ఎస్‌ఐ)కు అనుమతి

మిగతా 2వ పేజీలో ▶

వి'వాహ్.. వైభోగం'

పెళ్లి ఖర్చుకు వెనకాడని నేటి యువత

వారి అభీష్టాలనూ గౌరవిస్తున్న పెద్దలు

103 బిలియన్ డాలర్లకు చేరిన పరిశ్రమ

నగం వ్యయం ఈవెంట్ ప్లానింగ్, కేటరింగ్‌లకే..

మెట్రో నగరాల్లో థీమ్, డెస్టినేషన్ వెడ్డింగ్‌లపై పెరిగిన ఆసక్తి

సాక్షి, హైదరాబాద్: వివాహ అనుభూతులను పదికాలాల పాటు పదిలంగా భద్రపరుచుకునేందుకు నేటితరం ఎంతైనా ఖర్చు చేస్తోంది. థీమ్, లగ్జరీ, డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు ఏమాత్రం తగ్గడం లేదు. మనసెరిగిన వ్యక్తితో కలిసి ఏడడుగులు నడవాలని అమ్మాయిలు.. తమ ఇంటిని చక్కదిద్దగలరనే విశ్వాసంతో అబ్బాయిలు.. భాగస్వామి ఎంపికలో పరిణతితో వ్యవహరిస్తున్నా రు. కులమతాలకు అతీతంగా ఎన్నో జంటలు ఒక్కటవుతున్నాయి. తమకు నచ్చినట్లు పెళ్లి నిర్వహించాలని వధూవరులు కోరుకుంటున్నారు. తల్లిదండ్రులు ఖర్చుకు వెనకాడి మొదట్లో నచ్చజెప్పే ప్రయత్నం చేసినా.. చివరికి పిల్లల అభీష్టం మేరకు వైభవంగా పెళ్లి తంతు జరిపిస్తున్నారు.

➤ దేశంలో నగటు వివాహ ఖర్చు వార్షిక కుటుంబ ఆదాయం కంటే మూడు రెట్లు ఎక్కువ. దేశంలో ఏటా 80 లక్షల నుంచి కోటి వివాహాలు జరుగుతున్నాయని తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) తెలిపింది. గతేడాది నాటికి దేశీయ వివాహ సేవల మార్కెట్ 103.93 బిలియన్ డాలర్లుగా ఉంది. ఏటా 14.3 శాతం వృద్ధి రేటుతో 2030 నాటికి 228.69 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. 2023లో ఇది 92.3 బిలియన్ డాలర్లుగా ఉంది. దేశంలో

మిగతా 2వ పేజీలో ▶





ఆఫర్ల షి'కారు'

జీఎస్టీ తగ్గింపుతో కార్ల కోసం క్యూ

పండుగ ఆఫర్‌లతో ఆకట్టుకుంటున్న ఆటోమొబైల్స్ సంస్థలు

చిన్న కార్లపై రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు తగ్గింపు

సెప్టెంబర్ 22 కోసం కొనుగోలుదారుల ఎదురుచూపులు

రోజుకు 1,000కి పైగా బుకింగ్‌లు

సాక్షి, హైదరాబాద్: వాహన అమ్మకాలు టాప్‌గేర్‌లో పరుగులు తీయనున్నాయి. ఈ నెల 22 నుంచి జీఎస్టీ తగ్గనున్న నేపథ్యంలో మధ్యతరగతి వేతనజీవులు తమ చిరకాల వాహనయోగ కోరికను తీర్చుకొనేందుకు ఆటోమొబైల్ షోరూమ్‌లకు బారులు తీరుతున్నారు. ఒకవైపు జీఎస్టీ తగ్గింపుతోపాటు మరోవైపు దసరా, దీపావళి పర్వదినాలను దృష్టిలో ఉంచుకొని ఆటోమొబైల్ షోరూమ్‌లో వాహనాల అమ్మకాలపైన ఆఫర్లు, రాయితీలు ప్రకటించాయి. దీంతో కొనుగోలుదారులకు ఈ దసరా ఉత్సవం డబుల్ ధమాకా అయ్యింది. వివిధ రకాల వస్తు సేవలపై జీఎస్టీని తగ్గించనున్నట్టు ప్రధాని ప్రకటించినప్పటి నుంచి గ్రేటర్ హైదరాబాద్‌లో వాహన విక్రయాలు ఉన్నపళంగా తగ్గుముఖం పట్టాయి. అప్పటికప్పుడు కొత్త బండి కొనుగోలు చేయాలని భావించిన వారు తమ ప్రణాళికలను సెప్టెంబర్ 22వ తేదీకి

మిగతా 2వ పేజీలో ▶



ఆఫీసు, ఇల్లు పక్కపక్కనే!

వాక్ టు వర్క్ ప్రాజెక్టులకు ఆదరణ
ఈ తరహా ఇళ్లకే కొనుగోలుదారుల ఆసక్తి

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ తర్వాత నుంచి గృహ కొనుగోలుదారుల అభిరుచుల్లో మార్పులు వచ్చాయి. కోవిడ్‌తో వర్క్ ఫ్రం హోమ్ అలవాటైన ఉద్యోగస్తులు తిరిగి కార్యాలయానికి రావడానికి ఆసక్తి చూపించడం లేదు. గంటలకొద్దీ ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతోపాటు కాలుష్యం బారినపడి ఆఫీసుకు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. ఈ నేపథ్యంలో వాక్ టు వర్క్ ప్రాజెక్టులకు డెవలపర్లు శ్రీకారం చుట్టారు. ఆఫీసులకు చేరువలోనే గృహాలతోపాటు స్కూల్, ఆసుపత్రి, షాపింగ్ మాల్, పార్కు వంటి అన్ని రకాల వాణిజ్య ఏర్పాట్లు ఉండటం ఈ ప్రాజెక్టుల ప్రత్యేకత. దీంతో ఈ తరహా ప్రాజెక్టులకు డిమాండ్ పెరిగింది. పనిచేసే కార్యాలయానికి చేరుకోవడానికి అత్యధిక శాతం మంది తక్కువలో తక్కువ గంటసేపు బస్సుల్లోనో లేదా వ్యక్తిగత వాహనాల్లోనో గడిపేస్తున్నారు. దీంతో విలువైన సమయం వృథా అవుతోంది. దీంతో కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారు. అయితే వాక్ టు వర్క్ ప్రాజెక్టుల్లో ఇల్లు, ఆఫీసు, మాల్, పార్కులు, స్కూల్, ఆసుపత్రి.. ఇలా సమస్త

మిగతా 2వ పేజీలో ▶

డివిజన్ల భేటీలు.. నేతలకు బాధ్యతలు



నిరంతర సర్వేలతో మదింపు

'జూబ్లీహిల్స్ ఉపఎన్నిక'పై బీఆర్‌ఎస్ ఫోకస్

డివిజన్ల వారీగా కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్న కేటీఆర్

ఇప్పటికే ఆరు డివిజన్లకు ఇన్‌చార్జ్‌లుగా కీలక నేతలకు బాధ్యతలు

వరుస సర్వేలతో పార్టీలు, ఆశావహుల బలాబలాలపై మదింపు

బిహార్ ఎన్నికలతోపాటు ఉప ఎన్నిక జరుగుతుందని అంచనా

సాక్షి, హైదరాబాద్ : బిహార్ శాసన సభ ఎన్నికలతోపాటు జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక జరుగుతుందని బీఆర్‌ఎస్ పార్టీ అంచనా వేస్తోంది. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఏర్పడిన ఖాళీతో నవంబర్‌లో ఎన్నిక జరుగుతుందని పార్టీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో గెలుపును ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న బీఆర్‌ఎస్ ఉప ఎన్నిక దిశగా పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేయడంపై దృష్టి సారించింది. ఇప్పటికే డివిజన్ల వారీగా పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించిన వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని ఆరు మున్సిపల్ డివిజన్ల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక భేటీలు నిర్వహిస్తున్నారు. బతుకమ్మ పండుగ ప్రారంభమయ్యేలోపు పోలింగ్ బూత్‌ల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించాలని కేటీఆర్ ఆదేశించారు. మైనారిటీ ఓటర్లకు చేరువయ్యేందుకు డివిజన్ల వారీ గా కమిటీలు కూడా ఏర్పాటు చేశారు. పట్టణ ప్రాంతాల్లో 'ఓట్ చోరీ'ఎక్కువ మొత్తంలో ఉంటోందనే అనుమానంతో ఓటరు జాబితాలోని ప్రతీ ఓటరు పూర్వాపరాలను పరిశీలించాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతీ వందమంది ఓటర్లకు ఒకరు చొప్పున సమన్వయకర్తను నియమించడంపై కసరత్తు జరుగుతోంది.

ఉప ఎన్నికలో సొంత పార్టీ బలంతోపా టు ప్రధాన రాజకీయ పక్షాలు కాంగ్రెస్, బీజేపీ బలాబలాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు బీఆర్‌ఎస్ క్రమానుగత సర్వేలు నిర్వ హిస్తోంది. బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఎవరనే అంశంపై నిర్వహించిన అంతర్గత సర్వేలో మాగంటి సునీత అభ్యర్థిత్వం వైపు మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలో సునీత అభ్యర్థిత్వాన్ని కేసీఆర్ దసరా తర్వాత ప్రకటించనున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన మాగంటి గోపీనాథ్ 43.94% ఓట్లు సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్‌కు 35.03%, బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి 14.11%, ఎంఐఎం అభ్యర్థి ఫరాజుద్దీన్ 4.28% ఓట్లు సాధించారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 50,83%, బీజేపీకి 36.65%, బీఆర్‌ఎస్‌కు 10.43% ఓట్లు పోలయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రతీ ఓటును ఒడిసి పట్టేలా కార్యాచరణకు బీఆర్‌ఎస్ పదును పెడుతోంది.

మాగంటి భార్య సునీతకే అవకాశం!

దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీత, ఆయన సోదరుడు వజ్రనాథ్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి, రావుల శ్రీధర్‌రెడ్డి అభ్యర్థిత్వాలను బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పరిశీలించారు. చివరకు మాగంటి భార్య సునీత అభ్యర్థిత్వానికే కేసీఆర్ మొగ్గు చూపడంతో క్షేత్ర స్థాయిలో ఆమె చురుగ్గా పర్యటిస్తున్నారు. కేటీఆర్ అధ్యక్షతన జరుగుతున్న డివిజన్ల వారీగా పార్టీ సమావేశాల్లోనూ సునీత పాల్గొంటున్నారు. మాగంటి గోపీనాథ్ కుమార్తెలు అక్షర, దిశిర కూడా తల్లి వెంట డివిజన్లలో పర్యటిస్తూ సోషల్ మీడియాలోనూ చురుగ్గా వ్యవహరిస్తున్నారు. పార్టీ కేడర్‌ను ఉప ఎన్నిక దిశగా సన్నద్ధం చేయడంతోపాటు ఎన్నికల ప్రచారానికి నియోజకవర్గ పరిధిలోని ఆరు డివిజన్లకు పార్టీ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్ రావు (రహమత్‌నగర్), పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి (యూసుఫ్‌గూడ), దాసోజు శ్రవణ్ (షేక్‌పేట) డివిజన్ ఇన్‌చార్జ్‌లుగా పనిచేస్తున్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్ (బోరబండ), ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి (వెంగళరావునగర్), కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు (ఎర్రగడ్డ) డివిజన్ ఇన్‌చార్జ్‌లుగా పనిచేస్తున్నారు.



ఆన్‌లైన్ ఆఫర్లే..
ఆఫర్లు

దసరా వేళ డిస్కౌంట్‌ల బొనాంజా
అదే సమయంలో నకిలీ సైట్ల పట్ల జాగ్రత్త వహించాలంటున్న నిపుణులు
ఏ లింక్ పడితే ఆ లింక్ ఓపెన్ చేయొద్దని సూచన

దసరా పండుగ సంబరాల నేపథ్యంలో ఆన్‌లైన్ వేదికలు సందడిగా మారాయి. ల్యాప్‌టాప్‌లు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, మొబైల్స్, ఫ్యాషన్ సంబంధిత వస్తువులను గణనీయమైన తగ్గింపు ధరలకు అందజేస్తున్నాయి.

- సాక్షి, హైదరాబాద్

గ్రేట్ ఇండియన్ ఫెస్ట్

అమెజాన్ ఇండియా.. గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ పేరిట విక్రయాలను నిర్వహిస్తోంది. స్మార్ట్ ఫోన్స్, ఎలక్ట్రానిక్స్ నుంచి గృహ, వంటగది ఉపకరణాలు, ఫ్యాషన్, బ్యూటీ వరకు విస్తృతశ్రేణి ఉత్పత్తులను అందిస్తోంది. అగ్రశ్రేణి బ్రాండ్లకు చెందిన లక్షకు పైగా ఉత్పత్తులపై ఆఫర్స్ అందిస్తున్నట్టు ప్రకటించింది. ప్రయాణాల పట్ల మక్కువ ఉన్నవారి కోసం అమెజాన్ పే 20 శాతం వరకు ఫ్లైట్ల టికెట్ ధరలపై తగ్గింపు, హోటల్ స్టేపై 45 శాతం వరకు తగ్గింపు, బస్ బుకింగ్‌లపై 17 శాతం వరకు తగ్గింపు ఆఫర్ అందజేస్తోంది. ఈ వేదికపై ఓటీటీ సబ్ స్క్రిప్షన్స్ సైతం కొత్తకొత్త రాయితీలతో అందుబాటులోకి వచ్చాయి.

జాగ్రత్తలు

- పండుగ సీజన్ ఉత్తేజకరమైన డీల్స్, అంతులేని షాపింగ్ అవకాశాలను తెస్తుంది. అదే సమయంలో ప్లాట్‌ఫామ్‌లలో నకిలీ ఆఫర్‌లు తప్పుదారి పట్టించే ప్రమోషన్లు కూడా పెరుగుతున్నాయి జాగ్రత్త.
- ఇది 'ప్రత్యేక పండుగ ఒప్పందం'', 'అత్యవసర ఖాతా ధ్రువీకరణ'అంటూ అమెజాన్ లేదా ఏదైనా ఇతర షాపింగ్ వెబ్‌సైట్ నుంచి వచ్చినట్టుగా ఏవైనా లింక్ సందేశం వస్తే క్లిక్ చేయడానికి, షేర్ చేయడానికి లేదా చెల్లించడానికి ముందు తనిఖీ చేయాలి.
- అమెజాన్ ఇండియా స్కామ్–ఫ్రీ సెప్టెంబర్‌ను పాటించడానికి హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో అవగాహన ప్రచారాలను నిర్వహిస్తున్నాయి.
- ఏదైనా లింక్‌ను క్లిక్ చేయడానికి లేదా ప్రతిస్పందించడానికి ముందు తగిన సమయం తీసుకోండి.
- గిఫ్ట్‌కార్డ్‌లను కొనుగోలు చేయమని ఒత్తిడి చేసినా, లావాదేవీల కోసం సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేయమని అడిగినా సందేహించాల్సిందే.

బిగ్ షాపింగ్ ఉత్సవ్..

దసరా పండుగకు ఫ్లిప్‌కార్ట్ బిగ్ షాపింగ్ ఉత్సవ్ నిర్వహిస్తోంది. ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, పండుగ దుస్తులు, వివిధ ఫ్యాషన్ బ్రాండ్‌లపై ప్రత్యేక ఆఫర్లు, డీల్‌ను అందిస్తున్నది. సాధారణ కంప్యూటింగ్ నుంచి అధిక పనితీరు గల గేమింగ్ వరకు విభిన్న ఉపయోగాల కోసం వినియోగించే ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్‌లపై రిలయన్స్ డిజిటల్, క్రోమాలు గణనీయమైన తగ్గింపును అందిస్తున్నాయి.

- ఇన్‌స్టా మార్ట్..'ఇన్‌స్టా మార్ట్ క్విక్ ఇండియా మూమెంట్'ను ప్రారంభించింది. కొనుగోలుదారులకు వేగంగా డెలివరీతోపాటుగా ఉత్తేజభరిత ఆఫర్లను సైతం అందిస్తోంది. ఈ అమ్మకాలు ఇన్‌స్టా మార్ట్ యాప్, స్విగ్గీ యాప్‌లోనూ ఈనెల 28వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఈ సేల్‌లో భాగంగా 50–90% తగ్గింపుతో ఎలక్ట్రానిక్స్, కిచెన్, డైనింగ్, బ్యూటీ, పర్సనల్ కేర్, బొమ్మలు మరిన్ని విభాగాల్లో కొనుగోలు చేస్తే.. కేవలం 10 నిమిషాల్లో డెలివరీ చేస్తారు. రూ.50,000 కంటే ఎక్కువ ఉత్పత్తులతో ఇన్‌స్టా మార్ట్ పండుగ షాపింగ్‌ను అందిస్తోంది.

సూచనలు

- బజాజ్ ఫిన్ సర్వ్ ఇన్‌స్టా ఈఎంఐ కార్డ్‌తో కలిపి జీరో డౌన్‌పేమెంట్ ఈఎంఐ సౌకర్యాన్ని అందిస్తున్నది.
- అధిక రాయితీల కోసం యాక్సిస్ తదితర బ్యాంక్ ఆఫర్లు, నిర్దిష్ట బ్యాంకుల నుంచి అదనపు డిస్కౌంట్‌లు లేదా అమెజాన్ పే వంటి వాటి క్యాష్‌బ్యాక్ ఆఫర్‌లపై ఓ కన్నేయండి.

'ఫ్యూచర్' అదిరేలా..

▶ మొదటి పేజీ తరువాయి

వలసలు పెరుగుతాయి. మెరుగైన కనెక్టివిటీతో కొత్త ప్రాంతాల్లో వ్యాపారాలు, వాణిజ్య కేంద్రాలతో స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. విద్య, వైద్యం, వినోద కేంద్రాలతో జీవన నాణ్యత మెరుగవుతుంది. శివారు ప్రాంతాలు సామాన్య, మధ్యతరగతికి పెట్టుబడి హాట్‌స్పాట్‌గా మారుతాయి.

భారత్ ఫ్యూచర్ సిటీ:

కాంక్రీట్ జంగిల్‌గా మారిన హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా గ్రేటర్‌లో ప్రణాళికాబద్ధమైన నాలుగో నగరం అవసరమని సీఎం రేవంత్ నిర్ణయించారు. ఇందులో భాగంగా నగరానికి దక్షిణం వైపున 814 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీకి శ్రీకారం చుట్టారు. 7 మండలాలు, 56 రెవెన్యూ గ్రామాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ ఫోర్త్ సిటీలో ఐటీ, పారిశ్రామిక, ఆతిథ్య, పర్యాటక, క్రీడారంగాలకు పెద్దపీట వేస్తారు. కృత్రిమ మేధ (ఏఐ) సిటీ, స్పోర్ట్స్ సిటీ, స్కిల్ యూనివర్సిటీలతో పాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు అత్యాధునిక వాణిజ్య భవనం సహా ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌సెంటర్లను ఏర్పాటు చేస్తారు. ఫోర్త్ సిటీని కేవలం ఉద్యోగ, ఉపాధి అవకాశాల కేంద్రంగానే కాకుండా అంతర్జాతీయ ఎగుమతులకు వీలుండేలా అభివద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు తూర్పున శ్రీశైలం హైవే (ఎన్‌హెచ్–765) నుంచి పశ్చిమాన ఉన్న నాగార్జునసాగర్ హైవే (స్టేట్ హైవే–19) వరకూ గ్రీన్ ఫీల్డ్ ట్రంక్ రోడ్‌ను నిర్మిస్తారు. ఈ ప్రతిపాదిత రహదారి వయా భారత్ ఫ్యూచర్ సిటీ మీదుగా వెళుతుంది. గతంలోనే కందుకూరు నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు చేపట్టిన ఈ రోడ్డు నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేసేలా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక తయారు చేసింది. మీర్‌ఖాన్ పేట నుంచి నంది వనపర్తి మీదుగా యాచారం మండలం కేంద్రంలోని నాగార్జునసాగర్ హైవేకు దీన్ని లింకు చేసే పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. అదే సమయంలో రావిర్యాల ఔటర్ ఎగ్జిట్ నుంచి ప్రతిపాదించి 330 అడుగుల రతన్ టాటా గ్రీన్ ఫీల్డ్ రహదారి కూడా ఇక్కడి నుంచే ముందుకు సాగుతున్నందున.. ఈ ప్రాంతం అన్నింటికీ హబ్‌గా మారడం ఖాయమని నిపుణులు అంచనా వేస్తున్నారు.

రీజినల్ రింగ్ రోడ్డు:

350 కిలోమీటర్ల ఈ హైవే ప్రాజెక్టు 20 జాతీయ రహదారులతో అనుసంధానమై ఉంటుంది. షాద్‌నగర్, భువనగిరి, గజ్వేల్, సంగారెడ్డి, తూప్రాన్, చేవెళ్ల వంటి ద్వితీయ శ్రేణి పట్టణాలతో అనుసంధానమై.. ఆయా ప్రాంతాలలో వ్యాపార, ఆర్థిక కార్యకలాపాలను విస్తరిస్తుంది. ట్రిపుల్ ఆర్‌తో ప్రధాన నగరంపై ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గిస్తుంది. గిడ్డంగులు, పారిశ్రామిక కారిడార్లలో పెట్టుబడులను ఆకర్షిస్తుంది. వచ్చే 3–5 ఏళ్లలో శంషాబాద్, ముచ్చర్ల, షాద్‌నగర్, ఘట్‌కేసర్, మేడ్చల్, శామీర్‌పేట వంటి ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. ఆయా ఏరియాలలో ప్రాపర్టీ విలువలు 30–40 శాతం మేర పెరుగుతాయి.

మెట్రో:



మెట్రో ఫేజ్–2లో అదనంగా 86.1 కిలోమీటర్ల మెట్రో కనెక్టివిటీని పెంచుతారు. ఇందులో ప్రధానమైనవి శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ, జేబీఎస్ నుంచి మేడ్చల్, జేబీఎస్ నుంచి శామీర్‌పేట ప్రాంతాలు. వీటితోపాటు ఎల్‌బీనగర్, రాయదుర్గం, గచ్చిబౌలి, బీహెచ్‌ఈఎల్, నాగోల్ వంటి కొత్త ప్రాంతాలనూ మెట్రో ఎక్స్‌ప్రెస్‌ను అనుసంధానించనున్నారు. దీంతో ప్రజారవాణా మరింత మెరుగవుతుంది. మెట్రో మార్గాలు ప్రధాన నగరంతో అనుసంధానమై ఉంటాయి. స్టేషన్ల చుట్టూ కొత్త నివాస, వాణిజ్య కారిడార్లకు అవకాశం కలుగుతుంది. వచ్చే మూడేళ్లలో మెట్రో కారిడార్లలో ప్రాపర్టీ ధరలు 15–25 శాతం మేర పెరుగుతాయి.

వి'వాహ్‌... వైభోగం'

▶ మొదటి పేజీ తరువాయి

వెడ్‌మీగుడ్, వెడ్డింగ్స్, ఫెర్న్స్ ఎన్ పెటల్స్, శుభ్ ముహూర్త్, వెడ్డింగ్ బజార్ వంటి సంస్థలు వెడ్డింగ్ పరిశ్రమలో సేవలందిస్తున్నాయి.

కోటి మందికి ఉద్యోగావకాశాలు..

వివాహ వేదికలు, ఆభరణాలు, దుస్తులు, కేటరింగ్, ఆహ్వాన పత్రికలు, బహుమతులు, డెకొరేషన్, ఈవెంట్ ప్లానింగ్, లాజిస్టిక్, మేకప్, ఫొటో, వీడియోగ్రఫీ, మ్యూజిక్, డీజే వంటి విభాగాలు వివాహ మార్కెట్ కిందికి వస్తాయి. ఇందులో వేదికలు, కేటరింగ్, ఇన్విటేషన్, బహుమతులు ప్రధానమైన విభాగాలు. వెడ్డింగ్ ప్లానర్లు, ఫొటో, వీడియోగ్రాఫర్లు, డెకొరేషన్, మేకప్ ఆర్టిస్టుల వంటి రూపంలో వివాహ పరిశ్రమ సుమారు కోటి మందికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోంది. భారత వివాహ సేవల పరిశ్రమ వృద్ధిలో సాంకేతికత, సోషల్ మీడియా ప్రభావం పెరుగుతోంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ప్రదర్శించే ట్రెండ్‌ల ద్వారా ప్రేరణ పొందిన జంటలు, ప్రత్యేకమైన, యునిక్ వివాహ అనుభవాలను ఎక్కువగా కోరుకుంటున్నారు. వివాహ వేడుకలను సోషల్ మీడియాలో ప్రచారం చేయడం, ప్రొఫెషనల్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సేవల వైపు ఈ ధోరణి పెరుగుతోంది. వివాహ వేడుకలను ప్రత్యక్ష ప్రసారం చేయడం, ఈవెంట్, సంగీత్ ప్లానింగ్‌లలో సాంకేతికత వినియోగిస్తున్నారు. థాయ్‌లాండ్, జపాన్, మాల్దీవులు, యూకే, స్పెయిన్, ఫ్రాన్స్, ఇటలీ వంటి దేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఖర్చుకు ఎందుకు వెనకాడట్లేదంటే..

వివాహాలకు ఇంత ఖర్చు చేయడానికి కారణాలు విశ్లేషిస్తే పలు ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. చిన్న వయసులో కుర్రకారు పెద్ద మొత్తంలో సంపాదిస్తుండటం, భవిష్యత్తులో మరింత ఆర్జించగలమనే ధీమాతో తమ పెళ్లి కోసం భారీగా ఖర్చు చేస్తున్నారు. తల్లిదండ్రుల వద్ద సరిపోయే డబ్బులు లేకపోతే వారే ఆ సొమ్మును సమకూర్చుతున్నారు. సిటీలో ఉన్నా.. విదేశాల్లో ఉన్నా వారే కన్వెన్షన్ కేంద్రాల బుకింగ్ దగ్గర్నుంచి పెళ్లి మండపం, అలంకరణ వరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వివాహాలకు సంపన్నులు, ఎగువ మధ్యతరగతి వర్గాలు డెస్టినేషన్ వెడ్డింగ్స్ పేరుతో విదేశాలు, ఇతర నగరాలకు వెళ్తుంటే.. మధ్యతరగతి వర్గాలు కన్వెన్షన్ సెంటర్లు, రిసార్ట్‌లలో వేడుకలను నిర్వహిస్తున్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్‌ల నుంచి మొదలుపెట్టి ఎంగేజ్‌మెంట్, బ్యాచిలర్ పార్టీలు, మెహందీ, సంగీత్, పెళ్లి, రిసెప్షన్ వరకు తగ్గేదేలే అన్నట్లుగా డబ్బు ఖర్చు చేస్తున్నారు.

విభాగాల వారీగా వివాహ పరిశ్రమలో ఖర్చులు (శాతంలో)

విభాగం	వ్యయాలు
వేదికలు, కేటరింగ్	30
ఈవెంట్ ప్లానింగ్	12
డెకొరేషన్	14
బహుమతులు	19
ఆహ్వానాలు	2
ఫొటోగ్రఫీ	3
మేకప్	3
హనీమూన్/టూరిజం	8
లాజిస్టిక్స్	9



శివార్లలో ఈవెంట్ సిటీ అవసరం

ప్రస్తుతం రాష్ట్రంలో 15–20 వేల మందితో అంతర్జాతీయ సమావేశాలు నిర్వహించే వేదికలు లేవు. అందుకే శివారు ప్రాంతంలో 100–200 ఎకరాల్లో ఈవెంట్ సిటీని అభివృద్ధి చేయాలి. పీపీపీ విధానంలో దీన్ని అభివృద్ధి చేసేందుకు టీసీఈఐ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. చైనా, లాస్‌వేగాస్ వంటి నగరాల్లో మాదిరిగా హైదరాబాద్‌లోనూ ప్రపంచ స్థాయి సమావేశాలు, వేడుకలు నగరంలో జరుగుతాయి. తారామతి బారాదరి, శిల్పారామంలో రాక్ గార్డెన్, మౌంటెన్ హైట్స్ వంటి నగరంలోని చాలా వరకు ప్రభుత్వ వేదికలు నిర్వహణ సరిగా లేక పాడవుతున్నాయి. వీటిని రాయితీల రూపంలో టీసీఈఐకు అందజేస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు పరిశ్రమకు హెల్ప్ అవుతుంది. టీసీఐఈ పరిశ్రమ ఏటా 17–18 శాతం వృద్ధి చెందుతుంది. ఈ రంగంలోని కార్మికులకు యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ ఆధ్వర్యంలో నైపుణ్య శిక్షణ అందజేయాలి.

– రవి బూర, జనరల్ సెక్రటరీ, టీసీఈఐ

ప్రీ ఫ్యాబ్ పూల్స్

▶ మొదటి పేజీ తరువాయి

చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రీ–ఫ్యాబ్ పూల్స్‌లో వాతావరణంతో సంబంధం లేకుండా అన్ని కాలాల్లోనూ స్విమ్మింగ్ చేసుకోవచ్చు. కంటైనర్ పూల్స్‌లో తగినంత స్థలం ఉంటుంది కాబట్టి గజ ఈతగాళ్లు సైతం వ్యాయామం కోసం వీటిని సౌకర్యవంతంగా వినియోగించుకోవచ్చు. ఈ పూల్స్‌లో నీటిని శుభ్ర పరిచేందుకు యూవీ ఫిల్టర్, సాండ్ ఫిల్టర్, బాడీ జెట్‌లు ఉంటాయి. దీంతో నీరు ఎల్లప్పుడు స్వచ్ఛంగానే ఉంటుంది.

15 రోజుల్లోనే ఏర్పాటు

కంటైనర్ స్విమ్మింగ్ పూల్ తయారీకి కనిష్ఠంగా 15 రోజుల సమయం పడుతుంది. వీటిని ఫ్యాక్టరీలో అసెంబుల్ చేసి, ఇంటికి డెలివరీ చేస్తారు. ఇవి కనిష్ఠంగా 10 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పు, 2 అడుగుల లోతు నుంచి మొదలవుతాయి. వీటి ప్రారంభ ధర రూ.2.5 లక్షలు. ఈ పూల్స్‌ను బిగించేటప్పుడు నిర్వహణ మెళకువలపై యజమానులకు తర్ఫీదు ఇస్తారు. వీటిని వేరే ప్రాంతానికి రీలొకేట్ చేసేటప్పుడు 80 శాతం ఇన్వెస్ట్‌మెంట్‌కు భరోసా ఉంటుంది. ప్లంబింగ్, ఇంటర్నల్ ఫినిషింగ్ వంటి 20 శాతం ఖర్చు పెట్టుకుంటే చాలు మనకు కావాల్సిన ప్రాంతానికి పూల్‌ను షిఫ్ట్ చేయొచ్చు.

నచ్చిన ఆకారంతో..

ప్రీ–ఫ్యాబ్ పూల్స్ మనకు నచ్చిన ఆకారంలో తయారు చేసి ఇస్తారు. గుండ్రంగా, కోడిగుడ్డు ఆకారం, చతురస్రాకారం, దీర్ఘ చతురస్రాకారం, నక్షత్ర ఆకారం.. ఇలా మనకు నచ్చిన ఆకారంలో ఏర్పాటు చేసుకోవచ్చు. మేడ్చల్, బూర్గుల్, శామీర్‌పేట, శంషాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి వంటి శివారు ప్రాంతాల్లోని లగ్జరీ అపార్ట్‌మెంట్ల టెర్రస్‌పైన, ఫామ్‌హౌస్‌లు, విల్లాలు, రిసార్ట్‌లు, హోటళ్లలో వీటిని ఏర్పాటు చేసుకుంటున్నారు. వీటి ఇన్‌స్టాలేషన్‌కు తక్కువ సమయం పడుతుంది. మన అవసరాన్ని బట్టి ఫ్యాబ్రికేటెడ్ స్విమ్మింగ్ పూల్స్‌ను వేరే చోటుకు కూడా మార్చొచ్చు.

నిర్వహణ వ్యయం తక్కువే..

కంటైనర్ పూల్స్‌లో నీటి దుర్వినియోగం ఉండదు. ఒకసారి పూల్‌ను నింపిన తర్వాత నిరంతరం ప్యూరిఫై అవుతుంది కాబట్టి 1–2 ఏళ్ల పాటు అవే నీటిని వినియోగించవచ్చు. సింథటిక్ పూల్స్‌లో సూక్ష్మజీవుల పెరుగుదల తక్కువ ఉంటుంది కాబట్టి క్రిమి సంహారక రసాయనాలు, వడబోత వంటి నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. వినైల్, పీవీసీ వంటి మెటీరియల్స్‌తో కంటైనర్ స్విమ్మింగ్ పూల్స్‌ను తయారు చేస్తారు. గరిష్ఠంగా వీటి 10–15 ఏళ్ల పాటు మన్నికగా ఉంటాయి. తుప్పు పట్టడం, నీళ్లు కారడం వంటివి జరగవు.

ఆఫర్ల షి'కారు'

▶ మొదటి పేజీ తరువాయి

వాయిదా వేశారు. జీఎస్టీ తగ్గింపుపై స్పష్టత రావడంతో ప్రస్తుతం షోరూమ్‌లకు పరుగులు తీస్తున్నారు. ఆన్‌లైన్ బుకింగ్‌లకు సైతం పెద్దఎత్తున డిమాండ్ ఉన్నట్లు ఆటోమొబైల్ డీలర్లు పేర్కొంటున్నారు.

ఆర్టీఏలో సందడే..సందడి

సాధారణంగా గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ప్రతీ రోజు సుమారు 1,500 నుంచి 2,000 వరకు కొత్త వాహనాలు నమోదవుతాయి. వాటిలో 400 నుంచి 500 వరకు కార్లు ఉంటే మిగతావి ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలే. రవాణా వాహనాల సంఖ్య తక్కువగానే ఉంటుంది. కానీ ఇప్పుడు కార్ల బుకింగ్‌లు అమాంతంగా పెరిగాయి. ఈ నెల 22 నుంచి కొనుగోలు చేసేందుకు ముందస్తు బుకింగ్‌ల కోసం బారులు తీరుతున్నారు. నగరంలో ప్రతీ రోజు 1,000కి పైగా బుకింగ్‌లు అవుతున్నట్టు పలువురు డీలర్లు చెప్పారు. హైదరాబాద్‌తోపాటు తెలంగాణ అంతటా వాహనాల అమ్మకాలు ఊపందుకున్నాయని బంజారాహిల్స్‌లోని ప్రముఖ కార్ల షోరూమ్‌కు చెందిన ప్రతినిధి ఒకరు తెలిపారు. సుమారు 6 నెలలకు పైగా అమ్మకాల్లో స్తబ్దత నెలకొందని, ప్రస్తుతం జీఎస్టీ తగ్గింపుతో అనూహ్యంగా అమ్మకాలు పెరిగాయని సికింద్రాబాద్ తిరుమలగిరి ప్రాంతానికి చెందిన కొండల్‌రెడ్డి తెలిపారు. కార్లతోపాటు ద్విచక్ర వాహనాలకు సైతం గిరాకీ పెరిగింది. సెప్టెంబర్ 22 నుంచే కొనుగోలు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. సాధారణ ఉద్యోగ వర్గాల నుంచి మధ్యతరగతి, ఉన్నత ఆదాయ వర్గాల వరకు తమ తాహతు మేరకు వాహనాలను కొనుగోలు చేసేందుకు ముందుకొస్తున్నారు.

చిన్న కార్లకు పెద్ద డిమాండ్..

జీఎస్టీ తగ్గింపు ప్రభావం హైఎండ్ వాహనాల కంటే చిన్న కార్లపైన ఎక్కువగా ఉంది. రూ.20 లక్షల కంటే తక్కువ ఖరీదైన వాహనాల ధరలు తగ్గనున్నాయి. వివిధ రకాల బ్రాండ్‌లకు చెందిన వాహనాలపైన వాటి ధరలపైన సుమారు రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు తగ్గనున్నాయి. ఈ మేరకు క్రెటా, నెక్సాన్, బ్రిజా, పంచ్ వంటి వాహనాల అమ్మకాలు భారీగా పెరగనున్నాయి. కొనుగోలుదార్లు సైతం తమ బడ్జెట్‌కు అనుకూలమైన కేటగిరీకి చెందిన వాహనాలనే ఎక్కువగా బుక్ చేసుకుంటున్నారు. జీఎస్టీ తగ్గింపుతోపాటు ఆటోమొబైల్ డీలర్లు సుమారు రూ.50,000 నుంచి రూ.80,000 వరకు తగ్గింపు ఆఫర్‌లను అందజేస్తున్నాయి.



దసరాకు కొత్త బండి కష్టమే....

ముందస్తు బుకింగ్‌లు భారీగా పెరిగిన దృష్ట్యా అక్టోబర్ 2వ తేదీ దసరా నాటికి కొనుగోలుదారులందరికీ కొత్తబండి యోగం కష్టమే. ఇప్పటికిప్పుడు బుక్ చేసుకుంటే వాహనం డెలివరీ కావడానికి కనీసం 30 రోజుల నుంచి 45 రోజుల వరకు సమయం పట్టే అవకాశం ఉంది. 'ఆటోమొబైల్ సంస్థలు ప్రతీ రోజు సగటున దేశవ్యాప్తంగా 25,000 నుంచి 30,000 కార్లను డెలివరీ చేస్తాయి. ప్రస్తుత బుకింగ్‌ల నేపథ్యంలో రోజుకు 45,000 కంటే ఎక్కువగా డెలివరీ చేయాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్‌తోపాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బుకింగ్‌లు భారీగా ఉన్న దృష్ట్యా వినియోగదారులకు వాహనం చేరడానికి కొంత సమయం పట్టొచ్చు'అని తెలంగాణ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంకోటేశ్వర్‌రావు తెలిపారు. ప్రస్తుత డిమాండ్ మేరకు నగరంలోని కొందరు ఆటోమొబైల్ డీలర్లు అడ్వాన్స్‌గా ఎక్కువ సంఖ్యలో వాహనాల దిగుమతికి ఆర్డర్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మకాలపైన ఈ ఒత్తిడి ఈ ఏడాది చివరకు ఉండే అవకాశం ఉన్నట్లు డీలర్లు అంచనా వేస్తున్నారు.



ఫైవ్‌స్టార్ హోమ్స్

▶ మొదటి పేజీ తరువాయి

కోరుకుంటున్నారు. దీంతో నిర్మాణ సంస్థలు థీమ్ బేస్డ్, సబ్లిమినల్ ఆర్కిటెక్చర్ ప్రాజెక్ట్‌లకు శ్రీకారం చుడుతున్నాయి. చాలా మంది కిడ్స్, ఫిట్‌నెస్, స్పోర్ట్స్, డిస్నీ థీమ్ వంటి ప్రాజెక్ట్‌లకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈజిప్టియన్, అరబిక్, స్పానిష్, రోమన్ వంటి ఆర్కిటెక్చర్ డిజైన్లతో నిర్మాణాలను చేపడుతున్నారు. థీమ్ బేస్డ్, సబ్లిమినల్ ప్రాజెక్ట్‌లున్న ప్రాంతం అభివృద్ధికి నిదర్శనంగా.. నగరానికే తలమానికంగా నిలుస్తాయనడంలో ఎలాంటి సందేహమక్కర్లేదు.

ప్యాలెస్ లాంటి ప్రాజెక్ట్‌లు..

పౌలోమీ, రాజపుష్ప, హానర్, మై హోమ్, శ్రీఆదిత్య, అపర్ణ వంటి పలు నిర్మాణ సంస్థలు నగరంలో పలు థీమ్ బేస్డ్, సబ్లిమినల్ ఆర్కిటెక్చర్ ప్రాజెక్ట్‌లను నిర్మిస్తున్నాయి. థీమ్ బేస్డ్ ప్రాజెక్ట్‌లు అభివృద్ధి చెందే ప్రాంతంలో, విశాలమైన విస్తీర్ణంలో, వినూత్నమైన ఆర్కిటెక్చర్ డిజైన్లు ఉంటాయి. వాటి ఎలివేషన్స్, వసతుల ఏర్పాట్ల కోసం విదేశీ ఆర్కిటెక్చర్లు, నిపుణుల అవసరం ఉంటుంది. ప్యాలెస్‌లు, ప్రీమియం రెస్టారెంట్లకు మాత్రమే పరిమితమైన సబ్లిమినల్ ఆర్కిటెక్చర్స్.. గృహ నిర్మాణాల్లోనూ మొదలయ్యాయి. మానసిక చైతన్యం, ప్రేరణను కలిగించడమే సబ్లిమినల్ ఆర్కిటెక్చర్ ప్రత్యేకత. ఇందుకోసం ఆయా ప్రాజెక్టుల్లో మహనీయులు, గొప్ప నాయకుల చిత్రపటాలు, జీవిత చరిత్రలు, బొమ్మలు, గుర్తులను పెడతారు. అనునిత్యం ఆయా వ్యక్తుల అడుగుజాడలు కళ్లముందు కదలాడుతుంటే మెదడు సానుకూలంగా ఆలోచిస్తుంది. దీంతో మాటల్లో, చేతల్లోనూ ఉన్నతమైన భావాలు బహిర్గతమవుతాయని నిపుణులు చెబుతున్నారు. సబ్లిమినల్ ఆర్కిటెక్చర్‌లో ఇంట్లో కాకుండా ప్రాజెక్ట్ కామన్ ఏరియా, ఓపెన్ స్పేస్, క్లబ్‌హౌస్ వంటి ప్రాంతాల్లో స్ఫూర్తిదాయక వ్యక్తులు, మహనీయుల బొమ్మలు, జీవిత చరిత్రలు, గుర్రం, ఏనుగు, రథం వంటి చిత్రాలను గోడలపై (మ్యూరల్ ఆర్ట్) చిత్రీకరిస్తారు. దీంతో నివాసితులకు ప్యాలెస్ తరహా వాతావరణం కలుగుతుంది.

ప్రాజెక్ట్ మధ్యలో క్రీక్..

సాధారణ నిర్మాణాలతో పోలిస్తే థీమ్, సబ్లిమినల్ ఆర్కిటెక్చర్ ప్రాజెక్టుల నిర్మాణానికి పెట్టుబడి కూడా కొంత ఎక్కువే అవసరం. అందుకే ఇళ్ల ధరలు కూడా కాస్త అధికంగా ఉంటాయి. కానీ ఆయా ప్రాజెక్టులు అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తాయి. కొత్త తరహా ప్రాజెక్టులు, వసతులున్న ప్రాజెక్టులను చూసేందుకు కస్టమర్లు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. వాటిల్లో క్లబ్‌హౌస్‌తోపాటు జిమ్, ఇండోర్ గేమ్స్, బాంక్విట్ హాల్, కాఫీ షాప్, లైబ్రరీ, ప్లే స్కూల్, సూపర్ మార్కెట్, సెలూన్, గెస్ట్ రూమ్స్, పార్టీ ఏరియా వంటి వసతి ఏర్పాట్లున్నాయి. ప్రాజెక్ట్ మధ్యలో నుంచి చిన్నపాటి సరస్సు పారుతున్నట్లు వాటర్ క్రీక్ ఏర్పాట్లు సైతం ఉంటాయి. ఈ క్రీక్ నిత్యం నీటి ప్రవాహంతో గలగలలాడుతుంటే మనసు ఆహ్లాదకరంగా మారుతుంది.

ఆఫీసు, ఇల్లు పక్కపక్కనే!

▶ మొదటి పేజీ తరువాయి

అవసరాలూ ఒకే చోట ఉండటం వల్ల అలాంటి ఇళ్ల కొనుగోలుకే వినియోగదారులు మొగ్గుచూపుతున్నారు.

ఈ ప్రాజెక్టులతో వేగంగా అభివృద్ధి..

నడిచి వెళ్లేందుకు అనువైన దూరంలో కార్యాలయం, షాపింగ్ మాల్స్ ఉండాలని కోరుకొనే వారి సంఖ్య నగరంలో రోజురోజుకూ పెరుగుతోంది. అయితే వాక్ టు వర్క్ ప్రాజెక్టుల్లో కేవలం అన్ని సౌకర్యాలు ఒకేచోట ఉంటే సరిపోదు. ఆ ప్రాంతం కూడా అభివృద్ధికి చిరునామాగా నిలవాలని వినియోగదారులు కోరుకుంటున్నారు. అప్పుడే ఐటీ, బీపీఓ సంస్థలు ఎక్కువగా ఉన్న గచ్చిబౌలి, మాదాపూర్‌ల తరహాలో ఆయా ప్రాంతాలలో రెట్టింపు అభివృద్ధి జరుగుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ వంటి కొన్ని ప్రాంతాలకే పరిమితమైన వాక్ టు వర్క్ ప్రాజెక్టులు ఇప్పుడు నగరం చుట్టూ విస్తరిస్తున్నాయి. ఐటీఐఆర్ ప్రాజెక్టుతో వాక్ టు వర్క్ ప్రాజెక్టులకు మరింత ఊపొచ్చింది. ఆదిభట్ల, ఉప్పల్, పోచారం, మహేశ్వరం వంటి శివారు ప్రాంతాల్లోనూ ఐటీ సంస్థలు రానున్నాయి. దీంతో ఈ ప్రాంతాలకు చుట్టూ 4 కి.మీ. పరిధిలో వాక్ టు వర్క్ ప్రాజెక్టులు నిర్మించేందుకు బిల్డర్లు ముందుకొస్తున్నారు. నగరంలోని మొత్తం 2 లక్షల మందికిపైగా ఐటీ ఉద్యోగుల్లో అత్యధికులు మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. సిటీ నలువైపుల నుంచి ఈ ప్రాంతాలకు వచ్చే వారు కొందరైతే.. 5–6 కి.మీ. దూరం నుంచి వచ్చి వెళ్లేవారు మరి కొందరు ఉంటున్నారు. వాక్ టు వర్క్ ప్రాజెక్టులతో ఇప్పుడు ఈ దూరం కూడా తగ్గిపోతుంది. ఒకవైపు కార్యాలయాలు, మరోవైపు గృహ నిర్మాణాలు.. ఇంకేం ఎంచక్కా నడుచుకుంటూ ఆఫీసుకు వెళ్లిపోవచ్చు. ఉదయం నడకకు బద్ధకించే వారికి ఇదొక వ్యాయామంగానూ ఉపయోగపడుతుంది. ఆరోగ్యం దృష్ట్యా సైకిల్‌పైనా ఆఫీసులకు వెళ్లొచ్చు కూడా.

ఎకరం రూ.140 కోట్లపైనే!

▶ మొదటి పేజీ తరువాయి

లేదు. ప్లాట్ నంబరు 19లో ఎఫ్ఎస్ఐ 80 మీటర్లు, ప్లాట్ నంబరు 15లో ఎఫ్ఎస్ఐ 65 మీటర్ల వరకు మాత్రమే అనుమతి ఉంది. ఎఫ్ఎస్ఐపై ఆంక్షలున్నప్పటికీ అధిక ధర పెట్టేందుకు బిడ్డర్లు వెనుకాడటం లేదని తెలుస్తోంది. 470 ఎకరాలలో విస్తరించి ఉన్న నాలెడ్జ్ సిటీలో వందకు పైగా ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలున్నాయి. బిజినెస్ హబ్‌గా అత్యంత శరవేగంగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతం బహుళ జాతి సంస్థలు, గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ)కు నిలయంగా మారడంతో ఎలాగైనా భూమిని దక్కించుకోవాలనే బిడ్డర్లు పోటీపడుతున్నారు.

34 మంది బిడ్డర్లు దరఖాస్తు..

వచ్చే నెల 6న జరగనున్న ఈ – వేలంలో పాల్గొనేందుకు దేశ, విదేశీ నిర్మాణ సంస్థలు పోటీపడుతున్నాయి. ఇప్పటికే నాన్ రీఫండబుల్ డాక్యుమెంట్ ఫీజు కింద ప్లాట్‌కు రూ.10 లక్షల చొప్పున చెల్లించి సుమారు 34 మంది బిడ్డర్లు టీజీఐఐసీకి దరఖాస్తు చేసినట్లు తెలిసింది. వీరితో పాటు పలువురు స్థానిక పెట్టుబడిదారులు, డెవలపర్లు జాయింట్ వెంచర్‌గా ఏర్పడి వేలంలో పాల్గొనన్నారు. పలు నిర్మాణ సంస్థలు ఎకరానికి రూ.140 కోట్లకు పైగానే బిడ్డింగ్ చేయనున్నట్లు తెలిసింది. బహుళ జాతి సంస్థల కార్యాలయాలు, ఐటీ, ఐటీఈఎస్ కంపెనీలు, వినోద కేంద్రాలు, బహుళ అంతస్తుల భవనాలు, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలతో రాయదుర్గం అభివృద్ధి చెందిన ప్రాంతం కావడంతో ఇక్కడి స్థలాలకు డిమాండ్ అధికంగా ఉంది.

వేలంతో మార్కెట్‌లో బూమ్..

ఈ భూముల వేలంతో మార్కెట్‌లో బూమ్ ఏర్పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ భూములు వేలంలో ఎంతకైతే ధర పలుకుతాయో చుట్టుపక్కల స్థలాలు కూడా అంతే ధర పలుకుతాయి. అయితే ఈ పరిణామం స్థానిక పెట్టుబడిదారులు, డెవలపర్లకు కొంత వరకు ఇబ్బందే అని నిపుణులు అంటున్నారు. అంత ధర పెట్టి ప్రాజెక్ట్‌లను చేపట్టినా అంతిమంగా ఆ భారం కొనుగోలుదారుల మీదనే పడుతుందని చెపుతున్నారు. ఐటీ, ఐటీఈఎస్, కమర్షియల్, రిటైల్, రెసిడెన్షియల్, హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్, ఎంటర్‌టైన్‌మెంట్.. ఇలా మల్టీ జోన్ ప్రాంతమైన రాయదుర్గం నుంచి ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో, విమానాశ్రయంతో సులువైన కనెక్టివిటీ ఉంది. ఇక్కడినుంచి రాయదుర్గం మెట్రో స్టేషన్‌కు 5 నిమిషాలు, ఔటర్ జంక్షన్‌కు 6 నిమిషాలు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్/విప్రో జంక్షన్‌కు, హెచ్ఐసీసీ/హైటెక్స్‌కు 15 నిమిషాలు, ఎయిర్‌పోర్ట్‌కు 40 నిమిషాల ప్రయాణ వ్యవధి ఉంటుంది. దీంతో ఇక్కడి భూములకు డిమాండ్ అధికంగా ఉంది.

సంప్రదాయ ఆధునికతల మేళవింపు

దేశంలోనే తొలిసారి బొటిక్ లుక్‌లో అల్లకాస్ స్టోర్ • 22వ తేదీన సన్ సిటీలో అట్టహాసంగా ప్రారంభం • సాక్షితో అల్లకాస్ మేనేజింగ్ డైరెక్టర్ జ్ఞానేశ్వర్



సాక్షి, హైదరాబాద్: సంప్రదాయాలను ఆధునిక వస్త్ర శైలితో మేళవిస్తూ సరికొత్త లుక్‌ను హైదరాబాద్‌కు పరిచయం చేయనున్నామని అల్లకాస్ బ్రాండ్ నిర్వాహకులు జ్ఞానేశ్వర్ చెప్పారు. హైదరాబాద్ వాసులకు సుపరిచితమైన సీఎంఆర్ బ్రాండ్ ఇప్పటికే నగరంలో పలు చోట్ల షోరూమ్స్‌ను నిర్వహిస్తూ వస్త్రాభిమానుల ఆదరణ పొందుతున్న విషయం తెలిసిందే. దశాబ్దాల తరబడి విజయవంతంగా కొనసాగుతున్న ఈ బ్రాండ్ ద్వారా యువతరం సారథ్యంలో అత్యాధునికతను సంతరించుకున్న మరో కొత్త బ్రాండ్ అల్లకాస్ నగరంలోని సన్ సిటీలో ఏర్పాటు కానుంది. ఈ నేపథ్యంలో అల్లకాస్ మేనేజింగ్ డైరెక్టర్ జ్ఞానేశ్వర్ సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే...

ALLAKAS
Anywear. Everywear.

బొటిక్ స్టైల్... షాపింగ్‌మాల్

దశాబ్దాలుగా నగరంలో అత్యంత పేరొందిన, విశ్వసనీయత కలిగిన బ్రాండ్‌గా సీఎంఆర్‌కు ఉన్న పేరు ప్రతిష్ఠలను నిలబెట్టుకోవడంతోపాటు నెక్స్ట్ జనరేషన్‌కు మరింత చేరువయ్యేలా మా కొత్త అల్లకాస్ బ్రాండ్ స్టోర్‌ను రూపుదిద్దాం. దీనిని బొటిక్ తరహాలో వినూత్నంగా డిజైన్ చేశాం. బహుశా దేశంలోనే మరెక్కడా లేనివిధంగా బొటిక్ లుక్‌లో ఉండే షాపింగ్ మాల్‌గా మా స్టోర్ నిలవనుంది. సంప్రదాయ శైలి వస్త్రాలను ట్రెండీ టచ్‌తో అందించడం మా కొత్త స్టోర్ ప్రత్యేకతగా చెప్పగలను. ఇది నిన్నటి వారసత్వాన్ని చాటుకుంటూనే రేపటి పోకడలకు దీటుగా కనపడాలనే ప్రస్తుత తరం ఆకాంక్షలకు దగ్గరగా ఉంటుంది.

ఆల్ అకేషన్స్, సెలబ్రేషన్స్‌కు నప్పేలా...

ప్రస్తుతం నగరంలో ఫ్యాషన్ ప్రియుల ఎంపికలు, అభిరుచులు శరవేగంగా మారుతున్నాయి. ఆ ఆలోచనలను అందుకోవాలంటే అంతకన్నా వేగంగా ఫ్యాషన్ పోకడలను మేం ఒడిసిపట్టుకోవాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ స్టోర్ ద్వారా అన్ని వయసుల వారికి అత్యాధునిక స్టైల్స్ అందించనున్నాం. ముఖ్యంగా పెళ్లిళ్ల వంటి ప్రధాన వేడుకలకు కలెక్షన్స్ అందించడం సాధారణమే. అయితే, భారీ వేడుకలతో పాటు ఇప్పుడు నగరంలో పార్టీలు, ఈవెంట్స్, గెట్ టు గెదర్స్, మీటింగ్స్... ఇలా హాజరయ్యే ప్రతీ చోటా తమ లుక్ ఆకట్టుకునేలా ఉండాలని కోరుకుంటున్నారు. ఐటీ కంపెనీలు, కార్పొరేట్ కల్చర్ అభివృద్ధి ఈ తరహా ట్రెండ్‌కు ఊపునిస్తోంది. ఈ పరిస్థితుల్లో విభిన్న సందర్భాలకు అనుగుణంగా కలెక్షన్స్‌ను మా స్టోర్ అందిస్తుంది. ఎత్నిక్ వేర్ మొదలుకుని పార్టీ వేర్, ఆఫీస్ వేర్, క్యాజువల్ వేర్, అకేషనల్ వేర్ వంటివి మా కలెక్షన్స్‌లో ఉంటాయి. అలాగే మోడ్రన్ ట్రెండ్స్‌ను ఒడిసిపట్టుకునే క్రమంలో దేశవ్యాప్తంగా పేరొందిన ఫ్యాషన్ డిజైనర్స్‌తో కలిసి పనిచేయనున్నాం. లినెన్, క్రష్ తదితర ఫ్యాబ్రిక్స్‌తోనూ ప్రయోగాలు చేస్తూ వైవిధ్యభరిత స్టైల్స్‌ను నగరానికి పరిచయం చేయడమే మా లక్ష్యం. ట్రెడిషన్స్‌కు పెద్ద పీట వేస్తూనే అంతర్జాతీయ ట్రెండ్స్‌ను అన్ని వయసులవారికీ చేరువ చేసేందుకు అల్లకాస్ ఈ నెల 22వ తేదీన ప్రారంభం కానుంది. ఈ స్టోర్ ఒక షాపింగ్ సెంటర్ మాత్రమే కాదు.. ఒక సరికొత్త అనుభవంగా నగరవాసుల్ని ఆకట్టుకుంటుందని నేను చెప్పగలను.

ఆర్ఎస్ బ్రదర్స్ దసరా కానుకలు

- 'దసరా బ్లాక్‌బస్టర్ స్పాట్ గిఫ్ట్స్'తో ఆకర్షణీయమైన ఆఫర్లు

R.S. Brothers
ANDHRA PRADESH | TELANGANA

సాక్షి, హైదరాబాద్: రానున్న దసరా పండుగ నేపథ్యంలో ఆర్ఎస్ బ్రదర్స్ యాజమాన్యం 'దసరా బ్లాక్ బస్టర్ స్పాట్ గిఫ్ట్స్' పేరుతో ఆకర్షణీయమైన అమ్మకాల ఆఫర్లను ప్రకటించింది. స్త్రీలు, పురుషులు, చిన్నారులకు సంబంధించిన వివిధ రకాల వస్త్రశ్రేణిపై అత్యధిక సేవింగ్స్‌తో.. అద్భుతమైన చాలెంజ్ ఆఫర్స్‌ను అందిస్తున్నారు. దసరా వేడుకల సందర్భంగా ఆకర్షణీయమైన డిజైన్లు, సరికొత్త వెరైటీలతో పండుగ కలెక్షన్లు, సరసమైన ధరలతో స్పాట్ గిఫ్టులు కస్టమర్లను ఆకట్టుకుంటున్నాయి. ఇందులో భాగంగా కంచి పట్టు చీరలను.. కంచి సొసైటీ ధరకే విక్రయిస్తున్నారు. ధర్మవరం, అరణి, ఉప్పాడ, పఠాని, పోచంపల్లి, పటోల, రాజ్‌కోట్, జైపూర్, కోల్‌కత్తా, బెనారస్, ఫ్యాన్సీ, డిజైనర్ శారీస్, క్యాటలాగ్ శారీస్, మెన్స్ ఎత్నిక్‌వేర్, కిడ్స్‌వేర్‌ను అతితక్కువ ధరకే అందిస్తున్నట్లు ఆర్ఎస్ బ్రదర్స్ యాజమాన్యం వెల్లడించింది.

సౌత్ ఇండియా షాపింగ్ మాల్ దసరా ఆఫర్లు

SOUTH INDIA shopping mall

సాక్షి, హైదరాబాద్: దసరా పండుగ నేపథ్యంలో సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వినియోగదారులకు ప్రత్యేక దసరా ఆఫర్లను ప్రకటించింది. ఇందులో భాగంగా మహిళల వైవిధ్యభరితమైన పట్టు, ఫాన్సీ చీరలపై.. పురుషులకు ఫెస్టివల్ కలెక్షన్ మెన్స్ వేర్, చిన్నారులు ఇష్టపడే కిడ్స్‌వేర్‌పై అద్భుత ఆఫర్లు ప్రకటించారు. తమ షోరూంలో శారీస్ వేర్, లేడీస్ వెస్ట్రన్ వేర్, చుడీదార్స్, లెహంగాస్, లెగ్గింగ్స్ తదితర కలెక్షన్లు అతితక్కువ ధరలకే లభిస్తున్నాయని సంస్థ యాజమాన్యం తెలిపింది. దసరా వేడుకల సందర్భంగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ షోరూమ్స్ లీడింగ్ బ్రాండ్లపై స్పెషల్ కాంబో ఆఫర్లు సైతం అందిస్తోంది.

మెడికల్ డివైజెస్‌కు కేరాఫ్ హైదరాబాద్

సాక్షి, హైదరాబాద్: దేశీయ వైద్య పరికరాల తయారీ పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతోంది. గతంలో స్థానిక అవసరాలకు వైద్య పరికరాలను అమెరికా, ఇంగ్లండ్ తదితర దేశాల నుంచి దిగుమతి చేసుకునేవారు. నేడు ఆయా దేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి మన పరిశ్రమ చేరుకుంది. మెడికల్ హబ్‌గా ఉన్న హైదరాబాద్ వైద్య పరికరాల తయారీలోనూ దూసుకెళుతోంది. ప్రధానంగా గుండె జబ్బు బాధితులకు స్టెంట్లలో వినియోగించే పరికరాలు, మోకాలు కీళ్ల మార్పిడి చికిత్సలకు అవసరమైన కిట్లు, ఇతర చికిత్సలకు సంబంధించిన ఉపకరణాలు స్థానికంగానే తయారవుతున్నాయి. దీంతో ఆయా పరికరాల ధరలు గణనీయంగా తగ్గుతున్నాయి. గుండె ఆపరేషన్‌కు వాడే నాణ్యమైన స్టంట్స్ సుమారుగా రూ.38 వేలకు లభిస్తుండగా, మెటల్ స్టంట్లు రూ.10,500 నుంచి ప్రారంభమవుతున్నాయి. మోకాలు కీలు మార్పిడి పరికరాలు రూ.30 వేల నుంచి రూ.70 వేల వరకు ఉన్నాయి. దేశంలో వీటి మార్కెట్ సుమారుగా రూ.23 వేల కోట్లు ఉంటుందని, రానున్న మూడేళ్లలో సుమారు రూ.40 వేల కోట్లకు పెరుగుతుందని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ సంస్థ పేర్కొంది.

ఏటా 25 శాతం వృద్ధి

వైద్య పరికరాలు, డయాగ్నోస్టిక్స్‌ను భవిష్యత్తులో అత్యంత వేగంగా వృద్ధి చెందే రంగాలుగా గుర్తించిన నాటి ప్రభుత్వం 2017లో సుల్తాన్‌పూర్‌లో 250 ఎకరాల విస్తీర్ణంలో దేశంలోనే అతి పెద్ద మెడికల్ డివైజెస్ పార్కును ఏర్పాటు చేసింది. పర్యావరణ హితంగా వైద్య రంగంలో సాంకేతిక ఆవిష్కరణలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, పరిశోధనలకు ఇది కేంద్రంగా ఉంది. సుమారు 60కిపైగా పరిశ్రమలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఆసియాలోనే అతిపెద్ద స్టంట్స్ తయారీ సంస్థ సైతం ఇక్కడ తన యూనిట్‌ను ప్రారంభించింది. ఏటా 1.2 మిలియన్ల కార్డియాక్ స్టంట్లు, 2 మిలియన్ల కార్డియాక్ బెలూన్లు ఉత్పత్తి చేస్తున్నారు. మరికొన్ని పరిశ్రమలు సైతం వివిధ రకాల వైద్య పరికరాలను మార్కెట్‌లో అందుబాటులోకి తెస్తున్నాయి. దీంతో దేశీయంగా వైద్య పరికరాల పరిశ్రమ వృద్ధి రేటు గడిచిన ఆరేళ్లలో ఏటా 25 శాతం వృద్ధి సాధిస్తోందని నివేదికలు చెబుతున్నాయి. మన దగ్గర తయారైన వైద్య పరికరాలు అమెరికా, యూరప్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఆయా దేశాల్లో వివిధ రకాల అనుమతులు, పన్నులు ఎక్కువగా ఉండటం, మన దగ్గర తయారయ్యే పరికరాలు తక్కువ ధరలోనే లభించటం మనకు కలిసొచ్చే అంశం. హైదరాబాద్‌తోపాటు తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లో మెడికల్ డివైజెస్ పార్కులు ఉన్నాయి.

కార్పొరేట్‌లో విదేశీ పెట్టుబడులు

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో మెడికల్ డివైజెస్ పార్కు ఏర్పాటు చేయడంతో ఉత్పత్తులు తక్కువ ధరలో లభిస్తున్నాయి. దీనివల్ల వైద్య ఖర్చుల భారం తగ్గుతోంది. దీంతో దేశ, విదేశాల నుంచి రోగులు వైద్య చికిత్సల నిమిత్తం హైదరాబాద్‌కు క్యూ కడుతున్నారు. దీంతో విదేశాల నుంచి ఇక్కడ వైద్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ముందుకొస్తున్నారు. ఫలితంగా గ్రేటర్ పరిధిలోని ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులు తమ పడకల సామర్థ్యాన్ని పెంచుకుంటూ వివిధ ప్రాంతాల్లో శాఖలను విస్తరిస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం ఎముక, గుండె చికిత్సలకు సంబంధించిన వైద్య పరికరాల అమ్మకాల్లో విదేశీ కంపెనీల వాటా అధికంగా ఉండేది. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. దేశీయంగా తయారు చేసిన పరికరాలు అందుబాటులోకి రావడం, తక్కువ ధరకే లభిస్తుండటంతో దేశీయ కంపెనీల అమ్మకాలు గత ఐదేళ్లలో రెండు రెట్లకు పైగా పెరిగినట్లు నిపుణులు చెబుతున్నారు.

ఇంగ్లండ్‌లో జీరో ట్యాక్స్

గతంలో ఇంగ్లండ్‌కు మనం వైద్య పరికరాలు, ఇంప్లాంట్స్ ఎగుమతి చేయాలంటే 6 శాతం వరకు పన్ను చెల్లించాల్సి వచ్చేది. ఇటీవల ఆ దేశంతో మనదేశం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంతో వీటిపై పన్ను చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయింది. రెండు దేశాలకు చెందిన సంస్థలు సంయుక్తంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి. 2035 నాటికి మెడికల్ డివైజెస్ మార్కెట్ విలువ సుమారు రూ.6 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నారు.

పన్నుల పాలసీని సరళీకరించాలి



టెక్నాలజీ పరంగా వృద్ధి ఉన్న రంగం హెల్త్. సిటీ స్కాన్, ఎంఆర్ఐ, సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఇంప్లాంట్స్, ఇతర వైద్య పరికరాలు సుమారు 50 శాతం వరకు స్థానికంగా ఉత్పత్తి అవుతున్నాయి. ఆపై అవసరాలకు చైనా, అమెరికా తదితర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. హైదరాబాద్‌కు మెడికల్ టూరిజం పెరుగుతోంది. స్థానిక అవసరాలకు తగ్గట్లు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలి. దీంతో ప్రభుత్వానికి ఆదాయం, రోగులకు వైద్య సేవలు, యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఆస్పత్రుల సంఖ్య పెరగాలి. ప్రభుత్వ విధానాల్లో మార్పులు రావాలి. సోమాలియా, మస్కట్, నైజీరియా, రువాండా, ఇతర ఆఫ్రికా, అరబ్ దేశాల నుంచి ఎక్కువ మంది రోగులు వస్తున్నారు. ఇంకా మనం పశ్చిమ దేశాలను ఆకర్షించాలి. ప్రపంచస్థాయి పరిశ్రమలు మనదగ్గర ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేసేవిధంగా ప్రోత్సహించాలి. పన్ను విధానాలను సరళీకృతం చేయాలి. దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలి. ఫలితంగా తక్కువ ధరలోనే పరికరాలు అందుబాటులో ఉంటాయి. వైద్య ఖర్చులు తగ్గుతాయి. ఐటీ అంటే ఇండియా అన్నట్లు భవిష్యత్తులో వైద్యం అంటే ఇండియా అనేలా ప్రపంచ దేశాలకు తెలియజేయాలి.

– డా.కిరణ్ మాదాల, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ మీడియా కో–కన్వీనర్



కాలంతో పయనించే.. కమల్ వాచ్

KWC SINCE 1969

- నగరంలో ప్రారంభమై దేశవ్యాప్తంగా విస్తరించిన సేవలు
- అంతర్జాతీయ ప్రసిద్ధ వాచ్ బ్రాండ్స్‌కు కేరాఫ్ అడ్రస్
- మొదటి స్టోర్ అబిడ్స్‌లో.. ప్రస్తుతం కంపెనీ టర్నోవర్ రూ.400 కోట్లు
- సాక్షితో అనుభవాలు పంచుకున్న కమల్ వాచ్ కంపెనీ ఎండీ వేణుగోపాల్ తోట్ల



వాచ్... ఒకప్పుడు అదొక సమయ సూచిక, ఒక యంత్రం. కానీ ఎప్పటికప్పుడు మారుతున్న అధునాతన కాలానికి, జీవనశైలికి మొదటి సాక్ష్యం వాచ్ అని జెన్ జీ గాడ్జెట్స్ చెప్పకనే చెబుతున్నాయి. సమయ సూచిక నుంచి ప్రస్తుతం యాప్స్, అధునాతన ఫీచర్స్‌ను తనలో కలుపుకొని పరిణామ క్రమంలో మనిషితోపాటు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. మొదటి నుంచి హైదరాబాద్‌తోపాటు తెలుగు రాష్ట్రాల్లో వాచ్‌లకు మంచి ఆదరణ ఉంది. ఇండియన్ బ్రాండ్స్ మొదలు గ్లోబల్ ఫేమ్ వాచ్ లవర్స్ స్థానికంగా ఉన్నారు. అయితే ఈ వాచ్ లవర్స్‌కు దాదాపు 55 ఏళ్లకు పైగా సేవలందిస్తోంది 'కమల్ వాచ్ కంపెనీ'. ఇండియన్ బ్రాండ్స్ మొదలు గుర్తింపు పొందిన అంతర్జాతీయ బ్రాండ్స్ వరకు కమల్ వాచ్ స్టోర్లలో అందుబాటులో ఉన్నాయి. 1969లో నగరంలోని అబిడ్స్ వేదికగా కమల్ వాచ్ కంపెనీ మొదటి బ్రాంచ్ ప్రారంభమైంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 60కి పైగా బ్రాంచ్‌లతో దేశ్యవ్యాప్తంగా విస్తరించి సేవలందిస్తోంది. అంతేకాకుండా కమల్ వాచ్ గ్రూప్ ఏకంగా రూ.400 కోట్ల టర్నోవర్‌తో అతిపెద్ద కంపెనీగా అభివృద్ధి చెందుతోంది. ఈ నేపథ్యంలో కంపెనీ ప్రయాణం, వాచెస్ రంగంలో వచ్చిన మార్పులు, సాంకేతికత వంటి అంశాలను కమల్ వాచ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ తోట్ల 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..,

ఎక్స్‌క్లూజివ్ స్టోర్లుగా రూపాంతరం

గడియారం అనేది ఒక సమయ సూచిక నుంచి ప్రస్తుత తరుణంలో ఒక గాడ్జెట్‌గా, యాక్ససరీగా, ట్రెండింగ్ స్టైల్ స్టేట్‌మెంట్‌గా మారింది. ఈ పరిణామ క్రమమే మా సంస్థ సక్సెస్‌కు వారధిగా మారింది. 1969లో అబిడ్స్‌లో కమల్‌వాచ్ పేరుతో మా నాన్న చాంద్‌మల్ ప్రారంభించిన మొదటి బ్రాంచ్... ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో 61 స్టోర్లతో సేవలందిస్తోంది. మా ప్రత్యేకత మల్టీ బ్రాండ్ స్టోర్. ఇందులో భాగంగా అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన రొలెక్స్ ఒమేగా, రాడో, అర్మానీ, గెస్, ఫాజిల్, డీసిల్, క్యాసియో, టిస్సాట్, సికో వంటి అన్ని వాచ్‌ల బ్రాండ్‌లు మా వద్ద అందుబాటులో ఉంటాయి. గ్లోబల్ ఫేమ్ ఉన్న కొన్ని టాప్ బ్రాండ్స్‌కు ఎక్స్‌క్లూజివ్ స్టోర్లు సైతం ఉన్నాయి, వీటిని ప్రీమియం బ్రాండ్ స్టోర్లుగా పరిగణిస్తారు. ఇలాంటి ఎక్స్‌క్లూజివ్ స్టోర్లు హైదరాబాద్‌లోనే 15 వరకు ఉన్నాయి. సాధారణంగా వెయ్యి రూపాయల బ్రాండ్ నుంచి రూ. 50 లక్షల విలువ చేసే వాచ్‌లు మా బ్రాంచ్‌లలో లభిస్తాయి.

స్టైల్ స్టేట్‌మెంట్.. స్మార్ట్ వాచ్

వాచ్ ఒక ట్రెండ్‌గానే కాకుండా స్టైల్ స్టేట్‌మెంట్‌గా మారడంలో ఈ తరం జెన్ జీ ప్రధాన కారణం. పార్టీలు, ఫిట్‌నెస్, డ్రెస్ కాంబినేషన్ యాక్ససరీ, చిల్డ్రన్ వాచ్ అని విభిన్న విధాలుగా వాచ్ ఈ తరానికి దగ్గరైంది. ముఖ్యంగా స్మార్ట్ వాచ్‌లు, అధునాతన ఫీచర్స్‌తో టెక్నికల్ గాడ్జెట్‌లు రావడంతో ఇప్పుడిదొక ట్రెండ్‌లా మారింది. దీనివల్ల మా సంస్థ బిజినెస్ కూడా పెరిగింది. దీనికి అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను మా సంస్థ పాటిస్తోంది. ప్రతీ ఏడాది స్విట్జర్లాండ్ వంటి దేశాల్లో నిర్వహించే గ్లోబల్ మీటింగ్స్‌లో భాగస్వామ్యం అవుతాం. ముందుగానే శాంపిల్ వాచ్‌లను పరిశీలిస్తాం. ఒకప్పటిలా కాకుండా అంతర్జాతీయ బ్రాండ్ వాచ్‌లను వాటి ఆవిష్కరణ సమయంలోనే దేశంలో కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నాం. ప్రస్తుతం దేశంలో రిటైల్ మార్కెట్ వేగంగా దూసుకుపోతోంది. చైనా వంటి దేశాలను దాటి వృద్ధి సాధిస్తోంది. దీనికి కారణం ఇక్కడ యువత సంఖ్య ఎక్కువగా ఉండటం. మరో 3, 4 ఏళ్లలో 100 బ్రాంచ్‌ల మార్క్‌కు చేరాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నాం.


OG ఫేం
ప్రియాంక మోహన్ తో
పండగ షురూ!
మన సన్ సిటీలో..
సెప్టెంబర్
22
గొప్ప శుభప్రారంభం
ఆరంభం అదరగొట్టేయ్!
ఆఫర్లు కొల్లగొట్టేయ్!
అల్లకాస్
Anywear. Everywear.
SAREES ✦ WOMEN ✦ MEN ✦ KIDS
కాళీమాత మందిర్ మెయిన్ రోడ్
సన్ సిటీ, హైదరాబాద్ -91
ఫోన్ : +91 801960 72999
Follow us @ allakas1
contact@eyecatch.co.in



నల్లగండ్లలో త్రిదాస రైజ్

- కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా నిర్మాణం
- గడువులోగా ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడమే లక్ష్యం

సాక్షి, సిటీబ్యూరో: గడువులోగా నిర్మాణాలను పూర్తి చేసి, గృహ కొనుగోలుదారులకు అప్పగించడమే లక్ష్యంగా ప్రాజెక్ట్‌లను చేపడుతోంది త్రిదాస రియల్టీ వెంచర్స్. నిర్మాణంలో నాణ్యత, కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా ప్రాజెక్ట్‌లను చేపట్టడమే సంస్థ ప్రత్యేకత అని బ్రాండింగ్ అండ్ మార్కెటింగ్ కమ్యూనికేషన్ వైస్ ప్రెసిడెంట్ అనురాధ శ్రీనివాసన్ తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలు అంటే వందల సంఖ్యలో యూనిట్లు, పొద్దున లేస్తే చాలు బిజీ బిజీ లైఫ్ స్టయిల్. కానీ, త్రిదాస రియల్టీ వెంచర్స్ ప్రాజెక్ట్‌లు అలా కాదు పరిమిత యూనిట్లు, తక్కువ జన సాంద్రతతో ఉంటాయని పేర్కొన్నారు. నల్లగండ్లలో నిర్మిస్తున్న త్రిదాస రైజ్ ప్రాజెక్ట్‌లో ఎకరానికి కేవలం 92 ప్రీమియం రెసిడెన్షియల్ యూనిట్లు మాత్రమే ఉంటాయని చెప్పారు. దీంతో విశాలమైన అంతర్గత రోడ్లు, నివాసితులకు ఎక్కువ విస్తీర్ణం, ప్రైవసీ, గ్రీనరినికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని, ఈ ప్రాజెక్ట్ ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ) గోల్డ్ ప్రీ-సర్టిఫికేషన్ గుర్తింపు పొందిందని వివరించారు. పార్కింగ్‌లో ఎలక్ట్రిక్ చార్జింగ్ పాయింట్లతో పాటు ల్యాండ్ స్కేపింగ్ జోన్లను ఏర్పాటు చేస్తున్నామని, త్రిదాస రైజ్ క్లబ్‌హౌస్‌లో వెల్‌నెస్, ఫిట్‌నెస్, పిల్లల ఆట స్థలాలు వంటి అన్ని రకాల ఆధునిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. నగరంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం నల్లగండ్ల. గచ్చిబౌలి, హైటెక్ సిటీ వంటి ప్రధాన ఐటీ కారిడార్‌లతో అద్భుతమైన కనెక్టివిటీ ఉంది. అంతర్జాతీయ విద్యా, వైద్య సంస్థలు, వినోద కేంద్రాలకు సమీపంలో ఉంది. త్రిదాస రైజ్ ప్రాజెక్ట్‌ను పరిమాణం కంటే నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పర్యావరణ స్పృహతో కూడిన డిజైనింగ్‌తో ఉందని వివరించారు.





కస్టమర్ల ఇష్టాలివే..

గడువులోగా నిర్మాణాల పూర్తి, నాణ్యత, సహజ కాంతి

గృహ కొనుగోలుదారుల డిమాండ్స్ ఇవే..

అనరాక్ కన్జ్యూమర్ సెంటిమెంట్ సర్వేలో వెల్లడి

గడువులోగా ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడం, నిర్మాణంలో నాణ్యత, ఇంట్లోకి సహజ కాంతి వచ్చేలా ఏర్పాట్లు.. గృహ కొనుగోలుదారుల ప్రధాన డిమాండ్లు ఇవే. పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన సాధనం స్థిరాస్తి రంగమేనని అనరాక్ గ్రూప్ కన్జ్యూమర్ సెంటిమెంట్ సర్వే వెల్లడించింది. 63 శాతం మంది ప్రాపర్టీలో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఇది 4 శాతం పెరిగింది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులకు 22 శాతం మంది ఆసక్తి చూపిస్తున్నారు. బంగారం ధరలు పెరుగుతున్నప్పటికీ.. ఈ విభాగంలో పెట్టుబడులకు 7 శాతం మంది మాత్రమే ఆసక్తి చూపిస్తున్నారు. అమెరికా టారిఫ్‌లు, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక ఒడిదుడుకులు తదితర కారణాలతో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులకు వెనుకాడుతున్నారని వెల్లడైంది.

– సాక్షి, సిటీబ్యూరో



ఈ ఏడాది తొలి అర్ధభాగంలో దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ప్రముఖ నిర్మాణ సంస్థలు సుమారు 2 లక్షల యూనిట్లను లాంచ్ చేశాయి. గతేడాది ఇదే కాలంలో 2.28 లక్షల కొత్త ఇళ్లను ప్రారంభించాయి. గడువులోగా నిర్మాణాల పూర్తి, డెలివరీ, నాణ్యత కారణంగా డిమాండ్, సప్లయి సమానంగా ఉంటున్నాయి. పెట్టుబడి కోసం, భవిష్యత్తు అవసరాల కోసం కంటే సొంతగా తాము నివాసం ఉండేందుకే ఇళ్లు కొంటున్నారు. నాణ్యమైన నిర్మాణాలు, మంచి లొకేషన్, వినూత్న డిజైన్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. 65 శాతం మంది సొంత వినియోగానికే గృహాలను కొనుగోలు చేస్తుంటే.. 35 శాతం మంది పెట్టుబడుల రీత్యా కొంటున్నారు.

ప్రీమియం ఇళ్లకు ఆదరణ..

ప్రీమియం, లగ్జరీ హౌసింగ్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. రూ.45 లక్షలలోపు ధర ఉన్న అందుబాటు గృహాల విభాగంపై కొనుగోలుదారుల ఆసక్తి క్షీణించింది. 2020 హెచ్1లో ఈ విభాగం వాటా 36 శాతంగా ఉండగా.. 2025 హెచ్1 నాటికి 17 శాతానికి తగ్గింది. ప్రాంతం, డిజైన్, యూనిట్ సైజ్ చిన్నగా ఉండటమే అఫర్డబుల్ గృహాలకు డిమాండ్ తగ్గటానికి ప్రధాన కారణం. 36 శాతం మంది రూ.90 లక్షల నుంచి రూ.కోటిన్నర ధర ఉన్న ఇళ్ల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. 25 శాతం మంది రూ.45 లక్షల నుంచి రూ.90 లక్షలు, 17 శాతం మంది రూ.45 లక్షల లోపు, 12 శాతం మంది రూ.1.50–రూ.2.50 కోట్ల మధ్య, 10 శాతం మంది రూ.2.50 కోట్లకంటే ఎక్కువ ధర ఉన్న ఇళ్ల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు.

లాంచింగ్ ప్రాజెక్టులపై ఆసక్తి..

సిద్ధంగా ఉన్న ఇళ్లకంటే లాంచింగ్ యూనిట్లకే కస్టమర్లు ఆసక్తి చూపిస్తున్నారు. పెద్ద, లిస్టెడ్ డెవలపర్లు భారీ ఎత్తున లాంచింగ్స్ చేస్తుండటమే ఈ ఆసక్తికి



ప్రధాన కారణం. పేరున్న డెవలపర్లయితే గడువులోగా ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడం, నిర్మాణంలో నాణ్యత పాటిస్తారని కస్టమర్లు భావిస్తున్నారు. గతేడాది హెచ్1లో రెడీ టు హోమ్స్, న్యూ లాంచింగ్స్ నిష్పత్తి 20:25గా ఉండగా.. 2025 హెచ్1 నాటికి 16:29గా ఉంది.

త్రీ బీహెచ్‌కే ఇళ్లకే మొగ్గు..

టాప్–7 నగరాల్లో కస్టమర్లు పెద్ద సైజు గృహాలకు ఆసక్తి చూపిస్తున్నారు. 45 శాతం మంది త్రీ బీహెచ్‌కేలకు మొగ్గు చూపిస్తుండగా.. 40 శాతం మంది టూ బీహెచ్‌కేకు జై కొడుతున్నారు. మూడేళ్ల క్రితం ఫోర్ బీహెచ్‌కేలకు 4 శాతం మంది ఆసక్తి చూపించగా.. 2025 హెచ్1 నాటికిది 7 శాతానికి పెరిగింది. 8 శాతం మంది వన్ బీహెచ్‌కేలకు ఇంట్రెస్ట్ ఉన్నారు. హైదరాబాద్‌లో చూస్తే.. 55 శాతం మంది త్రీ బీహెచ్‌కేలకు, 38 శాతం మంది టూ బీహెచ్‌కే, 5 శాతం వన్ బీహెచ్‌కే, 2 శాతం మంది ఫోర్ బీహెచ్‌కే, ఆపైన విస్తీర్ణమైన ఇళ్లకు మొగ్గు చూపిస్తున్నారు.




రీట్స్‌లో రాబడి ఎక్కువే..

సాక్షి, సిటీబ్యూరో: రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్స్) పెట్టుబడులు 6–7 శాతం రాబడిని అందిస్తున్నాయని అనరాక్–క్రెడాయ్ సంయుక్త నివేదిక వెల్లడించింది. దేశంలో 2019లో మొదలైన తొలి రీట్ లిస్టింగ్ నుంచి ఈ రంగం ఊపందుకుంది. ఈ ఏడాది ఆగస్టు నాటికి దేశంలో రీట్స్ 18 బిలియన్ డాలర్లకు చేరింది. 2030 నాటికి 25 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. దేశీయ సంస్థాగత రియల్ ఎస్టేట్ పెట్టుబడుల్లో రీట్స్ వాటా కేవలం 20 శాతం మాత్రమే. అమెరికాలో 96 శాతం, సింగపూర్‌లో 55 శాతం, జపాన్‌లో 51 శాతం వంటి ఇతర దేశాలతో పోలిస్తే ఇండియాలో రీట్స్ పెట్టుబడులు తక్కువే. డేటా సెంటర్లు, రిటైల్, పారిశ్రామిక వంటి వైవిధ్యభరితమైన స్థిరాస్తి విభాగాలలో రీట్స్ పెట్టుబడులు పెడుతుంటారు. గతేడాది ప్రపంచవ్యాప్తంగా 250 బిలియన్ డాలర్ల విలువైన డేటా సెంటర్ల రీట్స్ పెట్టుబడులు రాగా.. వచ్చే ఏడేళ్లలో ఇవి రెట్టింపు అవతాయని అంచనా. దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో 520 మిలియన్ చ.అ. ఆఫీసు స్థలంలో.. కేవలం 32 శాతం 166 మిలియన్ చ.అ. రీట్స్‌లో లిస్టయ్యాయి. యూఎస్, సింగపూర్, జపాన్ వంటి దేశాలతో పోలిస్తే ఇది తక్కువైనప్పటికీ ఇండియాలో రీట్స్ రాబడులు ఆకర్షణీయంగా ఉంటుంది.

ఇంటిపై సౌరకాంతులు!

పెరుగుతున్న నెలవారీ విద్యుత్ చార్జీలు

ప్రత్యామ్నాయం దిశగా వినియోగదారుల అడుగులు



- గ్రేటర్‌లో రూఫ్‌టాప్ నెట్‌మీటరింగ్‌కు పెరుగుతున్న ఆదరణ
- అందుబాటులోకి 'పీఎం ముఫ్త్ బిజ్లీ యోజన పథకం' పోర్టల్
- నెలకు 300 యూనిట్లు ఉచితం.. రాయితీపై బ్యాంకు రుణ సౌలభ్యం

ఇంటిపై మూడు కిలోవాట్ల సౌరపలకలు ఏర్పాటు చేయాలంటే 225 చదరపు అడుగుల విస్తీర్ణం అవసరం. ఒక కిలోవాట్ సౌరపలక రోజుకు సగటున 4 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది. మూడు కిలోవాట్ల సామర్థ్యం ఉన్న పలకలు ఏర్పాటు చేసుకుంటే నెలకు సగటున 360 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది. ఏడాదికి 4,320 యూనిట్లు ఉత్పత్తి అవుతుంది.

- ఇంటి అవసరాలు నెలకు 200 యూనిట్లు పోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించుకోవచ్చు. ఇందుకు ప్రస్తుత ధర ప్రకారం యూనిట్‌కు రూ.5.05 చెల్లిస్తుంది. మూడు కిలోవాట్లకు రూ.1.80 లక్షలు ఖర్చవుతుంది. గతంలో రాయితీ కిలోవాట్‌కు రూ.14 వేల చొప్పున మూడు కిలోవాట్లకు రూ.42 వేలు లభించేది. దీంతో చాలామంది విముఖత చూపేవారు. ప్రస్తుతం ఈ సబ్సిడీని రూ.78 వేలకు పెంచింది. అంతేకాదు మిగిలిన మొత్తం చెల్లింపునకు రాయితీపై బ్యాంకుల నుంచి రుణాలు పొందేలా కేంద్రం ఏర్పాటు చేసింది. ఒక రకంగా చెప్పాలంటే పైసా ఖర్చు లేకుండా యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఉత్పత్తి అయిన విద్యుత్‌లో ఇంటి అవసరాలు పోగా, మిగిలిన విద్యుత్‌ను నెట్‌మీటరింగ్ ద్వారా డిస్కంకు విక్రయించడం ద్వారా వచ్చే సొమ్ముతో బ్యాంకు రుణం తీర్చవచ్చు.

సర్కిళ్ల వారిగా సోలార్ కనెక్షన్లు.. ఉత్పత్తి ఇలా..

సర్కిల్	కనెక్షన్లు	విద్యుత్ ఉత్పత్తి
మేడ్చల్	440	10.5 మెగావాట్లు
రాజేంద్రనగర్	228	10 మెగావాట్లు
హబ్సిగూడ	440	10 మెగావాట్లు
బంజారాహిల్స్	598	8 మెగావాట్లు
సైబర్‌సిటీ	360	6.8 మెగావాట్లు
సికింద్రాబాద్	370	4.8 మెగావాట్లు
హైదరాబాద్ సెంట్రల్	290	4.4 మెగావాట్లు
హైదరాబాద్ సౌత్	190	3.6 మెగావాట్లు
సరూర్‌నగర్	270	2.8 మెగావాట్లు

40 మందికిపైగా దరఖాస్తు

సౌరపలకల జీవితకాలం 25 ఏళ్లను పరిగణలోకి తీసుకుంటే 5.32 సంవత్సరాల్లోనే పెట్టిన పెట్టుబడి అంతా తిరిగి వస్తుందని చెబుతున్నారు. మిగిలిన కాలానికి ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకోవచ్చు. సౌర విద్యుత్‌తో పర్యావరణ ప్రయోజనాలు లేకపోలేదు. మూడు కిలోవాట్ల సోలార్ ప్యానల్ల ఏర్పాటుతో 25 ఏళ్లలో 85 టన్నుల కార్బన్‌డైయాక్సైడ్‌ను తగ్గించిన వారవుతారు. ఇదిలా ఉంటే సోలార్ విద్యుత్ ఉత్పత్తిదారులను ప్రోత్సహించేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో 'పీఎం సూర్య ఘర్' పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే గ్రేటర్ జిల్లాల నుంచి 40 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు.

- ఔత్సాహికులు టీఎస్ఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి డిస్కం పేరు, కరెంట్ కనెక్షన్, ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ, ఆధార్ నంబర్ వంటి వివరాలను పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. ఎంపిక చేసిన కంపెనీల సోలార్ పలకలు, రాయితీపై రుణాలు ఇచ్చే బ్యాంకులు, టెక్నీషియన్ల వివరాలు ఉంటాయి. పలకల ఇన్‌స్టాలేషన్ తర్వాత నెట్‌మీటరింగ్ ద్వారా గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు.




కిలోవాట్స్	చ.అ.వి	విద్యుత్ ఉత్పత్తి (యూనిట్ల)	స్థాపిత ఖర్చు	ప్రభుత్వ సబ్సిడీ
2	150	240	రూ.1,44,000	రూ.62400
3	225	360	రూ.2,06,400	రూ.78000
4	300	480	రూ.2,59,600	రూ.78,000
5	375	600	రూ.3,24,500	రూ.78,000
6	450	720	రూ.3,89,400	రూ.78,000
8	600	960	రూ.5,19,200	రూ.78,000
10	750	1200	రూ.6,49,000	రూ.78,000

రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటుకు ఖర్చు, సబ్సిడీ ఇలా

హైదరాబాద్‌లోనే అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీగా గుర్తింపు పొందిన మాదాపూర్‌లోని ఫార్చ్యూన్ టవర్స్‌పై నిర్వాహకులు 250 కిలోవాట్స్ సోలార్ రూఫ్ టాప్ పలకను ఏర్పాటు చేసుకున్నారు. రోజుకు సగటున వెయ్యి యూనిట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. నెలకు సగటున రూ.3 లక్షల వరకు విద్యుత్ బిల్లు ఆదా అవుతోంది. ఈ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు నిర్వాహకులు పెట్టిన పెట్టుబడి అంతా మరో ఐదేళ్లలో తీరిపోతోంది. ఆ తర్వాత వారికి పూర్తిగా సోలార్ విద్యుత్ ఉచితంగా అందనుంది. ఇలా వీరొక్కరే కాదు గ్రేటర్‌లో సుమారు 3,500 మంది వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ పలకలను ఏర్పాటు చేసుకుని, సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకుంటున్నారు. ఇంటిపై ఉత్పత్తి అయిన విద్యుత్‌తో సొంత అవసరాలు తీర్చుకుంటూ.. మిగిలిన విద్యుత్‌ను డిస్కంకు విక్రయిస్తున్నారు. దేశవ్యాప్తంగా కోటి ఇళ్లలో సౌర విద్యుత్ వెలుగులు నింపే లక్ష్యంతో తాజాగా కేంద్రం 'పీఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజ్లీ యోజన' పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. రేషన్‌కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి నెలకు సగటున 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఉచితంగా అందించే కార్యక్రమంలో భాగంగా కొత్తగా రూఫ్‌టాప్ సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవాలని భావించే వారికి పలు ప్రోత్సాహకాలు అందజేస్తుంది.



–సాక్షి, సిటీబ్యూరో



ఆఫీస్ స్పేస్.. వర్క్ పీస్

ఎప్పటికప్పుడు మారుతున్న అధునాతన జీవనశైలికి అనుగుణంగా భాగ్యనగరం తన వైవిధ్యాన్ని మార్చుకుంటోంది. సహజత్వం మొదలు సాంకేతికత వరకు నిత్య జీవనశైలిలో తన గుర్తింపును సుస్థిరపరుచుకుంటోంది. ప్రధానంగా ఆధునిక కార్యాలయాలు, ఉత్పాదకత, శ్రేయస్సుకు ప్రాధాన్యం ఏర్పడుతోంది. ఇళ్లు, ప్రభుత్వ భవనాలు, కార్పొరేట్ కార్యాలయాలన్నీ నయాలుక్ సంతరించుకుంటున్నాయి. ఆఫీస్ అందంగా, అత్యాధునికంగా ఉండాలనే స్థాయి నుంచి ఉద్యోగుల పని సామర్థ్యం పెంచగలిగేలా ఆఫీస్ స్పేస్ డిజైన్ చేస్తున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

- అధునాతన మార్పులతో ఆఫీస్ ప్రదేశాలు
- పని సౌలభ్యం, ప్రదేశాల సౌందర్యంపై దృష్టి
- క్యాబిన్‌లకు స్వస్తి, ఓపెన్ వర్క్‌స్పేస్‌కు నాంది
- అటు సాంకేతికత, ఇటు సహజత్వం..
- ఇంటీరియర్, ఫర్నిచర్ సహా అన్నిట్లో మార్పులు

పాతకాలపు క్యాబిన్ డెస్కులు, క్లోజ్డ్ క్యాబిన్ స్పేస్‌లు తీసేసి వాటి స్థానంలో ఉద్యోగుల శ్రేయస్సు, సృజనాత్మకత, జట్టు సహకారం పెరిగే విధంగా డిజైన్ చేయబడిన క్రియేటివ్ స్పేస్‌లు వచ్చాయి. 2025లో మనం చూస్తున్న కార్యాలయాలు ఒకవైపు అధునాతన సౌకర్యాలతో పాటు మరోవైపు ప్రకృతి, సహజత్వాన్ని సమ్మేళనంగా అందిస్తున్నాయి. ఈ కల్చర్ భవిష్యత్ వర్క్ కల్చర్‌ను సరికొత్త దారిలోకి తీసుకెళ్లనుంది.



ఓపెన్ ఫ్లోర్ లేఔట్..

ఆఫీస్ లోపల గోడలు లేకుండా ఓపెన్‌గా ఉన్న సీటింగ్, క్యాబిన్లు ఉద్యోగుల మధ్య సంభాషణలు పెంచుతాయి. అడ్డంకులు లేకపోవడంతో అవసరమైన చర్చలు, ఆలోచనలు పంచుకోవడం, సాంకేతిక సమస్యలపై కలిసి పనిచేయడం మంచి ఫలితాలను అందిస్తోందని సరికొత్త కార్యాలయాలు నిరూపిస్తున్నాయి. ముఖ్యంగా ఇలాంటి వాతావరణం టీమ్ స్పిరిట్‌ను పెంచుతోంది.

ఫర్నీచర్ సౌకర్యవంతంగా..

ఈ తరం గ్లోబల్ ట్రెండ్‌లో ఆఫీస్‌లు ఎప్పటికప్పుడు మారుతున్నాయి. వీటికి అనువైన ఫర్నీచర్ కూడా సౌకర్యవంతంగా ఉండాలి. ఎత్తు మార్చుకునే డెస్క్‌లు, మడతపెట్టే టేబుల్స్, ఎక్కడికైనా మార్చుకోగలిగే కుర్చీలు.. పైగా ఇవి సరికొత్త డిజైనింగ్‌తో ఆకర్షణీయంగా ఉండటంతో పాటు స్టోరేజ్ సదుపాయంతో ఉండే డెస్క్‌లు వంటి వినూత్న మార్పులు వస్తున్నాయి. ఇందులో భాగంగా వైట్ బోర్డ్‌లు, డిజిటల్ స్క్రీన్లు, మాడ్యులర్ ఫర్నిచర్‌తో మోడ్రన్ ఇంటీరియర్ స్పేస్ ఏర్పాటు చేస్తారు. ఇలా విభిన్న అవసరాలకు అనువైన ప్రదేశాలు ఉండటంతో ఉద్యోగులందరికీ సౌకర్యంగా ఉంటుంది.

సహజమైన కాంతి వచ్చేలా..

ప్రకృతి, సహజత్వం మన ఆరోగ్యం, మనసుకు హాయి, ఆహ్లాదం అందిస్తుంది. అందుకే ఇప్పుడు కార్యాలయాల్లో కూడా బయోఫిలిక్ డిజైన్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. ఇందులో ముఖ్యంగా ఇండోర్ ప్లాంట్స్, వాటర్ ఫౌంటెయిన్లు, ఉడ్ డిజైనింగ్, పెద్ద పెద్ద కిటికీలు లేదా విశాలమైన ఓపెన్ గ్లాస్ విండోస్‌తో సహజ కాంతి రావడం వంటి అంశాలు ట్రెండ్‌గా మారాయి. గోడలపై గ్రీన్ ప్లాంట్ ఇన్‌స్టాలేషన్లు ఇతర సహజ పద్ధతులు ప్రశాంతమైన వాతావరణాన్ని అందిస్తాయి.

సాక్షి రియల్టీ

శనివారం

20-09-2025



రియల్ ఎస్టేట్‌లో లొకేషన్ అత్యంత కీలకం. ప్రాజెక్ట్ ప్రాంతం కస్టమర్లకు ఎంత చేరువలో ఉంటే అంత సక్సెస్ అవుతుంది. కూకట్‌పల్లి దీనికి సరైన ఉదాహరణ. ఇక్కడ భూమి కొరత ఉంది కానీ డిమాండ్ ఎక్కువగా ఉంది. పాతికేళ్ల క్రితమే పొరుగు రాష్ట్రాల నుంచి చాలా మంది వలస వచ్చి ఈ ప్రాంతంలో స్థిరపడ్డారు. వీరిలో చాలా మంది ఇదే ప్రాంతంలో విస్తీర్ణమైన ఇళ్లు, ఆధునిక వసతులు ఉండే ప్రాజెక్ట్‌లను కావాలని కోరుకుంటున్నారు. స్కూళ్లు, ఆఫీసులకు ఇబ్బంది ఉండదు. నిత్యావసరాలు, వినోద కేంద్రాలకూ కొదవలేదు. దీంతో ఈ ప్రాంతంలో పలు ప్రాజెక్ట్‌లకు శ్రీకారం చుట్టామని, మా కస్టమర్లలో 70 శాతం కూకట్‌పల్లి, చుట్టుపక్కల ప్రాంతాలవాసులే ఉన్నారంటే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చని హానర్ హోమ్స్ కో–ఫౌండర్ అండ్ డైరెక్టర్ వై.స్వప్న కుమార్ 'సాక్షి'కి తెలిపారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే.. – సాక్షి, సిటీబ్యూరో

లొకేషన్ కీలకం!

- కూకట్‌పల్లి, నార్సింగి, గోపనపల్లిలో మూడు కొత్త ప్రాజెక్ట్‌లు
- ఆరు నెలలకొకటి చొప్పున లాంచింగ్‌కు సన్నాహాలు
- హానర్ హోమ్స్ కో-ఫౌండర్ అండ్ డైరెక్టర్ స్వప్న కుమార్

28.4 ఎకరాలు గ్రీన్‌హిల్స్ రోడ్‌లో 28.4 ఎకరాల్లో రిచ్‌మాంట్ ప్రీమియం విల్లా ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాం. ఇందులో 142 విల్లాలుంటాయి. 475 గజాల్లోని విల్లా 6,800 చ.అ. బిల్టప్ ఏరియా ఉండగా.. 760 గజాలు, 10 వేల చ.అ., 910 గజాలు 12 వేల చ.అ. బిల్టప్ ఏరియాలో ఉంటాయి. ప్రతీ విల్లాలో లిఫ్ట్ సౌకర్యంతో పాటు డ్రై, వెట్ రెండు రకాల కిచెన్స్ ఉంటాయి. లివింగ్, డ్రాయింగ్ రూమ్‌కు మధ్యలో కోర్ట్‌యార్డ్ ఉండటమే ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత. దీంతో ఇంటి మధ్యలో మొక్కలు, గ్రీనరిని పెంచుకునే వీలుంటుంది. 40 వేల చ.అ. క్లబ్‌హౌస్‌లో జిమ్, స్విమ్మింగ్ పూల్, లాన్, యాంఫీ థియేటర్, పార్టీ రూమ్ వంటి అన్ని రకాల అధునిక వసతులు ఉంటాయి.

- ఐడీఎల్ లేక్ సమీపంలో 27.7 ఎకరాల్లో సిగ్నాటిస్ పేరుతో అతిపెద్ద గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాం. ఇందులో 1695 చ.అ. 3,815 చ.అ. మధ్య అపార్ట్‌మెంట్లున్నాయి. మొత్తం 18 టవర్లు, ఒక్కోటి జీ25 అంతస్తుల్లో మొత్తం 3,266 యూనిట్లుంటాయి. 2,875 నుంచి 3,815 చ.అ. విస్తీర్ణంతో అన్నీ 3 బీహెచ్‌కే ఫ్లాట్లే ఉంటాయి. ఇందులో ప్రత్యేకంగా నాలుగు అల్ట్రా టవర్లను నిర్మిస్తున్నాం. ఇందులో ఫ్లోర్‌కు నాలుగు చొప్పున మొత్తం 400 యూనిట్లు ఉంటాయి. స్పోర్ట్స్‌కు, ఫ్యామిలీ ఈవెంట్స్‌కు 1.35 లక్షల చ.అ.లలో రెండు వేర్వేరు క్లబ్‌హౌస్‌లు ఉండటమే ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత. నివాసితుల ఆరోగ్యం కోసం జిమ్, ఏరోబిక్స్, యోగా, జుంబా వంటి అన్ని రకాల క్రీడా, వ్యాయామ వసతుల కోసం ఒకటి, సూపర్ మార్కెట్, క్రచ్, క్లినిక్, పిల్లలు, మహిళల ఇండోర్ గేమ్స్ వంటి వాటి కోసం ఇంకో క్లబ్ హౌస్ ఉంటుంది.

ఆరు నెలలకొక ప్రాజెక్ట్ లాంచింగ్..

ఆరు నెలలకు ఒకటి చొప్పున వచ్చే ఏడాదిన్నర కాలంలో మూడు ప్రాజెక్ట్‌లను ప్రారంభించనున్నాం. కూకట్‌పల్లిలో 30 ఎకరాల్లో నిర్మించనున్న ప్రాజెక్ట్‌లో 3,500 యూనిట్లు, నార్సింగిలో 9 ఎకరాల్లో 1,038 యూనిట్లు, గోపన్‌పల్లిలో 30కు పైగా ఎకరాల్లో విల్లాలు, అపార్ట్‌మెంట్లు రెండూ కలిపి నిర్మించనున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3 వేల కోట్ల టర్నోవర్‌ను లక్ష్యంగా పెట్టుకున్నాం.

హానర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్..

సాధారణంగా బిల్డర్లు ప్రాజెక్ట్ సైట్‌లోనే మోడల్ ఫ్లాట్ కడతారు. కానీ, హానర్ హోమ్స్ మోడల్ ఫ్లాట్, విల్లాల కోసమే ప్రత్యేకంగా హానర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. కస్టమర్లు కొనేందుకు తన అపార్ట్‌మెంట్ ఎలా ఉంటుందో ముందే చూసుకోవచ్చు. అనుభూతిని పొందవచ్చు. కూకట్‌పల్లిలోని ఐడీఎల్ రోడ్‌లో 3.5 ఎకరాల్లో హానర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 65 వేల చ.అ. విస్తీర్ణంలో ఈ సెంటర్‌లో నమూనా అపార్ట్‌మెంట్లు, విల్లాలు ఉంటాయి. కొనుగోలుదారులు తమ ప్రాజెక్ట్, అపార్ట్‌మెంట్ ఎలా ఉంటుందో వాక్ త్రూ చేస్తూ అనుభూతిని పొందవచ్చు.

త్రీడీ రిసార్ట్



సాక్షి, సిటీ బ్యూరో: నిర్మాణ రంగంలో త్రీడీ ప్రింటింగ్ విప్లవాత్మక మార్పులను తీసుకొస్తుంది. హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ సంస్థ రిధిర గ్రూప్ త్రీడీ ముద్రణ సాంకేతికతను వినియోగించింది. ప్రపంచంలోనే తొలిసారిగా కమ్యూనిటీ లివింగ్ 'రిధిర జెన్' రిసార్ట్‌ను త్రీడీలో ముద్రించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. రీసైకిల్ చేసిన, స్థానిక వనరులతో అవసరమైన మెటీరియల్స్ మాత్రమే త్రీడీలో ముద్రించే వీలు కలుగుతుందని, దీంతో వ్యర్థాల విడుదల గణనీయంగా తగ్గుతుందని సంస్థ ఎండీ రితేష్ మస్తిపురం తెలిపారు. భారీ యంత్రాలు, కార్మికుల వినియోగంతో పాటు కర్బన ఉద్గారాల విడుదల 50 శాతం వరకు తగ్గుతుందని పేర్కొన్నారు.



వాణిజ్య పెట్టుబడులు

బెటర్!

సాక్షి, సిటీబ్యూరో: వాణజ్య సముదాయాల్లో పెట్టే పెట్టుబడిపై 8 నుంచి 11 శాతం అద్దె గిట్టుబాటయితే.. ఇళ్లపై రాబడి రెండు నుంచి నాలుగు శాతం వరకే ఉంటుందని నిపుణులు చెబుతుంటారు. రానున్న ఐదేళ్లలో ఎంతలేదన్నా 2కోట్ల చ.అ. వాణిజ్య భవనాలు అందుబాటులోకి వస్తాయని అంచనా. ఇప్పటికే కొన్ని నగరాల్లో వాణిజ్య స్థలాల ధరలు తగ్గాయి. దీంతో వీటిలో పెట్టుబడి పెట్టడానికిదే సరైన సమయమని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో పరిశీలించాల్సిన అంశాలేమిటో ఓ సారి చూద్దాం.

- వాణిజ్య సముదాయాల్లో స్థలం కొన్న తర్వాత దాన్ని అమ్ముకోగానే మెరుగైన ఆదాయం గిట్టుబాటవుతుంది. ఇదొక్కటే కాదు ప్రతినెలా ఆశించిన స్థాయిలో అద్దె కూడా లభిస్తుంది. కాకపోతే అన్ని విధాలా అభివృద్ధికి ఆస్కారం ఉన్న చోట నిర్మితమయ్యే వాణిజ్య కట్టడాల్లో స్థలం తీసుకోవాలి. కాకపోతే పెట్టుబడి పెట్టే ముందు ప్రతి అంశాల్ని క్షుణ్ణంగా పరిశీలించాకే తుది నిర్ణయానికి రావాలి.

ఇవే కీలకం..

- వాణిజ్య భవనాల్లో స్థలం తీసుకోవడం మెరుగైన నిర్ణయం అయినప్పటికీ ఇందులో పెట్టుబడి పెట్టడం ఆషామాషీ వ్యవహారం కాదు. అధ్యయనం, ముందు చూపు, ప్రణాళిక.. ఈ మూడు ఉంటేనే వీటిలో మదుపు చేయాలి.
- ఒక ప్రాంతంలో నిర్మించే వాణిజ్య సముదాయంలో స్థలం కొనడానికి వెళ్లే ముందు ఆయా స్థలానికి గిరాకీ ఉంటుందా లేదా అనే విషయాన్ని పక్కాగా అంచనా వేయాలి. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మీరు కొనే భవనానికి ప్రజలు వచ్చే అవకాశం ఉందా అనే విషయాన్ని బేరీజు వేయాలి.
- భవనాన్ని నిర్మించే డెవలపర్ గత చరిత్రను గమనించాలి. ఆయా సముదాయానికి ప్రజా రవాణా వ్యవస్థ అందుబాటులో ఉందా? భవన నిర్వహణ సక్రమంగా ఉంటుందా లేదా అనే అంశాన్ని నిశితంగా పరిశీలించాలి. ఇలాంటి భవనాల్లో నిర్వహణ మెరుగ్గా ఉంటేనే గిరాకీ ఉంటుంది.
- మీరు వాణిజ్య స్థలం కొనాలనుకున్న ప్రాంతం భవిష్యత్తులో అభివృద్ధి చెందడానికి అవకాశముందా? ఉద్యోగావకాశాలు పెరగానికి ఆస్కారం ఉందా? అక్కడ జనాభా పెరుగుతుందా వంటి అంశాల్ని గమనించాలి.
- మీరు కొనాలని భావించే స్థలం వాణిజ్య సముదాయంలో ఎక్కడ ఉంది? సందర్శకులకు నేరుగా కనిపిస్తుందా? స్థలం ముందు భాగాన్ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దారా? ఇలాంటి విషయాల్ని కూడా తప్పకుండా చూడాలి.
- వాణిజ్య సముదాయంలో స్థలం కొనాలన్న నిర్ణయానికి వచ్చేముందు.. నెలసరి నిర్వహణ సొమ్ము ఎంత? ఆస్తి పన్ను, భవనం బీమా వంటివి కనుక్కోవాలి. ఖాళీ లేకుండా ఉండేలా చేసుకోవాలి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే మనం కోరుకున్న రాబడి గిట్టుబాటవుతుంది.

సాక్షి సిటీ ప్లస్
8
హైదరాబాద్, శనివారం, 20, సెప్టెంబర్, 2025

స్వర్ణమే.. వర్ణమై..



కాదేదీ కళా సృష్టికి అనర్హం అంటున్నారు ప్రముఖ చిత్రకారిణి నవాబ్ జెహాన్ బేగం. కళాకృతుల సృష్టిలో 24 క్యారెట్ల బంగారాన్ని చేర్చడం ద్వారా వ్యక్తిగత చిత్రకళా రంగంలో బంగారం వినియోగిస్తున్న ఏకైక ఆర్టిస్టుగా ఆమె పేరు గడించారు. అంతేకాదు వంటగదిలోని కత్తిని కుంచెగా మార్చడం కూడా ఆమె ప్రత్యేకత. మధ్యప్రదేశ్‌కు చెందిన గిరిజన కళారూపమైన గోండ్ ఆర్ట్‌లో నిజమైన బంగారాన్ని చేర్చడం ద్వారా రికార్డ్ సృష్టించిన ఈ భోపాల్ రాజ కుటుంబ మహిళ.. ఇటీవలే నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా సాక్షితో ప్రత్యేకంగా ముచ్చటించారు.

- సాక్షి, సిటీ బ్యూరో



అమ్మాయిలూ తొందర తగ్గించండి..

“ఆర్ట్ లేదా ఇంకేదైనా వైవిధ్యభరిత కెరీర్ ఎంచుకుంటే అమ్మాయిలు తొందరపడవద్దు. ఓర్పుగా, నేర్పుగా ముందుకు వెళ్లాలి. ఇప్పుడు పెయింటర్ అవ్వాలని ఓ నెల ఆగి డ్యాన్సర్ అవ్వాలని, మరో నెల ఆగి ఇన్‌ఫ్లుయెన్సర్ అవ్వాలని అనుకోవడం కనిపిస్తోంది. మనం ఏం కావాలనుకుంటున్నామో అది సరైన విధంగా అర్థం చేసుకుని.. ముందుకు వెళ్లాలి.

– నవాబ్ జెహాన్ బేగం, ప్రముఖ చిత్రకారిణి

- → కిచెన్ నైఫ్‌నే కుంచెగా మార్చి
- → బంగారపు పేస్ట్‌తో చిత్రాల సృష్టి
- → త్వరలోనే పారిస్‌లో చిత్ర ప్రదర్శన
- → నగరానికి వచ్చిన భోపాల్ రాజవంశీకురాలు
- → 'సాక్షి'తో అనుభవాలు పంచుకున్న నవాబ్ జెహాన్



'నా కళ వ్యక్తిగత వ్యక్తీకరణకు అతీతం.. ఎందుకంటే నా పని ద్వారా భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడాలన్నదే నా లక్ష్యం' అని ఆమె అంటున్నారు. ఈ సందర్భంగా సాక్షితో పలు ఆసక్తికరమైన అంశాలను వివరించారు.. ఆ విశేషాలు ఆమె మాటల్లోనే..

ఇంట్రావర్ట్ టు ఇంటర్నేషనల్ ఆర్ట్..

హైదరాబాద్ ఎలాగైతే నవాబ్స్‌కి ఫేమస్సో, మా భోపాల్ బేగమ్స్‌కి ఫేమస్.. కళలకు రాజపోషకులుగా ఉండే రాయల్ ఫ్యామిలీలో కళాభిమానులు ఎంత ఎక్కువో.. కళాకారులు అంత తక్కువగా ఉంటారు. మా రాజ కుటుంబంలో నేనే తొలి ఆర్టిస్ట్. రెండేళ్ల వయసు నుంచి పెయింటింగ్ వేస్తున్నా. మొదటి నుంచీ నేను సోషల్ పర్సన్‌ని కాదు.. ఇంట్రావర్ట్‌ని. నాకు చాలా తక్కువ మంది స్నేహితులున్నారు. ఆర్ట్ మీద అభిరుచే నన్ను నా లోకం నుంచి బయటకు తెచ్చింది. చిన్నప్పుడు నా భావాలు తెలపడానికి, మాటల కన్నా చిత్రాలపైనే ఎక్కువ ఆధారపడ్డాను. ఆ తర్వాత తర్వాత.. అవి మంచి చిత్రాలుగా మారాక ముంబయిలో ఒక ఇంట్లో నా పెయింటింగ్ కొలువుదీరాకగాని నా కళకు విలువ ఉందని తెలుసుకుని సంతోషపడ్డాను.

కుటుంబ సహకారమే కీలకం..

నా కుటుంబం బాగా సపోర్టివ్‌గా ఉంటుంది. మా అమ్మ నాతో పాటే ప్రయాణిస్తూ ఉంటుంది. ఎక్కడకు వెళితే అక్కడకు నాతోనే జర్నీ చేస్తుంది. చూశారుగా ఈ ఇంటర్వ్యూ సందర్భంగా ఇప్పుడు కూడా నాతోనే ఉంది. మన దేశంలో మహిళలు గాయని, నృత్యకారిణి ఇలా ఏదైనా సరే కళలో రాణించాలంటే కుటుంబ సహకారం ఒక తప్పనిసరి అవసరం. అయితే కొందరు సపోర్టివ్‌గా ఉంటారు. కొందరు మాత్రం ఇంకా ఆర్ట్‌కి విలువ ఇవ్వడం లేదు.



అలంకారం కాదు అర్థవంతం..

ఎంత ఆధునికంగా ఉన్నా మనం మూలాలతో అనుసంధానమై ఉండాల్సిందే అని నమ్ముతాను. పాజిటివిటీ, వాస్తు శాస్త్ర ఆధారంగా చిత్రాలు గీస్తాను. స్పిరిట్యువాలిటీని నమ్ముతాను. ఫిలాసఫీ ఎక్కువగా చదువుతాను. పెయింటింగ్‌ను తమ ఇంట్లో ఉంచుకుంటే కేవలం అలంకారం లా కాక ఒక పాజిటివిటీతో పాటు అర్థవంతంగా ఉండాలి. చేపల నుంచి ఆకుల దాకా మట్టి దాకా చిత్రకళకు ప్రతిదీ స్ఫూర్తిని అందిస్తుంది. ఏ నగరానికి ఆ నగరంలోని ఆకాశం వేర్వేరు రంగుల్లో కనిపిస్తుంది. అవి కూడా స్ఫూర్తినిచ్చేవే.



మన బంగారం.. మన సంప్రదాయం..

మన దేశంలో బంగారం ఒక లోహం కంటే చాలా ఎక్కువ. ఆభరణాల తయారీలో మాత్రమే కాదు తంజావూర్, మైసూర్ పెయింటింగ్స్‌లో అసలైన గోల్డ్ వినియోగిస్తారు. కాంజీవరం శారీస్, జర్దోసి చీరల్లో సైతం బంగారం వినియోగిస్తారు. ఫర్నిచర్ ఉత్పత్తుల్లో కూడా వాడతారు. రాయల్ ఫ్యామిలీస్‌లో వినియోగం మరింత ఎక్కువ. అలా బంగారం మీద ఏర్పడిన మక్కువతోనే స్వర్ణాన్ని వర్ణంగా మార్చి చిత్రాలు గీస్తున్నా. దీని కోసం లిక్విడ్ గోల్డ్ పేస్ట్, గోల్డ్ పేపర్ లను కూడా వినియోగిస్తాను. కాపర్‌తో కూడా చేశాను. అయితే గోల్డ్, సిల్వర్, క్రిస్టల్స్.. లతో కూడా ప్రయోగాలు చేశాను. రియల్ గోల్డ్‌తో కిచెన్ నైఫ్ ఉపయోగించి వేసిన నా మొదటి పెయింటింగ్. గోల్డ్ మైన్‌కు ఈ రెండూ మేళవించిన తొలి ఆర్ట్ వర్క్/ ఆర్టిస్ట్‌గా నాకు హార్వర్డ్ లండన్ గుర్తింపు అందించింది.





శిల్పారామంలో

హర్కర్గా మేళా..

- అక్టోబర్ 5 వరకూ కొనసాగింపు
- 100 స్టాల్స్‌లో చేనేత ఉత్పత్తులు

మాదాపూర్ : చేనేత కళాకారులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని అగ్రికల్చర్ మార్కెటింగ్, కో–ఆపరేషన్, టెక్స్‌టైల్స్ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో డెవలప్‌మెంట్ ఆఫ్ కమిషనర్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, వీవర్స్ సర్వీస్ సెంటర్ హైదరాబాద్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన హర్కర్గా మేళాను శుక్రవారం ప్రారంభించారు. దాదాపు 19 రాష్ట్రాలకు చెందిన చేనేత హస్తకళా ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నందుకు సంతోషాన్ని వ్యక్తపరిచారు. అక్టోబర్ 5 వరకూ నిర్వహించనున్న ఈ మేళాలో నవరాత్రి, బతుకమ్మ, దసరా ఉత్సవాలను, సారీ మేళాను నిర్వహించనున్నట్లు వీవర్స్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు. 100 స్టాల్స్‌లో చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5గంటలకు ఆంఫిథియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సౌత్‌సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్ నిర్వహణలో రాజస్థాన్, జమ్మూ కశ్మీర్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, పంజాబ్ రాష్ట్రాల జానపద నృత్యబందాల ప్రదర్శించనున్నట్లు తెలిపారు.



ఏఎన్నార్ సినిమాల

ఉచిత ప్రదర్శన..

- అక్కినేని 101వ జయంతిని పురస్కరించుకుని
- నేడు, రేపు బుక్‌మై షోలో ఉచిత బుకింగ్స్
- ప్రదర్శనకు డా.చక్రవర్తి, ప్రేమాభిషేకం చిత్రాలు



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ తెలుగు సినీ నటులు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతిని పురస్కరించుకుని ఏఎన్నార్ నటించిన ఆల్‌టైం హిట్ 'డాక్టర్ చక్రవర్తి', 'ప్రేమాభిషేకం' చిత్రాలను ఉచితంగా ప్రదర్శించనున్నట్లు నిర్వాహక ప్రతినిధులు తెలిపారు. జయంతి వేడుకల్లో భాగంగా శనివారం, ఆదివారం ఈ సినిమాలను నగరంలోని కూకట్‌పల్లి మల్లికార్జున థియేటర్‌తో పాటు ఎంపిక చేసిన పలు థియేటర్లలో ప్రదర్శించనున్నారు. ఈ రీరిలీజ్ టికెట్లు బుక్ మై షోలో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని అన్నపూర్ణ స్టూడియో యాజమాన్యం పేర్కొంది.



ఆర్ట్ గ్యాలరీలో ప్రింట్స్

ఏక్ చిత్ర

ఈనెల 28 వరకూ ప్రదర్శన

ఆకట్టుకుంటున్న 150 చిత్రాలు

మాదాపూర్: కళాకారులు వేసిన(ప్రింట్) చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని ఇండియా ఫ్యాషన్ డిజైనర్ శిల్పారెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఏకచిత్ర చిత్ర ప్రదర్శనను నిర్వాహకులతో కలసి ప్రారంభించారు. 30 మంది కళాకారులు వేసిన 150 ప్రింట్ చిత్రాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకూ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం ప్రదర్శన బ్రోచర్ విడుదల చేశారు. ఐపీఎస్ రమేశ్‌రెడ్డి, డాక్టర్ సంజీవ్‌కిషోర్ గౌతమ్ నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్, కళాకారులు పాల్గొన్నారు.

ముగిసిన సీసీయూబీ సదస్సు

25కి పైగా దేశాల నుంచి 400 ప్రతినిధులు హాజరు

సాక్షి, సిటీ బ్యూరో: ఓడరేవుల ద్వారా వాణిజ్యంపై శంషాబాద్‌లోని నోవోటెల్ హోటల్‌లో నిర్వహించిన కోల్డ్ చైన్ అన్ బ్రోకెన్–2025 సదస్సు ముగిసింది. తెలంగాణను తూర్పు–పశ్చిమ ఓడరేవులకు కలుపుతూ జాతీయ లాజిస్టిక్స్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికను పరిశ్రమల శాఖ డైరెక్టర్ జె.నిఖిల్ చక్రవర్తి కీలకంగా ప్రకటించారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 కింద ప్రభుత్వం–వ్యాపారాల భాగస్వామ్యంతో మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి, ఔషధాలు, తాజా ఆహారం వంటి కీలక రంగాలకు విశ్వసనీయ సరఫరాను అందించడమే లక్ష్యమని చెప్పారు. సీసీయూబీ ఛైర్మన్ సతీష్ లక్కరాజు మాట్లాడుతూ.. 'సుస్థిరత, ఆవిష్కరణ, సహకారంతో మరింత శక్తిమంతమైన కోల్డ్ చైన్ వ్యవస్థను నిర్మించాలి' అని పేర్కొన్నారు. మొత్తం 25కి పైగా దేశాల నుంచి 400 ప్రతినిధులు హాజరైన ఈ సదస్సులో ఆహార వృధా నివారణ, సుస్థిర కోల్డ్ చైన్ పరిష్కారాలు, ఆధునిక టెక్నాలజీ, నియంత్రణ విధానాలపై చర్చలు జరిగాయి. ఫార్మాస్యూటికల్, లాజిస్టిక్స్ రంగాల్లో కీలక కేంద్రంగా ఉన్న హైదరాబాద్, ఈ అంతర్జాతీయ సదస్సుకు ఆతిథ్యమివ్వడం గర్వకారణమని నిపుణులు అభిప్రాయపడ్డారు.



అన్నను కోల్పోయాకే

అర్థమైంది..

- అంతకుముందు రహదారి భద్రత పట్టలేదు
- పల్లెలో ఇల్లు కట్టాలనుకున్న గంటకే ప్రమాదం
- అప్పటి నుంచి బాధ్యతతో డ్రైవింగ్ చేస్తున్నా
- ట్రాఫిక్ సమ్మిట్‌లో నటుడు కిరణ్ అబ్బవరం



'కాలేజీ చదివే రోజుల్లో అల్లరిచిల్లరగా తిరిగా.. ఎవరేం చెప్పినా పట్టించుకోలేదు.. రోడ్డు ప్రమాదంలో మా అన్నను కోల్పోయిన తర్వాతే రహదారి భద్రతకు ఉండే ప్రాధాన్యత అర్థమైంది' అని సినీ నటుడు కిరణ్ అబ్బవరం అన్నారు. అప్పటి నుంచి బాధ్యతగా వాహనాన్ని నడుపుతున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు జలవిహార్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ సమ్మిట్–2025 ముగింపు వేడుకలు శుక్రవారం సాయంత్రం జరిగాయి. వీటికి కిరణ్ అబ్బవరం ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.

- సాక్షి, సిటీబ్యూరో



'డ్రైవింగ్ చేస్తున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఎవరైనా చెబుతుంటే.. సోది అనుకునేవాడిని.. ఓ రోజు సాయంత్రం మా అన్నతో చాలాసేపు గడిపా.. పల్లెలో ఇల్లు కట్టుకోవాలని, అది అలా ఉండాలి.. ఇలా ఉండాలి అంటూ చర్చించుకున్నాం. ఇది జరిగిన గంటకే అన్నయ్య రోడ్డు ప్రమాదంలో చనిపోయారనే వార్త వినాల్సి వచ్చింది. అప్పటి నుంచి నాకూ భయం పట్టుకుంది. అప్పటి వరకూ కారు ఎక్కితే చాలు దూసుకుపోవాలని, గంటకు 140 కిలోమీటర్ల స్పీడ్ టచ్ కావాలని భావించే వాడిని. బంజారాహిల్స్‌లో చెకింగ్స్ జరుగుతున్నాయని తెలిస్తే జూబ్లీహిల్స్ మీద నుంచి దూసుకుపోయేవాడిని' అన్నారు.

ప్రతిక్షణం అప్రమత్తతతో..

'ఇప్పుడు ప్రతిక్షణం అప్రమత్తంగా డ్రైవ్ చేస్తున్నా. మనం బతకాలి, ఎదుటి వారిని బతికించాలి అనే ఉద్దేశంతో పూర్తి బాధ్యతగా డ్రైవింగ్ చేస్తున్నా. అన్న ఉదంతం తర్వాతే ఏదైనా ప్రమాదంలో ఓ ప్రాణం ఆ కుటుంబానికి ఎంత అవసరమో తెలిసింది. ఎవరైనా చెప్పే ఆ విషయం మన మనసులో ఎక్కువ కాలం ఉండదు. అదే మన మనసులో మెదిలితే మాత్రం సుదీర్ఘకాలం ఉండిపోతుంది. అందుకే ట్రాఫిక్ రూల్స్ విషయంలో అందరం మనస్ఫూర్తిగా మారదాం. నేటి తరం యువకు నేను చెప్పున్నది ఒక్కటే.. ద్విచక్ర వాహనంపై హెల్మెట్ కచ్చితంగా ధరించండి. మీతో పాటు ఎదుటి వారి భద్రతను దృష్టిలో పెట్టుకుని వాహనాన్ని నడపండి. ఇంటి నుంచి వాహనం బయటకు తీసిన క్షణం నుంచే దీన్ని గుర్తుపెట్టుకుని బాధ్యతగా మెలగాలి' అని పిలుపునిచ్చారు.



“‘రోజంతా ఉత్సాహంగా ఉండడానికి, మనం ఉదయం లేవగానే చేసే పనులు కీలకపాత్ర పోషిస్తాయి. నిద్ర లేచిన కొద్దిసేపటికే నెగటివ్ థాట్స్, చేదు జ్ఞాపకాలు దూసుకు రావచ్చు. అవి మదిలో చేరిన వెంటనే డిలీట్ చేయాలి. ఇష్టమైన సంగీతం వినాలి. వ్యాయమాలు, క్రియేటివ్ వర్క్‌పై దృష్టి పెట్టాలి’ అని అంటున్నాడు బ్రూక్. హార్వర్డ్ ప్రొఫెసర్ ఆర్థర్ సి.బ్రూక్‌కి హ్యాపీ సైంటిస్ట్ అని పేరు.”

తొలి అడుగు

ఫస్ట్ క్లాస్ జర్నీ





కాస్త సరదాగా చెప్పుకోవాలంటే...

‘నువ్వు ఎక్కవలసిన రైలు ఒక జీవితకాలం లేటు’ అనే ఆరుద్ర మాట సురేఖ యాదవ్‌కు వర్తించదు.

నిజానికి రైలే ఆమెను వెదుక్కుంటూ వచ్చింది.

ఆసియా ఫస్ట్ ఉమెన్ ట్రైన్ డ్రైవర్‌గా చరిత్ర సృష్టించిన సురేఖ రిటైర్ అయింది.

ఆమె ఒక రైలుబడి. ఆ బడిలో ఎన్నో విలువైన పాఠాలు ఉన్నాయి. భావితరాలకు మార్గదర్శకాలు ఉన్నాయి.

మహారాష్ట్రలోని సతారలో పుట్టి పెరిగింది సురేఖ. అయిదుగురు పిల్లల్లో పెద్దది. తండ్రి రామచంద్ర భోంస్లే రైతు. సతారాలోని సెయింట్ పాల్ కాన్వెంట్ హైస్కూలులో చదువుకున్న సురేఖ వృత్తివిద్యా కోర్సులో చేరింది. ఆ తరువాత.. కరాడ్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రిక్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా, బీఎస్సీ(మ్యాథ్స్), బీయిడీ చేసింది.

టీచర్ కాదు రైలు డ్రైవర్

బీయిడీ చేసిన సురేఖ టీచర్ కావాలనుకునేది. అయితే ఆమెకు రైల్వే డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే అవకాశం వచ్చింది. ముంబైలో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తి చేసుకొని సెంట్రల్ రైల్వేస్‌లో ట్రైనీ అసిస్టెంట్ డ్రైవర్‌గా చేరింది. 1985లో కల్యాణ్ ట్రైనింగ్ స్కూల్‌లో ఆరు నెలల పాటు శిక్షణ తీసుకుంది. అసిస్టెంట్ డ్రైవర్‌గా ఆమె వృత్తి ప్రయాణం మొదలైంది. వాడి బందర్, కల్యాణ్‌ల మధ్య నడిచే గూడ్స్ ట్రైన్‌లో ఇంజిన్ రన్నింగ్ కండీషన్, సిగ్నల్స్... మొదలైన వాటిని పర్యవేక్షించేది. కొన్ని సంవత్సరాల తరువాత పూర్తిస్థాయిలో గూడ్స్ డ్రైవర్‌గా బాధ్యతలు స్వీకరించింది. ఆ తరువాత వెస్టర్న్ ఘాట్ రైల్వేస్‌లో డ్రైవర్‌గా పనిచేసింది.

■ దక్కన్ క్వీన్ డ్రైవ్ చేసిన క్వీన్

దక్కన్ క్వీన్(డైలీ పాసింజర్ ట్రైన్) డ్రైవర్‌గా పాసింజర్ ట్రైన్‌ను నడిపిన ఆసియాలోని తొలి మహిళగా గుర్తింపు పొందింది సురేఖ. ఘాట్ లైన్ కోసం రెండు–ఇంజిన్‌ల ప్యాసింజర్ ట్రైన్ నడపడానికి ప్రత్యేక శిక్షణ తీసుకుంది. గతంలో మహిళలు ఎవరూ ఘాట్ లైన్‌లో ట్రెయిన్ నడపకపోవడం వల్ల పై అధికారులకు సందేహాలు ఉండేవి. వాటిని పటాపంచలు చేస్తూ ‘శభాష్’ అనిపించుకుంది సురేఖ.

‘దక్కన్ క్వీన్ ట్రైన్ నడపాలనేది నా కలగా ఉండేది. ఎందుకంటే మహిళ పేరుతో నడిచే రైలు అది. ఆ పేరులో రాజసం ధ్వనిస్తుంది. ఆ కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది. భారతీయ రైల్వే నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు గర్వంగా ఉంది. మహిళలకు ప్రత్యేకించిన ట్రైన్స్‌ను నడపడం కూడా సంతోషంగా ఉంది’ అంటుంది సురేఖ.

■ గురువుగా...

ఎక్స్‌ప్రెస్ మెయిల్ డ్రైవర్‌గా 2011లో ప్రమోట్ అయిన సురేఖ ఆ తరువాత కల్యాణ్‌లో డ్రైవర్స్ ట్రైనింగ్ సెంటర్ (డిటీసి)లో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా పాఠాలు బోధించింది. మన దేశంలో ట్రైన్ నడిపిన తొలి మహిళగా గుర్తింపు తెచ్చుకున్న సురేఖ ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చింది.

కష్టం లేదు... ఎప్పుడూ ఇష్టమే!

‘ట్రెయిన్ నడపడం అంటే మాటలా!’లాంటి మాటలు వినిపించినప్పటికీ నేను ఎప్పుడూ భయపడలేదు. చాలా ధైర్యంగా, ఉత్సాహంగా శిక్షణ తీసుకున్నాను. ఈ ఉద్యోగంలోకి ఎందుకు వచ్చానా అని ఎప్పుడూ అనుకోలేదు. ఉద్యోగం ఎప్పుడూ కష్టంగా అనిపించలేదు. కుటుంబ, వృత్తి బాధ్యతలను జాగ్రత్తగా సమన్వయం చేసుకునేదాన్ని.

– సురేఖ యాదవ్

ఘనమైన వీడ్కోలు



సురేఖ యాదవ్ ఫేర్‌వెల్ సెలబ్రేషన్ ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ (సీఎస్ఎంటీ)లో ఘనంగా జరిగింది. ఎక్కడెక్కడి నుంచో వచ్చిన సురేఖ ఆత్మీయులు, స్నేహితులు, బంధువులు, రైల్వే ఉద్యోగులు ఆమె మెడలో పూలమాలలు వేశారు. డోళ్లు వాయిస్తూ నృత్యాలు చేశారు.

‘సురేఖ రిటైర్ అయినప్పటికీ... ఆమెలోని శక్తి సామర్థ్యాలు రిటైర్ కావు. అవి ఎప్పుడూ ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తూనే ఉంటాయి’ అన్నారు వక్తలు.

2011లో 50 మంది మహిళలు సబర్బన్, గూడ్స్ ట్రైన్ డ్రైవర్లుగా ప్రయాణం మొదలుపెట్టారు. ఇలాంటి ఎంతోమంది మహిళలకు స్ఫూర్తి...సురేఖ.

■ ఆ ప్రోత్సాహమే ఉత్సాహమై...

‘ఆడవాళ్లు ట్రైన్ డ్రైవర్ ఏమిటి! అని ఆశ్చర్యపోయే రోజుల్లో కూడా నా కుటుంబం, మిత్రులు, బంధువుల నుంచి ప్రోత్సాహం లభించింది. ఆ ప్రోత్సాహమే ఉత్సాహమై నన్ను ముందుకు నడిపించింది. వృత్తిజీవితంలో నాకు ఎలాంటి వివక్షా ఎదురుకాలేదు. ట్రైన్ ఎక్కిన తొలి క్షణం నుంచి మరే విషయాలు మదిలో రాకుండా ప్రశాంతంగా ఉండేలా చూసుకునేదాన్ని’ అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది సురేఖ.

నిజానికి ఆమె రైల్వే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తానని ఎప్పుడూ అనుకోలేదు. అయితే ఆ ఉద్యోగమే ఆమెను చరిత్రలో గుర్తింపు తెచ్చుకునేలా చేసింది.

వంటిల్లు

దుర్గామాత పూజలకు అన్నీ సిద్ధం అనుకునేలోపు నైవేద్యాల తయారీ ఎలా- అనే ఆందోళన తలెత్తడమూ సహజం... ఏమేం కావాలి, ఎలా రెడీ చేసుకోవాలో ముందే తెలుసుకుని, ఆచరణలో పెడితే అమ్మవారికి రుచిగా... శుచిగా నైవేద్యాలను సులువుగా సిద్ధం చేసుకోవచ్చు. ఆ వివరాలు ఈ వారం వంటిల్లులో..

అమ్మకు నైవేద్యం

పరమాన్నం



కావలసినవి: పెసరపప్పు – 1/2 కప్పు; బియ్యం – 3/4 కప్పు; పాలు – కప్పు; నీళ్లు – 4 కప్పులు; బెల్లం తరుగు – కప్పు; యాలకుల పొడి – అర టీ స్పూన్; నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; జీడిపప్పు – పది పలుకులు; కిస్‌మిస్ – గుప్పెడు.

తయారీ: ● పప్పును దోరగా వేయించుకోవాలి ● బియ్యం, పప్పు కలిసి కడగాలి ● కుకర్‌లో కడిగిన బియ్యం, పప్పు, నీళ్లు కలిపి 3 విజిల్స్ వచ్చేవరకు ఉడికించి, దించాలి ● మందపాటి గిన్నెలో బెల్లం తరుగు వేసి వేడిచేయాలి. దీంతో 3–4 నిమిషాల్లో బెల్లం పాకం సిద్ధం అవుతుంది ● కుకర్ విజిల్ వచ్చాక మూత తీసి, అన్నం మెత్తగా స్పూన్‌తో మెదుపుకోవాలి. పాలు పోసి కలపాలి ● ఫిల్టర్ పెట్టి, బెల్లం సిరప్ వడకట్టి, మెత్తగా అయిన అన్నంలో కలపాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని స్టౌపై పెట్టి ఐదు నిమిషాలు ఉడికించాలి. దీంట్లో యాలకుల పొడి వేసి కలపాలి ● విడిగా మరొక మూకుడులో నెయ్యి వేడి చేసి, దాంట్లో జీడిపప్పు, కిస్‌మిస్ వేసి దోరగా వేయించాలి ● నెయ్యిలో వేయించిన జీడిపప్పు మిశ్రమంలో కలిపి, గిన్నెలోకి తీసుకోవాలి.

అల్లం గారెలు



కావలసినవి: మినప్పప్పు – కప్పు; ఉప్పు – 1/3 టీ స్పూన్ (తగినంత); వంట సోడా– చిటికెడు; పచ్చిమిర్చి తరుగు – అర టీ స్పూన్; అల్లం తరుగు – టేబుల్ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు; మిరియాల పొడి – పావు టీ స్పూన్; నూనె – వేయించడానికి తగినంత.

తయారీ: ● మినప్పప్పు కడిగి, 3–4 గంటలసేపు నానబెట్టాలి. నీళ్ల వడకట్టి, ఉప్పు వేసి, మెత్తగా రుబ్బుకోవాలి ● రుబ్బిన పిండిలో పచ్చిమిర్చి తరుగు, ఉప్పు, మిరియాలపొడి, కరివేపాకు తరుగు వేసి కలపాలి ● స్టౌ పై కడాయి పెట్టి, గారెలు వేయించడానికి తగినంత నూనె పోసి, వేడి చేయాలి ● వేళ్లకు నీళ్లు తగిలేలా తడి చేసుకొని, పిండిని కొద్ది కొద్దిగా తీసుకొని, వేళ్లతోనే బాల్స్‌లా చేసుకోవాలి ● నూనె రాసిన ప్లాస్టిక్ షీట్‌పైన పిండి బాల్‌ను కొద్దిగా వేళ్లతో అదిమి, మధ్యలో హోల్ పెట్టాలి ● తయారు చేసుకున్న దానిని కాగుతున్న నూనెలో వేసి, రెండు వైపులా గోధుమ రంగు వచ్చే వరకు ఉంచి, బయటకు తీసి, ప్లేటులో పెట్టాలి.

కదంబం



కావలసినవి: బియ్యం – కప్పు; కందిపప్పు – అర కప్పు; చింతపండు – నిమ్మకాయ పరిమాణం; కూరగాయలు – బీరకాయ, సొరకాయ, గుమ్మడికాయ, బెండకాయ, దొండకాయ, గాజర్, బఠానీ.. మొదలైనవి – 150 గ్రాములు (చిన్న ముక్కలు); పసుపు – పావు టీ స్పూన్; ఉప్పు – తగినంత; సాంబార్ పొడి – 2 టీ స్పూన్లు; నూనె – 2 టేబుల్ స్పూన్లు; ఆవాలు – టీ స్పూన్; ఎండు మిర్చి – 2; ఇంగువు – చిటికెడు; నెయ్యి – టేబుల్ స్పూన్.

తయారీ: ● కందిపప్పు బాగా ఉడికించి, మెత్తగా మెదిపి పక్కనుంచాలి ● మరొక గిన్నెలో బియ్యం మెత్తగా ఉడికించి, వేరుగా ఉంచాలి ● ఒక గిన్నెలో కూరగాయల ముక్కలు, చింతపండు రసం, పసుపు, ఉప్పు వేసి మెత్తగా ఉడికించాలి ● ఉడికిన కూరగాయ ముక్కల్లో సాంబార్ పొడి వేసి బాగా కలపాలి ● మెత్తగా చేసిన పప్పు, అన్నం ఉడుకుతున్న కూరగాయల మిశ్రమంలో వేసి కలపాలి ● ఒక చిన్న పాన్‌లో నూనె వేసి వేడి చేసి, ఆవాలు, జీలకర, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ వేసిన తాలింపును వేసి కలపాలి.

● గిన్నెలోకి తీసిన తర్వాత చివరగా నెయ్యి వేయాలి.



– నారాయణమ్మ,
మీ థాట్ హోమ్ డిలైట్

రీబూట్

స్టైల్ మార్చి సత్తా చాటింది!



వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణ పతకం గెలిచి చరిత్ర సృష్టించిన జైస్మిన్ లంబోరియా ప్రయాణం నల్లేరు మీద నడకేమీ కాదు. హరియాణాకు చెందిన జైస్మిన్ కుటుంబాన్ని ‘బాక్సర్‌ల కుటుంబం’ అంటుంటారు. ఆమె తాత కెప్టెన్ చందర్ బ్యాన్ లంబోరియా రెజ్లర్. బాబాయ్‌లు నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్స్‌గా సత్తా చాటారు. తాతల బాక్సింగ్ నైపుణ్యాల గురించి వింటూ, బాబాయ్‌ల బాక్సింగ్‌ల ప్రతిభను చూస్తూ పెరిగింది జైస్మిన్.

వారి స్ఫూర్తితో బాక్సింగ్‌లోకి అడుగు పెట్టిన జైస్మిన్ తన ఋుఎత్తు కారణంగా మొదట్లో ఇబ్బంది పడింది. అపజయాలు పలకరించాయి. ‘అపజయాన్ని చూసి బాధపడడం కంటే ఆడేవిధానాన్ని మార్చుకుంటే సరిపోతుంది’ అని ధైర్యం చెప్పుకొని తన స్టైల్‌ను మార్చుకుంది. ఆ మార్పులలో అతిగా తొందరపడకుండా ఓపికగా ఉండడం కూడా ఒకటి. కొత్త స్టైల్‌తో బంగారు పతకం గెలుచుకుంది.

బ్రెజిల్‌లో జరిగిన ‘వరల్డ్ బాక్సింగ్ కప్’కు జైస్మిన్‌ను పంపడానికి నిరాకరించిన బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సైతం స్వర్ణపతకం గెలిచిన సందర్భంగా ‘ప్రౌడ్ మూమెంట్ ఫర్ ఇండియా’ అంటూ ‘ఎక్స్’ వేదికగా ఎక్సలెంట్ టెక్నికల్ బాక్సర్ జైస్మిన్ లంబోరియాను ప్రశంసించడం విశేషం.

● సోషల్ మీడియా



తూమక్ తూమక్

సోషల్ మీడియాలో ‘తూమక్ తూమక్’ అనేది వైరల్ ట్రెండ్‌గా మారింది. కర్మ అనే టీచర్ చిన్న పిల్లలతో కలిసి వేసిన ‘తూమక్ డ్యాన్స్’ ఆహా అనిపిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియోకు 21 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.



టీచర్ వేసిన పాపులర్ ట్రెండ్ స్టెప్స్‌ను చిన్ని స్టూడెంట్స్ పర్ఫెక్ట్‌గా అనుసరించి ‘వారేవా’ అనిపించారు.

‘మీరు నమ్ముతారో లేదోగానీ నేను ఈ వీడియోను వందసార్లు చూసి ఉంటాను’ అన్నాడు ఒక యూజర్.

‘నా వయసు 26 సంవత్సరాలు. మీ స్కూల్‌లో విద్యార్థిగా మారవచ్చా?’ అని సరదాగా అడిగింది ఒక యూజర్.

ప్లేబ్యాక్ సింగర్ నేహా బాషిన్ ‘జుట్టి మేరీ’ ఆల్బమ్ పాపులర్ అయింది. ఈ పాటలోని తూమక్ స్టెప్స్‌కు ఆన్‌లైన్ లోకం ఫిదా అయింది. గతవారం క్లాస్‌రూమ్‌లో చిన్న అమ్మాయి ఒకరు చక్కని హావభావాలతో వేసిన తూమక్ తూమక్ స్టెప్స్ వీడియో కూడా వైరల్ అయింది.

● నమిత

పట్టుదలే..ముందడుగు



ఢిల్లీలో మెటల్ డిజైనింగ్‌లో మాస్టర్స్ చేసిన నమిత సూరత్‌లో ఎనిమిదేళ్లు ఆభరణాలను డిజైన్ చేసింది. అయితే ఉన్నట్టుండి ఆమె విజయవంతమైన కెరీర్‌ను వదిలి హైదరాబాద్‌కు మారి సామాజిక, పారిశుధ్య సమస్యలపై అవగాహన పెంచుకొని పర్యావరణం కోసం పనిచేస్తోంది. రైల్వేలతో పాటు దేశంలో శానిటేషన్ అవసరం ఉన్న ప్రాంతాలలో బయో డైజెస్టర్ టాయిలెట్‌లను నిర్మించి పారిశుధ్య కార్మికులు, గ్రామీణ మహిళలకు వందలాది ఉద్యోగాలను సృష్టించింది. పర్యావరణం కోసం పనిచేయడానికి ఆసక్తి చూపే అనేక స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాల్లో పాల్గొంది. హెల్త్ కేర్, వాటర్ అండ్ శానిటేషన్ అవార్డుతోపాటు అనేక ప్రశంసలను పొందిన నమిత బంకా కథ ఇది.

‘తలపెట్టిన పనిని నూటికి నూరుపాళ్లు పూర్తిచేయడానికి కృషి చేయాలని నమ్ముతాను’ అంటారు నమిత. భర్త ఉద్యోగరీత్యా హైదరాబాద్ కు బదిలీ కావడంతో ఇక్కడే సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో వివిధ కోర్సుల్లో చేరారు. దాంట్లో భాగంగా ఇండియన్ రైల్వేలో టెండర్లు వేయడం మొదలుపెట్టారు. తనకున్న పరిచయాల ద్వారా పెద్ద సమస్యలలో ఒకటైన పారిశుధ్యం గురించి తెలుసుకుని, రైల్వేలో టాయిలెట్ తయారీదారులకు లైసెన్సింగ్ ఏజెంట్‌గా పనిచేసి, మార్కెట్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకున్నారు. ఆ తర్వాత తెలంగాణలోని ఎమ్ఎస్ఎమ్ఇ ఇండస్ట్రియల్ పార్క్ వద్ద శానిటేషన్ నిర్వహణ వ్యవస్థ ఏర్పరిచి, పర్యావరణ అనుకూల ఉత్పత్తుల తయారీలో రాణిస్తున్నారు. బంకా బయో ప్రైవేట్ లిమిటెడ్‌కు రూపకల్పన చేసి, దానిని సంస్థాగతంగా వెలుగులోకి తీసుకు వచ్చారు.

వ్యర్థాల శుద్ధి

మన దేశంలో పారిశుధ్య సమస్యల గురించి నమిత వివరిస్తూ –‘‘గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మంది ప్రజలు బహిరంగంగా మలవిసర్జన చేస్తుంటారు. ఈ పద్ధతి ఆరోగ్య ప్రమాదాలను కలిగిస్తుంది. పర్యావరణ సమస్యలను పెంచుతుంది. నీటి కాలుష్యానికి దారితీస్తుంది. మేం టాయిలెట్‌ను మాత్రమే కాకుండా ‘ఆన్–సైట్’ వ్యర్థాల శుద్ధి సౌకర్యాన్ని కూడా అందిస్తాం. వీటి ట్యాంక్‌లో బయో–డైజెస్టర్‌లు అమర్చి ఉంటాయి. సంప్రదాయ టాయిలెట్‌లతో పోలిస్తే తక్కువ సమయం లో 99 శాతం వ్యర్థాలు కుళ్ళిపోతాయి. సంప్రదాయ సెప్టిక్ ట్యాంకులను బయో–ట్యాంకులుగా మార్చడానికి మేం కృషి చేస్తున్నాం. ఇది మెరుగైన పర్యావరణాన్ని, ఆరోగ్య పరిస్థితులను సృష్టిస్తుంది. రైలు పట్టాలను వ్యర్థ పదార్థ రహిత ట్రాక్‌లుగా మార్చడానికి భారతీయ రైల్వేలకు, కుటుంబాలకు బయో–టాయిలెట్లు, పబ్లిక్–కమ్యూనిటీ, పాఠశాలలు, సంస్థలకు బయో–టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రస్తుతం ఉన్న సెప్టిక్ ట్యాంకులను బయో–ట్యాంకులుగా అప్‌గ్రేడ్ చేస్తున్నాం. సమాజంలో పారిశుధ్యం విషయంలో మహిళలు ఎదుర్కొంటున్న కఠినమైన పరిస్థితి గురించి నాకు తెలుసు. మొదట ఈ విషయంలో రైల్వే అధికారులను సంప్రదించినప్పుడు, రైళ్లలో టాయిలెట్ టెక్నాలజీలను మెరుగుపరచడంలో వారు నాతో సహకరించారు. పారిశుధ్య ప్రమాణాలను పెంచడానికి అక్కడ ఒక బలమైన అవకాశాన్ని చూశాను. తరువాత సమాజం కోసం కూడా దీనిని ఉపయోగించడం ప్రారంభించాను.

ధైర్యంతో పాటు దృఢ సంకల్పమే తోడు

కష్టాలను ఎదుర్కోవడానికి ధైర్యంతో పాటు తలపెట్టిన పని పూర్తిచేయాలనే దృఢ సంకల్పం ఉండాలి. నేను అదే చేశాను. సాంస్కృతిక అడ్డంకులెన్నో నాకు అడ్డంకిగా నిలిచాయి కానీ ఆగిపోలేదు. సమాజం పట్ల నా విధులను సక్రమంగా నిర్వర్తించాలన్న నా సంకల్పం, పారిశుధ్యం, పర్యావరణం పట్ల శ్రద్ధే నన్ను నడిపిస్తున్నాయి. ఔత్సాహిక బృందం నాతో కలిసి రావడం అదృష్టం. మొదట ముగ్గురు సభ్యులతో మొదలుపెట్టాం. 2013 చివరి నాటికి మా సంఖ్య 80కి పెరిగింది. వివిధ విభాగాలతో ఖర్చుతో కూడుకున్న పారిశుధ్య పరిష్కారాలను అందించడానికి కృషి చేస్తున్నాం. సంకల్ప్ సమ్మిట్, యాక్షన్ ఫర్ ఇండియా వంటి కార్యక్రమాలలో పాల్గొన్నాం. అక్కడి అనుభవాలు మమ్మల్ని మేము మరింతగా మెరుగుపరచుకోవడానికి సహాయ పడ్డాయి. దీనికితోడు బ్యాంకు క్రెడిట్, ప్రైవేట్ రుణ నిధులు ఉండనే ఉన్నాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ కొన్ని ప్రయోజనాలను అందించింది. ఒక మహిళా వ్యవస్థాపకురాలిగా ప్రతి దశలోనూ మనల్ని మనం నిరూపించుకోవాలి. రకరకాల సామాజిక మనస్తత్వాలనూ దృష్టిలో ఉంచుకోవాలి. అప్పుడే సక్సెస్ సాధించగలుగుతాం’’ అని చెప్పారు నమిత.

దేశంలో టాయిలెట్ సౌకర్యం అందుబాటులో లేని ప్రదేశాలలో బయోడైజెస్టర్ టాయిలెట్ల నిర్మాణానికి, తయారీకి, సరఫరాకు నమిత బంకా కృషి చేస్తున్నారు. దాదాపు పది మిలియన్ల మందికి ఆమె సేవలు చేరుకున్నాయి. ఇండియన్ రైల్వేస్, షాపూర్జీ పల్లోంజీ, ఎల్ అండ్ టి, వోకార్డ్ ఫౌండేషన్, తెలంగాణ, ఎ.పి ఎడ్యుకేషన్ – వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఇస్రో .. వంటివి బంకా బయోకు ఉన్న ముఖ్యమైన క్లయింట్లు. ఈ కంపెనీ ప్రతిష్ఠాత్మక సంకల్ప్ హెల్త్‌కేర్, వాటర్ అండ్ శానిటేషన్ అవార్డుతో సహా అనేక అవార్డులను గెలుచుకుంది.

● పునరాగమనం



5000 ఏళ్లనాటి ఆట తిరిగి వచ్చింది!

5000 వేల ఏళ్ల క్రితం నాటి ఆట ఒకటి తమిళనాడులో పునరాగమనం చేయడమే కాదు బాగా పాపులర్ అవుతోంది. చోళుల కాలం నాటి ఈ ఆట పేరు... ఆట్య పట్య. శారీరక దారుఢ్యం, ఐక్యతకు అద్దం పట్టే ఈ ఆటను ‘సత్రినై’ అని కూడా పిలుస్తారు. తమిళ ప్రాచీన సాహిత్యంలో ఈ ఆటకు సంబంధించిన ఎన్నో విశేషాలు కనిపిస్తాయి.

పదిహేనుమందితో రెండు జట్లు ఆడే ఈ ఆట చురుకుదనం, వ్యూహం, క్రమశిక్షణకి గీటురాయిగా నిలిచింది.

పెద్దల నోటి నుంచి ఆట్య పట్య గురించి విన్న యువతరం వేల ఏళ్ల నాటి ఆటకు ప్రాణం పోశారు. తమిళనాడులోని వివిధ జిల్లాలలో యువతరమే కాదు పిల్లలు కూడా ఆట్య పట్య ఆడుతున్నారు. ఈ ఆట ఎలా ఆడాలి అనేదాని గురించి యూట్యూబ్‌లో ఎన్నో వీడియోలు ఉన్నాయి.

బులియన్
(బంగారం 10 గ్రా.; వెండి కిలో)
సెప్టెంబర్ 19న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,14,410	1,13,500	1,11,330	1,13,500	1,14,050	1,11,600
బంగారం (22 క్యారెట్లు)	1,07,560	1,02,050	1,02,050	1,05,110	1,04,930	1,02,300
వెండి	1,33,500	1,33,800	1,43,000	1,33,800	1,33,300	1,43,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సరదా ఈత.. కాకూడదు గుండె కోత

లోతుపాతులు తెలియక నిత్యం పలువురు మృత్యువాత

అత్యుత్సాహంతో కొందరు.. ఆదమరచి మరికొందరు

ఈతలో మెళకువలు తెలుసుకోవడం తప్పనిసరి

కొంచెం దృష్టి పెడితే స్విమ్మింగ్ వల్ల ఎన్నో ఉపయోగాలు



విశాఖపట్నం నాయుడుతోట సమీపంలోని మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో ఇటీవల ఇద్దరు యువకులు నీట మునిగి మృతి చెందారు. పెందుర్తికి చెందిన బల్లంకి శేఖర్(18), ఇతని సోదరుడు వాసు, చిన ముషిడివాడకు చెందిన యాదాడ లక్ష్మణ్‌కుమార్ (18) సరదాగా రిజర్వాయర్ ఒడ్డున కూర్చొని ఉండగా శేఖర్ చెప్పు నీటిలో పడిపోయింది. రిజర్వాయర్ అంచు పట్టుకుని దానిని బయటకు తీసే క్రమంలో నాచు కారణంగా నీటిలో పడిపోయాడు. పైకి, కిందికి మునకలేస్తుండగా ఒడ్డు నుంచి లక్ష్మణ్ కుమార్ చేయి అందించబోయాడు. అయితే శేఖర్ అమాంతం.. లక్ష్మణ్ చేయిని లాగేయడంతో ఇద్దరూ నీట మునిగి పోయారు. వీరిద్దరికీ ఈత రాదు. ఒడ్డునే ఉన్న వాసు (ఇతనికి ఈత వచ్చు) నీటిలోకి దూకి వారిని రక్షించబోగా.. ఇతన్ని గట్టిగా పట్టేసుకున్నారు. దీంతో ముగ్గురూ నీటిలో మునిగిపోతుండగా ఒడ్డున ఉన్న మరో వ్యక్తి గమనించి నీటిలోకి దూకి.. ఒక్క వాసును మాత్రమే కాపాడగలిగాడు. మొన్నామధ్య అన్నమయ్య జిల్లా రాజంపేటలో ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు, మచిలీపట్నం సమీపంలో నలుగురు విద్యార్థులు ఇలానే మృత్యువాత పడ్డారు. ఇలాంటి సంఘటనలు ప్రతి రోజూ రాష్ట్రంలో ఎక్కడో చోట జరుగుతూనే ఉన్నాయి. చాలా మంది విద్యార్థులు ఈత రాక, మరికొందరు ఈత వచ్చినా కూడా ఇలాంటి ఘటనల్లో మృతి చెందుతున్నారు. చాలా మందికి ఈత వచ్చినా 'రెస్క్యూ' (కాపాడటం) ఎలా చేయాలో తెలియక పోవడం విచారకరం.

- చాలా దేశాల్లో స్విమ్మింగ్, సైక్లింగ్, కుకింగ్.. అనేవి విద్యార్థి దశలోనే మాండటరీ. ప్రతి వ్యక్తికి ఏదో ఒక దశలో ఇవి చాలా ముఖ్యం. ఇవి వస్తేనే ఉన్నత విద్యలో ప్రవేశం ఉంటుంది. మన దేశంలో మాత్రం అంత ముఖ్యం కాదు. ఇవన్నీ ఐచ్ఛికం. కుకింగ్ (వంట చేయడం) ఎంత ఇంపార్టెంటో మొన్న కరోనాలో మనకు బాగా తెలిసొచ్చింది. ఈత అనేది ఎంత ఉపయోగకరమో పైన చెప్పుకున్న ఘటనల్లాంటివి మనకు తారస పడినప్పుడు తెలుస్తుంది.
- చాలా మందికి.. ప్రత్యేకించి యువతకు నీటి గురించి అవగాహన ఉండదు. ఆ.. ఏమవుతుంది అనుకుని నీటిలో దిగేస్తుంటారు. ఫ్రెండ్స్‌తో కలిసి బీచ్‌లకు, నది ఒడ్డుకు పిక్నిక్‌లకు వెళ్లినప్పుడు లోతు గమనించకుండానే ముందుకెళుతూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటుంటారు. మరికొంత మంది స్విమ్మింగ్ పూల్‌లో పట్టుమని 10 మీటర్లు కూడా ఈదలేని విధంగా ఉదరాబదరా ఈత నేర్చుకుని 'మాకూ ఈత బాగా వచ్చు' అని భ్రమ పడుతుంటారు.
- పై ఈత (ఫ్రీ స్టైల్), లో ఈత (అండర్ వాటర్), వెనకీత (బ్యాక్ స్ట్రోక్), పక్కీత (సైడ్ స్ట్రోక్), నిలువీత (స్టాండింగ్ పొజిషన్), ఏటీత (బటర్‌ఫ్లై స్ట్రోక్), కప్పీత (బ్రెస్ట్ స్ట్రోక్) అని ఈతలో చాలా రకాలున్నాయి. చాలా మంది ఇవన్నీ నేర్చుకున్నప్పటికీ ఎప్పుడు ఏ ఈత అవసరమో తెలుసుకోరు. నేర్పించే వారు కూడా చెప్పరు. భారీ పరిమాణంలో నీరు నిల్వ ఉన్న చోట వెనకీత (బ్యాక్ స్ట్రోక్), కొద్దిపాటి ప్రవాహాలకు ఎదురీదాల్సి వచ్చినప్పుడు, సుడిగుండాల్లో చిక్కుకున్నప్పుడు ఏటీత (బటర్‌ఫ్లై స్ట్రోక్), చిన్నపాటి కాలువలు దాటాల్సి వచ్చినప్పుడు పై ఈత (ఫ్రీ స్టైల్), నీటిపైన చెత్తా చెదారాలు, పరిశ్రమల వ్యర్థాలు తేలుతున్నప్పుడు అండర్ వాటర్ ఈత అవసరం. అన్నింటికంటే బ్యాక్ స్ట్రోక్ చాలా ముఖ్యం. ఎందుకంటే ఎక్కువగా అలుపు రాదు. మధ్య మధ్యలో నీటిపై తేలియాడుతూ రిలాక్స్ అయ్యే అవకాశం ఉంటుంది. ఎంత దూరమైనా ఇలా నెమ్మదిగా వెనక్కు వెళ్లిపోవచ్చు.
- చాలా మంది యువతకు కొద్దో గొప్పో ఈత వచ్చి కూడా చనిపోవడం చూస్తున్నాం. ఇలాంటి చాలా ఘటనల్లో బయటకు చెప్పలేని నిజం ఏమిటంటే వారు మద్యం మత్తులో ఉండటం. సరదాగా స్నేహితులతో కలిసి పిక్నిక్‌లకు వెళ్లినప్పుడు మందు (లిక్కర్) తాగుతుంటారు. అలా మద్యం మత్తులో నీటిలోకి దిగినప్పుడు ఎంత దూరం లోపలికి పోతున్నారో గమనించరు. తిరిగి వెనక్కు వచ్చే క్రమంలో ఆయాసం ఎక్కువై.. బాడీ బ్యాలెన్స్ చేసుకోలేక.. ఆలోచించే కెపాసిటీ కోల్పోయి నీట మునిగి చనిపోతున్నారు. అందువల్ల మద్యం తీసుకున్నప్పుడు పొరపాటున కూడా ఈతకు దిగరాదని యువతకు గట్టిగా చెప్పాలి. మన పిల్లలకు మనం నీరంటే భయమన్నా నేర్పాలి. లేదా ఈత అయినా నేర్పించాలి.

- సాక్షి స్పెషల్ డెస్క్

రెస్క్యూ చాలా కీలకం

ఇకపోతే చాలా మందికి ఈత బాగా వచ్చినప్పటికీ రెస్క్యూ చేయడం తెలియదు. ఆపదలో ఉన్న వారిని కాపాడబోయి వీరూ మృత్యువాత పడుతుంటారు. ఎందుకంటే నీట మునిగి పోతున్న వారి దగ్గరకు మనం వెళ్లగానే వారు మనల్ని గట్టిగా పట్టేసుకుని ముంచేస్తారు. అందువల్ల ఎవరినైనా కాపాడాలనుకుంటే నేరుగా వారి ముందుకు వెళ్లకూడదు. ఒకవేళ వారు పట్టుకోజూసినా గట్టిగా తోసేసి విదిలించుకోవాలి. వారి వెనక్కు వెళ్లి సంకల కింద ఒక చేయి వేసి పట్టుకోవాలి. అంటే వారి తలను మన భుజం వద్ద పెట్టుకోవాలి. అప్పుడు వారికి శ్వాస తీసుకోవడానికి వీలవ్వడంతో మనకు సహకరిస్తారు. మరో చేత్తో నెమ్మదిగా రివర్స్ స్ట్రోక్‌లో ఈత కొడుతూ ఒడ్డుకు చేరుకోవాలి. అనంతరం ప్రథమ చికిత్స చేయాలి. ఈతలో మరింత ప్రొఫెషనల్‌గా తయారవ్వడం కోసం రాష్ట్రీయ లైఫ్ సేవింగ్ సొసైటీ శిక్షణ ఇస్తోంది. మరిన్ని వివరాలకు 'లైఫ్ సేవింగ్ ఇండియా డాట్ ఆర్గ్' వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.



కొత్త ప్రాంతాల్లో జాగ్రత్తలు తప్పనిసరి

చాలా మందికి అంతో ఇంతో ఈత వచ్చినా కొత్త ప్రాంతాలకు వెళ్లినప్పుడు ప్రమాదాలబారిన పడుతుంటారు. ప్రధానంగా పరిసరాలు, లోతు గమనించకుండా డైవ్ చేస్తుంటారు. ఇది సరికాదు. తొలుత నీటిలోకి దూకే ముందు ఎంత లోతులో ఉందో అంచనా వేయాలి. సుడిగుండాలున్నాయేమో గమనించాలి. కింద బురద మట్టి, పదునైన రాళ్లు ఏమైనా ఉన్నాయా అని కూడా పరిశీలించాలి. ఇవన్నీ తెలుసుకోకుండా అమాంతం దూకేయడం సరికాదు. స్విమ్మింగ్ పూల్‌లో ఈదినట్లు అన్నిచోట్లా సాధ్యం కాదు. ఇంకో విషయం.. 'నాకు ఈత బాగా వచ్చు.. మీకు ఏమీ కాదు.. నేనున్నాగా.. మీరు దిగండి..' అంటూ కొంత మంది పిక్నిక్‌లకు వెళ్లినప్పుడు స్నేహితులను బలవంతం చేస్తుంటారు. తీరా లోపలకు దిగి.. కొంత దూరం వెళ్లాక బురదలో కాళ్లు ఇరుక్కుపోతే.. లేక కింద గుంత లోతుగా ఉంటే రెస్క్యూ చేయడం చాలా కష్టం. అందుకే అన్నీ గమనించాలి. ఈత గురించి ఒక్క మాటలో చెప్పాలంటే అందరికీ చాలా అవసరం. ప్రత్యేకించి ఎన్నో అనారోగ్యాలకు చక్కటి మందు. ఒత్తిడిని సహజంగా తగ్గిస్తుంది. భారీ వర్క్ అవుట్స్ చేయలేని, జాగింగ్, వాకింగ్‌కు వెళ్లలేని వారికి అత్యద్భుతమైన ఎక్సర్‌సైజ్ స్విమ్మింగ్.

– కీర్తన సుందరమూర్తి, స్విమ్మింగ్ కోచ్, విజయవాడ



ఆశలు 'కుళ్లిపోతున్నాయి'!

పెట్టుబడి కూడా దక్కని ఉల్లిరైతు

- క్వింటా ఉత్పత్తికి రూ.1,750
- మద్దతు ధర నామమాత్రంగా రూ.1,200
- పంట అంతంతమాత్రంగా మార్కెట్‌లోకి వస్తేనే ఈ దుస్థితి
- పూర్తి స్థాయిలో వస్తే పరిస్థితి ఏమిటని ఆందోళన
- మద్దతు ధర రూ.2,000 పెంపునకు డిమాండ్



కర్నూలు మార్కెట్‌కు వెల్లువెత్తిన ఉల్లి

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వ హయాంలో మిరప, పత్తి, మామిడి, టమాట తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. ఇప్పటికే యూరియా కొరత సతమతం చేస్తున్న సమయంలో మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు ఉల్లి ధర కన్నీళ్లు పెట్టిస్తోంది. రాష్ట్రంలో ఉల్లి పండించే జిల్లాల్లో కర్నూలుదే అగ్రస్థానం. మహారాష్ట్రలోని పుణే తర్వాత అత్యధికంగా ఉల్లి సాగవుతున్నది ఇక్కడే. అయితే ఇప్పుడున్న ధరలతో రైతు తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉల్లి సాధారణ సాగు విస్తీర్ణం 19,288 హెక్టార్లుకాగా (హెక్టార్ దాదాపు 2.5 ఎకరాలు) 15,704 హెక్టార్లలోనే సాగయింది. ఉద్యాన శాఖ గణాంకాల ప్రకారం హెక్టారుకు 150 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. దీని ప్రకారం చూస్తే, జిల్లా మొత్తంగా ఉల్లి ఉత్పాదకత అంచనా 23,55,600 క్వింటాళ్లు. అయితే ఇప్పటికే మార్కెట్‌లోకి వచ్చిన దిగుబడి 2,52,000 క్వింటాళ్లు. అంతంత మాత్రం మార్కెట్‌లోకి వచ్చిన ఉల్లిగడ్డలనే కొనేవారు లేరు. పూర్తి స్థాయి పంట మార్కెట్‌లోకి వస్తే పరిస్థితి ఏమిటని రైతులు వాపోతున్నారు.

క్వింటాకు తక్షణ నష్టం రూ.550

అప్పులు, పంట చేతికి వచ్చి అమ్ముకోవడానికి పట్టే నాలుగు నెలల కాలంలో వడ్డీల భారం వెరసి ఉల్లి రైతుకు పెను భారమవుతోంది. మొత్తంగా క్వింటా ఉల్లిగడ్డలు పండించి మార్కెట్‌కు తీసుకురావడానికి రూ.1,750 వరకు (కేజీకి రూ.17.50 చొప్పున) ఖర్చవుతోంది. కూటమి ప్రభుత్వం ఉల్లికి ఇస్తున్న మద్దతు ధర రూ.1,200 మాత్రమే. అంటే పెట్టుబడిలోనే క్వింటాపై రైతులు రూ.550 నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో పెట్టుబడి వ్యయాన్ని పరిగణలోకి తీసుకొని మద్దతు ధరను కనీసం రూ.2,000కు పెంచాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఇతర ప్రాంతాలకు వలస

ధర లేక నష్టాలు మూట కట్టుకుంటున్న రైతులు గిట్టుబాటు ధర కోసం వలస బాట పడుతున్నారు. ప్రభుత్వం రూ.1,200 మద్దతు ధర ప్రకటించినప్పటికీ పెట్టుబడి కూడా దక్కకపోవడంతో అనేక మంది రైతులు చిత్తూరు, తిరుపతి, గుంటూరు తదితర ప్రాంతాలకు ఉల్లిగడ్డలు తీసుకెళ్లి ప్రధాన రహదారులు, నగరాల్లోని ప్రధాన కూడళ్లలో అమ్మకాలు సాగిస్తున్నారు. రీటైల్ మార్కెట్‌లో కిలో రూ.20 ప్రకారం విక్రయిస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు రైతులు లారీ తీసుకెళ్లి అమ్మకాలు చేస్తుండటం గమనార్హం.

జగన్ హయాంలో ఐదేళ్లూ హ్యాపీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్న ఐదేళ్లలో ఉల్లి రైతులు ఏ ఒక్క రోజు రోడ్డెక్కిన దాఖలాలు లేవు. ఉల్లి సాగు ఎక్కువగా ఉండటంతో పాటు వర్షాలు విస్తారంగా పడటం వల్ల దిగుబడి కూడా పెరిగింది. బంగ్లాదేశ్‌తో పాటు వివిధ దేశాలకు ఎగుమతులు అయ్యాయి. జిల్లా చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా రైతులకు ధర లభించింది. రికార్డు స్థాయిలో క్వింటా ఉల్లికి రూ.13,500 వరకు ధర లభించింది. ఆ ఐదేళ్లలో ఉల్లి సాగు చేసిన రైతులకు నష్టాల మాటే తెలియదు.

బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి ధర రూ.25పైనే..

ఇక జిల్లాలోనే బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి ధర రూ.25పైగా ఉంది. రోడ్లపై రూ.100కు నాలుగు కిలోల ఉల్లి బోర్డుపై రాసి అమ్మకాలు సాగిస్తున్నారు. రైతు బజార్లలోనే కిలో రూ.25 ప్రకారం విక్రయిస్తున్నారు. సూపర్ మార్కెట్‌లు, మాల్స్‌లో కిలో ధర మరింత ఎక్కువే ఉంటోంది. ఉల్లి పండించే జిల్లాలోనే బహిరంగ మార్కెట్‌లో ఉల్లి ధరలు ఇలా ఉంటే, ఉల్లి పండించని జిల్లాల్లో ధరలు ఏ విధంగా ఉంటాయే ఊహించుకోవచ్చు. అయితే కూటమి ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర మాత్రం కిలోకు రూ.12 మాత్రమే కావడం గమనార్హం.



కర్నూలులో రూ.100కు 4 కిలోల ప్రకారం ఉల్లి విక్రయాలు

మద్దతు ధర ఎప్పుడు అందుతుందో..?



ఒకటిన్నర ఎకరాలో ఉల్లి సాగు చేశా. విత్తనాలు కొనడం మొదలు.. పంటను మార్కెట్‌కు తెచ్చే వరకు పెట్టుబడి వ్యయం దాదాపు రూ.2 లక్షల వరకు వచ్చింది. గ్రేడింగ్ చేయగా.. దిగుబడి మాత్రం 100 క్వింటాళ్లు వచ్చింది. ఉల్లిలో నాణ్యత కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నప్పటికీ, వ్యాపారులు క్వింటా రూ.550 ధరతో కొన్నారు. ప్రభుత్వం మాత్రం మద్దతు ధర రూ.1,200 మాత్రమే నిర్ణయించింది. వ్యాపారులు రూ.550 ప్రకారం కొనగా.. మిగిలిన రూ.650 ప్రభుత్వం చెల్లిస్తుందని అధికారులు చెబుతున్నారు. అదీ ఎప్పటికి పడుతుందో తెలియని పరిస్థితి. మద్దతు ధర రూ.1,200 ఏ మాత్రం గిట్టుబాటు కాదు. రూ.2 లక్షలు పెట్టుబడి పెడితే రూ.1.20 లక్షలు చేతికి వస్తోంది. కనీసం రూ.2,000 మద్దతు ధర ఉండాలి. – గోవిందు, బోగోలు, వెల్దుర్తి మండలం

పెట్టుబడిలోనే రూ.40 వేల నష్టం



రెండు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాం. ఎకరాకు రూ.1.10లక్షల ప్రకారం రూ.2.20 లక్షలు పెట్టుబడి పెట్టాం. దిగుబడి రూ.150 క్వింటాళ్లు వచ్చింది. మార్కెట్‌కు తీసుకరాగా.. వ్యాపారులు క్వింటా రూ.320 ప్రకారం కొన్నారు. మద్దతు ధరలో గ్యాప్ అమౌంటు రూ.980 ప్రభుత్వం చెల్లిస్తుందని చెబుతున్నారు. ఎప్పటికి పడుతుందో తెలియని పరిస్థితి. పెట్టుబడి రూ.2.20 లక్షలు పెడితే ప్రభుత్వ మద్దతు ధరతో లెక్కించినా రూ.1.80 లక్షలు మాత్రమే వస్తోంది. పెట్టిన పెట్టుబడిలోనే రూ.40 వేలు నష్టం వస్తోంది. – పాపన్న, దేవనకొండ

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల : తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోయాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 68,095 మంది స్వామి వారిని దర్శించుకోగా 23,932 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.70 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

టీడీపీలో చేరిన ముగ్గురు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికైన ముగ్గురు ఎమ్మెల్సీలు టీడీపీలోకి ఫిరాయించారు. బల్లి కళ్యాణ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, మర్రి రాజశేఖర్ శుక్రవారం ఉండవల్లిలో సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. చంద్రబాబు వారిని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వాస్తవానికి వారు గతంలోనే వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి టీడీపీలో అనధికారికంగా చేరారు. ఇప్పుడు అధికారికంగా పార్టీ ఫిరాయించారు.

ప్రఖార్ జైన్‌కు సమాచార డైరెక్టర్‌గా బాధ్యతలు

సాక్షి, అమరావతి: రియల్ టైమ్ గవర్నెన్స్ సీఈవో ప్రఖార్ జైన్‌కు సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్, ఈవో సంయుక్త కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏపీ ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మీడియా పాయింట్

రండి క్షేత్ర స్థాయిలో చూసొద్దాం



జగన్ నేతృత్వంలో ఏకంగా 17 మెడికల్ కాలేజీల కోసం అనుమతులు తెచ్చి, స్థల సేకరణ పూర్తి చేయడంతో పాటు పనులు కూడా మొదలు పెట్టారు. వీటిలో 7 కాలేజీల నిర్మాణం పూర్తి చేయగా, 5 మెడికల్ కాలేజీల్లో తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. బాధ్యత గల ప్రభుత్వంగా మిగిలిన మెడికల్ కాలేజీల నిర్మాణాలను పూర్తి చేయకుండా చంద్రబాబు సహా మంత్రులు పచ్చి అబద్ధాలు చెప్పడం చూస్తుంటే అసహ్యం కలుగుతోంది. నంద్యాల మెడికల్ కాలేజీ అద్భుతంగా నిర్మాణం పూర్తి చేసుకుని రెండో సంవత్సరం అడ్మిషన్లు కూడా జరుగుతున్నాయి. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే రండి క్షేత్ర స్థాయికి వెళ్లి చూసి వద్దాం. – కల్పలత, ఎమ్మెల్సీ

గతంలోనూ ఇలాగే చేశారు



చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఇంజినీరింగ్ కళాశాలలను ప్రైవేటు పరం చేశారు. ఇప్పుడు మెడికల్ కళాశాలను ప్రైవేటుకు అప్పగిస్తున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పెడితే దానిని చంద్రబాబు నిర్వీర్యం చేశారు. పెత్తందార్ల చేతిలో పెట్టి వైద్యాన్ని వ్యాపారం చేశారు. మన స్వార్థం కోసం కాకుండా సమాజం కోసం ఆలోచించాలి. ప్రభుత్వం ఇచ్చిన జీవోను, పీపీపీ విధానాన్ని రద్దు చేయాలి. – వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి



స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గత చంద్రబాబు పాలన ముగిసే వారకు 11 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. లక్షలాది మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు మెడిసిన్ చదవడానికి ఎదురు చూస్తున్నారు. జగన్ సీఎం అయిన తరువాత 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చారు. పేద విద్యార్థులకు వైద్య విద్య అందాలంటే ప్రభుత్వ ఆధీనంలోనే మెడికల్ కళాశాలలు ఉండాలి. కానీ ఈ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలో పేదలు, మైనార్టీల మీద కక్ష కట్టినట్టు వ్యవహరిస్తోంది. కూటమి తన నిర్ణయాన్ని వెనుక్క తీసుకునే వరకు పేద ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుంది. – బొమ్మి ఇజ్రాయెల్, ఎమ్మెల్సీ

విద్య, వైద్యానికి జగన్ ప్రాధాన్యం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో విద్యా విప్లవం తీసుకొచ్చారు. ప్రజారోగ్యం కూడా ప్రభుత్వ బాధ్యతే అని నమ్మారు. హైదరాబాద్‌లో ఉన్న నీలోఫర్ ఆస్పత్రి కన్నా మిన్నగా చిన్నారుల కోసం తిరుపతిలో కొత్త ఆస్పత్రిని నిర్మించాలని అధునాతన వసతులతో పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రికి శ్రీకారం చుట్టారు. 2021 అక్టోబర్ 3న వైద్యశాలను ప్రారంభించారు. 2022 డిసెంబర్‌లో చిన్నారులకు గుండె మార్పిడి ఆపరేషన్లు కూడా మొదలుపెట్టారు. 3 వేలకు పైగా ఓపెన్ హార్ట్ సర్జరీలు, గుండె మార్పిడి ఆపరేషన్లు చేయించి వారికి ప్రాణాలు పోసిన ఘనత జగన్‌కే దక్కుతుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీరుపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. – ఎం.వి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ

గ్రాఫిక్స్ కోసం రూ.లక్షల కోట్లు ఖర్చు పెడతారా?



ఐదేళ్లలో అమరావతిలో ఏమైనా అభివృద్ధి జరిగిందా? ఐకానిక్ టవర్ ఎప్పుడు పూర్తవుతుందో చెప్పగలరా? అలాంటి చోట రూ.లక్షల కోట్లు ఖర్చుపెడతారా? పేద వాడికి ఆరోగ్యాన్ని అందించే వైద్య కళాశాలకు మాత్రం రూ.6 వేల కోట్లు ఖర్చు చేయలేరా? నడపలేమని ప్రైవేటుకు అప్పగించేస్తారా? ఇదేం నీతి చంద్రబాబూ? ప్రైవేట్ వారికి అప్పగిస్తే వారు ఉచితంగా వైద్యం అందిస్తారా? ఇది దుర్మార్గ చర్య. సీట్లు వద్దని ఏ ముఖ్యమంత్రి అయినా లేఖ రాస్తారా? – పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ

వైద్య రంగానికి కేటాయించిన నిధులెన్ని?



ఈ ఏడాది వైద్య రంగానికి ప్రభుత్వం కేటాయించిన నిధులెన్ని? రూ.20 వేల కోట్లు అని చెబుతున్నారు. అందులోంచి రూ.5–6 వేల కోట్లు ఖర్చు చేయగలిగితే 10 మెడికల్ కళాశాలలు పేదలకు అందుబాటులోకి వస్తాయి. రూ.10 వేల కోట్లు బడ్జెట్ ప్రభుత్వానికి ఆదా అవుతుంది. అలా చేయాల్సిందిపోయి ప్రైవేటీకరణ చేయడం దారుణం. టీడీపీకి ఎన్నికల్లో నిధులిచ్చిన సంస్థలకు కట్టబెట్టాలని చూడటం అన్యాయం. ప్రభుత్వం తన నిర్ణయాన్ని విరమించుకోకుంటే మండలిలో ఎండగడతాం. – తూమాటి మాధవరావు, ఎమ్మెల్సీ

డీఏలు, బకాయిలు విడుదల చేయాలి



ఉద్యోగుల సమస్యలను శాసనమండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే పరిస్థితి లేదు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు 11వ పీఆర్సీ 2023 జూన్ 31తో అయిపోయింది. జూలై నుంచి 12వ పీఆర్సీ ఇవ్వాలి. సీఎం చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు ఉద్యోగ, ఉపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్ ఓటును తనకు వేసినందున పీఆర్సీ కమిషన్ వేస్తామన్నారు. కానీ 15 నెలలు కావస్తున్నా ఏమీ చేయలేదు. నాలుగు డీఏలు పెండింగ్ ఉన్నాయి. దసరాకు అవన్నీ ఇవ్వాలి. వెంటనే పీఆర్సీ వేసి ఇంటీరియం రిలీఫ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. రూ.25 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలి. – పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

• స్ఫూర్తి

పూర్ణ మాలావత్: 13 ఏళ్లకే ఎవరెస్ట్ ఎక్కింది





ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వతాల్లో ఒకటైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలానేది ప్రతీ ట్రెక్కర్ కల. అయితే అది అంత సులభంగా నెరవేరే కల కాదు. ఎన్నో సంవత్సరాల శిక్షణ, సాధన, నేర్పు, ఓర్పులతో పాటు అచంచలమైన మనో ధైర్యం ఉంటే తప్ప సాధ్యపడదు. సంవత్సరాల పాటు సాధన చేసిన వారు సైతం వెనకడుగు వేసిన సందర్భాలు కోకొల్లలు. కానీ, తెలంగాణకు చెందిన మాలావత్ పూర్ణ కేవలం 13 ఏళ్ల వయసులోనే మొక్కవోని దీక్షతో అత్యంత ప్రమాదకర పర్వతమైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించింది.

నిజామాబాద్ జిల్లాలోని పాకాల అనే గ్రామంలో 2000 సంవత్సరంలో జన్మించింది పూర్ణ. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు అయినప్పటికీ పూర్ణ చదివించాలని పూనుకొని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చేర్పించారు. ఆ పాఠశాల పూర్ణ జీవితాన్ని మలుపుతిప్పింది. చదువులతో పాటు, ఆటల్లో కూడా రాణించడంతో ఉపాధ్యాయులు తనలోని ప్రతిభను గుర్తించి ప్రత్యేకమైన శిక్షణ ఇప్పించారు.

శిక్షణ ముగిసిన అనంతరం నాటి గురుకులాల కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ సాయంతో షేక్ హుస్సేన్ అనే గైడ్ ఆధ్వర్యంలో 2014 మే 25 న కేవలం 13 ఏళ్ల వయసులోనే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి ఆ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించింది.

అగ్గిపెట్టె కూడా దొరకని కుగ్రామం నుండి వచ్చి ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన శిఖరాన్ని అధిరోహించిన పూర్ణ సాహసం ఆమె వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, పట్టుదల ఉంటే సమాజంలో ఎటువంటి అడ్డంకులనైనా అధిగమించవచ్చు అనడానికి ఒక ఉదాహరణ. ఆమె తన చదువును కొనసాగిస్తూ, ఇతర బాలికలకు స్ఫూర్తినిస్తోంది. 'ఎంత చిన్న వయసైనా, పెద్ద కలలను సాధించవచ్చు' అని పూర్ణ నిరూపించింది. ఆమె జీవితం తెలుగు బాలికలకు, ముఖ్యంగా గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే పిల్లలకు, కష్టపడితే ఏదైనా సాధ్యమని చెప్పే సజీవ ఉదాహరణ.





• వండర్ కిడ్

మూడేళ్ల పిల్లాడు... బొమ్మలేసి లక్షలు సంపాదిస్తున్నాడు

జర్మనీలోని బావరియాకు చెందిన లారెంట్ స్క్వార్జ్ మూడేళ్ల వయసులోనే బొమ్మలు వేసి ఆశ్చర్యపరుస్తున్నాడు. లారెంట్ వేసే బొమ్మలు ఆన్‌లైన్ వేదికగా అమ్ముడవుతున్నాయి. ఒక్కోదాన్ని లక్షలు పెట్టి కొంటున్నారు.

లారెంట్ తల్లిదండ్రులు ఆ పిల్లాణ్ణి రెండేళ్ల క్రితం సెలవులకు ఇటలీకి తీసుకెళ్లారు. అప్పటికి లారెంట్ వయసు సంవత్సరం. ఆ సమయంలో హోటల్‌లోని యాక్టివిటీ రూమ్‌లో ఓ పెయింటింగ్ చూశాడా గడుగ్గాయి. దాన్ని చూస్తూ అలాగే నిలబడిపోయాడు. అతనికి చిత్రలేఖనం మీద ఆసక్తి కలిగిందని భావించిన తల్లిదండ్రులు ఇంటికొచ్చాక రంగులు, కాన్వాస్, బ్రెష్‌లు ఏర్పాటు చేశారు. సరదాగా మొదలైన చిత్రలేఖనం సీరియస్ పనిగా మారిపోయింది.

ప్రస్తుతం ఇంట్లో తన సొంత స్టూడియోను ఏర్పాటు చేసుకున్నాడు. లారెంట్ పెయింటింగ్‌లు సుమారు 7,000 డాలర్లు (రూ.6 లక్షల) వరకు అమ్ముడవుతున్నాయి. అతని తల్లి అతనికి ఇన్‌స్టాగామ్ ఖాతాను ఏర్పాటు చేసి వాటిని విక్రయిస్తోంది. అతని అకౌంట్‌కి సుమారు 9.99 లక్షల మంది కంటే ఎక్కువ మంది ఫాలోవర్స్ ఉన్నారు. స్క్వార్జ్ తండ్రి, తాత ఇద్దరూ కూడా కళాకారులే. వారి నుంచే ఆ బాలుడికి ఈ కళ అబ్బిందని అందరూ అంటున్నారు.

• కథ

మంత్రాల రాయి



సుధీరుడు, విక్రముడు ప్రాణ స్నేహితులు. వారిద్దరూ దేశాటనం చేస్తున్నారు. ఒక నాడు ఒక ఊరికి చేరేసరికి పొద్దు పోయింది. అయితే ఆ ఊరిలోని వారెవరూ వారిని తమ ఇంట్లో ఉండేందుకు అంగీకరించలేదు. తిరిగి తిరిగి, విసిగి వేసారిన వారికి చివరకు ఓ వృద్ధురాలు ఆశ్రయమిచ్చింది. ఉండేందుకు చోటు మాత్రమే ఇస్తానని, భోజన సదుపాయాలు కల్పించనని తెగేసి చెప్పింది. రోజంతా చేసిన ప్రయాణం కారణంగా సుధీరుడు, విక్రముడు ఆకలితో నకనకలాడిపోతున్నారు. ఎలా అని ఆలోచిస్తున్న సుధీరుడికి ఓ ఆలోచన వచ్చింది. వెంటనే విక్రముడు చెవిలో ఏదో చెప్పాడు. దానికి విక్రముడు సరేనని తలూపాడు. వీరు పడుకున్న చోటుకు కొద్ది దూరంలోనే ఆ వృద్ధురాలు మంచం వేసుకొని పడుకుంది. ఆమెకు వినిపించేలా 'మిత్రమా! ఆ సన్యాసి ఇచ్చిన మంత్రాల రాయి భద్రంగా దాచావా?' అని అడిగాడు విక్రముడు.

దానికి సుధీరుడు 'ఆ.. భద్రంగా దాచాను. అది మామూలు రాయి కాదు, మహిమ గల రాయి. దాని ద్వారా ఏ వంటైనా సులభంగా వండేయవచ్చు. ఏమాత్రం ఖర్చు లేకుండా జీవితాంతం రుచికరంగా భోజనం చేయవచ్చు' అన్నాడు.

నిద్రపోబోతున్న వృద్ధురాలు ఈ మాటలు విన్నది. ఆ రాయిని చూడాలని ఆమెకు కోరిక కలిగింది. వెంటనే లేచి వారి వద్దకు వచ్చి ఆ రాయిని చూపించమని కోరింది. సుధీరుడు సంచీలోనుంచి ఓ రాయిని బయటకు తీసి ఆమెకు ఇచ్చాడు. ఆమె దాన్ని పరీక్షగా చూసి 'ఇది మామూలు రాయిలాగానే ఉందే?' అని సందేహపడింది.

'ఇలా చూస్తే దీని మహిమ తెలియదు. పొయ్యి వెలిగించి, గిన్నెలో కాసిన్ని పాలు పోసి అందులో ఈ రాయి వేస్తే మహిమ తెలుస్తుంది' అన్నాడు. రాయి మహిమ చూడాలన్న ఆశతో వారిని వంటింట్లోకి తీసుకెళ్లి, పొయ్యి వెలిగించి, పాలగిన్నె పొయ్యి మీద పెట్టి అందులో రాయి వేసింది. కాసేపటికి పాలు బాగా మరిగాయి. 'ఆ... అదిగో పాయసం తయారవుతోంది. మరికాసేపట్లో రుచికరమైన పాయసం తినొచ్చు' అన్నాడు విక్రముడు. ఆ మాటలతో వృద్ధురాలి కళ్లు మెరిశాయి. కాసేపటి తర్వాత 'కొంచెం సగ్గుబియ్యం ఉంటే పాయసం అద్భుతం తయారవుతుంది' అన్నాడు సుధీరుడు.

సరేనని ఆమె వెళ్లి సగ్గుబియ్యం కడిగి తీసుకువచ్చింది. దాన్ని అతను పాలల్లో వేశాడు. బియ్యం ఉడుకుతూ ఉంది. కాసేపటికి గరిటెతో కొంత పాయసం తీసుకుని నోట్లో వేసుకుని 'చక్కగా కుదిరింది. కానీ చక్కెర తక్కువైంది. మనం కావాలంటే కొంత చేర్చుకోవచ్చు' అన్నాడు. 'అవునవును. పాయసం తియ్యగా ఉండాల్సిందే' అన్నాడు విక్రముడు.

ఆమె లేచి వెళ్లి చక్కెర తెచ్చింది. ఉడుకుతున్న పాయసంలో ఆ చక్కెర వేశాడు సుధీరుడు. కాసేపటికి ఆమెకు ఏదో గుర్తొచ్చినట్లు 'ఉండండి. డబ్బాలో కొంత జీడిపప్పు, కొన్ని యాలాకులు ఉన్నట్లున్నాయి. అవి కూడా చేరిస్తే బాగుంటుంది' అని చెప్పి వాటిని తీసుకొచ్చి పాయసంలో కలిపింది. ఇల్లంతా పాయసం వాసన ఘుమఘుమలాడింది. కాసేపటికి పొయ్యి మీద నుంచి గిన్నె దించింది. సుధీరుడు జాగ్రత్తగా ఆ మంత్రాల రాయిని బయటకు తీశాడు. పాయసాన్ని చిన్న గిన్నెల్లో వేసి వారికి ఇచ్చిందామె. అనంతరం తానూ ఓ గిన్నెలో వేసుకుంది.

పాయసాన్ని తింటూ 'మీరన్నది నిజమే! నా జన్మలో ఇలాంటి పాయసం తినలేదు. అద్భుతంగా ఉంది. ఇదంతా ఆ మంత్రాల రాయి మహిమ' అంది ఆ వృద్ధురాలు. సుధీరుము, విక్రముడు ఒకరినొకరు చూసి ముసిముసిగా నవ్వుకున్నారు. తెల్లారి నిద్రలేచిన తర్వాత ఆమెకు కృతజ్ఞతలు చెప్తూ, తమ గుర్తుగా ఆ మంత్రాల రాయిని ఆమెకు ఇచ్చి ప్రయాణమయ్యారు. 'ఇంత మహిమ గల రాయిని వీళ్లు నాకు ఇచ్చేస్తున్నారు. పాపం అమాయకులు' అనుకుంది ఆ వృద్ధురాలు. మహిమ ఆ రాయిలో లేదని, రాత్రి ఆమె చేత తాము వేయించిన పదార్థాలన్నీ కలిసి పాయసంగా మారిందన్న విషయం ఆ స్నేహితులకు తెలుసు.

• మన సినిమా | ఎలియో

వీడికి ఏలియన్స్ కావాలి



హేయ్ కిడ్స్... మీకెవరికైనా ఏలియన్స్‌ని చూడాలనుందా? లేదా వాళ్ల దగ్గరకి వెళ్ళాలనుందా. అమ్మో అస్సలు లేదు అనుకుంటున్నారా. కాని ఎలియో మాత్రం తనను ఎవరైనా ఏలియన్స్ తీసుకువెళితే బావుండు అని అనుకుంటున్నాడు. అది కూడా ఎంతలా అంటే రోజూ బీచ్‌కి వెళ్ళి అలా ఒంటరిగా ఉండిపోయి పడుకుండి పోతాడు. ఎప్పుడైనా ఓ ఏలియన్ తనను చూసి ఎత్తుకెళ్ళకుండా ఉంటదా అన్న చిన్న ఆశ ఎలియోకి. పేరెంట్స్‌ని పోగొట్టుకోని ఎయిర్ ఫోర్స్‌లో పని చేసే తన పిన్ని దగ్గర ఉంటున్న ఎలియోకి చిన్నప్పటి నుండి ఏలియన్స్ అంటే పిచ్చి. అందుకే తనను ఎత్తుకుపొమ్మని కనిపించిన సిగ్నల్స్‌కి మెసేజ్ పెడుతుంటాడు. ఆ రోజు రానే వస్తుంది. ఎలియోని ఓ ఏలియన్ గ్రూప్ ఎత్తుకు వెళుతుంది. ఏలియన్స్ గ్రూప్‌లో గ్లోర్డన్ ఎలియోకి మంచి ఫ్రెండ్ అవుతుంది. ఇక అక్కడ నుండి వీళ్ళు చేసే అల్లరి, ఫాంటసీ అడ్వెంచర్స్ తెలియాలంటే మాత్రం హాట్ స్టార్‌లో స్ట్రీమ్ అవుతున్న యానిమేటెడ్ ఫాంటసీ మూవీ 'ఎలియో'ని చూడాల్సిందే. ఇంకెందుకాలస్యం గ్రాబ్ యువర్ రిమోట్ టు జాయిన్ ఎలియో ఎలాంగ్ విత్ ఏలియన్స్.

- హరికృష్ణ ఇంటూరు

• మీకు తెలుసా?



చల్లని కుండ... తయారీ ఎలా?



పిల్లలూ! మనకు చల్లని నీరు ఇచ్చే కుండని మీరు చూశారు కదా? మరి ఆ కుండ ఎలా తయారు చేస్తారో తెలుసా? మనిషి కుండలు తయారు చేయడమనేది వేల సంవత్సరాల ముందు నుంచే ఉందని చరిత్రకారుల మాట. ప్రస్తుతం మనం వాడుతున్నట్లు కేవలం నీటి కోసమే కాకుండా ధాన్యం, విలువైన వస్తువులు, డబ్బులు, ఆభరణాలు దాచుకునేందుకు కుండలను వాడేవారు. అన్నం, కూరలు కూడా కుండల్లోనే వండుకునేవారు. అందుకే ఆ రోజుల్లో కుండలు చేసేవారికి చాలా ప్రాధాన్యం ఉండేది.

కుండలు తయారు చేసేవారిని 'కుమ్మరులు' అని అంటారు. వారు ముందుగా మట్టిని ఎంపిక చేసుకుంటారు. సరైన మట్టి దొరికితేనే కుండ నాణ్యత బాగుంటుంది. అందుకే సరైన మట్టిని తెచ్చి శుభ్రం చేసి, నీటితో కలిపి ముద్దగా చేస్తారు. మట్టి, నీరు కలిసేలా దాన్ని బాగా తొక్కి తమకు కావాల్సిన రీతిలో తయారు చేసుకుంటారు. అనంతరం చక్రంపై (దీనిని సారె అంటారు) మట్టిని, చేత్తోనే దాన్ని సరిచేస్తూ కుండ ఆకృతిని తీసుకొస్తారు. ప్రస్తుతం చక్రం స్థానంలో మోటార్ బిగించిన ఆధునిక యంత్రాలు వచ్చాయి. వాటి వల్ల కుమ్మరుల పని సులువైంది.

కుండ తయారీ పూర్తయిన తర్వాత, దాన్ని సారె మీద నుంచి తీసి ఆరబెడతారు. అవి కాస్త గట్టిపడ్డాక బట్టీకి తీసుకెళ్తారు. అక్కడ వాటిని అధిక ఉష్ణోగ్రతలో కాలుస్తారు. ఇలా కాల్చడం వల్ల కుండలో రసాయనిక చర్య జరిగి, కుండ విరిగిపోదు. గట్టిగా ఉంటుంది. ఆ ప్రక్రియ అనంతరం కుండ తయారైనట్లే. కుండలోని నీరు తాగడం ఎంతో ఆరోగ్యకరం.

• వావ్!




నక్షత్రాలు కాదు...

ఈ ఫొటో చూశారా... నక్షత్రాలు భలే మెరిసిపోతున్నాయనుకున్నారా... మీ ఊహ తప్పు. ఇవి నక్షత్రాలు కాదు. కాంతులీనే డ్రోన్లు. వేడుకలకు, ఉత్సవాలకు ఆకాశంలో ఇలా మందలుగా ఎగరేసి నక్షత్రాలను తలపిస్తారు. ఈ ఫొటో వాటికన్ సిటీలోది. ఇటీవల అక్కడ 'గ్రేస్ ఫర్ ది వరల్డ్' పేరుతో ఒక కార్యక్రమం జరిగింది. ఆ సందర్భంగా అక్కడి ప్రఖ్యాత సెయింట్ పీటర్స్ డోమ్ మీద ఇలా ఇల్యుమినేటెడ్ డ్రోన్లను ఎగరేశారు. నెట్‌లో ఇలాంటి డ్రోన్ల గురించి చదివి తెలుసుకోండి.


• పుస్తకాలు

స్వీయ అనుభవాల సమాహారం



ప్రముఖ రచయిత్రి సిడ్నీ టేలర్ రాసిన 1951లో రాసిన పిల్లల పుస్తకం 'ఆల్ ఆఫ్ ఏ కైండ్ ఫ్యామిలీ'. 1912లో న్యూయార్క్ నగరంలోని లోయర్ ఈస్ట్ సైడ్‌లో పెరుగుతున్న ఐదుగురు అమెరికన్ యూదు బాలికల కుటుంబం అనుభవాలే ఇందులోని కథనం. ఇది రచయిత్రి స్వీయ అనుభవాల సమాహారం. ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి పొందిన ఈ పుస్తకానికి నాలుగు సీక్వెల్స్ రావడం విశేషం.


మారుతున్న బాల్యంపై వచన కవిత్వం



బాల్యం ఓ బంగారు జ్ఞాపకాల గని. గత కాలంలో పిల్లలు పొందిన ఆనందమేమిటో, ఇప్పటి పిల్లలు కోల్పోతున్న ఆనందాలు ఏమిటో పిల్లలకు మాత్రమే కాక వారి తల్లితండ్రులకు కూడా అర్థమయ్యేలా గిరిధర్ ఆళ్వార్ రాసిన వచన కవితలవి. అమ్మ గర్భంలోని శిశువు పొందే అనుభూతుల నుండి, బాల్యం, ఆ తర్వాత పెరిగి పెద్దయిన పిల్లల పరివర్తన దాకా ఈ వచన కవితా ప్రయాణం సాగుతుంది 'బాల వికాసం' పుస్తకంలో.

• మహనీయులు

పేదల పక్షాన కథలు రాసిన- చాసో



తెలుగు నేల మీద అనేకమంది రచయితలు రచనలు చేసి గొప్ప పేరు తెచ్చుకున్నారు. అటువంటి వారిలో ఒకరు చాగంటి సోమయాజులు. 'చాసో'గా ప్రసిద్ధి చెందిన ఆయన పేదల పక్షాన నిలిచి కథలు రాశారు.

1915 జనవరి 17న శ్రీకాకుళంలో జన్మించారు చాగంటి సోమయాజులు. ఆయన తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ శర్మ, తులసమ్మ. పెదతల్లి తులసమ్మకు ఆయన దత్తతగా విజయనగరానికి వెళ్ళారు. ఆయన బాల్యమంతా నాగావళి నదీతీరంలో గడిచింది. కళాశాల విద్యార్థిగా ఉన్న సమయంలోనే తొరుదత్, సరోజినీ నాయుడు, లియో టాల్‌స్టాయ్, మాక్సిం గోర్కీ రచనలు చదివి ప్రభావితమయ్యారు. ఆ సమయంలో కథ, కవిత్వం రాయడం మొదలుపెట్టారు. తర్వాతి కాలంలో కథారచనకే ప్రాధాన్యమిచ్చారు. ఆయన రాసిన 'కుంకుడాకు', 'ఎందుకు పారేస్తాను నాన్నా', 'వాయులీనం', 'కుక్కుటేశ్వరం', 'బొండుమల్లెలు' తదితర కథలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. చాసో కథలలో వస్తువూ, శిల్పమూ పోటాపోటీగా సాగుతాయి. ఆయన రాసిన చాలా కథలు హిందీ, రష్యన్, కన్నడ, మరాఠీ, మలయాళం, ఉర్దూ భాషలలోకి అనువాదమయ్యాయి. 1943లో అభ్యుదయ రచయితల సంఘంలో చేరి చివరిదాకా అందులోనే కొనసాగారు. ఆయన కుమార్తె చాగంటి తులసి రచయిత్రిగా ప్రసిద్ధులు. చాసో 1994 జనవరి 1న మరణించారు. ఆయన కుటుంబసభ్యులు 'చాసో స్ఫూర్తి' పేరుతో ఒక ట్రస్ట్ నెలకొల్పి, ఏటా ఆయన జన్మదినం రోజున అభ్యుదయ రచయితలలో ఒకరికి 'చాసో స్ఫూర్తి సాహితీ పురస్కారం' అందిస్తున్నారు.

బిజినెస్ రీల్

వాహన ధరలు తగ్గించిన సుజుకీ మోటార్‌సైకిల్



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన తయారీ సంస్థ 'సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా' తన వాహన ధరలు తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కస్టమర్లు ఎంపిక చేసుకున్న మోడల్‌ను బట్టి రూ.18,024 వరకు తగ్గింపు ఉంటుందని తెలిపింది. కొత్త ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. ఆటోమొబైల్స్‌పై జీఎస్టీ తగ్గించిన నేపథ్యంలో ఆ ప్రయోజనాలను కస్టమర్లకు బదిలీ చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ వివరించింది. ''జీఎస్టీ 2.0 సంస్కరణలను స్వాగతిస్తున్నాము. పండుగ సీజన్‌లో టూవీలర్స్‌కు డిమాండ్ మరింత ఊపందుకోవచ్చు'' అని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ దీపక్ ముత్రేజా అన్నారు.

రూ. 400 కోట్ల పీఎల్‌ఐ కోసం ఓలా క్లెయిమ్



న్యూఢిల్లీ: ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్‌ఐ) పథకం కింద సుమారు రూ. 400 కోట్లు క్లెయిమ్ చేస్తూ ఓలా ఎలక్ట్రిక్ దరఖాస్తు చేసుకుంది. 2025 ఆర్థిక సంవత్సరంలో రూ. 3,000 కోట్ల అమ్మకాలకు గాను కంపెనీ క్లెయిమ్ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. నిబంధనల ప్రకారం 13 నుంచి 14 శాతం రేటు ప్రకారం చూస్తే రూ. 400 కోట్ల ఇన్సెంటివ్ ఉండొచ్చని వివరించాయి. ఈ నిధులు లభిస్తే కంపెనీ లిక్విడిటీ పరిస్థితి పటిష్టమవుతుందని, రాబోయే రోజుల్లో సంస్థ ఆర్థిక పనితీరుపై సానుకూల ప్రభావం ఉంటుందని పేర్కొన్నాయి. గతేడాది పీఎల్‌ఐ ప్రోత్సాహకాలు పొందిన ఏకైక ద్విచక్ర వాహనాల సంస్థగా (ఓఈఎం) ఓలా నిల్చింది.

జోయాలుక్కాస్ నుంచి అతిపెద్ద సేల్ ఆఫర్



హైదరాబాద్: జోయాలుక్కాస్ 'ది బిగ్గెస్ట్ జ్యువెలరీ సేల్ ఆఫ్ ఇయర్' ఆఫర్ ప్రకటించింది. ఇందులో భాగంగా గోల్డ్, కట్, అన్‌కట్ డైమండ్స్, ప్లాటినం, వెండి, ప్రెషస్ స్టోన్ జ్యువెలరీ శ్రేణిలో మజూరీ ఛార్జీలపై 50% డిస్కౌంట్ ఇస్తోంది. ఈ ప్రత్యేక ఆఫర్‌కి అదనంగా జోయాలుక్కాస్‌లో ప్రతి కొనుగోలుపై ఉచితంగా జీవితకాలం నిర్వహణ, ఒక ఏడాది ఉచిత బీమా, బై బ్యాక్ హామీ పొందవచ్చు. అక్టోబర్ 5 వరకు అందుబాటులో ఉండే ఈ ఆఫర్‌ను కస్టమర్లమంతా వినియోగించుకోవాలని కంపెనీ చైర్మన్ జోయ్ అలుక్కాస్ కోరారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-9-2025	
విశాఖ	555-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	560-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,528.00	5.25
SBILIFE	1,846.00	1.33
INDUSINDBK	744	1.16
ADANIPORTS	1,429.00	1.15
BHARTIARTL	1,959.90	0.97

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HCLTECH	1,470.00	-1.59
ICICIBANK	1,402.50	-1.35
TRENT	5,082.00	-1.21
TITAN	3,470.00	-1.18
M&M	3,600.90	-1.13

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,623
ఎన్ఎస్ఈ	1,38,903
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,68,345
ఎఫ్ఐఐ	+ 391
డీఐఐ	+ 2,105

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	ప్రస్తుత ధర
నైమెక్స్ లైట్ స్వీట్	62.92	$ 63.57
బ్రెంట్	66.75	$ 67.44

ఏటా రూ. 120 కోట్ల పెట్టుబడులు

- ఈసారి 14 స్టోర్లతో విస్తరణ
- లైఫ్‌స్టయిల్ సీఈవో దేవ్ అయ్యర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫ్యాషన్ దుస్తులు తదితర ఉత్పత్తుల విక్రయ సంస్థ లైఫ్‌స్టయిల్ ఇంటర్నేషనల్ తమ కార్యకలాపాల విస్తరణపై ఏటా రూ. 100–120 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 14 స్టోర్స్ ప్రారంభిస్తోంది. ప్రస్తుతం కంపెనీకి దేశవ్యాప్తంగా సుమారు 125 స్టోర్స్ ఉండగా, తెలుగు రాష్ట్రాల్లో 14 ఉన్నాయి. శుక్రవారమిక్కడ కొత్తగా తీర్చిదిద్దిన స్టోర్‌ను ప్రారంభించిన సందర్భంగా కంపెనీ సీఈవో దేవ్ అయ్యర్ ఈ విషయాలు తెలిపారు. తమ ఆదాయాల్లో తెలుగు రాష్ట్రాల వాటా 11–12 శాతం ఉంటుందని ఆయన చెప్పారు. జీఎస్టీలో మార్పులతో ధరలపరంగా 6–8 శాతం మేర ప్రభావం ఉంటుందని అయ్యర్ చెప్పారు. జీఎస్టీ సంస్కరణలతో దేశీయంగా వినియోగానికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. మరోవైపు, డిజిటల్, కొత్త స్టోర్స్, ప్రైవేట్ బ్రాండ్లు మొదలైన అయిదు అంశాలపై గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతం వ్యాపారంలో సుమారు ఆరు శాతంగా ఉన్న డిజిటల్ వాటాను వచ్చే ఏడాది, రెండేళ్లలో 10–12 శాతానికి పెంచుకోనున్నామని అయ్యర్ చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 5,000 కోట్ల ఆదాయం ఆర్జించగా, ఈసారి రెండంకెల స్థాయి వృద్ధి అంచనా వేస్తున్నామన్నారు. ప్రధానంగా మెట్రోల్లో స్టోర్స్ ఏర్పాటు చేస్తున్నామని, వచ్చే ఏడాది 10–12 స్టోర్స్ ప్రారంభించనున్నామని అయ్యర్ వివరించారు. పండుగ సీజన్ సందర్భంగా లైఫ్‌స్టయిల్ ఎక్స్‌క్లూజివ్ దసరా కలెక్షన్‌ను సినీ నటి పూజా హెగ్డే ఆవిష్కరించారు.

భారత రేటింగ్ బీబీబీ ప్లస్

- అప్‌గ్రేడ్ చేసిన జపాన్ రేటింగ్ సంస్థ
- స్థిరమైన అవుట్‌లుక్ కొనసాగింపు



న్యూఢిల్లీ: భారత దీర్ఘకాలిక సావరీన్ క్రెడిట్ రేటింగ్‌ను బీబీబీ నుంచి బీబీబీ ప్లస్‌కు అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు జపాన్‌కు చెందిన రేటింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఫర్మేషన్ (ఆర్అండ్ఐ) ప్రకటించింది. స్థిరమైన అవుట్‌లుక్‌ను కొనసాగిస్తున్నట్టు తెలిపింది. ప్రపంచంలో వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తున్న పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ఒకటని తెలిపింది. యువ జనాభా అధికంగా ఉండడం, దేశీయంగా బలమైన వినియోగం, పటిష్టమైన ప్రభుత్వ విధానాలను ప్రస్తావించింది. సబ్సిడీలను క్రమబద్ధీకరించడం, బలమైన పన్నుల ఆదాయం, నియంత్రణలో రుణభారం, అధిక వృద్ధి, ద్రవ్య క్రమశిక్షణను తన నివేదికలో పేర్కొంది. విదేశీ వాణిజ్యం బలంగా ఉండడాన్ని సైతం గుర్తు చేసింది. కరెంటు ఖాతా లోటు మోస్తరుగా ఉండడంతోపాటు సేవల ఎగుమతుల పరంగా నికర వాణిజ్య మిగులు, బలమైన రెమిటెన్స్‌లు (విదేశాల నుంచి నగదు బదిలీలు), జీడీపీలో విదేశీ రుణం తక్కువగా ఉండడం, విదేశీ మారకం నిల్వలు సమృద్ధిగా ఉండడాన్ని ప్రస్తావించింది. భారత సావరీన్ రేటింగ్ అప్‌గ్రేడ్‌ను కేంద్ర ఆర్థిక శాఖ స్వాగతించింది. సమ్మిళిత, నాణ్యమైన వృద్ధికి మద్దతుగా విధానపరమైన చర్యలను, ద్రవ్య క్రమశిక్షణ, స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని ఇకముందూ కొనసాగిస్తామని ప్రకటించింది. ఐదు నెలల వ్యవధిలో మూడు క్రెడిట్ రేటింగ్ అప్‌గ్రేడ్‌లు అన్నవి భారత్ బలమైన స్థూల ఆర్థిక అంశాలు, ద్రవ్య క్రమశిక్షణకు అంతర్జాతీయ గుర్తింపు దక్కడంగా పేర్కొంది.

పన్నుల భారం తగ్గుతుంది

- ఎంఎస్ఎంఈలకు సానుకూలం
- ఏకీకృత పన్ను విధానానికి చేరువ
- స్వల్పకాలంలో ఆదాయ నష్టం
- వినియోగం పెరుగుదలతో భర్తీ అవుతుంది
- జీఎస్టీ తగ్గింపుపై ఫిక్కీ నివేదిక



న్యూఢిల్లీ: జీఎస్టీలో శ్లాబులను కుదిస్తూ ప్రభుత్వం ప్రకటించిన నూతన సంస్కరణలతో వినియోగదారులపై పన్ను భారం తగ్గుతుందని.. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈలు) సాధికారతకు తోడ్పడుతుందని, ఆర్థిక వ్యవస్థ మరింత సంఘటితంగా మారుతుందని ఫిక్కీ కమిటీ అభిప్రాయపడింది. అంతేకాదు భారత్‌ను ఏకీకృత పన్ను విధానానికి జీఎస్టీ 2.0 చేరువ చేస్తుందని పేర్కొంది. ఈ మేరకు ఒక నివేదికను విడుదల చేసింది. జీఎస్టీలో సంస్కరణలతో 5 శాతం పన్ను పరిధిలోని వస్తువులు మూడింతలు అవుతాయని.. 54 వినియోగ విభాగాలు కాస్తా 149కు చేరతాయని తెలిపింది. గ్రామీణులకు సంబంధించి జీఎస్టీ మినహాయింపు, యోగ్యత విభాగంలోని వస్తువులు 56.3 శాతం నుంచి 73.5 శాతానికి పెరుగుతాయని, పట్టణాల్లో వీటి వాటా 50.5 శాతం నుంచి 66.2 శాతానికి చేరుతుందని వెల్లడించింది. ''దీంతో గ్రామీణ వినియోగదారులపై నికర జీఎస్టీ అన్నది ఇప్పుడున్న 6.03 శాతం నుంచి 4.27 శాతానికి దిగొస్తుంది. పట్టణ వాసులపై ఇది 6.38 శాతం నుంచి 4.38 శాతానికి తగ్గుతుంది. దీనివల్ల వినియోగదారుల చేతుల్లో ఖర్చు చేసే ఆదాయం మరింత మిగులుతుంది. ఇది విచక్షణారహిత వినియోగం, సేవలు, రిటైల్, స్థానిక వ్యాపారాలకు చోదకంగా మారుతుంది'' అని ఫిక్కీ కమిటీ నివేదిక వివరించింది.

వ్యాపారస్థులకూ ప్రయోజనమే..

జీఎస్టీ 2.0లో రేట్ల క్రమబద్ధీకరణతో వ్యాపారస్థులకు ముఖ్యంగా ఎంఎస్ఎంఈలకు ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్ (తుది ఉత్పత్తి కంటే ముడి పదార్థాలపై అధిక రేటు) కారణంగా ఏర్పడిన గందరగోళానికి పరిష్కారం లభిస్తుందని ఈ నివేదిక తెలిపింది. ''2017లో జీఎస్టీ ప్రవేశపెట్టడం మన పన్నుల వ్యవస్థలో మార్పునకు దారితీసింది. ఇప్పుడు జీఎస్టీ 2.0 అమలుతో సులభతర పన్నుల రేటు నిర్మాణం మరింత బలోపేతం అవుతుంది. సమర్థతను పెంచుతుంది. 'ఒకే దేశం, ఒకే పన్ను రేటు' అన్న దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది''అని నకిలీ ఉత్పత్తులకు వ్యతిరేకంగా ఏర్పాటైన ఫిక్కీ కమిటీ (క్యాస్కేడ్) చైర్మన్ అనిల్ రాజ్‌పుత్ పేర్కొన్నారు. జీఎస్టీ తాజా సంస్కరణలతో స్వల్పకాలంలో ఆదాయం తగ్గినప్పటికీ.. వినియోగం పెరగడం, నిబంధనల అమలుతో కొంత కాలానికి భర్తీ అవుతుందని ఈ నివేదిక అంచనా వేసింది. జీఎస్టీ 1.0 కింద 2018–19లో పరోక్ష పన్నుల ఆదాయం రూ.11.78 లక్షలుగా ఉంటే.. 2024–25 నాటికి రెట్టింపై రూ.22.09 లక్షలకు చేరినట్టు గుర్తు చేసింది. జీఎస్టీ చెల్లింపుదారులు 66.5 లక్షల నుంచి 1.51 కోట్లకు విస్తరించడాన్ని ప్రస్తావించింది. ఇప్పుడు జీఎస్టీ 2.0 అమలుతో మరిన్ని వ్యాపార సంస్థలు దీని కిందకు వస్తాయని.. ఆర్థిక వ్యవస్థ మరింత సంఘటితంగా మారుతుందని, అంతిమంగా ఇది మరింత ఆదాయానికి దారితీస్తుందని అంచనా వేసింది. జీఎస్టీ 1.0లో అధిక పన్ను రేట్ల కారణంగా చట్ట వ్యతిరేక మార్కెట్ విస్తరించినట్టు, ముఖ్యంగా అక్రమ ఎఫ్ఎంసీజీ మార్కెట్ 70 శాతం పెరిగినట్టు తెలిపింది. అలాగే, పన్నులు చెల్లించని ప్యాకేజ్డ్ ఫుడ్స్ మార్కెట్ 100 శాతం, పొగాకు రూ.41,000 కోట్లను దాటినట్టు పేర్కొంది. ఈ తరహా సమాంతర ఆర్థిక వ్యవస్థ అన్నది తక్కువ, మధ్యాదాయ వర్గాల వారిపై ప్రభావం చూపించినట్టు, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించినట్టు తెలిపింది. చట్టబద్ధమైన వస్తువులపై వెచ్చించే ప్రతి రూపాయి సంఘటిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని పేర్కొంది.

ఎస్ఎస్ఈలో మరిన్ని ట్రస్ట్‌లకు చోటు

సెబీ తాజా అనుమతులు

న్యూఢిల్లీ: సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎస్ఎస్ఈ) ప్లాట్‌ఫామ్‌ను మరింత విస్తృతపరిచేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా నిర్ణయించింది. దీనిలో భాగంగా ఎస్ఎస్ఈ ద్వారా నిధుల సమీకరణకు మరిన్ని చారిటబుల్ ట్రస్ట్‌లను అనుమతించనుంది. ఈ బాటలో లిస్టింగ్ పరిధిని పెంచుతూ సర్క్యులర్‌ను జారీ చేసింది. ఇందుకు లాభాపేక్షలేని సంస్థ(ఎన్‌పీవో)ల నిర్వచనాన్ని విస్తృతం చేసింది. దీంతో ఎస్ఎస్ఈ లిస్టింగ్ పరిధిలోకి మరిన్ని సంస్థలు చేరనున్నాయి.



ఇందుకు అనుగుణంగా 1908 ఇండియన్ రిజిస్ట్రేషన్ చట్టం, సంబంధిత రాష్ట్ర సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం, 1956 కంపెనీల చట్టంలో భాగంగా సెక్షన్ 25కింద రిజిస్టరైన కంపెనీలను తాజా మార్గదర్శకాలలోకి చేర్చింది. అయితే ఈ సంస్థల జవాబుదారీతనాన్ని పెంచుతూ సంబంధిత నిబంధనలను సైతం ప్రకటిం,చింది. ఎలాంటి సెక్యూరిటీలను లిస్ట్‌చేయని ఎన్‌పీవోలు ఏఐఆర్ నివేదికను సొంతంగా రూపొందించి దాఖలు చేయవలసి ఉంటుంది. తద్వారా ఎన్‌పీవో ప్రధాన కార్యకలాపాలతోపాటు ఏడాది పొడవునా చేపట్టిన ప్రోగ్రామ్‌లు, మధ్యవర్తిత్వాలు, ప్రాజెక్టులను వివరణలతో తెలియజేయవలసి ఉంటుంది. ఆయా సంస్థల ప్రాధాన్యతను గుర్తించేలా వీటిని రూపొందించవలసి ఉంటుంది.

సహకార బ్యాంకుల్లోనూ ఆధార్ చెల్లింపుల సేవలు

కేంద్ర సహకార శాఖ కార్యదర్శి భుటానీ



న్యూఢిల్లీ: కోపరేటివ్ బ్యాంకులు సైతం ఇకపై ఆధార్ ఆధారిత చెల్లింపుల సేవలను అందించొచ్చని కేంద్ర సహకార శాఖ కార్యదర్శి ఆశిష్ కుమార్ భుటానీ తెలిపారు. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) సవరించిన కార్యాచరణ కింద ఇది సాధ్యపడుతుందన్నారు. నూతన కార్యాచరణపై ఢిల్లీలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తాజా చర్యతో సహకార బ్యాంకులు మరింత సమర్థవంతంగా, స్వయం సమృద్ధిగల ఆర్థిక సంస్థలుగా మారగలవని అభిప్రాయపడ్డారు. దీంతో సమ్మిళిత వృద్ధిపై ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామీణ, చిన్న పట్టణాలకు ఆర్థిక సేవలు మరింత చేరువ అవుతాయని చెప్పారు. ఆధార్ ధ్రువీకృత ఎకోసిస్టమ్‌కు కోపరేటివ్ బ్యాంక్‌లు ఇప్పటి వరకు దూరంగా ఉండగా, కొత్త కార్యాచరణ దీనికి పరిష్కారం చూపించినట్టు తెలిపారు. సహకార శాఖ, నాబార్డ్, ఎన్‌పీసీఐ, కోపరేటివ్ బ్యాంకులతో సంప్రదింపుల అనంతరం యూఐడీఏఐ సులభతర వ్యవస్థను అభివృద్ధి చేయడం గమనార్హం. దీంతో యూఐడీఏఐ కింద 34 రాష్ట్ర కోపరేటివ్ బ్యాంక్‌లు (ఎస్‌టీసీబీలు) ఆధార్ ధ్రువీకరణ కోసం నమోదు కావొచ్చు. దీంతో ఆయా రాష్ట్ర కోపరేటివ్ బ్యాంకుల పరిధిలోని 351 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు సైతం ఆధార్ కేవైసీ ధ్రువీకరణలను చేపట్టడానికి వీలు పడుతుంది.

ఐఎల్అండ్ఎఫ్ఎస్ నిధుల సమీకరణ

ఇన్విట్‌లో 15.1% వాటా విక్రయం



న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో చిక్కుకున్న ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రోడ్‌స్టార్ ఇన్‌ఫ్రా ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(ఇన్విట్)లో 15.1 శాతం వాటా విక్రయించనుంది. తద్వారా లభించనున్న నిధులతో రుణ భారాన్ని తగ్గించుకునే యోచనలో ఉంది. ఇందుకు వీలుగా కొనుగోలుదారులను అన్వేషించేందుకు యాక్సిస్ బ్యాంక్‌ను ఎంపిక చేసుకుంది. కాగా.. రోడ్‌స్టార్ ఇన్విట్‌లో 15 శాతం వాటా విక్రయం గ్రూప్ రుణ పరిష్కార ప్రణాళికకు అత్యంత ముఖ్యమని కంపెనీ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. రుణ పరిష్కార చర్యలకు మద్దతుగా తాము కన్సల్టెంట్లు, ఇంటర్మీడియరీలను ఎంపిక చేయడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలియజేశారు. రుణ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఐఎల్అండ్ఎఫ్ఎస్ ఈ ఏడాది మార్చిలో రోడ్‌స్టార్ ఇన్విట్ యూనిట్లను ఎన్ఎస్ఈలో లిస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

రాంకీ ఇన్‌ఫ్రాకు రూ. 2,085 కోట్ల కాంట్రాక్టు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక సదుపాయాల రంగ సంస్థ రాంకీ ఇన్‌ఫ్రాకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సెవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) నుంచి భారీ కాంట్రాక్టు లభించింది. దీని విలువ రూ. 2,085 కోట్లు. ఈ కాంట్రాక్టు, గోదావరి తాగు నీటి సరఫరా స్కీములో రెండు, మూడు దశలకు చెందినది. దీని కింద మూసీ నదిని పునరుద్ధరించేందుకు తోడ్పడేలా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లను గోదావరి నీటితో నింపాల్సి ఉంటుంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో, రెండేళ్లలో నిర్మాణం చేపట్టాలి. పూర్తయిన తర్వాత పదేళ్ల పాటు నిర్వహించాల్సి ఉంటుంది. తమ అనుబంధ సంస్థ మల్లన్నసాగర్ వాటర్ సప్లై లిమిటెడ్ ద్వారా ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లు సంస్థ ఎండీ వై రత్నాకర నాగరాజ తెలిపారు.

జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ చేతికి పవర్ ప్లాంట్

- 150 మెగావాట్ల సామర్థ్యం
- విలువ రూ. 1,728 కోట్లు



న్యూఢిల్లీ: పూర్తి అనుబంధ సంస్థ జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ 150 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న విద్యుత్ ప్లాంటును కొనుగోలు చేయనున్నట్లు జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ తాజాగా పేర్కొంది. దీనిలో భాగంగా టిడోంగ్ పవర్ జనరేషన్‌లో 100 శాతం వాటా కొనుగోలుకి స్టాట్‌క్రాఫ్ట్ ఐహెచ్ హోల్డింగ్స్ ఏఎస్‌తో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. సుమారు రూ. 1,728 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో డీల్ కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని కిన్నౌర్ జిల్లాలోగల టిడాంగ్ వేలీలో 150 మెగావాట్ల సామర్థ్యంతో టిడోంగ్ పవర్ జల విద్యుత్ ప్లాంటును నిర్మిస్తున్నట్లు తెలియజేసింది. 2026 అక్టోబర్‌లో ప్లాంటు కార్యకలాపాలు ప్రారంభమయ్యే వీలున్నట్లు అంచనా వేసింది. ఉత్తరప్రదేశ్ పవర్ కార్పొరేషన్‌తో 22 ఏళ్లకు విద్యుత్ కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. మే నెల నుంచి అక్టోబర్‌వరకూ 75 మెగావాట్లను కిలోవాట్‌కు రూ. 5.57 టారిఫ్‌లో ఒప్పందం కుదిరినట్లు తెలియజేసింది. మిగిలిన 75 మెగావాట్లను మర్చంట్ మార్కెట్లో విక్రయించనున్నట్లు వివరించింది.

కంపెనీలు పెట్టుబడులతో ముందుకు రావాలి

ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు



ముంబై: ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థకు తాజా పెట్టుబడుల క్రమం ఎంతో అవసరమని కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు అన్నారు. కనుక తాజా పెట్టుబడులతో కంపెనీలు ముందుకు రావాలని కోరారు. చాలా కాలంగా ప్రైవేటు మూలధన వ్యయాలు నీరసంగా ఉన్న నేపథ్యంలో ఆయన ఈ విధంగా పిలుపునివ్వడం గమనార్హం. పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా కంపెనీలు బలమైన బ్యాలన్స్ షీట్లతో మెరుగైన స్థితిలో ఉన్నట్టు చెప్పారు. ఇందుకు ఆర్థిక శాఖ మద్దతు కూడా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తన వంతుగా మూలధన వ్యయాలు పెంచడాన్ని, విధానపరమైన సంస్కరణలను గుర్తు చేశారు. నాబ్‌ఫిడ్ వార్షిక సదస్సులో భాగంగా ఆయన మాట్లాడారు. పెట్టుబడులతో కంపెనీలు, ఆర్థిక వ్యవస్థ ప్రయోజనం పొందుతాయని, విశ్వాసం తిరిగి నెలకొంటుందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ అనిశ్చితుల్లోనూ చెక్కుచెదరకుండా ఉన్నట్టు చెప్పారు. జూన్ క్వార్టర్‌లో ఐదు త్రైమాసికాల గరిష్ట స్థాయిలో జీడీపీ వృద్ధి 7.8 శాతం నమోదు కావడాన్ని ప్రస్తావించారు.

ఉత్పాదకత నష్టం రూ.131 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: వాతావరణ సంబంధిత ఆరోగ్య రిస్క్‌లతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 1.5 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.131 లక్షల కోట్లు) మేర ఉత్పాదక నష్టం వచ్చే 25 ఏళ్లలో ఎదురవుతుందని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) అంచనా వేసింది. ఆరోగ్య సమస్యలు పెరుగుతుండడం కీలక రంగాల్లో కార్మికుల కొరతకు కారణమవుతుందని పేర్కొంది. ఆహారం, వ్యవసాయం, పర్యావరణం–నిర్మాణం,

- వాతావరణ మార్పుల ఫలితం
- ప్రపంచ ఆర్థిక వేదిక అంచనా
- ఉద్యోగుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచన

ఆరోగ్య సంరక్షణ, బీమా రంగాల్లో వాతావరణ మార్పుల కారణంగా పడే ప్రభావాన్ని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్‌తో కలసి డబ్ల్యూఈఎఫ్ అధ్యయనం చేసింది. రూ.131 లక్షల కోట్ల ప్రభావం అన్నది మొదటి మూడు రంగాలపై మధ్యస్తంగా పడే ప్రభావంతో వేసిన అంచనా అని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఈ భారం మరింత ఎక్కువగా ఉండొచ్చని డబ్ల్యూఈఎఫ్ నివేదిక తెలిపింది. కనుక కంపెనీలు తమ సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చురుగ్గా స్పందించాలని, వాతావరణ మార్పుల ప్రభావాన్ని పరిమితం చేసేందుకు, ఉత్పాదకతకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. వాతావరణ మార్పులతో తీవ్రమైన వేడి పరిస్థితులు, ఇన్ఫెక్షన్ల తీవ్రత, ఇతర ఆరోగ్య సమస్యల రిస్క్ పెరుగుతుందని అంచనా వేసింది. ''వ్యాపార కార్యకలాపాలు సజావుగా కొనసాగేందుకు, దీర్ఘకాలం పాటు బలంగా నిలబడేందుకు వీలుగా సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి సారించాల్సిన దశకంలోకి ప్రవేశించాం. ఉద్యోగుల ఆరోగ్యం పరిరక్షణ, ఉత్పాదకత రిస్క్‌లు, వ్యయాలు పెరుగుతున్నాయి''అని డబ్ల్యూఈఎఫ్ తెలిపింది.



ఆహార భద్రతకు రిస్క్

ఆహారం, వ్యవసాయ రంగంలో వాతావరణ మార్పుల ఫలితంగా 740 బిలియన్ డాలర్ల మేర ఉత్పాదక నష్టం ఏర్పడుతుందన్నది డబ్ల్యూఈఎఫ్ అంచనా. దీంతో ప్రపంచ ఆహార భద్రతకు రిస్క్ ఏర్పడుతుందని పేర్కొంది. పర్యావరణం–నిర్మాణ రంగంలో 570 బిలియన్ డాలర్ల ఉత్పాదకతన నష్టం వాటిల్లుతుందని తెలిపింది. వాతావరణ మార్పుల ఫలితంగా బీమా కంపెనీలు పెద్ద సంఖ్యలో ఆరోగ్య క్లెయిమ్‌లు ఎదుర్కోవాల్సి రావచ్చొని అంచనా వేసింది. ''ఉష్ణోగ్రతలు పెరిగితే లక్షలాది ఉద్యోగాలు ప్రమాదంలో పడతాయి. లేదా తగ్గిపోవచ్చు. దీంతో కుటుంబాలు పేదరికంలోకి వెళతాయి. ఇది ప్రజల మనుగడకు ముప్పుగా మారుతుంది''అని ఈ అధ్యయానికి సహకరించిన రాక్‌ఫెల్లర్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ నవీన్‌రావు తెలిపారు. వాతావరణ మార్పుల ఫలితంగా ఆరోగ్యంపై పడే ప్రభావాన్ని అధిగమించేందుకు ముందస్తు పెట్టుబడులు పెట్టే కంపెనీలు ప్రయోజనం పొందుతాయని ఈ అధ్యయనం అంచనా వేసింది. అలాగే, సవాళ్లకు తగిన పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ప్రతీ రంగం భిన్నమైన స్థితిలో ఉన్నట్టు పేర్కొంది. వాతావరణ మార్పులను తట్టుకుని నిలిచే పంటల రకాలు, అధిక ఉష్ణోగ్రతలను తట్టుకుని నిలిచే ఔషధాల అభివృద్ధి, నిర్మాణ రంగ కార్మికుల భద్రత దృష్ట్యా శీతల పరిష్కారాలు, వాతావరణ మార్పుల షాక్‌ల నుంచి రక్షించే బీమా నమూనాల అవసరాన్ని ప్రస్తావించింది.

ప్రదర్శన బాగున్నా... పతకం తెస్తేనే మజా!

- అప్పట్లో గాయంతో కష్టాలు
- ఊర్లో అప్పులు-తిప్పలు
- ఇప్పుడు... మా పల్లె వెలుగులోకి వచ్చింది
- భారత జావెలియన్ త్రోయర్ సచిన్ యాదవ్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: భారత కొత్త జావెలియన్ త్రో సంచలనం సచిన్ యాదవ్ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆకట్టుకున్నాడు. పాల్గొన్న తొలి ప్రపంచ ఈవెంట్‌లోనే తన ప్రదర్శనతో దిగ్గజాలు నీరజ్ చోప్రా, జూలియన్ వెబర్‌లను అధిగమించడం మంచి అనుభూతినిచ్చినప్పటికీ కాంస్యం చేజారడం తీవ్ర నిరుత్సాహపరిచిందని అన్నాడు. గురువారం జరిగిన పోటీల్లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 25 ఏళ్ల సచిన్ ఈటెను 86.27 మీటర్ల దూరం విసిరి నాలుగో స్థానంలో నిలిచాడు. కాంస్య విజేత కర్టిస్ థామ్సన్ (అమెరికా; 86.67 మీటర్లు)కు కేవలం 40 సెంటీమీటర్ల దూరంతో పతకం అవకాశాన్ని కోల్పోయాడు. అయితే 6 అడుగుల 5 అంగుళాల ఎత్తున్న సచిన్... రెండు ఒలింపిక్ పతకాల విజేత నీరజ్ చోప్రా (84.03 మీటర్లు), ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్ (పాకిస్తాన్; 82.75 మీటర్లు), టోక్యో డైమండ్ లీగ్ చాంప్ వెబెర్ (జర్మనీ; 86.11 మీటర్లు)లాంటి హేమాహేమీలను అధిగమించడం విశేషం. ఈ సందర్భంగా పలు అంశాలపై సచిన్ వెలుబుచ్చిన అభిప్రాయాలు అతని మాటల్లోనే...

ఘనంగానే ఆరంభించా

ప్రారంభ త్రో బాగా మురిపించింది. వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలించాయి. నా శరీర స్పందన, ఆటతీరు కూడా ఉత్సాహపరిచింది. తొలి త్రో వెళ్లిన దూరం, నేల తాకిన చోటు చూశాక పతకం గెలుస్తాననే ధీమా వచ్చింది. మిగతా ప్రయత్నాల్లో ఒక్కసారి అయిన 87 మీటర్ల దూరం ఈటెను విసురుతాననే నమ్మకం కలిగింది. ప్రపంచంలోనే అత్యుత్తమ అథ్లెట్లతో పోటీపడుతున్న నాకు సహజంగానే తదుపరి ప్రదర్శన మించి ఉంటుందనే భావించాను. నా శాయశక్తులా ప్రయత్నించినప్పటికీ మిగతా ఐదు ప్రయత్నాల్లో ఆరంభ త్రోను మెరుగుపర్చుకోకపోవడం వల్లే ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం కోల్పోయాను.

నీరజ్ 2 పతకాలు ఖాయమన్నాడు

సీనియర్ సహచరుడు, స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రాతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూనే ఉన్నాను. ఫైనల్ ఈవెంట్ జరుగుతున్న సమయంలోనూ మేమిద్దరం ముచ్చటించుకున్నాం. నా తొలి త్రో చూసిన వెంటనే చోప్రా నాతో ఈ ఈవెంట్‌లో దేశానికి రెండు పతకాలు ఖాయమయ్యాయన్నాడు. అతను వెన్నెముక సమస్యతో బాధపడుతున్నప్పటికీ మంచి ప్రదర్శన ఇస్తాడనే అనుకున్నాను. కానీ నీరజ్... ప్రదర్శనలో నా కంటే వెనుకబడిపోవడం చాలా బాధనిపించింది. టోక్యో ఒలింపిక్స్ నుంచి పోడియంలో ఉంటున్న అతను చివరకు ఇక్కడ పతకానికి దూరమవడం నా బాధను రెట్టింపు చేసింది.

ఆటలు, అథ్లెట్లు ఎరుగరు

నా ప్రదర్శనతో మా గ్రామంలో (భాగ్‌పట్ జిల్లాలోని ఖేరా) ఎక్కడలేని హడావుడి మొదలైంది. కొందరు జర్నలిస్టులు మా తల్లిదండ్రులతో మాట్లాడారంట. ఆటలు, అథ్లెట్లు, పతకాలంటే వాళ్లకి అస్సలు తెలినే తెలియదు. వాళ్లకు తెలిసిందల్లా తమ కుమారుడికి మంచి ఉద్యోగం, చక్కని జీవితం లభిస్తే చాలనుకునే అమాయకులు. ముఖ్యంగా నన్ను ఓ ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలనుకున్నారు. 2023లో ఉత్తరప్రదేశ్ పోలీస్ శాఖలో ఉద్యోగం దొరకడంతోనే వారి ఆనందానికి హద్దుల్లేవు. అలాంటిది ఇప్పుడు జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు వచ్చి తమని ప్రముఖంగా ఫొటోలు తీసారని నా తల్లి గొప్పగా చెప్పింది.

నా గాయంతో అప్పులపాలయ్యాం

నిజం చెప్పాలంటే నాకు అసలు నాణ్యమైన కోచ్ లేడు. మరో జావెలిన్ త్రోయర్ సందీప్ యాదవ్ నా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాడు. అతనే గతేడాది నాకు పారాలింపిక్ స్వర్ణ విజేతలు సుమిత్, నవ్‌దీప్‌ల కోచ్ నవల్ సింగ్‌కు పరిచయం చేశాడు. ఇక కెరీర్ తొలినాళ్లలో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. 2021లో నా భుజానికి అయిన గాయంతో మా నాన్న చాలా ఖర్చు చేశాడు. తెలిసిన వాళ్లు, తెలియని వాళ్ల దగ్గర అప్పులు చేసి నన్ను బాగు చేశాడు. మళ్లీ ఈ ఏడాది ఉత్తరాఖండ్ జాతీయ క్రీడల్లో స్వర్ణం గెలిచినప్పుడు కూడా చీలమండ గాయంతో ఇబ్బందిపడ్డాను. అయితే అప్పటికీ ఇప్పటికీ ఎంతో మారింది. ఇప్పుడు నేను 'టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్)లో ఉన్నాను. వ్యక్తిగత స్పాన్సర్‌షిప్ కూడా లభించింది. కాబట్టి ఇప్పుడు ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు ఎదురవలేదు. పునరావాస శిబిరంలోనే గాయానికి చికిత్స తీసుకుని వెంటనే మెరుగయ్యాను.

సచిన్‌కు చీఫ్ కోచ్ కితాబు

క్రీడాశాఖ ప్రోత్సాహకాలతో సచిన్ యాదవ్‌కు నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో దిగ్గజ రష్యన్ కోచ్ సెర్గెయ్ మకరొవ్ శిక్షణ జతయ్యింది. సచిన్ టాలెంట్‌ను గుర్తించిన ఆయన వెంటనే చిన్నచిన్న తప్పు ఒప్పులను సరిచేశారు. మెలకువలు నేర్పించారు. ట్రెయినింగ్ సెషన్స్‌లో 90 మీటర్ల దూరం కూడా ఈటెను విసిరాడని, అతను భారత జావెలిన్ త్రోలో నీరజ్‌కు ధీటుగా పతకాలు సాధిస్తాడని చీఫ్ కోచ్ మకరొవ్ కితాబిచ్చారు.



ఇలా ముగిస్తానని అనుకోలేదు: నీరజ్

న్యూఢిల్లీ: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఎనిమిదో స్థానంలో నిలిచి నిరాశ పరిచిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా... విరామం అనంతరం బలంగా తిరిగి వస్తానని ధీమా వ్యక్తం చేశాడు. టోక్యో వేదికగా జరిగిన ఫైనల్లో జావెలిన్‌ను 84.03 మీటర్ల దూరం విసిరిన డిఫెండింగ్ చాంపియన్ నీరజ్ చోప్రా... ఐదో త్రో అనంతరం ఎలిమినేట్ అయ్యాడు. ఇదే పోటీలో భారత్‌కు చెందిన మరో త్రోయర్ సచిన్ యాదవ్ జావెలిన్‌ను 86.27 మీటర్ల దూరం విసిరి నాలుగో స్థానంలో నిలిచాడు. సచిన్‌కు ఇదే వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన కావడం విశేషం. 'సీజన్‌ను ఇలా ముగిస్తానని అనుకోలేదు. దేశం తరపున అత్యుత్తమ ప్రదర్శన చేయాలనే ఉద్దేశంతోనే టోక్యో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అడుగుపెట్టా. కానీ అది సాధ్యపడలేదు. అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మరింత బలంగా తిరిగివస్తా. సచిన్ యాదవ్ వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడం ఆనందంగా ఉంది. అతడు త్రుటిలో పతకం కోల్పోయాడు' అని నీరజ్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించాడు. ఈ సందర్భంగా పతక విజేతలకు నీరజ్ అభినందనలు తెలిపాడు. 27 ఏళ్ల నీరజ్ చోప్రా 2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం... 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం... 2022 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం... 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం సాధించాడు.

అన్ను రాణి విఫలం



టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ల నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతోంది. మహిళల జావెలిన్ త్రో ఈవెంట్‌లో జాతీయ చాంపియన్ అన్ను రాణి ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. శుక్రవారం జరిగిన క్వాలిఫయింగ్‌లో 33 ఏళ్ల అన్ను రాణి జావెలిన్‌ను 55.18 మీటర్ల దూరం విసిరి ఓవరాల్‌గా 29వ స్థానంలో నిలిచింది. ఫైనల్ చేరేందుకు అర్హత ప్రమాణం 62.50 మీటర్లుకాగా... అన్ను కెరీర్ బెస్ట్ ప్రదర్శన 63.82 మీటర్లు. క్వాలిఫయింగ్‌లో అన్ను రాణి తన అత్యుత్తమ ప్రదర్శనను పునరావృతం చేసి ఉంటే ఫైనల్‌కు చేరుకునేది. వరుసగా ఐదో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీపడ్డ అన్ను రాణి 2019, 2022లలో ఫైనల్‌కు చేరుకోవడంతోపాటు వరుసగా ఏడు, ఎనిమిది స్థానాల్లో నిలిచింది. మరోవైపు పురుషుల 5000 మీటర్ల విభాగంలో భారత అథ్లెట్ గుల్‌వీర్ సింగ్ ఫైనల్‌కు అర్హత పొందలేకపోయాడు. గుల్‌వీర్ సింగ్ 13 నిమిషాల 42.34 సెకన్లలో గమ్యానికి చేరి ఓవరాల్‌గా 27వ స్థానంలో నిలిచాడు.

తెలుగు టైటాన్స్ గెలుపుబాట


విజయ్ మలిక్

జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ తిరిగి గెలుపుబాట పట్టింది. గత మూడు మ్యాచ్‌ల్లో ఓడిన టైటాన్స్ శుక్రవారం జరిగిన పోరులో 43-29 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది. టైటాన్స్ కెప్టెన్ విజయ్ మలిక్ 10 పాయింట్లతో విజృంభించాడు. భరత్ 8 పాయింట్లతో అతడికి సహకరించాడు. తమిళ్ తలైవాస్ తరపున కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 7 పాయింట్లతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు. తాజా సీజన్‌లో 9 మ్యాచ్‌లు ఆడిన తెలుగు టైటాన్స్ 4 విజయాలు, 5 పరాజయాలతో 8 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో నాలుగో స్థానానికి చేరింది. మరో మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ 34-30 పాయింట్ల తేడాతో పుణేరి పల్టన్ చేతిలో ఓడింది. టేబుల్ టాపర్ పుణేరి పల్టన్‌కు వరుసగా మూడు విజయాల తర్వాత ఇదే తొలి ఓటమి. హర్యానా స్టీలర్స్ తరపున వినయ్ 13 పాయింట్లు సాధించగా... పుణేరి పల్టన్ తరపున పంకజ్ 14 పాయింట్లతో పోరాడాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో దబంగ్ ఢిల్లీ, హరియాణా స్టీలర్స్‌తో తమిళ్ తలైవాస్ తలపడతాయి.

పడిక్కల్ భారీ సెంచరీ

- భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్ 531/7 డిక్లేర్డ్
- ఆస్ట్రేలియా 'ఎ'తో అనధికారిక తొలి టెస్టు 'డ్రా'



లక్నో: ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో జరిగిన అనధికారిక తొలి టెస్టును భారత 'ఎ' ఆటగాళ్లు బ్యాటింగ్ ప్రాక్టీస్‌కు వినియోగించుకున్నారు. వర్షం అంతరాయం మధ్య సాగిన పోరులో భారత ప్లేయర్లు రాణించడంతో... చివరకు మ్యాచ్ 'డ్రా'గా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 403/4తో చివరి రోజు శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత 'ఎ' జట్టు చివరకు 531/7 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. టీమిండియా ప్లేయర్లు దేవదత్ పడిక్కల్ (281 బంతుల్లో 150; 14 ఫోర్లు, 1 సిక్స్), ధ్రువ్ జురేల్ (197 బంతుల్లో 140; 13 ఫోర్లు, 5 సిక్స్‌లు) భారీ సెంచరీలతో కదంతొక్కారు. అంతకుముందు ఆస్ట్రేలియా 'ఎ' జట్టు 532/6 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా... భారత్ అంతకంటే ఒక్క పరుగు తక్కువ వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. పడిక్కల్, జురేల్ ఐదో వికెట్‌కు 228 పరుగులు జోడించి జట్టు భారీ స్కోరుకు బాటలు వేశారు. తనుశ్ కొటియాన్ (16), హర్ష్ దూబే (16 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) తలా కొన్ని పరుగులు చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 'ఎ' జట్టు 16 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 56 పరుగులు చేసింది. స్యామ్ కొన్‌స్టాస్ (27 నాటౌట్; 3 ఫోర్లు), క్యాంప్‌బెల్ కెల్లవే (24 నాటౌట్; 3 ఫోర్లు) రాణించారు. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో నిర్ణీత సమయం కంటే ముందే కెప్టెన్‌లు 'డ్రా'కు అంగీకరించారు.

228 పరుగుల భాగస్వామ్యం...

త్వరలో స్వదేశంలో వెస్టిండీస్‌తో భారత జట్టు రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆడనుండగా... దానికి **ముందు యువ ఆటగాళ్ల సత్తాను పరీక్షించేందుకు నిర్వహించిన ఈ మ్యాచ్‌ను మిడిలార్డర్ బ్యాటర్లు** సంపూర్ణంగా వినియోగించుకున్నారు. భారత 'ఎ' జట్టు సారథి శ్రేయస్ అయ్యర్ విఫలమైనా... పడిక్కల్, జురేల్ తమ విలువ చాటుకున్నారు. క్రితం రోజే జురేల్ సెంచరీ పూర్తి చేసుకోగా... 86 పరుగులతో శుక్రవారం ఆట కొనసాగించిన పడిక్కల్ సాధికారికంగా ఆడాడు. ఆసీస్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్న ఈ జంట ఆడుతూ పాడుతూ ముందుకు సాగింది. ఏమాత్రం తొందరపాటుకు పోని పడిక్కల్ ఒక్కో పరుగు జోడిస్తూ... ఫస్ట్ క్లాస్‌లో ఏడో సెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు నుంచి జురేల్ అతడికి చక్కటి సహకారం అందించాడు. జాతీయ జట్టు తరఫున 2 టెస్టులు, 2 టి20లు ఆడిన పడిక్కల్... 5 టెస్టులు, 4 టి20లు ఆడిన జురేల్ కలిసి ఐదో వికెట్‌కు 228 పరుగులు జోడించడంతో భారత 'ఎ' జట్టు భారీ స్కోరు చేయగలిగింది. జురేల్ అవుట్ అయిన తర్వాత పడిక్కల్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఇరు జట్ల మధ్య మంగళవారం నుంచి రెండో అనధికారిక టెస్టు ప్రారంభం కానుంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా 'ఎ' తొలి ఇన్నింగ్స్: 532/6 డిక్లేర్డ్; **భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్:** అభిమన్యు (బి) లియామ్ స్కాట్ 44; జగదీశన్ (సి) ఫిలిప్ (బి) జేవియర్ 64; సాయి సుదర్శన్ (ఎల్బీ) (బి) కానొల్లీ 73; దేవదత్ పడిక్కల్ (సి) ఫిలిప్ (బి) రోచిసియోలి 150; శ్రేయస్ అయ్యర్ (ఎల్బీ) (బి) రోచొసెల్లీ 8; ధ్రువ్ జురేల్ (సి) స్కాట్ (బి) ఫెర్గూస్ ఓ నైల్ 140; తనుశ్ కొటియాన్ (సి) మెక్‌స్వీనీ (బి) రోచిసియోలి 16; హర్ష్ దూబే (నాటౌట్) 16; ప్రసిధ్ కృష్ణ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (141.1 ఓవర్లలో 7 వికెట్లకు డిక్లేర్డ్) 531. వికెట్ల పతనం:** 1-88, 2-137, 3-213, 4-222, 5-450, 6-491, 7-520. **బౌలింగ్:** ఫెర్గూస్ 19-2-66-1; జేవియర్ 20-1-75-1; టాడ్ మర్ఫీ 35-4-102-0; కోరీ రోచిసియోలి 36.1-3-159-3; లియామ్ స్కాట్ 14-4-31-1; కూపర్ కనొల్లీ 14-0-71-1; క్యాంప్‌బెల్ 2-0-9-0; మెక్‌స్వీనీ 1-0-1-0.

24న హాకీ ఇండియా లీగ్ వేలం

లీగ్‌లోకి కొత్తగా రాంచీ రాయల్ టస్కర్స్



న్యూఢిల్లీ: హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) ఆటగాళ్ల వేలం కార్యక్రమం ఈ నెల 24న జరుగనుంది. ఢిల్లీలోని హాకీ ఇండియా (హెచ్ఐ) ప్రధాన కార్యాలయంలో ఈ వేలం పాట నిర్వహిస్తారు. ఫ్రాంచైజీల మధ్య ఆటగాళ్ల బదిలీ, కొనుగోళ్లు, అట్టిపెట్టుకునే గడువు ఈ నెల 9తోనే ముగిసింది. దీంతో మినీ వేలం నిర్వహించేందుకు హెచ్ఐఎల్ రంగం సిద్ధం చేస్తోంది. పురుషుల జట్టయితే రూ. 4 కోట్లు, మహిళల జట్టయితే రూ. 2 కోట్లతో ఆటగాళ్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఫ్రాంచైజీలు ఆటగాళ్ల కోసం వెచ్చించే 'పర్సు' సరైన వినియోగం కోసం ఆటగాళ్ల సంఖ్యను 24 నుంచి 20కి కుదించింది. ఇప్పుడు గరిష్టంగా ఒక జట్టులో 20 మంది ఆటగాళ్లే ఉంటారు. విదేశీ ఆటగాళ్ల కోటాకు కోత పెట్టింది. 8 మంది బదులు 7 మంది విదేశీ ప్లేయర్లనే కలిగివుండాలి. వచ్చే సీజన్ జనవరిలో చెన్నై అంచె పోటీలతో మొదలవుతుంది. తర్వాత భువనేశ్వర్, రాంచీ, రాజ్‌గిర్‌లలో తదుపరి అంచె పోటీలు నిర్వహిస్తారు. గతేడాది మహిళల విభాగంలో విజేతగా నిలిచిన ఒడిశా వారియర్స్ టీమ్‌తో పాటు పురుషుల్లో గోనాసిక లీగ్ నుంచి పూర్తిగా తప్పుకోవడంతో రెండు విభాగాల్లోనూ రాంచీ రాయల్ టస్కర్స్ కొత్తగా జట్టుగా బరిలోకి దిగనుంది.

ఎస్‌జీ పైపర్స్ కోచ్‌లపై వేటు

ఢిల్లీకి చెందిన ఫ్రాంచైజీ ఎస్‌జీ పైపర్స్ గతేడాది లీగ్‌లో నిరాశపరిచింది. 8 జట్లు తలపడిన టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. దీంతో ఫ్రాంచైజీ యాజమాన్యం కోచింగ్ స్టాఫ్‌ను మార్చింది. గ్రాహం రీడ్ స్థానంలో పురుషుల టీమ్ హెడ్ కోచ్‌గా టిమ్ ఒడెనల్లర్, డేవ్ స్మోలెనార్స్ స్థానంలో మహిళల హెడ్ కోచ్ సోఫీ గిర్స్‌ను నియమించింది. మొత్తం కోచింగ్ సిబ్బందిలో పెనుమార్పులతో ఈ సీజన్ బరిలో దిగనుంది. అలాగే 24 మంది సభ్యుల జట్టులో 17 మంది ఆటగాళ్లను అట్టిపెట్టుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన కోరే వేయర్, జేక్ వెటన్, బెంజమిన్ రేనీలతో పాటు జపాన్ ప్లేయర్ కోజి యామసాకిని విడుదల చేసింది. లీగ్ నుంచి తప్పుకున్న గోనాసిక జట్టులోని జాకబ్ డ్రాపర్‌ను ఎస్‌జీ పైపర్స్ తీసుకుంది.



ఇంగ్లండ్‌లో శుక్రవారం మొదలైన హర్రో గేట్ ఆటమ్ ఫ్లవర్ షోలో 9.5 కిలోల భారీ క్యారెట్‌తో రైతు క్రిస్ మారియట్



ఈ ప్రదర్శనలో 8.8కిలోల ఉల్లి గడ్డతో రైతు స్టీఫెన్ పర్విస్. అత్యంత బరువైన ఉల్లి గడ్డ విభాగంలో ఇది మొదటి ప్రైజ్ సాధించింది



24.9 కిలోల బరువైన క్యాబేజీతో రైతు జాన్ సింప్సన్. కూరగాయల విభాగంలో ఈ భారీ క్యాబేజీ బహుమతి కొట్టేసింది



రష్యా రాజధాని మాస్కోలోని మాస్కో స్టేట్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన ప్రదర్శనకు ముందు ఓ భారీ పుచ్చకాయ బరువును చూస్తున్న నిర్వాహకులు



మాస్కో స్టేట్ యూనివర్సిటీలో ప్రదర్శనకు తీసుకువచ్చిన 969 కిలోల బరువున్న గుమ్మడికాయ



ఇదే ప్రదర్శనకు తూకం వేసేందుకని రైతులు మోసుకు వస్తున్న భారీ జుకిని కాయ

గాజా తీర్మానంపై అమెరికా వీటో

కాల్పుల విరమణ, బందీల విడుదల తీర్మానానికి యూకే, ఫ్రాన్స్, చైనా, రష్యా సహా 14 దేశాలు మద్దతు

ఐక్యరాజ్యసమితి: గాజాలో తక్షణమే శాశ్వత కాల్పుల విరమణ పాటించాలని, బందీలందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఐరాస భద్రతామండలి చేసిన తీర్మానాన్ని గురువారం మరోసారి అమెరికా వీటో చేసింది. హమాస్ చర్యలను ఈ తీర్మానం సరైన విధంగా ఖండించలేదంటూ అగ్రరాజ్యం తప్పుబట్టింది. మండలిలోని శాశ్వత సభ్యత్వమున్న రష్యా, చైనా, ఫ్రాన్స్, యూకే సహా 14 దేశాలు ఈ తీర్మానాన్ని బలపర్చగా, అమెరికా మాత్రం తిరస్కరించింది. తనకున్న వీటో హక్కును వాడుకుంది. రెండేళ్ల పదవీకాలానికి ఎన్నికైన 10 శాశ్వతేతర దేశాలు ఈ తీర్మానాన్ని రూపొందించాయి. గాజాలో పరిస్థితులపై గత నెలలో విడుదల చేసిన నివేదికలో ఐరాస తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. అత్యంత తీవ్రమైన కరువు నెలకొందని, వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి, మానవతా సాయంపై ఆంక్షలు తొలగిస్తేనే ఈ పరిస్థితి మెరుగవుతుందని పేర్కొంది. ఈ నివేదికను మండలి ముసాయిదా తీర్మానం ప్రస్తావించింది. గాజాలో తీవ్ర మానవీయ సంక్షోభం కొనసాగుతోందని తీర్మానం పేర్కొంది. అక్కడున్న 21 లక్షల పాలస్తీనియన్లకు సాయం అందించడంలో ఉన్న అన్ని రకాల ఆంక్షలను ఎత్తివేయాలని ఇజ్రాయెల్‌ను కోరింది. అయితే, 'ఈ తీర్మానం హమాస్ చర్యలను తప్పుబట్టలేదు, ఇజ్రాయెల్‌కుగల ఆత్మరక్షణ హక్కును బలపర్చలేదు. హమాస్‌కు అనుకూల తప్పుడు వాదనలనే ఈ తీర్మానం తలకెత్తుకుంది. ఈ పరిస్థితుల్లో అమెరికా ఈ తీర్మానాన్ని వీటో చేస్తుంది'అని ఓటింగ్‌కు ముందే సీనియర్ యూఎస్ పాలసీ అడ్వైజర్ మోర్గాన్ ఒర్టాగస్ వ్యాఖ్యానించారు. అమెరికా హెచ్చరికలను పట్టించుకోకుండా మండలి సభ్యదేశాలు తీర్మానంలో వాడిన భాష కూడా ఆమోదయోగ్యంగా లేదన్నారు. మరికొద్ది రోజుల్లో ఐరాస జనరల్ అసెంబ్లీ వార్షిక సమావేశాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పలువురు ప్రపంచ దేశాల నేతలు ప్రసంగిస్తారు. ఈ దఫా ప్రధానంగా గాజాపై చర్చ జరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. అదే సమయంలో, అమెరికా ప్రధాన మిత్ర దేశాలు పాలస్తీనాను స్వతంత్ర దేశంగా ప్రకటించే అవకాశం కన్పిస్తోంది. ఈ వైఖరిని ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

తీర్మానం వీగిన అనంతరం ఐరాసలో పాలస్తీనా రాయబారి రియాద్ మన్సూర్ స్పందిస్తూ.. భద్రతా మండలి సెషన్‌లో జరిగిన పరిణామాలు పాలస్తీనా ప్రజల్లో మరింత ఆవేదనకు ఆగ్రహానికి కారణమవుతాయని వ్యాఖ్యానించారు. మండలి సభ్యదేశం నైజీరియా స్పందిస్తూ.. సామాన్య పౌరుల ప్రాణాలను కాపాడలేకపోతున్నందుకు క్షమించాలంటూ పాలస్తీనా వాసులను కోరింది. ఇజ్రాయెల్ రాయబారి స్పందిస్తూ.. బందీల విడుదలకు గానీ, ఈ ప్రాంతంలో భద్రతను నెలకొల్పడానికి గానీ ఈ తీర్మానం ప్రయత్నించలేదని ఆరోపించారు. తమ పౌరుల భద్రతకు, హమాస్‌కు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. గత వారం జరిగిన ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశం ఇజ్రాయెల్–పాలస్తీనా రెండు దేశాల ప్రతిపాదనను అత్యధిక మెజార్టీతో ఆమోదించింది. పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించాలని ఇజ్రాయెల్‌ను కోరింది. హమాస్ లక్ష్యంగా గాజాను నెలలుగా ఇజ్రాయెల్ ఆర్మీ దిగ్బంధించడంతోపాటు పౌరులపై యథేచ్ఛగా కాల్పులు, దాడులకు పాల్పడటాన్ని ఫ్రాన్స్, యూకే తీవ్రంగా ఖండిస్తున్నాయి. త్వరలో జరిగే ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించే ప్రతిపాదనకు మద్దతిస్తామని ప్రకటించాయి.

సంక్షోభానికి.. సత్వర ముగింపు

- భారత్‌ను చూసి ప్రపంచ దేశాలు నేర్చుకోవాలి
- ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఒక సంక్షోభానికి సాధ్యమైనంత అతి తక్కువ సమయంలో ముగింపు పలకడం ప్రపంచ దేశాలు భారత్‌ను చూసి నేర్చుకోవాల్సి ఉందని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ తన లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో నిర్ధారించుకుందన్నారు. శుక్రవారం ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో మిలటరీకి ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందని చెప్పారు. దేశ రాజకీయ నాయకత్వం ఎలాంటి ఆంక్షలను విధించలేదని స్పష్టం చేశారు. మే 7–10వ తేదీల మధ్య పాకిస్తాన్‌తో కొనసాగిన సంక్షోభం సమయంలో వైమానిక దళం సత్తా చాటిందని పేర్కొన్నారు. ఎస్–400 క్షిపణి వ్యవస్థ సంక్షోభం గతినే మార్చేసిందని, ఈ ఆయుధ వ్యవస్థల శక్తిసామర్థ్యాలతో శత్రువు గుండెల్లో రైళ్లు పరుగెట్టాయన్నారు. శత్రువు సైనిక స్థావరాలు, మౌలిక వసతులు, రాడార్లు, కంట్రోల్ కోఆర్డినేషన్ వ్యవస్థలు, హంగార్లు, విమానాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు ఎయిర్ చీఫ్ వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అనేక యుద్ధాలు దీర్ఘకాలం కొనసాగాయంటూ ఆయన.. సంఘర్షణకు సరైన ముగింపు కూడా ఆపరేషన్‌లో ఒక ముఖ్యమైన అంశమేనన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను మరింత కాలం కొనసాగిస్తే బాగుండేదన్న వాదనలను ఆయన కొట్టి పారేశారు. 'ఉగ్రవాదులకు వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్ అది. మనం చాలా తొందరగా యుద్ధాన్ని ముగించాం. చేయాలనుకున్నది చేసేశాం. శత్రువు అప్పటికే కాళ్ల బేరానికొచ్చింది. ఇంకెందుకు ఈ సంక్షోభాన్ని కొనసాగించాలి? యుద్ధం వల్ల ఎంతో మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది కూడా'అని ఆయన వివరించారు. మన ఆర్థిక వ్యవస్థతోపాటు దేశ పురోగతిపై పై ప్రభావం చూపుతుంది. ఆపరేషన్ పొడిగింపు వల్ల తర్వాతి చర్యలకు సన్నద్ధమయ్యే అవకాశం మనకుండదని తెలిపారు. అందుకే, సాధ్యమైనంత త్వరగా సంక్షోభాన్ని ప్రారంభించడం, ముగింపు పలకడం అనే అంశాల్లో ప్రపంచ దేశాలు భారత్‌ను చూసి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని ఏపీ సింగ్ అన్నారు.

ప్రజలను ప్రభుత్వం ఎలా విభజించి చూడగలదు?

మైసూరు దసరా ఉత్సవాలకు బాను ముష్తాక్‌కు ఆహ్వానంపై పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: ఈ నెల 22న అట్టహాసంగా మొదలయ్యే మైసూరు దసరా ఉత్సవాలకు బుకర్ ప్రైజ్ విజేత బాను ముష్తాక్‌ను కర్నాటక ప్రభుత్వం ఆహ్వానించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 'ఇది ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమం. ప్రభుత్వం ప్రజలను ఏ, బీ, సీ అంటూ ఎలా విభజించి చూడగలదు? మన రాజ్యాంగ పీఠిక ఏం చెబుతోంది?'అంటూ శుక్రవారం విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం పిటిషనర్‌ను ప్రశ్నించింది. బాను ముష్తాక్ చేతుల మీదుగా దసరా ఉత్సవాలను ప్రారంభించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను ఈ నెల 15వ తేదీన కర్ణాటక హైకోర్టు కొట్టివేయడం తెల్సిందే. ఈ సందర్భంగా హైకోర్టు.. 2017 దసరా ఉత్సవాల వేదికపై డాక్టర్ నిస్సార్ అహ్మద్‌తో పిటిషనర్లలో ఒకరు వేదికను పంచుకోవడాన్ని ప్రస్తావించింది. ఇదే విషయాన్ని సుప్రీం ధర్మాసనం గుర్తు చేస్తూ.. ఇది నిజమా? కాదా? అని ప్రశ్నించింది. అయితే, ఉత్సవాలను ప్రారంభించడం, పూజల్లో పాల్గొనడమనే రెండు అంశాలున్నాయంటూ పిటిషనర్ తరఫు లాయర్ పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయం కారణంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం మత స్వేచ్ఛకు భంగం కలుగుతోందని తెలిపారు. అలాంటప్పుడు, 2017లో భంగం కలగలేదా అని ధర్మాసనం ప్రశ్నించగా కలగలేదని లాయర్ బదులిచ్చారు. కర్నాటక ప్రభుత్వ నిర్ణయం పూర్తిగా రాజకీయపరమైందని ఆరోపించారు. గతంలో బాను ముష్తాక్ మత వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. వాదనల అనంతరం ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

తీర్పును స్వాగతించిన సీఎం సిద్ధరామయ్య

మైసూరు దసరా ఉత్సవాలకు బాను ముష్తాక్‌ను ఆహ్వానించాలన్న తమ ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంపై కర్నాటక సీఎం సిద్ధరామయ్య హర్షం వ్యక్తం చేశారు. మైసూరు దసరా ఉత్సవాలను మత కోణంలో చూడరాదన్నారు. అందరినీ కలుపుకుని పోయేందుకే ప్రభుత్వం ఈ ఉత్సవాలను నిర్వహిస్తోందని ఎక్స్‌లో తెలిపారు.

సాదిక్ ఖాన్ చెత్త మేయర్

ట్రంప్ స్పష్టీకరణ

లండన్: లండన్ మేయర్ సాధిక్ ఖాన్ ప్రపంచంలోనే పరమ చెత్త మేయర్ అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అభివర్ణించారు. బ్రిటన్ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన రాజ విందుకు.. లండన్ మేయర్ సాదిక్ ఖాన్‌ను ఆహ్వానించవద్దని తానే వ్యక్తిగతంగా కోరానని డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కింగ్ చార్లెస్–3 ఆతిథ్యమిచ్చిన రాజ విందులో ట్రంప్ పాల్గొన్నారు. రాజ విందులో బ్రిటన్, అమెరికాకు చెందిన ప్రముఖ నాయకులు, వ్యాపారవేత్తలు, ఇతర ఉన్నత స్థాయి అతిథులు పాల్గొన్నారు. విందు అనంతరం ట్రంప్.. గురువారం బ్రిటన్ నుంచి బయలుదేరుతూ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో మాట్లాడారు. ఖాన్ గైర్హాజరీ గురించి అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. సాదిక్ ఖాన్ అక్కడ ఉండటం తనకు ఇష్టం లేదని, అతన్ని ఆహ్వానించవద్దని తానే కోరానని స్పష్టం చేశారు.

శరీరం తిరగబడుతుంది

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా • ఐఎస్ఎస్‌లో అనుభవాల వెల్లడి

న్యూఢిల్లీ: 'రక్త ప్రసరణలో వ్యత్యాసం ఏర్పడుతుంది. ముఖం ఉబ్బుతుంది, గుండె వేగం తగ్గుతుంది, వెన్నెముక సాగుతుంది, నడుము నొప్పి మొదలవుతుంది. పొట్టలోని పదార్థాలు తేలుతున్నట్లు అనిపిస్తుంది. ఆకలి అనిపించదు.. ఇవన్నీ అంతరిక్షంలోకి చేరుకున్నాక తాను ఎదుర్కొన్న సమస్యలని భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తెలిపారు. ఢిల్లీలో ఎఫ్ఐసీసీఐ సీఎల్‌వో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తన అంతరిక్ష అనుభవాలను పంచుకున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో జీవితం మానవ సహనానికి ఒక పరీక్ష లాంటిదని అభిప్రాయపడ్డారు. అది పట్టుదల, సహనం, జట్టు స్ఫూర్తిని నేర్పిందని పేర్కొన్నారు. అంతరిక్ష యాత్రలంటే సరదాగా ఉంటాయని అందరూ భావించవచ్చు.. నిజం చెప్పాలంటే అవి అలానే ఉంటాయి కానీ, ఒకసారి సూక్ష్మ గురుత్వాకర్షణలోకి చేరుకోగానే, శరీరం తిరుగుబాటు చేస్తుందని శుభాంశు శుక్లా స్పష్టం చేశారు. శరీరం అప్పటివరకు అలాంటి వాతావరణాన్ని ఎప్పుడూ చూడకపోవడమే అందుకు కారణమని.. అక్కడ ప్రతిదీ మారిపోతుందని వివరించారు.

ఐఎస్ఎస్‌లో ఉన్నప్పుడు శుభాంశు శుక్లా.. భారత ప్రధాని నరేంద్ర మోదీతో సంభాషించడం తెలిసిందే. ఆ సంభాషణకు ముందు తనకు కడుపులో వికారంగా అనిపించిందని, తలనొప్పితో బాధపడ్డానని శుక్లా గుర్తు చేసుకున్నారు. వాంతులు రాకుండా మందులు వేసుకుంటే మగతగా అనిపిస్తుందని.. కాబట్టి అవి కూడా వేసుకునేందుకు వీల్లేకపోయిందని తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో తన జట్టు సభ్యులు ఎంతో సహకరించారని చెప్పారు. అంతరిక్షం నుంచి భూమిని చూసినప్పుడు.. భారతదేశాన్ని గుర్తించడం ఒక అద్భుతమైన అనుభవమని శుక్లా తెలిపారు. అంతరిక్షం నుంచి చూసినప్పు డు భారతదేశం చాలా అందంగా కనిపించిందని శుభాంశు శుక్లా ఆనందం వ్యక్తం చేశారు.



శుభాంశు శుక్లా

పాక్‌కు వెళ్తే సొంతింట్లో ఉన్నట్లే అనిపిస్తుంది

శామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: వివాదాస్పద వ్యాఖ్యలకు మారుపేరైన కాంగ్రెస్ సీనియర్ నేత శామ్ పిట్రోడా మరోసారి వాక్చాతుర్యం ప్రదర్శించారు. పొరుగునే ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్‌లలో పర్యటనకు వెళ్లినప్పుడల్లా తనకు సొంతింట్లోనే ఉన్నట్లు అనిపిస్తుందన్నారు. ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్‌కు సారథిగా ఉన్న ఆయన..హింస, ఉగ్రవాదం వంటి సమస్యలున్నప్పటికీ భారత్ తన పొరుగు దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో సంబంధాలను కొనసాగించాలని కోరారు. మన విదేశాంగ విధానంలో పొరుగుదేశాలకు ప్రాధాన్యం తప్పక ఇవ్వాలి. పొరుగు వారితో సంబంధాలను మనం నిజంగా గణనీయంగా మెరుగుపరుచుకోగలమా? ఆ దేశాల వారంతా కష్ట సమయాల్లో ఉన్నారు. హింస, ఉగ్రవాదం వంటి సమస్యలున్నాయి. వారితో మనకు విరోధం అవసరం లేదు. అందరం ఒకే సాధారణ జన్యు సమూహంలో వాళ్లం కదా'అని పిట్రోడా అన్నారు. ఇటీవల పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్‌లో జరిపిన పర్యటనలను గుర్తు చేసుకున్న ఆయన..'అవి ఇతర దేశాలని అనిపించవు. అక్కడికి వెళ్లిన ప్రతిసారీ సొంతింటికి వెళ్లినట్లే ఉంటుంది. వాళ్లు నాలాగే ఉంటారు. నాలాగే మాట్లాడతారు. వాళ్ల ఆహార అలవాట్లు, ఇష్టమైన పాటలు ఒకేలా ఉంటాయి. మనందరం శాంతి, సామరస్యాలతో జీవించడం అలవాటు చేసుకోవాలి'అని ఆయన చెప్పారు. పహల్గాం ఉగ్ర ఘటన తర్వాత పాకిస్తాన్‌తో సంబంధాలు దిగజారిన విషయాన్ని ప్రస్తావించిన శామ్ పిట్రోడా.. ఆ దేశంతో సంబంధాలను పునరుద్ధరించుకోవాలని చెప్పడం కొసమెరుపు. కాంగ్రెస్ నేత వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. సుమారు 170 మందిని బలి తీసుకున్న ముంబై ఉగ్రదాడులప్పుడు కూడా అప్పటి యూపీఏ ప్రభుత్వం సైతం ఇదే విధంగా స్పందించిందని గుర్తు చేసింది. కాంగ్రెస్‌కు పాకిస్తానే ఫేవరెట్ అంటూ బీజేపీ నేత ప్రదీప్ భండారి ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. గతంలోనూ శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు తీవ్ర అలజడిని రేపాయి. ఈశాన్య రాష్ట్రాలకు వెళితే చైనీయులు, దక్షిణాదికి వెళితే ఆఫ్రికన్లు గుర్తుకొస్తారంటూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. అదేవిధంగా, దేశంలో వారసత్వ పన్ను విధానాన్ని అమలు చేయాలన్న వ్యాఖ్యలపై సైతం సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. దీంతో, కాంగ్రెస్ అగ్ర నాయకత్వం శామ్ పిట్రోడాను ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చీఫ్ పదవి నుంచి తొలగించింది. కొద్ది నెలలకే తిరిగి ఆయనకు ఆ పదవిని అప్పగించింది.

గుర్తింపులేని మరో 474 రాజకీయ పార్టీల రద్దు

న్యూఢిల్లీ: నిబంధనలను అతిక్రమించిన కారణంగా గుర్తింపు పొందని మరో 474 రాజకీయ పార్టీలను రద్దు చేసినట్లు ఎన్నికల కమిషన్(ఈసీ) శుక్రవారం తెలిపింది. రిజిస్టరయి, గుర్తింపు పొందని 334 రాజకీయ పార్టీలను రద్దు చేస్తూ ఆగస్ట్ 9వ తేదీన ఈసీ మొదటి దఫా ప్రకటించడం తెల్సిందే. రెండో విడతలోసీ నెల 18వ తేదీన మరో 474 పార్టీలను రద్దు చేశామని ఈసీ తెలిపింది. దీంతో, రెండు నెలల్లో మొత్తం 808 రాజకీయ పార్టీలను రద్దు చేసినట్లయిందని ఈసీ పేర్కొంది. వరుసగా ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకపోవడం వంటి కారణాలతో వీటి పేర్లను జాబితా నుంచి తొలగించినట్లు వివరించింది. మొన్నటి వరకు 2,520 రిజిస్టర్డ్ అన్ రికగ్నయిజ్డ్ పొలిటికల్ పార్టీ(ఆర్‌యూపీపీ)లుండగా, ఇప్పుడు వీటి సంఖ్య 2,046కు తగ్గిపోయిందని పేర్కొంది. రద్దయిన పార్టీల్లో త్వరలో ఎన్నికలు జరిగే బిహార్‌కు చెందిన 14 పార్టీలున్నట్లు వెల్లడించింది.

బ్రిటన్ దంపతులను విడిచిపెట్టిన తాలిబన్లు

అఫ్గానిస్తాన్‌లో ఏడు నెలలుగా నిర్బంధం

దుబాయ్: అఫ్గానిస్తాన్‌లో ఏడు నెలలుగా నిర్బంధంలో ఉంచుకున్న బ్రిటన్ జంటను తాలిబన్లు శుక్రవారం విడిచిపెట్టారు. పీటర్ రేనాల్డ్స్(80), బార్బీ రేనాల్డ్స్(75) దంపతులు అఫ్గానిస్తాన్‌లోని బామియన్‌లో గత 18 ఏళ్లుగా విద్య, శిక్షణ సంస్థలను నిర్వహిస్తున్నారు. 2021లో అమెరికా ప్రభుత్వం దన్నుతో నడుస్తున్న ప్రభుత్వాన్ని తాలిబన్లు కూలదోసి అధికారాన్ని హస్తగతం చేసుకున్న తర్వాతా వీరు అక్కడే ఉంటున్నారు. అయితే, వీరు చట్టాలను ఉల్లంఘించారంటూ తాలిబన్ యంత్రాంగం అదుపులోకి తీసుకుని, గుర్తు తెలియని ప్రాంతంలో నిర్బంధించింది. బ్రిటన్ వినతి మేరకు రంగంలోకి దిగిన ఖతార్ ప్రభుత్వం దంపతుల విడుదలపై తాలిబన్లతో చర్చలు జరిపింది. చర్చలు ఫలప్రదం కావడంతో రేనాల్డ్స్ దంపతులను తాలిబన్లు విడిచిపెట్టారు. శుక్రవారం వీరు కాబూల్ నుంచి విమానంలో స్వదేశానికి బయలుదేరారు. అఫ్గాన్‌లోని తాలిబన్ ప్రభుత్వానికి ప్రపంచ దేశాల గుర్తింపు లభించలేదు. దీంతో, వీరు రేనాల్డ్స్ దంపతులను నిర్బంధించడం ద్వారా తమ డిమాండ్లపై బేరసారాలకు దిగినట్లుగా భావిస్తున్నారు. అమెరికాకు చెందిన పర్యాటకుడు జార్జి గ్లెజ్‌మాన్‌ను నిర్బధంలోకి తీసుకున్న తాలిబన్లు అనంతరం ఆ దేశంతో ఖైదీల మార్పిడి ఒప్పందం కుదుర్చుకుని, ఇటీవల విడుదల చేయడం తెల్సిందే.

ఢిల్లీ అల్లర్ల కేసులో బెయిల్ పిటిషన్లపై 22న విచారణ

న్యూఢిల్లీ: 2020 ఫిబ్రవరిలో ఢిల్లీలో అల్లర్లకు కుట్ర పన్నినట్లు ఆరోపణలను ఎదుర్కొంటున్న ఉద్యమకారులు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్, గుల్‌ఫిషా ఫాతిమా, మీరన్ హైదర్‌ల బెయిల్ అర్జీలపై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది. ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ సహా 9 మంది వేసిన బెయిల్ పిటిషన్‌ను ఈ నెల 2న ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. దీనిని సవాల్ చేస్తూ ఉమర్ ఖలీద్ సహా నలుగురు వేసిన పిటిషన్లపై శుక్రవారం జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర రిజిస్టర్‌లకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో 53 మంది చనిపోగా, 700 మందికి పైగా గాయాలు పాలు కావడం తెల్సిందే. దీనివెనుక కుట్ర ఉందంటూ ఖలీద్, ఉమర్ సహా ఫాతిమా, హైదర్, సలీంఖాన్, షిఫా రెహ్మాన్, అతర్ ఖాన్, ఖలీద్‌సైఫి, షాదాబ్ అహ్మద్‌అనే 9 మందిని పోలీసులు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం(ఉపా)కింద 2020లో అరెస్ట్ చేశారు. వీరి బెయిల్ పిటిషన్లను దిగువ కోర్టుతోపాటు, హైకోర్టు కూడా తిరస్కరించింది.

జెన్ జడ్ ఆందోళనలపై కాల్పులకు ఆదేశాలివ్వలేదు

నేపాల్ పదవీచ్యుత ప్రధాని కేపీ శర్మ ఓలి వెల్లడి

కాఠ్మండు: నేపాల్ వ్యాప్తంగా ఈ నెల 8వ తేదీన మొదటి రోజు జరిగిన జెన్ జడ్ నిరసనలపై తమ ప్రభుత్వం కాల్పులకు ఆదేశాలిచ్చిందంటూ వస్తున్న వార్తలను పదవీచ్యుత ప్రధాని కేపీ శర్మ ఓలి ఖండించారు. ఆ రోజు కాల్పుల్లో కనీసం 19 మంది ఆందోళన కారులు చనిపోవడం తెల్సిందే. పరిస్థితి చేయిదాటడంతో 9వ తేదీన ఓలి ప్రధాని పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. కాగా, చొరబాటుదారులే 8వ తేదీన చోటుచేసుకున్న విషాదానికి కారణమంటూ ఓలి నిందించారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్(యూఎంఎల్) చైర్మన్ కూడా అయిన ఓలి శుక్రవారం దేశ రాజ్యాంగ దినం సందర్భంగా ఈ మేరకు ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ చేశారు. నిరసనకారుల ప్రాణాలు తీసిన బుల్లెట్లు ఆటోమేటిక్ తుపాకుల నుంచి పేలినవి. అటువంటి తుపాకులు పోలీసుల వద్ద లేవు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి'అని ఆ ప్రకటనలో తెలిపారు. 'శాంతియుత ప్రదర్శనల్లోకి చొరబాటుదార్లు ప్రవేశించారు. వీరి వల్లే ఆందోళన హింసాత్మకంగా మారి, యువత ప్రాణాలను బలితీసుకుంది. ఈ ఘటనల వెనుక ఉన్న కుట్రను వివరించలేను. కాలమే సమాధానం చెబుతుంది'అని పేర్కొన్నారు.

కశ్మీర్ గ్రూపులపై నిషేధం సబబే ఢిల్లీ హైకోర్టు ట్రిబ్యునళ్లు వెల్లడి

న్యూఢిల్లీ: కశ్మీర్‌కు చెందిన మత పెద్ద మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్, షియా నేత మస్రూర్ అబ్బాస్ అన్సారీలు ఏర్పాటు చేసిన అవామీ యాక్షన్ కమిటీ, జమ్మూకశ్మీర్ ఇత్తిహాదుల్ ముస్లిమీన్ సంస్థలపై కేంద్రం విధించిన నిషేధాన్ని ఢిల్లీ హైకోర్టు ట్రిబ్యునళ్లు సమర్థించాయి. ఈ రెండు ట్రిబ్యునళ్లు జస్టిస్ సచిన్ దత్తా సారథ్యంలోనే పనిచేస్తున్నాయి. నిషేధానికి సమర్థనగా తమ ముందుంచిన ఆధారాలు, ఇతర పత్రాలను పరిశీలించిన మీదట చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం–1967 ప్రకారం పై రెండు గ్రూపులను చట్ట విరుద్ధ సంస్థలుగా ప్రకటించడం సమర్థనీయమేనని భావిస్తున్నట్లు ట్రిబ్యునల్ ఒక ఉత్తర్వులో తెలిపింది. కేంద్ర హోం శాఖ ఈ రెండు గ్రూపులపై నిషేధం విధిస్తూ మార్చి 11వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసింది. అవామీ యాక్షన్ కమిటీ, జమ్మూకశ్మీర్ ఇత్తిహాదుల్ ముస్లిమీన్ సంస్థలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు దేశ సార్వభౌమత్వానికి, భద్రతకు, సమగ్రతకు ముప్పుగా పరిణమించాయని పేర్కొంది.

ఏనుగు ఉన్నందుకు 15 ఏళ్ల జైలు.. జరిమానా

కొలంబో: ఏనుగును అక్రమంగా కలిగి ఉన్న ఒక వ్యక్తికి కొలంబో హైకోర్టు 15 ఏళ్ల జైలు శిక్ష విధించింది. నిందితునికి 20.6 మిలియన్ శ్రీలంక రూపాయల (సుమారు 6 మిలియన్లు) జరిమానా కూడా విధించింది. ఈ మేరకు ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఏనుగును ప్రభుత్వానికి అప్పగించాలని ఆదేశించింది.'అలీ రోషన్'అలియాస్ సమరప్పులిగే నీరాజ్ రోషన్ అనే వ్యక్తి వద్ద ఐదు ఏనుగులు అక్రమంగా ఉన్నాయన్న ఆరోపణలపై.. 2015లో ప్రజా ఆస్తుల చట్టం కింద అతనిపై విచారణ జరిగింది. అతనితోపాటు మరో ముగ్గురిపై అభియోగాలు మోపారు. మొత్తం 33 అభియోగాలలో.. న్యాయస్థానం రోషన్‌ను రెండింటిలో దోషిగా నిర్ధారించింది. ఒక ఏనుగును కలిగి ఉన్నందుకు రోషన్‌కు జైలు శిక్ష విధిస్తూ, మిగిలిన ముగ్గురు నిందితులను నిర్దోషులుగా తీర్పు చెప్పింది.

బెయిల్ షరతులను మార్చాలన్న వరవరరావు పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: 2018నాటి భీమా కోరెగావ్ హింసాత్మక ఘటన కేసులో నిందితుడిగా ఉన్న రచయిత, ఉద్యమకారుడు వరవరరావుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తనకు మంజూరు చేసిన బెయిల్‌లో నిబంధనలను మార్చాలంటూ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ముంబై మహానగరాన్ని వీడి వెళ్లాలంటే ముందుగా దిగువ కోర్టు నుంచి అనుమతి తీసుకోవాలంటూ ఉన్న షరతులో మార్పులు చేయాలని ఆయన కోరారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌ల ధర్మాసనం బెయిల్ నిబంధనల మార్పునకు తిరస్కరించింది. వరవరరావు నాలుగేళ్లుగా బెయిల్‌పై కొనసాగుతున్నారని, ఆయన ఆరోగ్యం క్షీణిస్తోందని సీనియర్ లాయర్ ఆనంద్ గ్రోవర్ తెలిపారు. వరవరరావు భార్య హైదరాబాద్‌కు వెళ్లిపోవడంతో ప్రస్తుతం ఆయన బాగోగులు చూసుకునేందుకు ఎవరూ లేరన్నారు. ఈ కేసు ఇప్పట్లో తేలేలా కూడా లేదని లాయర్ పేర్కొన్నారు. స్పందించిన ధర్మాసనం.. 'వరవరరావు ఆరోగ్యం గురించి ప్రభుత్వం శ్రద్ధ తీసుకుంటుంది. లేదా అంతగా కావాలంటే దిగువ కోర్టుకు వెళ్లండి. మేం దీనిపై విచారణ చేపట్టం'అని ధర్మాసనం స్పష్టం చేసింది. వరవరరావును 2018 ఆగస్ట్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం అనారోగ్య కారణాలపై 2022 ఆగస్ట్ 10న సుప్రీంకోర్టు వరవరరావుకు బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు అనుమతి లేకుండా ముంబైని వీడి వెళ్లరాదనే షరతును ఆయనకు విధించింది.

భారత సమాఖ్య నిర్మాణం-పని విధానం

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
పాలిటీ

ప్రపంచ రాజకీయ వ్యవస్థల్లో భిన్నమైంది. భారత రాజకీయ వ్యవస్థ. దీని నిర్మాణంలో కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల పంపిణీ, సంబంధాలు, పని చేసే విధానం వివరణ, విశ్లేషణ ప్రాధాన్యత కలిగిన అంశం. 1950లో రాజ్యాంగం అమల్లోకి వచ్చింది .మొదలు ఇటీవల దేశంలో ప్రవేశపెట్టిన మలిదశ ఆర్థిక సంస్కరణల వరకు కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో వచ్చిన మార్పులు, రావాల్సిన మార్పుల వివరణ మన సమాఖ్య విశ్లేషణ.

ఏ దేశ రాజ్యాంగమైనా ఆనాటి పరిస్థితులను ప్రతిబింబిస్తుంది అని మన మొదటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ పేర్కొన్నారు. ఆయన మాటలు వాస్తవీకరణ పొందాలంటే.. మారుతున్న దేశ కాలమాన పరిస్థితులకు, సామాజిక, ఆర్థిక, రాజకీయ అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగంలో కూడా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. 50 ఏళ్ల రాజ్యాంగ పనితీరును అధ్యయనం చేసేందుకు నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ జస్టిస్ ఎం.ఎన్. వెంకటాచలయ్య నేతృత్వంలో రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ కమిషన్ రెండేళ్ల తర్వాత 2002లో నివేదిక సమర్పించింది. ఈ కమిషన్ రాజ్యాంగం పని విధానాన్ని మొత్తం అధ్యయనం చేసే సందర్భంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాల తీరును విశ్లేషించడమే కాకుండా పలు సూచనలు చేసింది. 2007లో మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మదన్‌మోహన్ పూంఛీ కమిషన్ కేంద్ర-రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేసి 2010 మార్చిలో నివేదిక సమర్పించింది. వీరప్ప మొయిలీ నేతృత్వంలోని రెండో పరిపాలనా సంస్కరణల కమిషన్ కూడా కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై ప్రత్యేక నివేదికను రూపొందించింది.

భారతదేశం - అర్ధ సమాఖ్య

భారతదేశ ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రాజ్యాంగ నిర్మాతలు.. మన రాజ్యాంగాన్ని ఏకకేంద్ర, సమాఖ్య లక్షణాల కలయికగా రూపొందించారు. 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని అనుసరించి సమాఖ్య విధానాన్ని ఆమోదిస్తూనే దేశ విభజన కాలంనాటి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ బలమైన కేంద్రానికి అవకాశం కల్పించే ఏకకేంద్ర లక్షణాలకు రాజ్యాంగంలో చోటు కల్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించిన కాంగ్రెస్ పార్టీ.. రాజ్యాంగ రచనలో కూడా కీలక పాత్రను నిర్వహించింది. స్వాతంత్ర్యానికి పూర్వం కేంద్రీకరణ ధోరణిని సమర్థించిన కాంగ్రెస్ ఆలోచనా విధానం రాజ్యాంగంలోనూ ప్రతిబింబిస్తుంది. భిన్నత్వానికి నిలయమైన మనదేశంలో ఏకత్వాన్ని సాధించాలంటే కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఉండటమే ఏకైక పరిష్కార మార్గంగా కాంగ్రెస్ విశ్వసించి.. బలమైన కేంద్రీకృత ధోరణిని అనుసరించింది. అందుకే కె.సి.వేర్ మన రాజ్యాంగాన్ని విశ్లేషిస్తూ 'భారతదేశం బలమైన ఏకకేంద్ర లక్షణాల బలహీనమైన సమాఖ్యయే గానీ బలమైన సమాఖ్య లక్షణాలు గల బలహీనమైన ఏకకేంద్రం కాదు' అని వ్యాఖ్యానించారు. అంటే 'భారతదేశం ఒక అర్ధ సమాఖ్య వంటిది' అని పేర్కొన్నారు.

భారతదేశం - సహకార సమాఖ్య

గ్రాన్‌విలే ఆస్టిన్, డి.ఎస్. బెనర్జీలు మన దేశాన్ని ఒక సహకార సమాఖ్యగా వర్ణించారు. అధికరణ 252 ప్రకారం రెండు అంతకంటే ఎక్కువ రాష్ట్రాలు కోరినప్పుడు.. రాష్ట్ర జాబితాలోని అంశంపై కేంద్రం శాసనం చేయడం, అధికరణ 258 ప్రకారం కేంద్రం .. రాష్ట్రాలను సంప్రదించి కొన్ని నిర్మాణపరమైన బాధ్యతలను అప్పగిస్తే రాష్ట్రాలు వాటిని నిర్వర్తించడం, కేంద్రానికి-రాష్ట్రాలకు, రాష్ట్రాలు-రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని పెంపొందించే ఉద్దేశంతో అధికరణ 263 ప్రకారం అంతర్ రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటుకు అవకాశం కల్పించారు. అధికరణ 285 ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఆస్తులపై రాష్ట్రాలు పన్నులు విధించకుండా, అధికరణ 289 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులపై కేంద్రం పన్నులు విధించకుండా రాజ్యాంగ పరంగా చేసిన ఏర్పాట్లు మనదేశాన్ని ఒక సహకార సమాఖ్యగా వర్ణించడానికి కారణమయ్యాయి.

బలమైన కేంద్రీకృత ధోరణి

సర్ ఐవర్ జెన్నింగ్స్ వంటి వారు మనదేశాన్ని ఒక బలమైన కేంద్రీకృత ధోరణి గల సమాఖ్యగా వర్ణించారు. అధికరణ 249 ప్రకారం రాజ్యసభ ప్రత్యేక తీర్మానం చేస్తే, రాష్ట్ర జాబితాలోని ఏదైనా అంశానికి జాతీయ ప్రాముఖ్యత ఉందని భావిస్తే ఆ అంశంపై శాసనం చేసే అధికారం కేంద్రానికి ఉంది. జాతీయ అత్యవసర పరిస్థితిలో అధికరణ 250 ప్రకారం కేంద్రం.. రాష్ట్ర జాబితాలోని ఏ అంశంపైనైనా శాసనం చేయవచ్చు. 365 అధికరణను అనుసరించి కేంద్రం జారీ చేసిన ఆదేశాన్ని సదరు రాష్ట్రం తప్పనిసరిగా పాటించాలి. లేకుంటే ఆ రాష్ట్రంపై చర్య తీసుకునే అధికారం కేంద్రానికి ఉంది. అధికరణ 356 ద్వారా విధించే రాష్ట్రపతి పాలన కేంద్ర ప్రభుత్వం వద్ద ఉండే వజ్రాయుధం వంటిది. అందుకే 356 అధికరణను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర ప్రభుత్వాల పాలిట చావు ఉత్తర్వు వంటిదని పేర్కొన్నారు.

వాస్తవికమైన సమాఖ్య

ప్రముఖ అమెరికన్ పాలనా శాస్త్రవేత్త పాల్ ఆసిల్ బీ, అలెగ్జాండ్రి విజ్ వంటి వారు మన సమాఖ్యను వాస్తవికమైన సమాఖ్యగానే పేర్కొన్నారు. గ్రాన్‌విలే ఆస్టిన్ మరొక సందర్భంలో భారత సమాఖ్య నిర్మాణంలో రాజ్యాంగ నిర్మాతల వివేకం దాగి ఉందని వ్యాఖ్యానించారు. 7వ షెడ్యూల్‌లో పొందుపరిచిన అధికారాల పంపిణీ జాబితాలో పేర్కొన్న అంశాల ప్రాముఖ్యాన్ని అనుసరించి మాత్రమే జరిగిన అధికారాల పంపిణీగా పేర్కొంటారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య ఉండే సమన్వయానికి నిదర్శనం ఉమ్మడి జాబితా.

రాజ్యాంగ - రాజ్యాంగేతర సంస్థల ప్రభావం

స్వాతంత్ర్యానంతరం మన దేశం ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థను అనుసరించింది. సామాజిక, ఆర్థిక ప్రణాళికలు ఉమ్మడి జాబితాలో ఉన్నాయి. 1950లో ఏర్పడిన ప్రణాళికా సంఘం.. జాతీయ ప్రణాళికలను రూపొందించడంతోపాటు ప్రాంతీయ ప్రయోజనాలను నిర్ణయించేది. కానీ ప్రణాళికా సంఘంలో రాష్ట్రాలకు ఎలాంటి ప్రాతినిధ్యం లేదు. ప్రణాళికా ముసాయిదాను ఆమోదించే జాతీయాభివృద్ధి మండలిలో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ.. అందులో కూడా కేంద్రం ప్రభుత్వానిదే ఆధిపత్యం. ప్రణాళిక లక్ష్యాలను దృష్ట్యా కేంద్ర-రాష్ట్రాల మధ్య ఆదాయ వనరులను పంపిణీ చేసే కేంద్ర ఫైనాన్స్ కమిషన్‌లో కూడా రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లేదు. ఈ రెండూ కూడా మన సమాఖ్య పని తీరుపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఆర్థికపరమైన ఈ కేంద్రీకరణ దృష్ట్యా ప్రముఖ రాజ్యాంగ, ఆర్థిక నిపుణుడు కె. సంతానం మన దేశం సమాఖ్య విధానాన్ని అనుసరించాలని కోరుకున్నప్పటికీ, వాస్తవంలో ఏకకేంద్ర విధానాన్నే అనుసరిస్తుందని పేర్కొన్నారు. దీనికి గల ప్రధాన కారణం ఆర్థిక అంశాల కేంద్రీకరణే. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన నీతిఆయోగ్‌లో రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ప్రాతినిధ్యం కల్పించడం కీలక అంశం.

వాస్తవిక సమాఖ్యతో విభేదించే అంశాలు

ప్రపంచంలో అత్యుత్తమమైన సమాఖ్యకు పర్యాయపదంగా నిలిచే అమెరికా సమాఖ్యతో మనదేశం పలు విషయాల్లో విభేదిస్తుందనే అంశం సుస్పష్టం. భారతదేశం ఏక పౌరసత్వాన్ని, ఒకే రాజ్యాంగం, ఏకీకృత న్యాయ వ్యవస్థను అనుసరిస్తుంది. అమెరికాలో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే సెనేట్‌లో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం లభిస్తుంటే మన రాజ్యసభలో పెద్ద రాష్ట్రాలకు ఎక్కువ, చిన్న రాష్ట్రాలకు తక్కువ ప్రాతినిధ్యం కల్పించారు. అమెరికా బలమైన రాష్ట్రాలను ఏర్పాటు చేస్తే మనం బలమైన కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. మన దగ్గర అవశిష్ట అధికారాలను కేంద్రానికి కట్టబెట్టారు. వాస్తవిక సమాఖ్యకు భిన్నంగా మన రాజ్యాంగం ప్రధానంగా అదృఢమైంది. సూత్రబద్ధమైన సమాఖ్య కాకపోడంతో మన రాజ్యాంగంలో సమాఖ్య అనే పదాన్ని వినియోగించలేదు.

కేంద్ర - రాష్ట్రాల మధ్య వివాదాలు - కారణాలు

గడిచిన ఆరు దశాబ్దాలలో కేంద్ర-రాష్ట్రాల సంబంధాల తీరును పరిశీలిస్తే పలు సందర్భాల్లో వివాదాలు, సమస్యలు కనిపిస్తాయి. 1967లో నాలుగో సాధారణ ఎన్నికల అనంతరం కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ.. ఎనిమిది రాష్ట్రాల్లో కాంగ్రెసేతర పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అప్పుడే రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు కావాలనే డిమాండ్ ప్రారంభమైంది. ప్రధానమైన సంక్షేమ శ్రేయోవాద అంశాల సంబంధిత బాధ్యతలన్నీ రాష్ట్రాలకు అప్పగించగా ఆర్థిక వనరులన్నీ కేంద్రం వద్ద ఉండేవి. క్రమంగా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు అధ్వాన్నంగా తయారయ్యాయి. దాంతో రాష్ట్రాలు నిరంతరం కేంద్రంపై ఆధారపడాల్సి వచ్చింది.

గవర్నర్ వ్యవస్థ కేంద్ర-రాష్ట్రాల మధ్య వివాదాలకు మరో కారణం. రాజ్యాంగం గవర్నర్లకు విచక్షణాధికారాలను కల్పించింది. అయితే గవర్నర్లు వాటిని విచక్షణ రహితంగా వినియోగించడం ప్రధాన సమస్యగా పరిణమించింది. ఏ రాజకీయ పార్టీ శాసనసభలో మెజార్టీ సాధించలేని సందర్భంలో ముఖ్యమంత్రి నియామకం గవర్నర్ విచక్షణాధికారంపైనే ఆధారపడి ఉంటుంది. 1952 తమిళనాడు గవర్నర్ ప్రకాశ్ మొదలు.. జార్ఖండ్‌లో గవర్నర్ సయ్యద్ సిబ్తరజి.. శిబూ సోరెన్‌ను ముఖ్యమంత్రిగా నియమించడం వంటివి గవర్నర్లు తమ అధికారాలను విచక్షణ రహితంగా వినియోగించరడానికి నిదర్శనాలు. రాష్ట్ర శాసనసభలో మెజార్టీని కోల్పోయిన సందర్భంలో సదరు ప్రభుత్వానికి తమ మెజార్టీ నిరూపించుకునే అవకాశాన్ని కల్పించకుండా వాటి రద్దు చేయడం మరో సమస్య. 1984లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టీ రామారావు ప్రభుత్వానికి శాసనసభలో మెజార్టీ ఉన్నప్పటికీ.. మెజార్టీ నిరూపించుకునే అవకాశం ఇవ్వకుండానే అప్పటి గవర్నర్ ప్రభుత్వాన్ని రద్దుచేసి నాదెండ్ల భాస్కరరావును ముఖ్యమంత్రిగా నియమించారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్‌లో అప్పటి గవర్నర్ రమేష్ బండారీ బీజేపీకి చెందిన కల్యాణ్‌సింగ్ ప్రభుత్వాన్ని రద్దుచేసి జగదంబికా పాల్‌ను ముఖ్యమంత్రిగా నియమించారు (ఈ నియామకాన్ని అలహాబాద్ హైకోర్టు నిలిపివేయడంతోపాటు సుప్రీంకోర్టు కూడా తప్పుపట్టింది).

కేంద్ర-రాష్ట్రాల మధ్య వివాదాలకు మరో కారణం 356 అధికరణ దుర్వినియోగం. రాజ్యాంగంలో అత్యంత వివాదాస్పద అధికరణ 356. కారణం దాన్ని వినియోగించిన తీరు వివాదాస్పదం కావడమే. 1959లో కేరళలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రభుత్వాన్ని ఈ అధికరణతో రద్దు చేశారు. 1977లో కేంద్రంలో అధికారంలో ఉన్న జనతా ప్రభుత్వం 9 రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలపై ఈ అధికరణను ప్రయోగించింది. 1980లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఇందిరాగాంధీ ప్రభుత్వం 9 రాష్ట్రాల్లోని జనతా ప్రభుత్వాలను రద్దు చేసింది. 1989లో కర్ణాటకలో ఎస్.ఆర్. బొమ్మై ప్రభుత్వాన్ని, నాగాలాండ్‌లో ఎస్.సి. జమీర్ ప్రభుత్వాన్ని రద్దు చేయడాన్ని 1994లో సుప్రీం కోర్టు 'ఎస్.ఆర్. బొమ్మై/యూనియన్ ఆఫ్ ఇండియా' మధ్య జరిగిన వ్యాజ్యంలో అధికరణ 356 దుర్వినియోగం మన సమాఖ్య విధానానికి భంగకరం అని పేర్కొంది. అంతేకాకుండా సమాఖ్య విధానం మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని కూడా వ్యాఖ్యానించింది. రాజ్యాంగ - రాజ్యాంగేతర సంస్థల పని విధానానికి సంబంధించి ముఖ్యంగా ప్రణాళికా సంఘం, కేంద్ర ఫైనాన్స్ కమిషన్‌ల ఏకఛత్రాధిపత్యాన్ని రాష్ట్రాలు తమ ప్రయోజనాలకు పెద్ద ఆటంకంగా భావిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కేంద్రం రాష్ట్రాలపై ఆధిపత్యాన్ని కొనసాగించడం లేదా తరచుగా జోక్యం చేసుకోవడం కూడా మరో సమస్య. 1967లో దుర్గాపూర్ ఇనుము ఉక్కు కర్మాగారంలో కార్మికుల సమ్మె సందర్భంగా కనీసం ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించకుండానే కేంద్రం సాయుధ బలగాలను మోహరించింది. దీంతో అప్పటి ఆ రాష్ట్ర హోంశాఖ మంత్రి జ్యోతిబసు రాజీనామా చేస్తాననడం గమనించదగిన అంశం.


కేంద్ర-రాష్ట్రాల వివాదాలు-పరిష్కార మార్గాలు


1967 సాధారణ ఎన్నికల తదనంతరం వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు, ప్రతిపక్షాలకు చెందిన ప్రభుత్వాలు రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు కావాలనే డిమాండ్‌ను ముందుకు తెచ్చాయి. దీంతో 1966లో ఏర్పాటు చేసిన మొదటి పరిపాలనా సంస్కరణల కమిషన్ నుంచి ఎం.సి. సీతల్‌వాడ్ కమిటీని ప్రత్యేకంగా కేంద్ర - రాష్ట్ర సంబంధాలు, వివాదాల అధ్యయనం కోసం ఇందిరాగాంధీ ప్రభుత్వం నియమించింది. సీతల్‌వాడ్ కమిటీ సమూల మార్పులను సూచించనప్పటికీ.. కొన్ని కీలక అంశాలను ప్రభుత్వం దృష్టికి తెచ్చింది. కేంద్రం తరచుగా రాష్ట్రాల విషయాల్లో జోక్యం చేసుకోకుండా చర్యలు చేపట్టాలని, అంతర్ రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటు చేయాలని పేర్కొంది. కేంద్ర ఫైనాన్స్ కమిషన్ సూచనలను కేంద్రం తప్పనిసరిగా పాటించాలని కోరింది. గవర్నర్లుగా వివాదాస్పదం కాని వ్యక్తులను నియమించాలని సూచించింది. 1967లో తమిళనాడులో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం పి.వి. రాజమన్నార్ నేతృత్వంలో కేంద్ర - రాష్ట్ర సంబంధాలపై ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దీనికి ప్రధాన కారణం సీతల్‌వాడ్ కమిటీ సూచనలు రాష్ట్రాలకు సంతృప్తిని ఇవ్వకపోవడమే. రాజమన్నార్ కమిటీ ..రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలను కల్పించడం కోసం రాజ్యాంగాన్ని సవరించాలని పేర్కొంది. ఉమ్మడి జాబితాలో జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలను కేంద్రానికి కేటాయించి మిగిలిన అధికారాలన్నీ రాష్ట్రాలకు బదలాయించాలని కోరింది. ప్రణాళికా సంఘంలో సమూల మార్పులు చేయాలని సూచించింది. ఎక్కువ ఆర్థిక వనరులను కల్పించడం కోసం విదేశీ ఎగుమతులు, దిగుమతులపై విధించే సుంకాల్లో రాష్ట్రాలకు కూడా వాటా కల్పించాలని కోరింది. 1980లో చోటు చేసుకున్న రాజకీయ మార్పుల నేపథ్యంలో 1983లో ఇందిరాగాంధీ ప్రభుత్వం సర్కారియా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ కేంద్ర - రాష్ట్ర సంబంధాలపై అనేక అంశాలతో కూడిన సవివరమైన నివేదికను రాజీవ్‌గాంధీ ప్రభుత్వానికి సమర్పించింది. గవర్నర్ వ్యవస్థ వివాదాస్పదం కాకుండా ఉండటం కోసం పలు సూచనలు చేసింది. 356 అధికరణను చివరి అస్త్రంగా మాత్రమే వినియోగించాలని కమిషన్ పేర్కొంది. ఆదాయపన్నుపై విధించే సెస్, కార్పొరేట్ ట్యాక్స్‌లో రాష్ట్రాలకు వాటా కల్పించాలని సూచించింది. అంతర్ రాష్ట్ర వ్యాపార వాణిజ్యంపై చట్టాలు చేసేటప్పుడు, ఉమ్మడి జాబితాలోని అంశాలపై కేంద్రం శాసనాలు చేసే సందర్భంలో రాష్ట్రాల అభిప్రాయాలను, ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్ కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై వ్యాఖ్యానించే సందర్భంలో అంతర్ రాష్ట్ర కౌన్సిల్ ద్వారా కేంద్రం లేదా రాష్ట్రాలు సహకార సమాఖ్య ఏర్పాటు కోసం కృషి చేయాలని సూచించింది. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులను, కేంద్ర పరిశీలన కోసం గవర్నర్ పంపినప్పుడు దానిపై రాష్ట్రపతి ఆరు నెలల్లోగా ఏదో ఒక నిర్ణయం ప్రకటించేలా సవరణ చేయాలని కూడా ఈ కమిషన్ సూచించింది. మదన్ మోహన్ పూంఛీ కమిషన్ గవర్నర్లను కూడా రాష్ట్రపతి మాదిరిగానే తొలగించే అధికారం రాష్ట్ర శాసన సభలకు కల్పించాలని పేర్కొంది..


స్కూల్ అసిస్టెంట్ ప్రాక్టీస్ పేపర్-ఫిజికల్ సైన్స్

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
ఫిజికల్ సైన్స్


1. ఒక సెకండ్ల లోలకం పొడవు 100 సెం.మీ. దాని పొడవును మార్చిన డోలనావర్తన కాలం ఒక సెకనుకు మారినప్పుడు దాని పొడవు? (సెం.మీ.లలో)
   1) 100 2) 50
   3) 25 4) 75
2. అత్యంత కచ్చితంగా కాలాన్ని కొలిచే సాధనాలు?
   1) చేతి గడియారాలు
   2) పరమాణు గడియారాలు
   3) నీటి గడియారాలు 4) పైవన్నీ
3. విమానాల తయారీలో ఇమిడి ఉన్న సూత్రం?
   1) పాస్కల్ సూత్రం
   2) బాయిల్ సూత్రం
   3) ఆర్కిమెడీస్ సూత్రం 4) బెర్నౌలీ సూత్రం
4. నీటి కాఠిన్యతకు కారణమైనవి
   1) కాల్షియం, మెగ్నీషియంల బైకార్బొనేట్లు
   2) కాల్షియం, మెగ్నీషియంల క్లోరైడ్లు, సల్ఫేట్లు
   3) కాల్షియం, మెగ్నీషియంల నైట్రేట్లు
   4) కాల్షియం, మెగ్నీషియంల కార్బొనేట్లు
5. 1986లో కనిపించిన హేలీ తోకచుక్క మళ్లీ ఏ సంవత్సరంలో కనిపిస్తుంది?
   1) 2062 2) 2022
   3) 2046 4) 2056
6. వేసవిలో తారురోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు దూరంగా నీరు ఉన్నట్లు కనిపిస్తుంది. దీనికి కారణం?
   1) కాంతి పరావర్తనం
   2) కాంతి ధృవణం
   3) సంపూర్ణాంతర పరావర్తనం
   4) కాంతి వివర్తనం
7. 0 డిగ్రీల సెంటీగ్రేడు వద్ద గాలిలో ధ్వనివేగం 332 మీ/సె. అయిన 1 డిగ్రీ సెంటీగ్రేడు ఉష్ణోగ్రత పెరిగితే అప్పుడు గాలిలో ధ్వని వేగం (మీ/సెలలో)
   1) 332.608 2) 332
   3) 330.608 4) 332.680
8. కిందివాటిలో తిర్యక్ తరంగాలు
   1) స్ప్రింగ్‌లో ఏర్పడే తరంగాలు
   2) కాంతి తరంగాలు 3) నీటి తరంగాలు
   4) కాంతి, నీటి తరంగాలు
9. అత్యధిక కెలోరిఫిక్ విలువ గల పదార్థం?
   1) అరటి పండు 2) గోధుమలు
   3) మాంసం 4) వేరుసెనగ
10. ఆల్ఫా, బీటా, గామాల నిష్పత్తి
    1) 3 : 2 : 1 2) 1 : 2 : 3
    3) 1 : 3 : 2 4) 2 : 1 : 3
11. దూరపు వస్తువుల్ని మాత్రమే చూడగలిగి, దగ్గరి వస్తువుల్ని చూడలేనప్పుడు దృష్టి సవరణకు ఏ కటకాన్ని ఉపయోగిస్తారు?
    1) కుంభాకార 2) పుటాకార
    3) ద్వి పుటాకార 4) పైవన్నీ
12. న్యూటన్ మూడో గమన సూత్రం ఆధారంగా పనిచేసేది?
    1) హెలికాప్టర్ 2) రైలు
    3) రాకెట్ 4) విమానం
13. విశ్వ గురుత్వ స్థిరాంకం 'G'కు ప్రమాణం
    1) Nm^2Kg^2 2) Nm^2Kg^{-2}
    3) N^2m^2Kg 4) $Nm^{-2}Kg^{-2}$
14. పెట్రోలియంలో పెట్రో అనగా లాటిన్‌లో ?
    1) నూనె 2) రాయి
    3) మండుట 4) వాసన
15. 0.1 కిలోగ్రాముల బరువున్న ఒక పక్షి భూమికి 10 మీటర్ల ఎత్తులోని చెట్టు కొమ్మపై ఉన్న దాని స్థితిశక్తి?
    1) 4.9 జౌల్స్ 2) 9.8 జౌల్స్
    3) 20 జౌల్స్ 4) 0.1 జౌల్స్
16. ఓడలలో లంగరును పైకెత్తుటకు ఉపయోగించేది?
    1) స్క్రూ జాక్ 2) విండ్‌లాస్
    3) కాప్‌స్టన్ 4) వించ్
17. ద్రవాల విశిష్ట సాంద్రతను కనుగొనడానికి ఉపయోగించే పరికరం?
    1) లాక్టో మీటర్ 2) హైడ్రో మీటర్
    3) పైరో మీటర్ 4) బారో మీటర్
18. విద్యుదయస్కాంతాల తయారీకి ఉపయోగించేది?
    1) ఉక్కు 2) మెత్తని ఇనుము
    3) నిక్రోమ్ 4) మాంగనీస్
19. ఫెర్రో అయస్కాంతాల సాపేక్ష ప్రవేశ్య శీలత?
    1) $\mu_r \le 1$ 2) $\mu_r > 1$
    3) $\mu_r = 1$ 4) $\mu_r >> 1$
20. కిందివాటిలో విద్యుత్ విశ్లేషణ అనువర్తనానికి ఉదాహరణ
    1) ఎలక్ట్రో ప్లేటింగ్ 2) ఎలక్ట్రో టైపింగ్
    3) లోహాల శుద్ధి 4) పైవన్నీ
21. లెడెన్ జాడీ అనేది ఒక
    1) కెపాసిటర్ 2) అమ్మీటర్
    3) వోల్ట్‌మీటర్ 4) ఓల్టా మీటర్
22. నిరోధానికి గుర్తు



23. డైనమో ఏ నిబంధన ఆధారంగా పనిచేస్తుంది?
    1) లెంజ్ నియమం
    2) ఫ్లెమింగ్ కుడిచేతి నిబంధన
    3) ఆంపియర్ 4) మాక్స్‌వెల్
24. ఒక రేడియో ధార్మిక మూలకం అర్ధ జీవిత కాలం 6.93 రోజులు. దాని విఘటన స్థిరాంకం?
    1) 0.1 $రోజు^{-1}$ 2) 00.1 $రోజు^{-1}$
    3) 100 రోజులు 4) 1000 రోజులు
25. కింది వాటిలో ఐసోబార్
    1) $_1H^1$, $_1H^2$, $_1H^3$
    2) $_{10}Ne^{20}$, $_{10}Ne^{21}$, $_{10}Ne^{22}$
    3) $_6C^{13}$, $_7N^{13}$
    4) ఏదీకాదు
26. కింది వాటిలో యంత్ర భాష
    1) బేసిక్ 2) కోబాల్
    3) ఫోర్ట్రాన్ 4) అసెంబ్లర్
27.  సంకేతం
    1) p-n-p ట్రాన్సిస్టర్
    2) n-p-n ట్రాన్సిస్టర్
    3) p-p-n ట్రాన్సిస్టర్
    4) n-p-p ట్రాన్సిస్టర్
28. వాయు స్థిరాంకం R విలువ
    1) 0.0821 లీ-అట్మా.మోల్$^{-1}$k^{-1}
    2) 8.314×10^7 ఎర్గ్‌మోల్$^{-1}$k^{-1}
    3) 1.987 కోల్.మోల్$^{-1}$k^{-1} 4) అన్నీ
29. కింది వాటిలో సరైంది
    1) 3p<4s<4p<3d
    2) 3p<4s<4d<2s
    3) 3s<3p<4s<3d
    4) 4p<3d<5p<6s
30. ఆర్బిటాల్ ప్రాదేశిక దృగ్విన్యాసాలను తెలియజేసే క్వాంటం సంఖ్య
    1) ప్రధాన క్వాంటం సంఖ్య
    2) అజిమూతల్ క్వాంటం సంఖ్య
    3) అయస్కాంత క్వాంటం సంఖ్య
    4) స్పిన్ క్వాంటం సంఖ్య
31. పరమాణు సంఖ్య 57 నుంచి 70 వరకు గల మూలకాల్ని ఏమంటారు?
    1) లాంథనైడ్స్ 2) ఆక్టినైడ్స్
    3) ఛాల్కో జెన్స్ 4) హాలోజెన్స్
32. ఆక్సైడ్‌లతో పాటు పెరాక్సైడ్‌లను ఏర్పరిచే మూలకం
    1) Be 2) Ba
    3) Ca 4) Sr
33. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ ఫార్ములా
    1) $CaSo_4\ 2H_2o$ 2) $CaSo_4\ ½\ H_2o$
    3) $CaSo_4$ 4) $Ca\ Co_3$
34. కోణీయ ఆకృతి గల అణువు
    1) నీరు 2) బెంజీన్
    3) అమ్మోనియా 4) బేరియం క్లోరైడ్
35. అంతరణుక హైడ్రోజన్ బంధాలు గల అణువుకు ఉదాహరణ
    1) HF 2) సాలిసిలిక్ ఆమ్లం
    3) 0- నైట్రో ఫినాల్ 4) 0- క్లోరో ఫినాల్
36. $H_2+I_2 \rightleftharpoons 2HI$ చర్యకు k_p, k_c మధ్య సంబంధం
    1) $k_p < k_c$ 2) $k_p = k_c$
    3) $k_p > k_c$ 4) $k_p >> k_c$
37. STP వద్ద 1 మోల్ వాయువు ఆక్రమించు ఘన పరిమాణం
    1) 2.24 లీటర్లు 2) 0.224 లీటర్లు
    3) 22.4 లీటర్లు 4) 224 లీటర్లు
38. క్షార గుణం కలిగిన మానవ శరీర ద్రవం
    1) ఉమ్మి 2) మూత్రం
    3) జఠర రసం 4) రక్తం
39. 750 మిల్లీ లీటర్ల 0.4 మోల్‌ల NaOH ద్రావణంలో NaOH ఉన్న మోల్‌ల సంఖ్య?
    1) 0.03 2) 0.3
    3) 3.1 4) 0.4
40. అత్యంత శ్రేష్ఠమైన బొగ్గు
    1) బిట్యుమస్ 2) ఆంత్ర సైట్
    3) సెమీ బిట్యుమస్ 4) లిగ్నైట్
41. కిందివాటిలో ఏరోమాటిక్ సమ్మేళనం



    4) 1, 3
42. కిందివాటిలో మెటామెరిజం సాదృశ్యకాలు
    1) nబ్యూటేన్, ఐసో బ్యూటేన్
    2) 1- క్లోరో బ్యూటేన్, 2- క్లోరో బ్యూటేన్
    3) 1- ప్రొపనోల్, మిథాక్సీ ఈథేన్
    4) ఇథాక్సీ ఈథేన్, మిథాక్సీ ప్రొపేన్
43. 96 శాతం ఆల్కహాల్‌ను ఏమంటారు?
    1) వాష్ 2) రెక్టిఫైడ్ స్పిరిట్
    3) అబ్సల్యూట్ ఆల్కహాల్ 4) వెనిగర్
44. మూడు క్షారాల వరుసను ఏమంటారు?
    1) కోడన్ 2) ట్రాన్ స్క్రిప్షన్
    3) రెప్లికేషన్ 4) ట్రాన్స్‌లేషన్
45. నీటిలో కరిగే విటమిన్
    1) A 2) D
    3) E 4) C
46. ద్రగలన ప్రక్రియకు ఉపయోగించే కొలిమి
    1) రివర్బరేటర్ 2) షాఫ్ట్
    3) బ్లాస్ట్ 4) ఓపెన్‌హార్త్
47. అల్నికో మిశ్రమ లోహ సంఘటనం
    1) Fe+C 2) Fe+Al+Ni+Co
    3) Fe+Ni+Cr+Mn 4) Fe+cr+Ni
48. ముఖానికి వాడే పౌడర్‌లో ఉన్న ఫాటీ ఆమ్ల లవణం
    1) K^+ 2) Na^+
    3) Mg^{2+} 4) Li^+
49. దృశ్య పరికరాలు, విద్యుత్ బల్బుల తయారీలో ఉపయోగించే గాజు
    1) సోడా గాజు 2) పైరెక్స్ గాజు
    3) క్వార్ట్జ్ గాజు 4) ఫ్లింట్ గాజు
50. టాల్క్ రసాయన నామం
    1) మెగ్నీషియం సిలికేట్
    2) మెగ్నీషియం కార్బొనేట్
    3) మెగ్నీషియం ఆక్సైడ్
    4) కాల్షియం సిలికేట్
51. ఆస్పరిన్ మందు నిర్మాణం



52. వల్కనైజేషన్ ప్రక్రియలో రబ్బరును ఏ మూలకంతో కలుపుతారు.
    1) ఫాస్ఫరస్ 2) సిలికాన్
    3) జింక్ 4) సల్ఫర్
53. రెండు విషయాల మధ్య ఎలాంటి సంబంధం లేదని చెప్పే ప్రకల్పన
    1) నల్ ప్రకల్పన
    2) ప్రకటనాత్మక ప్రకల్పన
    3) ప్రాగుక్తి ప్రకల్పన 4) ప్రశ్నా ప్రకల్పన
54. జ్ఞాన సముపార్జనకు దోహదపడేది
    1) తర్కం 2) స్పందన
    3) కంఠస్థం 4) అధికారత్వం
55. సౌర గడియారం, నీటి గడియారాలను మొదటిసారిగా తయారు చేసింది?
    1) బాబిలోనియన్లు 2) చైనీయులు
    3) ఈజిప్టియన్లు 4) గ్రీకులు
56. ఆన్ ది రివల్యూషన్ ఆఫ్ ద సెలిస్టియల్ స్పియర్స్ అనే గ్రంథ రచయిత?
    1) కోపర్నికస్ 2) గెలీలియో
    3) అరిస్టాటిల్ 4) గ్రాహంబెల్
57. విద్యుత్ జనరేటర్ ఆవిష్కర్త
    1) ఆయర్‌స్టడ్ 2) మాక్స్‌వెల్
    3) బ్రోగ్లీ 4) ఫారడే
58. తరగతిలో బోధనాభ్యసనా కార్యకలాపాల ద్వారా విద్యార్థుల్లో వచ్చే ప్రవర్తనా మార్పులు
    1) ఆశయాలు 2) లక్ష్యాలు
    3) స్పష్టీకరణలు 4) విలువలు
59. భావావేశ రంగంలో అత్యున్నత లక్ష్యం
    1) వ్యవస్థాపన 2) శీల స్థాపన
    3) విలువ కట్టడం
    4) ప్రతిస్పందించడం
60. దోషాలను గుర్తించుట అనేది ఏ లక్ష్యానికి చెందిన స్పష్టీకరణ
    1) నైపుణ్యం 2) జ్ఞానం
    3) అవగాహన 4) వినియోగం
61. ఒక విద్యార్థి సాంద్రత, సాపేక్ష సాంద్రతల మధ్య తేడాల్ని గుర్తించాడు. అతడిలో నెరవేరిన లక్ష్యం
    1) జ్ఞానం 2) అవగాహన
    3) వినియోగం 4) నైపుణ్యం
62. NTSE అనగా
    1) నేషనల్ టాలెంట్ సైన్స్ ఎడ్యుకేషన్
    2) నేషనల్ టాలెంట్ సైన్స్ ఎగ్జామ్
    3) నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్
    4) నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్ ఎంట్రన్స్
63. విద్యార్థి కేంద్ర పద్ధతి కానిది
    1) ఉపన్యాస పద్ధతి 2) సమస్యా పద్ధతి
    3) ప్రాజెక్ట్ పద్ధతి 4) ప్రయోగ పద్ధతి
64. సహజ పరిసరాల్లో సమస్యను సాధించే పద్ధతి
    1) హ్యూరిస్టిక్ పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) నియోజన పద్ధతి 4) ప్రకల్పన పద్ధతి
65. ప్రయోగశాలలోని వస్తువుల్ని విద్యార్థులకు ఇచ్చేటప్పుడు వాటి వివరాలను ఏ రిజిస్టర్‌లో పొందుపరుస్తారు?
    1) ఇష్యూ రిజిస్టర్ 2) ఆర్డర్ రిజిస్టర్
    3) రిక్వైర్‌మెంట్ రిజిస్టర్ 4) స్టాక్ రిజిస్టర్
66. బౌద్ధిక వనరులకు ఉదాహరణ
    1) వ్యవసాయ క్షేత్రాలు 2) పరిశ్రమలు
    3) వర్షాలు
    4) ఇంజనీర్లు, డాక్టర్లు
67. పాఠశాలలో వైజ్ఞానిక సంఘానికి ప్రధాన పోషకకర్త
    1) ఉపాధ్యాయుడు 2) విద్యార్థి
    3) ప్రధానోపాధ్యాయుడు 4) జిల్లా విద్యాధికారి
68. కిందివాటిలో మౌఖిక పరీక్షకు ఉదాహరణ
    1) లఘు సమాధాన పరీక్ష
    2) డ్రాయింగ్ పరీక్ష
    3) ఇంటర్వ్యూ
    4) ప్రయోగ పరీక్ష
69. ఎడ్గర్‌డేల్ అనుభవ శంఖువులో పైభాగాన ఉండేవి
    1) ప్రత్యక్ష అనుభవాలు
    2) కల్పితానుభవాలు
    3) శాబ్దిక చిహ్నాలు 4) క్షేత్ర పర్యటనలు
70. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన పాఠ్యాంశాలను ప్రసారం చేసేవి?
    1) మన టీవీ
    2) కేయూ బ్యాండ్
    3) సప్తగిరి
    4) మన టీవీ, కేయూ బ్యాండ్

సమాధానాలు

1) 3	2) 2	3) 4
4) 2	5) 1	6) 3
7) 1	8) 4	9) 4
10) 2	11) 1	12) 3
13) 2	14) 2	15) 2
16) 3	17) 2	18) 2
19) 4	20) 4	21) 1
22) 2	23) 2	24) 1
25) 3	26) 4	27) 1
28) 4	29) 3	30) 3
31) 1	32) 2	33) 2
34) 1	35) 1	36) 2
37) 3	38) 4	39) 2
40) 2	41) 4	42) 4
43) 2	44) 1	45) 4
46) 3	47) 2	48) 3
49) 4	50) 1	51) 2
52) 4	53) 1	54) 3
55) 3	56) 1	57) 4
58) 2	59) 2	60) 3
61) 2	62) 3	63) 1
64) 4	65) 1	66) 4
67) 3	68) 3	69) 3
70) 4		

కోడ్ భాషలో DIESELను ఏ విధంగా రాస్తారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

మెంటల్ ఎబిలిటీ

కోడింగ్ - డీకోడింగ్

1. ఒక ప్రత్యేక భాషలో 'EXERCISE' అనే పదాన్ని 'MTMVYRCM' గా రాస్తే అదే కోడ్ భాషలో 'RICE' అనే పదాన్ని ఏ విధంగా రాస్తారు.

- ఇందులో ఆంగ్ల పదంలోని అక్షరాలకు, కోడ్ పదంలోని అక్షరాలకు మధ్య సంబంధాన్ని కనుక్కోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రశ్నా పదం RICEలో ఉన్న అన్ని అక్షరాలు ఇచ్చిన పదం 'EXERCISE'లో ఉన్నాయి. దీని ఆధారంగా జవాబు కనుక్కోవచ్చు.

E X E R C I S E
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
M T M V Y R C M

కాబట్టి RICE కోడ్ VRYM

2. ఒక కోడ్ భాషలో BOARDను 40గా రాస్తే అదే కోడ్ భాషలో TUBEను ఏ విధంగా రాస్తారు?

- BOARD అనే పదంలోని అక్షరాల స్థాన విలువల మొత్తం 40

BOARD→ 2 + 15 + 1 + 18 + 4 = 40

అదే విధంగా

TUBE → 20 + 21 + 2 + 5 = 48

∴ TUBE కోడ్ 48

3. ఒక ప్రత్యేక కోడ్ భాషలో SOLVE THE PROBLEMS IN DOMESTIC SYSTEMను VROYH WKH SUREOHPV LQ GRPHVWLF VBVWHPగా రాస్తే అదే కోడ్ భాషలో కింది పదాలను ఏ విధంగా రాస్తారు?
a) HEN
b) INTER
c) MANGO

- HEN, INTER అనే రెండు పదాల్లోని అక్షరాలన్నీ పైన ఇచ్చిన ఆంగ్ల వాక్యంలో వచ్చాయి. కాబట్టి వాటికి కేటాయించిన కోడ్‌ల ఆధారంగా సమాధానం కనుక్కోవచ్చు.
a) HEN కోడ్ KHQ. అదేవిధంగా
b) INTER కోడ్ LQWHU, కానీ
c) MANGO అనే పదంలోని A, G అనే అక్షరాలు ఇచ్చిన ఆంగ్ల వాక్యంలో రాలేదు. కాబట్టి ఇప్పుడు ఇచ్చిన ఆంగ్ల వాక్యంలోని అక్షరాలకు, వాటి కోడ్ అక్షరాలకు మధ్య సంబంధాన్ని కనుక్కొని, దాని ఆధారంగా MANGO కోడ్ కనుక్కోవాలి.
ఆంగ్ల వాక్యంలోని ప్రతి అక్షరం, దాని తర్వాత మూడో అక్షరంతో కోడ్ చేసి రాశారు. కాబట్టి MANGO కోడ్ PDQJR అవుతుంది.

4. ఒక ప్రత్యేక కోడ్ భాషలో 'PUBLIC'ను 'QVCMJD'గా రాస్తే, అదే కోడ్ భాషలో 'OPINION'ను ఏ విధంగా రాస్తారు?

- PUBLIC అనే పదంలోని ప్రతి అక్షరాన్ని తర్వాత అక్షరంతో కోడ్ చేశారు.

P U B L I C
↓ ↓ ↓ ↓ ↓ ↓
Q V C M J D

అదే విధంగా OPINION అనే పదంలోని ప్రతి అక్షరాన్ని దాని తర్వాత అక్షరంతో కోడ్ చేయాలి.

O P I N I O N
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
P Q J O J P O

5. ఒక ప్రత్యేక కోడ్ భాషలో BRIGHTను 'CTLKMZ'గా రాస్తే, అదేకోడ్ భాషలో SUPERను ఏ విధంగా రాస్తారు?

- BRIGHT పదంలోని అక్షరాలను వరుసగా ఒకటో, 2వ, 3వ, 4వ, 5వ, 6వ అక్షరాలతో కోడ్ చేశారు.

B R I G H T
+1↓ +2↓ +3↓ +4↓ +5↓ +6↓
C T L K M Z

అదేవిధంగా

S U P E R
+1↓ +2↓ +3↓ +4↓ +5↓
T W S I W

∴SUPER ను TWSIW గా రాయవచ్చు.

6. ఒక ప్రత్యేక కోడ్ భాషలో 'STUDY'ని 'RSTCX'గా రాస్తే, అదే కోడ్ భాషలో CLASSను ఏ విధంగా రాస్తారు.

- STUDY అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని కంటే ముందున్న అక్షరంతో కోడ్ చేశారు. అదేవిధంగా CLASSను రాస్తే

C L A S S
↓ ↓ ↓ ↓ ↓
B K Z R R

∴CLASS కోడ్ BKZRR అవుతుంది.

7. ఒక కోడ్ భాషలో PETROLను OBOKFA గా రాస్తే అదే కోడ్ భాషలో DIESEL ను ఏ విధంగా రాస్తారు?

- PETROLలోని ప్రతి అక్షరాన్ని వరుసగా దాని కంటే 1వ, 3వ, 5వ, 7వ, 9వ, 11వ స్థానాల్లో ముందున్న అక్షరంతో కోడ్ చేశారు.

P E T R O L
−1↓ −3↓ −5↓ −7↓ −9↓ −11↓
O B O K F A

అదేవిధంగా

D I E S E L
−1↓ −3↓ −5↓ −7↓ −9↓ −11↓
C F Z L V A

∴DIESELను CFZLVAగా రాయవచ్చు.

8. ఒక కోడ్ భాషలో LOVEను OLEVగా రాస్తే, అదే కోడ్‌భాషలో MARRIAGEను ఏ విధంగా రాస్తారు?

- ఈ ప్రశ్నకు మూడు సరైన సమాధానాలు ఉన్నాయి. అవి
  - LOVEఅనే పదంలో వరుసగా ప్రతి జత అక్షరాలను తారుమారు చేస్తూ రాస్తే OLEV వచ్చింది. అదే విధంగా MARRIAGEని రాస్తే
    MA RR IA GE→AMRRAIEG అవుతుంది.
  - మరో కోణంలో LOVE అనే పదంలోని సగం అక్షరాలను రివర్స్ ఆర్డర్‌లో, చివరి సగం అక్షరాలను రివర్స్ ఆర్డర్‌లో రాశారు. అదేవిధంగా MARRIAGE అనే పదంలోని 8 అక్షరాల్లో మొదటి సగం అక్షరాలను రివర్స్ ఆర్డర్‌లో రాస్తే RRAM అవుతుంది. అదేవిధంగా చివరి సగం అక్షరాలను రివర్స్ ఆర్డర్‌లో రాస్తే EGAI అవుతుంది.
    ∴MARRIAGE కోడ్ RRAMEGAI అవుతుంది.
  - మరో కోణంలో LOVE అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని తిరోగమన స్థానాక్షరంతో కోడ్ చేశారు.
    L తిరోగమన స్థానాక్షరం O
    O తిరోగమన స్థానాక్షరం L
    Vతిరోగమన స్థానాక్షరం E
    E తిరోగమన స్థానాక్షరం V
    అదే విధంగా MARRIAGE అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని తిరోగమన స్థానాక్షరంతో కోడ్ చేస్తే

M A R R I A G E
↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓ ↓
N Z I I R Z T V

∴ MARRIAGE కోడ్ NZIIRZTV అవుతుంది.

9. ఒక ప్రత్యేక కోడ్ భాషలో నలుపు అంటే ఎరుపు; ఎరుపు అంటే నీలం; నీలం అంటే ఆకుపచ్చ; ఆకుపచ్చ అంటే తెలుపు; తెలుపు అంటే నలుపు; అయితే ఆ కోడ్ భాషలో బొద్దింక రక్తం రంగును దేనితో సూచిస్తారు?

- ఇలాంటి ప్రశ్నలు వచ్చినప్పుడు, ముందుగా చివర ఇచ్చిన ప్రశ్నకు, సమాధానం కనుక్కోవాలి. తర్వాత ఈ పదాన్ని కోడ్‌భాషలో దేనితో సూచిస్తారో తెలుసుకోవాలి.
- పై ప్రశ్నలో బొద్దింక రక్తం తెలుపు రంగులో ఉంటుంది. ఆ కోడ్ భాషలో తెలుపును నలుపుతో సూచిస్తారు.

∴ జవాబు: నలుపు

10. కోడ్ భాషలో ప్రిన్సిపాల్ అంటే విద్యార్థి; విద్యార్థి అంటే తండ్రి; తండ్రి అంటే ఉపాధ్యాయుడు; ఉపాధ్యాయుడు అంటే డాక్టర్; డాక్టర్ అంటే ఇంజినీర్ అయితే ఆ కోడ్ భాషలో తరగతిలో బోధించే వ్యక్తిని ఏమని పిలుస్తారు?

- తరగతిలో బోధించే వ్యక్తిని ఉపాధ్యాయుడు అంటారు. ఆ కోడ్ భాషలో ఉపాధ్యాయున్ని డాక్టర్ అంటారు

∴ జవాబు: డాక్టర్

11. SPACE అంటే TQBDF అయితే PURSE అంటే?
1) QTSRF 2) OTQRD
3) QVSTF 4) ESRUP

- SPACE అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని తర్వాత అక్షరంతో కోడ్ చేస్తే TQBDF వచ్చింది. అదే విధంగా PURSE అనే పదంలోని ప్రతి అక్షరాన్ని, దాని తర్వాత అక్షరంతో కోడ్ చేస్తే QVSTF వస్తుంది

∴ జవాబు: (3)

12. ఒక కోడ్ భాషలో vin min hin అంటే How are you? అని; hin fin vin అంటే Where are you? అని అర్థం. అయితే ఆ కోడ్ భాషలో
(a) How
(b) are కోడ్ పదాలను కనుక్కోండి?

- (a) How
How అనే పదం మొదటి వాక్యంలో మాత్రమే ఉంది. మొదటి వాక్యంలో How మినహా మిగిలిన రెండు పదాలు, రెండో వాక్యంలో కూడా ఉన్నాయి. కాబట్టి How కోడ్ min అవుతుంది. ఎందుకంటే min అనే పదం రెండో కోడ్ వాక్యంలో పునరావృతం కాలేదు.
(b) are
are అనే పదంతో పాటు మరో పదం youలు రెండు వాక్యాల్లో పునరావృతం అయ్యాయి. కాబట్టి వీటి కోడ్‌లు కూడా పునరావృతం అవుతాయి. రెండు కోడ్ వాక్యాల్లో vin, hin అనే రెండు పదాలు పునరావృతం అయ్యాయి.
కాబట్టి are కోడ్ vin లేదా hin అవుతుంది.

13. ఒక కోడ్ భాషలో MANGOను 13-1-14-7-15గా రాస్తే, అదేకోడ్ భాషలో GRAPESను ఏ విధంగా రాస్తారు?

- MANGO పదంలోని ప్రతి అక్షరాన్ని, ఆంగ్ల అక్షరాల వరుస క్రమంలో దాని స్థాన విలువతో కోడ్ చేశారు. అదేవిధంగా
GRAPES కోడ్ 7-18-1-16-5-19

14. ఒక కోడ్ భాషలో TABLEను 21-3-5-16-10గా రాస్తే, అదే కోడ్ భాషలో CHAIR ను ఏ విధంగా రాస్తారు?

- TABLE అనే పదంలోని అక్షరాల స్థాన విలువకు వరుసగా 1, 2, 3, 4, 5లను కలిపి రాశారు.

T→ 20+1=21
A→ 1+2=3
B→ 2+3=5
L→ 12+4=16
E→ 5+5=10

అదే విధంగా

C→ 3+1=4
H→ 8+2=10
A→ 1+3=4
I → 9+4=13
R→18+5=23

∴ CHAIR కోడ్ 4-10-4-13-23

15. ఒక కోడ్ భాషలో TREATMENTను 123415361గా రాస్తే, అదే కోడ్ భాషలో
a) MEAT
b) RENTలను ఏ విధంగా రాస్తారు?

- T R E A T M E N T
1 2 3 4 1 5 3 6 1

∴ MEAT కోడ్ - 5341
RENT కోడ్ - 2361

16. ఒక కోడ్ భాషలో STATEను 1-2-1-2 -5గా రాస్తే అదే కోడ్ భాషలో COUNTRYని ఏ విధంగా రాస్తారు.

- STATE అనే పదంలోని అక్షరాల స్థాన విలువలో ఒకే ఒక అంకె ఉంటే అదేవిధంగా, రెండంకెలు ఉంటే ఆ అంకెల మొత్తంగా కోడ్ చేస్తూ రాశారు.

S స్థాన విలువ 19
→ 1 + 9 = 10 → 1 + 0 = 1
T స్థాన విలువ 20→2+0=2
A స్థాన విలువ 1
T స్థాన విలువ 20→2+0=2
E స్థాన విలువ 5

కాబట్టి STATE కోడ్ 1-2-1-2-5

C స్థాన విలువ - 3
O స్థాన విలువ -15→1+5=6
U స్థాన విలువ - 21→2+1=3
N స్థాన విలువ - 14→1+4=5
T స్థాన విలువ - 20→2+0=2
R స్థాన విలువ - 18→1+8=9
Y స్థాన విలువ - 25→2+5=7

∴COUNTRY కోడ్ 3-6-3-5-2- 9-7

17. WINTERను 24-8-15-19-6-17గా రాస్తే, SUMMERను ఏ విధంగా రాస్తారు?

- WINTER అనే పదంలోని అక్షరాల స్థాన విలువలకు వరుసగా +1, -1, +1, -1, +1, -1 చేస్తూ కోడ్ చేశారు.

W→ 23+1=24
I → 9-1=8
N→ 14+1=15
T→ 20-1=19
E→ 5+1=6
R→ 18-1 =17

అదేవిధంగా

S→ 19+1 = 20
U→ 21-1 = 20
M→ 13+1 = 14
M→ 13-1 = 12
E→ 5+1 = 6
R→ 18-1 = 17

∴ SUMMER కోడ్
20-20-14- 12-6-17



What is the meaning of the phrase 'substantial moderation'

BANK EXAMS

GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q.No 1-10): Read the following passage carefully and answer the questions that follow.

Five years ago, any sign of weakness in the Rupee would have been the cue for RBI officials, ministers and sundry economic commentators to lash out at Indian households for their unreasonable and unpatriotic love for gold.

And it is true that gold imports had a big role to play in India's yawning trade deficit and precarious balance of payments position in 2013.

But as the Rupee has entered shaky territory again it is oil rather than gold that has been the hot topic of debate. There's good reason for this shift.

A break down of India's import bill suggests that gold is no longer the villain of the piece when it comes to exchange rate woes. In fact, data suggest that the Indian saver's love affair with gold may be well past its prime.

When India faced a run on the Rupee and a widening trade deficit in 2013, its annual gold import bill had topped $50 billion for the second year running. Between FY10 and FY13, India saw consistently high demand for gold jewellery, bars and coins despite **galloping** global gold prices.

The bloated the country's gold import bill from about $28 billion in FY10 to a record $56 billion in FY12.

But gold imports have since seen **substantial moderation** from those excessive levels. In FY18, India's dollar outgo on gold imports amounted to just $34 billion, having shrunk 40 percent from the peak six years ago. Lest you think this is an **aberration**, gold imports have hovered in a narrow range of $27 billion to $35 billion for five years now. Bullion accounted for nearly 12 percent of the country's import bill in FY12. But its contribution is now down to about 7 percent.

This explains why debates around the current account deficit no longer **obsess** over the yellow metal.

Trends in domestic demand, tracked by the World Gold Council, show that Indian consumers have been cutting back on the volume of gold purchases in the last five years. In the years from 2010 to 2012, consumers accumulated anywhere between 900 and 1,000 tonnes of bullion a year. Jewellery accounted for about two-thirds of this volume, with bars and coins making up a third.

In the last five years though, bar and coin demand has halved from 355 tonnes in 2012 to 164 tonnes in 2017. Jewellery demand, after rising from 595 tonnes to 662 tonnes between 2012 to 2015, has flat-lined, slipping back to 573 tonnes in 2017.

As a result, aggregate domestic demand for gold has fallen by 20 percent between 2012 and 2017.

So, what has made Indian consumers cold-shoulder their favorite asset? Several factors seem to be at play.

Indian gold buyers view bullion as much as an investment as an item of adornment. We all know that any investment is most sought-after when its returns are soaring. So it was with gold.

In the five years following the global financial crisis in 2008, gold churned out bumper returns for Indian investors who hoarded it, thanks to a global flight to safe-haven assets and a steadily depreciating Rupee.

With domestic gold holders earning a 20 percent plus return for five consecutive years until 2013, investment demand for the yellow metal sky-rocketed. Gold is also seen as a hedge against inflation and the runaway price-spike in this period also **stoked** demand.

But with the global stock and bond markets staging a recovery from 2013, and inflation flagging, gold began to lose its **mojo**. As the Rupee stabilized, domestic gold investments suffered three consecutive years of negative returns from 2015 to 2017, dousing investor interest. Purchases of bars and coins, which topped 340 tonnes in 2013, had crashed to 164 tonnes by 2017.



1. The author of the passage asserts that gold is no longer the villain of the piece when it comes to exchange rate woes. Then who is the real culprit?
1) Major steps of economic reforms taken by the incumbent government.
2) Price hike of crude oil in global market and its impact of Indian economy.
3) Exemption of petrol and diesel from GST
4) All (1), (2) and (3)
5) Only (1) and (2)

2. What is the meaning of the phrase 'substantial moderation' as used in the passage?
A) Remarkable downward trend
B) Noticeable upward movement
C) Either upward or downward trend
1) Only A 2) Only B 3)Only C
4) None of these
5) Other than those given as options

3. What was the impact of Indian households' unreasonable and unpatriotic love for gold in 2013 on Indian economy?
A) Due to excessive demand by Indian household the government earned huge revenue through taxation resulting in improvement in Indian economy.
B) The unreasonable demand of gold by Indian household gave rise to a situation of trade deficit.
C) As a result of excessive demand of gold in Indian bullion market the balance of payments position improved.
1) Only A 2) Only B 3)Only C
4) Both A and B
5) All A, B and C

4. Find the incorrect statement on the basis of the given passage.
1) Bullion accounts for about 7 per cent of the country's import bill as of now.
2) The consistent high demand for gold jewellery, bars and coins bloated the country's gold import bill to a record $56 billion in FY12.
3) As per the observation of the World Gold Council, Indian consumers showed heightened inclination towards purchase of yellow metal in the last five years.
4) Between 2012 to 2017 the aggregate domestic demand for gold has come down by 20 percent.
5) None of the above

5. Why did people prefer to invest in gold rather than in other class of investments during the period following the global financial crisis in 2008 till 2013? Answer on the basis of the given passage.
1) Because gold gave attractive returns on its sale
2) Because the investment in gold was seen as a hedge against inflation
3) Because of easy liquidity of gold
4) Only (1) and (2)
5) All (1), (2) and (3)

Directions (Q.No 6-8): Choose the word which is MOST SIMILAR in meaning to the word printed in bold as used in the passage.

6. Obsess
1) Repulse 2) Dominate
3) Exude 4) Distract 5) Rely

7. Stoked
1) Slumped2) Declined
3) Surged 4) Supplied5) Relied

8. Mojo
1) Poison 2) Price
3) Junk 4) Life 5) Charm

Directions (Q.No 9-10): Choose the word which is MOST OPPOSITE in meaning of the word printed in bold as used in the passage.

9. Galloping
1) Jumping2) Running
3) Speedy 4) Halted 5) Flying

10. Aberration
1) Conformity 2) Peculiarity
3) Delusion 4) Weirdness
5) Deviation

Directions (Q.No 11-15): Read each sentence to find out whether there is any grammatical or idiomatic error in it. The error, if any, will be in one part of the sentence, the number of that part is the answer. If there is "No error", the answer is 5. (Ignore errors of punctuation, if any).

11. (1) It is amazing how concern for / (2) the common man and the inconvenience caused to them / (3) has suddenly become / (4) a huge issue for the Opposition. / (5) No error

12. (1) Casting aspersions on the suitability / (2) of Donald Trump as president of the United States/ (3) amounts to disrespecting / (4) the American people's verdict. / (5) No error

13. (1) While Modi continues his harangue, / (2) some BJP members are behaving like Nero/ (3) playing the fiddle / (4) while Rome burnt. / (5) No error

14. (1) For India to remain a constitutional democracy / (2) we need a Supreme Court that operates/ (3) as an effective check on majority / (4) legislative and executive power. / (5) No error

15. (1) The Indian embassy in Beijing has now asked / (2) the government to consider extending / (3) the March 31 deadline for NRI / (4) as many cannot travel to India before then. / (5) No error

Directions (Q.No16-20): In the following questions, a sentence has been given with some of its parts in bold. To make the sentence grammatically and idiomatically correct, you have to replace the bold part with the correct alternative given below. If the sentence is correct as it is, give (5) as your answer (i.e, No correction required.)

16. Those with ears to the ground can hear the buzz of a movement that **are in way in** rural UP.
1) is on the way in
2) is towards the way of
3) is way of 4) is underway in
5) No correction required

17. Legalising betting will curtail the influence of unethical elements **on the** sports.
1) of the 2) in the
3) over 4) against
5) No correction required

18. Researchers have found that **learning by doing** practice tests, a strategy known as retrieval practice, can protect memory against the negative effects of stress.
1) learning by giving
2) learning by taking
3) learning by making
4) learning by having
5) No correction required

KEY

1) 2 2) 1 3) 2 4) 3 5) 4
6) 2 7) 3 8) 5 9) 4 10) 1
11) 2 (Replace 'them' with 'him'
12) 5
13) 4 (Replace 'burnt' with 'burns')
14) 3 (Replace 'majority' with majoritarian')
15) 3 (Replace 'NRI' with 'NRIs')
16) 4 17) 5 18) 2